# భాగవతం – ఆణిముత్యాలు

# నివేదనము

భాగవతం అంటే భగవంతుడే. భగవంతుడంటే అందరిలో అన్నింటిలో అన్నివేళలా గొప్ప వెలుగుతో అలరారుతూ ఉన్నవాడు. వ్యాసులవారు మానవజాతికి భాగవతరూపంగా అందించిన శబ్దబ్రహ్మమును పోతనగారు అమృతద్రవంతో మెదిపి తెలుగువారికి నిత్యప్రసాదంగా నిక్షేపించారు. అందులో ఏ ఒక్క మెతుకైనా నిండైన ఫలాన్ని ఇస్తుంది. వినండి. వీనులను, తక్కిన ఇంద్రియాలనూ పవిత్రం చేసుకోండి. అనండి, నాలుక పవిత్రం అవుతుంది. విన్నవారిని కూడా పవిత్రం చేస్తుంది. అనుకోండి, అంతరంగం పవిత్రమవుతుంది. ఆవిధంగా మూడుకరణాల ముక్కాలిపీట ఈ మనదేహం ఒకపవిత్ర దేవాలయం అవుతుంది.

ఈ భాగవతం ఆణిముత్యాలు అనే పవిత్ర కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఉత్తేజపరిచే ఉద్దేశంతో, చైతన్యవంతులను చేయాలనే సంకల్పంతో మీ ముందుకువస్తున్న ఈ ‘మందారమకరంద బిందుసందోహాన్ని’ మీ హృదయాలలో పదిలపర్చుకోవాలనే ఆకాంక్షతో ఈ బాలవాక్కు వెలువడుతున్నది.

# భాగవతం - ఆణిముత్యాలు

## ప్రథమ స్కంధం

## 1

తెలుగులపుణ్యాపేటి బమ్మెర పోతన శ్రీమద్భాగవత అమృతాన్ని తెలుగుజాతికి అందించటానికి పూనుకొని ముందుగా నందాంగనాడింభకుడైన కృష్ణపరమాత్మను హృదయంలో నిలుపుకుంటున్నాడు. మనలనుకూడా నిలుపుకోమంటున్నాడు.

**శ్రీకైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్ లోకర**
**క్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్ దానవో**
**ద్రేకస్తంభకు కేళిలోల విలసద్దృగ్జాలసంభూతనా**
**నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్.** భా.గ. 1.1

మహానందుని యిల్లాలు యశోదముద్దుబిడ్డను సంపదతోకూడిన మోక్షపదవిని చేరుకోవటానికి భావిస్తూ ఉంటాను. ఆపసిబిడ్డ లోకాలను రక్షించటం అనేఒకేఒక్క పని కలవాడు. భక్తులను కాపాడటం అనే కళలో తొందరతనం కలవాడు. రక్కసుల పొగరును నిలువరించే సామర్థ్యం కలవాడు. ఆటలలో అందంగా కదలాడుతున్న చూపుల సముదాయంతో రూపొందిన అనేక బ్రహ్మాండాలనే కుండలు గలవాడు. అట్టి బాలగోపాలుని మనస్సులో ధ్యానిస్తూ ఉంటాను.

## 2

తన భాగవతరచన సకల శుభపరంపరలతో సాగాలని మహాభక్తశిఖామణి పోతన సర్వజ్ఞుడైన శ్రీ శంకరుని వైభవాన్ని సంభావిస్తూ ప్రార్థిస్తున్నాడు.

**వాలినభక్తి మ్రొక్కెద నవారిత తాండవకేళికిన్ దయా**
**శాలికి శూలికిన్ శిఖరిజాముఖపద్మమయూఖమాలికిన్**
**బాలశశాంకమౌళికి కపాలికి మన్మథగర్వపర్వతో**
**న్మూలికి నారదాదిమునిముఖ్య మనస్సరసీరుహాళికిన్.** 1.2

నేను అతిశయించినభక్తితో పరమశివునకు మ్రొక్కుతాను. ఆ శివుడు ఎవరికీ నిలువరించటానికి సాధ్యం కాని తాండవనృత్యం ఆటగా గలవాడు. సర్వప్రాణులయందూ దయతో అలరారేవాడు. శూలం కలవాడు. పర్వతరాజతనయ మోము అనే తామరపూవునకు కిరణాలమాలలుగలభాస్కరుడు అయినవాడు. చిన్నిచంద మామను తలపైపూవుగా తాల్చినవాడు. బ్రహ్మతలను గోటితో గిల్లి ఆపుర్రెను విలాసంగా చేతిలో ధరించి తిరుగాడుతూ ఉండేవాడు. ఒకపెద్దపర్వతం వంటిది మన్మథుని గర్వం. దానికి అందరూ అణగిమణగి ఉండటం తప్ప మరొకదారిలేదు. అటువంటి గర్వపర్వతాన్ని అవలీలగా పెల్లగించి పారవేసినవాడు. నారదుడు మొదలైన జ్ఞానసంపన్నుల హృదయపద్మాలలో మనోజ్ఞమైననాదం చేస్తూ తిరుగాడే తుమ్మెదవంటివాడు.

# 3

**నాలుగుమోములదేవర బ్రహ్మయ్య. జ్ఞానవిజ్ఞానాల స్వరూపమైన సరస్వతి వేదాలరూపంతో ఆయన నాలుగుమోములలోనూ నిరంతరం కదలాడుతూ ఉంటుంది. తననోటినుండి భాగవతపరమార్థం రసాత్మకంగా వెలువడాలంటే ఆపరమేష్ఠి అనుగ్రహం కూడా కావాలి. అందువలన పోతన తన మధురమంజులవాక్కులతో బ్రహ్మను కొనియాడుతున్నాడు.**

**ఆతతసేవసేసెద సమస్తచరాచర భూతసృష్టి వి**
**జ్ఞాతకు, భారతీహృదయ సౌఖ్యవిధాతకు, వేదరాశి ని**
**ర్ణేతకు, దేవతానికరనేతకు, కల్మషజేతకున్ నత**
**త్రాతకు, ధాతకున్, నిఖిలతాపసలోక శుభప్రదాతకున్.** **1.3**

ఆయన ధాత. సకలసృష్టినీ పట్టినిలిపేవాడు. ఆసృష్టిలో కదలాడేవీ, కదలాడనివీ అయిన రెండు విధాలభూతాలున్నాయి. ఆ అన్నింటి తీరుతెన్నులను మొత్తంగా తెలిసినవాడు. చదువులతల్లి హృదయానికి సౌఖ్యం కూర్చేజ్ఞానసంపద ఆయన సొమ్ము. వేదాలరాశులను ఇది ఇది అని నిర్ణయించి జనులకు తెలివితేటలను ప్రసాదించినవాడు. ఇంద్రుడుమొదలైన దేవతలందరినీ వారివారి విధులలో నడిపించే నాయకుడు. పాపాలు ఏమాత్రమూ తననంటకుండా పరిశుద్ధుడై ప్రకాశిస్తున్నవాడు. తనయెడల వినయంతో ఉన్నవారి నందరినీ ఎల్లవేళలా కాపాడుతూ ఉంటాడు. తమ తపశ్శక్తితో ఈ భూమినంతటినీ పట్టినిలుపుతున్న తాపసులందరికీ శుభాలను పెద్దగా ప్రదానం చేస్తూఉండేవాడు. అట్టి బ్రహ్మదేవునకు చాలాపెద్దఎత్తున పూజ చేస్తాను.

# 4

**బ్రహ్మమొదలైనదేవతలు కూడా తమతమపనులు ప్రారంభించేటప్పుడు అతనికి మ్రొక్కి కృతకృత్యులవుతారట. ఇంక మానవుల సంగతి చెప్పనేల? కాబట్టి ఉత్తమపురుషుడైన పోతనామాత్యుడు భాగవతరచనామహాకార్యంలో తనకు ఏవిధమైన విఘ్నాలూ కలుగకూడదని గజాననునికి మ్రొక్కులు చెల్లిస్తున్నాడు.**

**ఆదరమొప్ప మ్రొక్కిడిదు నద్రిసుతాహృదయానురాగ సం**
**పాదికి, దోషభేదికి, ప్రపన్నవినోదికి, విఘ్నవల్లికా**
**ఛ్ఛేదికి, మంజువాదికి, నశేషజగజ్జన నందవేదికిన్**
**మోదకఖాదికిన్; సమదమూషకసాదికి; సుప్రసాదికిన్.** **1.5**

ఆ మహాత్ముడు అమ్మ పార్వతీదేవి హృదయపు అనురాగాన్ని నిరంతరం సంపాదించుకుంటాడు. చెడుపనులను చీల్చి చెండాడుతాడు. తానే దిక్కని నమ్ముకొన్న వారిని ఉల్లాసపరుస్తూ ఉంటాడు. విఘ్నములనెడి చిక్కుముడులుగల లతలను త్రెంపి వేస్తాడు. పరమమనోజ్ఞమైన పలుకులతో అందరికీ ఆనందం కలిగిస్తాడు. అన్నిలోకాలలో ఉండే ప్రాణుల ఆనందాన్ని ఎరిగినవాడు. కుడుములను ఆప్యాయంగా ఆరగించేవాడు. పొగరెక్కిన ఎలుక వాహనం అయినవాడు. సర్వప్రాణికోటియందూ ప్రసన్నతకలవాడు. అట్టి గణపయ్యకు ఆదరంతో మ్రొక్కుతాను.

# 5

**హృదయంలో భవ్యమైనభావన కదలాడాలంటే ఆ తల్లి అనుగ్రహం పుష్కలంగా ఉండాలి. ఆభావన పలుకుగా రూపందిద్దుకొని నాలుకపై నాట్యమాడా లంటే ఆయమ్మ చల్లనిచూపు జాలువారాలి. అందునా పలుక బోయేది భాగవతం. దానికై చదువుల తల్లి సరస్వతి సదమలకృప సమృద్ధిగా కావాలి. పోతన ఆమెదయకోసం ప్రార్థిస్తున్నాడు.**

**క్షోణితలంబు నెన్నుదురు సోకగ మ్రొక్కి నుతింతు సైకత**
**శ్రోణికి, చంచరీకచయసుందరవేణికి, రక్షితామర**
**శ్రేణికి, తోయజాతభవచిత్తవశీకరణైకవాణికిన్,**
**వాణికి, నక్షదామశుక వారిజపుస్తక రమ్యపాణికిన్. 1.6**

నా విశాలమైన ఫాలభాగం నేలకు చక్కగా తాకించి తల్లికి మ్రొక్కుతాను. నోరారా ఆ సరస్వతిని పలుకులతో కొనియాడతాను. ఆమె ఇసుకతిన్నెవంటి పిరుదులభాగంతో విశ్వాన్నంతటినీ నింపుకున్నదా అన్నట్లున్నది. కదలాడుతున్న తుమ్మెదల బారులాగా కన్పిస్తున్న అందమైన కేశసౌభాగ్యంతో గగనాన్నంతటినీ ప్రకాశింప జేస్తున్నది. అందరినీ ఆనందపరచే అమరగుణాలతో అలరారే ఉత్తములను కాపాడుతూ ఉంటుంది. అన్నిలోకాలకూ చివరిదైన సత్యలోకంలో సృష్టికార్యంలో తలమున్కలుగా ఉన్న నాలుగుమోముల దేవర అయిన బ్రహ్మదేవుని చిత్తాన్ని వశం చేసుకొనేవాక్కులతో విరాజిల్లుతున్నది. జపమాల, చిలుక, తామరపూవూ, పుస్తకమూ నాలుగుచేతులతో చక్కగా పట్టుకొని నాయెదుట సాక్షాత్కరిస్తున్నది.

# 6

**అహంకారం పతనానికి కారణం. వినయం సమున్నతశిఖరాలను ఎక్కిస్తుంది. భాగవతం తెలుగులో వ్రాయాలని సంకల్పించిన మహావ్యక్తి పోతన తనలో అహంకారాన్ని సమూలంగా దులిపివేసుకొని, వినయాన్ని ప్రోదిచేసికొని చదువులతల్లితో ఇలా అంటున్నాడు.**

**పుట్టంబుట్ట, శరంబునన్మొలవ, నంభోయాన పాత్రంబునన్**
**మెట్టం గల్గను, గాలి గొల్వను, బురాణింపన్ దొరంకొంటి, మీ**
**దెట్టేవెంట జరింతు తత్సరణి నాకీవమ్మ యోయమ్మ మేల్**
**పట్టు న్నానకు మమ్మ నమ్మితిజుమీ బ్రాహ్మీ! దయాంభోనిధీ. 1.7**

అమ్మా! బ్రహ్మదేవునియిల్లాలా! సముద్రంలో జలం ఎంత ఉంటుందో నీలో దయ అంత ఉంటుంది. కనుక నావిన్నపం విఫలం కాదనే నమ్మకంతో నిన్ను ప్రార్థిస్తున్నాను. నేను పుట్టలోపుట్టినవాడను కాదు. ఆపనిచేసిన వాల్మీకి శ్రీమద్రామాయణం రచించాడు. రెల్లుతోటలో పుట్టిన కుమారస్వామిని కాను. ఆయన మహాసారస్వతనిర్మాత. ఓడలో పయనించి ద్వీపం చేరుకొన్న పరాశరుని దయచేత అక్కడ ఉదయించిన వ్యాసుడను కాను. కాళీమాతను పూజించిన కవికులగురువు కాళిదాసుడను కాను. అయినా పురాణరచనకు పూనుకున్నాను. ఇకమీద ఏవిధంగా నడచుకోవాలో ఆమార్గాన్ని నీవు నాకు అనుగ్రహించు. నీవు అమ్మవు కదా! నాకు చేయూత నివ్వటం మానకు. అమ్మా! నేను నిన్నే నమ్ముకొన్నాను.

# 7

"దుర్గాం దేవీం శరణ మహం ప్రపద్యే" అనమంటున్నది వేదమాత. 'నేను దుర్గాదేవిని శరణుపొందుతాను' అనుకొంటూ ఆపని చేయాలి. ఈ వేదవాక్యంవలన కలిగిన సంస్కారంతో పోతనమహాకవి దుర్గాదేవిని స్తుతిస్తూ తెలుగువారినందరినీ ఈపద్యం చదువుకొని తరించమంటున్నాడు.

**అమ్మలగన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాలపె**
**ద్దమ్మ, సురారులమ్మకడుపాఱడిపుచ్చినయమ్మ, తన్నులో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గ, మా**
**యమ్మ కృపాబ్ధి యీవుత మహత్త్వకవిత్వపటుత్వసంపదల్.** **1.8**

దుర్గాదేవి మాయమ్మ. మాయకు అమ్మ. అంటే పరబ్రహ్మస్వరూపం. కృపాబ్ధి. కృపకు సముద్రం అయినది. అంటే నిలువెల్లా దయయేఅయినతల్లి. ఆమల – ఆ హిమగిరి – కన్నఅమ్మ. పర్వతరాజతనయగా అవతరించి లోకాలకు కన్నతల్లి అయినది. భారతి, ఉమ, రమ అనే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపాలైన ముగ్గురమ్మలకు మూలమైన ఆదిశక్తి అయిన దుర్గమ్మ. అందువలననే సనాతని కనుక చాలపెద్దఅమ్మ. దేవీభావనలకు పగవారైన రాక్షసుల అమ్మల కడుపును పనికిమాలినదిగా చేసి లోకాలను కాపాడే అమ్మ. హృదయంలోపలి సన్నని వరిముల్లువంటిరంధ్రంలో నిలుపుకొని నమ్మికొలిచే దివ్యత్వం కల మాతృభావంతో అలరారేవారి మనస్సులనే ఆలయాలలో అలరారే తల్లి. ఆ తల్లి మాకు ఎంతో సమున్నతమైన విలువలుగల కవిత్వంలోని పాటవానికి సంబంధించిన సంపదలను ప్రసాదించుగాక!

# 8

ఆ లక్ష్మీదేవిని లోకమాతఅంటారు. అనటంకాదు ఆమె లోకమాతయే. సమస్తప్రాణికీ సర్వమూ అమ్మలాగా అనురాగంతో అమర్చిపెట్టే వెలుగుల తల్లి. నిజానికి ఆమె అడగకపోయినా బిడ్డలకు అన్నీ యిస్తుంది. కాకపోతే వివేకం కలవ్యక్తులు ఏది తమకు శాశ్వతంగా శుభాన్నిస్తుందో దానినే అడుగుతారు. పోతన ఇందిరామాతను ఇలా ప్రార్థిస్తున్నాడు.

**హరికిన్ బట్టపుదేవి, పున్నెములప్రో, వర్థంబుపెన్నిక్క, చం**
**దురుతో బుట్టువు, భారతీగిరిసుతల్ తోనాడు పూబోణి, తా**
**మరలం దుండెడి ముద్దరాలు, జగముల్ మన్నించునిల్లాలు, భా**
**సురతన్ లేములు వాపుతల్లి సిరి యిచ్చున్ నిత్యకల్యాణముల్.** **1.9**

శ్రీమహావిష్ణువునకు పట్టపురాణి, పుణ్యాలరాశి. సంపదలకు పెద్దనిధి. ప్రాణులందరి మూడుకరణాలకూ పరమానందం అందించే చందురుని అక్కగారు. చదువులతల్లి అయిన భారతి, జ్ఞానప్రసూన అయిన గిరిజ ఆమెకు ఇష్టసఖులు. తమ వికాసంతో జనులహృదయాలను వికసింపజేసే తామరపూవులలో నివసించేముద్దరాలు. లోకాలన్నీ పూజించే యిల్లాలు. అద్భుతంగా కాంతులను విరజిమ్ముతూ జనుల లేములను పోగొట్టేతల్లి. సిరి. ఆమె మనకు అనంతమైన కల్యాణాలను ఇస్తుంది.

# 9

**దివ్యత్వాన్ని సాధారణమైన కన్నులతో చూడలేము. భావన అనే నేత్రంతోనే చూడాలి. అలా చూడటం గొప్పతపశ్శక్తితో గానీసాధ్యం కాదు. శ్రీభారతీదేవి దివ్యదర్శనంకోసం ఆర్తితో విన్నవించుకుంటున్నాడు పోతనగారు.**

**శారదనీరదేందుఘనసారపటీరమరాళమల్లికా**
**హార తుషారఫేన రజతాచల కాశఫణీశ కుందమం**
**దార సుధాపయోధి సితతామరసామరవాహినీ శుభా**
**కారత నొప్పు నిన్ను మది గానగ నెన్నడు గల్గు భారతీ!**

"సర్వశుక్లా సరస్వతీ". సరస్వతి నిలువెల్లా తెల్లదనంతో అలరారుతుంది అని ఋషులభావన. లోకంలో తెల్లదనంతో విరాజిల్లే పవిత్రవస్తువులు కొన్నింటిని ఉపమానాలుగా సరస్వతీ స్వరూపాన్ని సంభావిస్తున్నాడు పోతన. శరత్కాలమేఘం, చందమామ, కర్పూరం, నీటినురుగు, వెండికొండ, రెల్లుపూలు, మొల్లలు, మందారాలు, అమృతసముద్రం, తెల్లనితామరలు, దేవతలనది మందాకిని– అనేవాని శుభమైన ఆకారంవంటి ఆకారంతో ప్రకాశించే నిన్ను, ఓతల్లీ భారతీ! హృదయం అనే గుడిలో ప్రతిష్ఠించుకొని చూడగలగటం ఎన్నటికౌతుందో!

# 10

**కవిత్రయంలో మూడవవాడు ఎఱ్ఱాప్రెగ్గడ. అత్యద్భుతమైన వినయశీలంగల మహాకవి. అతడు అమ్మభారతిని పరమసుందరంగా ప్రార్థించిన పద్యం ఇది. పోతన మహాకవి ఆపద్యం అందానికి అబ్బురపడి, ఆనందపడి, అది తన భాగవత మహాకావ్యంలో తిలకంలాగా ఉండాలని కోరుకొని చేర్చుకున్నాడనుకుంటారు పోతన సచ్ఛీలం ఎరిగిన సహృదయులు.**

**అంబ! నవాంబుజోజ్జ్వలకరాంబుజ! శారదచంద్రచంద్రికా**
**డంబరచారుమూర్తి! ప్రకటస్ఫుటభూషణరత్నదీపికా**
**చుంబిత దిగ్విభాగ! శ్రుతిసూక్తవివిక్తనిజప్రభావ! భా**
**వాంబరవీథి విశ్రుతవిహార! ననుం గృపజూడు భారతీ!.**

అమ్మా! భారతీ! అప్పుడప్పుడే వికసిస్తున్నపద్మపు కాంతులతో వెలిగిపోతున్న, పద్మంవంటి చేతితో అలరారుతున్నావు. శరత్కాలపు చందమామ వెన్నెలల జిలుగులవంటి మనోహరమైన ఆకృతితో మమ్ములను ఆహ్లాదపరుస్తున్నావు. నీవు ధరింపగా విస్పష్టంగా కానవస్తున్న నగలలోని రత్నాల కాంతులు దిక్కుల అంచులను సుకుమారంగా తాకుతున్నాయి. నీదయిన ప్రభావాన్ని వేదసూక్తాలు విస్పష్టంగా వివరించి మానవులకు జ్ఞానసంపదను హాయిగా అందిస్తున్నాయి. నీవు మా భావం అనే గగనవీథిలో నాదరూపంలో తెలియవస్తూ విహరిస్తూ ఉంటావు. నన్ను దయజూడు తల్లీ.

## 11

పోతన మహాకవీంద్రులకు చదువులతల్లి సాక్షాత్కరించింది. ఆమె దర్శనం ఆయనకు ఆనందపారవశ్యం కలిగించలేదు. గుండెను తల్లడిల్లజేసింది. ఆ భారతితో ఈ భారతీపరిచారకుడు ఇలా అంటున్నాడు.

**కాటుక కంటినీరు చనుకట్టుపయింబడ ఏల యేడ్చెదో**
**కైటభదైత్యమర్దనుని గాదిలికోడల ! ఓమదంబ ! ఓ**
**హాటకగర్భురాణి నిను నాకటికిన్ కొనిపోయి అల్లక**
**ర్ణాటకిరాట కీచకుల కమ్మ, త్రిశుద్ధిగ నమ్ము భారతీ !**

అమ్మా ! నాతల్లీ ! భారతీ ! నీవు కైటభుడనే కరకు గుండెగల రక్కసుని ఉక్కు అణచివేసిన శ్రీ మహావిష్ణువునకు ప్రియమైన కోడలివి. కడుపంతా కనకమే అయిన నాలుగుమోముల దేవరకు రాణివి. కాటుకతో మలినమైన కన్నీరు పైటమీద జాలువారే తీరుగా ఎందుకమ్మా ఏడుస్తున్నావు ? నేను మూడు కరణాలనూ పరిశుద్ధంగా చేసికొని మాట యిస్తున్నాను. నీవే అయిన నా యీవాగ్దేవిని, తీసుకొనిపోయి పరమనికృష్టులైన కర్ణాటులు, కిరాటులు, కీచకులు అనే పాడుబుద్ధులుకల పార్థివులకు, ఆకలితీర్చుకోవటంకోసం అమ్ముకోనమ్మా! ఈనామాట నమ్ము.

## 12

తనకు పూర్వం కొందరుకవులు తమ సుఖభోగాలకోసం కావ్యాలను రాజులకు అంకితం పేరుతో అమ్ముకున్నారు. పోతనకు అది పరమనీచమైనపని అనిపించింది. అంతే కాదు ఆపాడుపనికి యముడు అతిఘోరంగా శిక్షిస్తాడని కూడా ఆయన మనస్సు చెబుతున్నది. తానాపాతకానికి ఒడికట్టనని ప్రతిజ్ఞ చేస్తున్నాడు.

**ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే**
**సమ్మెటపోటులం బడక సన్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ**
**బమ్మెరపోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.** 1.11

సాధారణంగా రాజ్యాలేలేవాళ్ళు నీచులై ఉంటారు. 'చిన్నినాపొట్టకు శ్రీరామరక్ష' అనేభావనతో బ్రదకటమే ఆనీచత్వం. కానీ తాము గొప్పవారుగా లెక్కకెక్కాలి అని కూడా వారి ఉబలాటం. దానికోసం కవులకు ఏదో విదిలిస్తూ కృతిభర్తలుగా కీర్తిపొందాలనే దాహం వారికి ఉంటుంది. ఈ బమ్మెరపోతరాజు అటువంటి రాజులు ఇచ్చే అగ్రహారాలనూ, ఏనుగులూ, గుఱ్ఱాలూ మొదలైన వాహనాలనూ, ధనాన్నీ కోరడు. ఎందుకంటే అవన్నీప్రాయంలో బాగానే ఉంటాయి. ముసలితనం వచ్చినప్పుడు అవే ముప్పుతిప్పులుపెడతాయి. శరీరం పోయిన తరువాత కాలుడు ఈపాపానికి శిక్షగా సహించనలవికాని సమ్మెట పోటులతో సత్కరిస్తాడు. ఆశిక్షను పొందకుండా శ్రీమహావిష్ణువునకు అంకితంగా సమస్తమైన జగత్తుకూ మేలుకలిగేవిధంగా భాగవతాన్ని ఈ బమ్మెరపోతరాజు 'ఒక్కడు' చెబుతున్నాడు.

# 13

మానవుడు నిజమైనమానవుడు కావాలంటే కొన్ని విశిష్టలక్షణాలను పెంపొందించుకోవాలి. అలా కాకపోతే వాడు పుట్టుకకు ఒకప్రయోజనం ఉన్నదని నిరూపించుకోలేడు. వాడు పశువుకన్నా హీనుడై పోతాడు. ఆవిశిష్టలక్షణాలను ప్రకటిస్తూ పోతన తనపుట్టుకను తాను ఏవిధంగా ఉదాత్తతరంగా రూపుదిద్దుకొనే యత్నం చేస్తున్నాడో చెప్పటం ద్వారా లోకానికి ఒక ఉపదేశం చేస్తున్నాడు.

**చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా దలపడేని**
**గలుగనేటికి దల్లులకడుపుచేటు.** **1.12**

నమకచమకాలు పఠిస్తూ శివునికి అభిషేకం చేస్తాము. లేదా వేయి నామాలు చదువుకుంటూ పూలతో శివుని పూజిస్తాము. కొంతసేపటికి చేతులు ఆశ్రమను తట్టుకోలేక అభిషేకానికో, పూజకో మొరాయిస్తాయి. దీక్షకలవాడు ఆమొరాయింపునకు లొంగిపోడు. చేతులను శిక్షించి అయినా పూజను తుదిముట్టా పూర్తిచేస్తాడు. చేతులారంగ శివుని పూజించటం అంటే అది. అలాగే ఏ విష్ణుస్తోత్రాలో, సహస్రనామాలో చదువుతూ ఉంటే నోరు కొంతసేపటికి నొప్పి పొందుతుంది. అలా అయినప్పుడు పఠనాన్ని ఆపివేయగూడదు. నోటిని నొప్పించి అయినా హరికీర్తిని ఆదరంతో అంటూనే ఉండాలి. అలాగే దయ, సత్యం మొదలైన ఉత్తమగుణాలయందు మనసును కుదురుకొల్పాలి. అప్పుడే పుట్టుకకు సార్థకత. అలా కాకపోతే తల్లికడుపును చెరచటానికే పుట్టినట్లవుతుంది.

# 14

పోతనమహాకవి ఏదైనా శ్రీమన్నారాయణకథను కావ్యంగా రచించాలనే ఉత్సాహంతో ఉన్నాడు. ఒక పున్నమినాడు చంద్రగ్రహణసమయంలో గంగను చేరుకొని పుణ్యస్నానం ఆచరించి మహేశ్వరధ్యానం చేస్తూ ఉన్నాడు. అప్పుడాయనకు శ్రీరామభద్రమూర్తి అరమోడ్పుకనులలో సాక్షాత్కారించాడు. మహాకవి ఆమూర్తిని మనకన్నులకు కట్టిస్తున్నాడు.

**మెఱుగు చెంగట నున్న మేఘంబుకైవడి**
**ఉవిదచెంగటనుండ నొప్పువాడు**
**చంద్రమండల సుధాసారంబు పోలిక**
**ముఖమున చిఱునవ్వు మొలచువాడు**
**వల్లీయుతతమాల వసుమతీజము భంగి**
**బలువిల్లు మూపున పరగువాడు**
**నీలనగాగ్ర సన్నిహితభానునిభంగి**
**ఘనకిరీటము దల గల్గువాడు**

**పుండరీకయుగము పోలు కన్నులవాడు**
**వెడదయురమువాడు విపులభద్ర**
**మూర్తివాడు రాజముఖ్యు డొక్కరుడు నా**
**కన్నుగవకు నెదుర గానబడియె.**

మెఱుపుతీగను అంటిపెట్టుకొనిఉన్న మేఘంలాగా జానకీకాంత చెంగట ఉండగా వెలిగిపోతున్నాడు. మోమున చిన్ననవ్వు పుట్టుకొనివస్తున్నది. అది చంద్రబింబంనుండి వెలువడే అమృతపుజల్లుగా ఉన్నది. పెద్దవిల్లు భుజంమీద అలరారుతూ ఉంటే లత చుట్టుకొన్న పెద్దచెట్టులాగా ప్రకాశిస్తునాడు. నల్లనికొండపరిసరాలలో ఉదయిస్తున్న సూర్యునిలాగా రత్నాలకిరీటం తలపైన కుదురుకొని ఉన్నది. చక్కగా వికసించిన తెల్లనితామరల జంటలాగా ఆమహానుభావుని కన్నులు కాంతులను జిమ్ముతున్నాయి. విశాలమైన వక్షఃస్థలం అతని హృదయవైశాల్యాన్ని స్ఫురింపజేస్తున్నది. ఏ వైపునుండిచూచినా మంగళమూర్తియే అయి అలరారుతున్నాడు. అట్టి రాజముఖ్యుడొకడు నా కన్నులయెదుట కానవచ్చాడు.

## 15

**శ్రీరామచంద్రుడు నాపేరు పేర్కొంటూ శ్రీమహాభాగవతాన్ని తెలుగు చేయవయ్యా! దానితో నీభవబంధాలన్నీ పటాపంచలయిపోతాయి అని పోతన కవీంద్రునితో అన్నాడు. ఆమహాకవికి పరమానందం కలిగింది. ఆభావననుండి ఆమహాకవినోట అద్భుతమైన పద్యం వెలువడింది.**

**పలికెడిది భాగవత మట;**
**పలికించువిభుండు రామభద్రుండట; నే**
**పలికిన భవహర మగునట;**
**పలికెద; వేఱొండుగాథ పలుకగ నేలా.** **1.16**

ఏమిటేమిటి? నేను పలుకబోతున్నది భగవంతుని అమృతం వంటి చరిత్రమట! ఏదో నేను పలుకుతున్నానను కొంటున్నాను కానీ నన్ను పలికించేవాడు సాక్షాత్తూ పరమాత్మయే అయిన ఆ రామభద్రుడట! పలికితే కలిగేఫలం సంసారం అనేఘోరమైన దు:ఖాన్ని పోగొట్టుకోవటమే అట! అటువంటి కార్యమూ, ఆవిధంగా చేయించే స్వామి! అంత అనితరసాధారణమైన ఫలమూ సమకూరుతూ ఉండగా మఱొకగాధను పలుకవలసిన పనియేమున్నది? కాబట్టి భాగవతగాధనే పలికి మహాఫలాన్ని అందుకుంటాను.

## 16

**కరుణావరుణాలయుడు శ్రీరామచంద్రమూర్తి శ్రీభాగవతాన్ని తెలుగులో వ్రాయవలసినదిగా తన్ను ఆదేశించాడు. కానీ అదేదో ఆషామాషీ వ్యవహారం కాదని తనకు తెలుసు. దానికి సారస్వతవ్యవసాయం చాలా కావాలి. దానిని లోకానికి తెలియజేస్తున్నాడు పోతన మహాకవి.**

**భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు**
**శూలికైన తమ్మిచూలికైన**
**విబుధజనులవలన విన్నంత కన్నంత**
**తెలియ వచ్చినంత తేటపఱుతు.** **1.17**

భాగవతం తత్త్వం తెలియటమే చాలా కష్టమైనపని. తెలిసినదానిని తెలియజెప్పటంకోసం పడవలసినపాట్లు అన్నీయిన్నీకావు. ఎవరికి? మానవమాత్రునకు కాదు. అటు సర్వజ్ఞమూర్తిగా పేరొందిన శూలికీ, ఇటు నాలుగుమోములతో నాలుగు వేదాలనూ ఉచ్చరించే బ్రహ్మదేవునికీ. వారిద్దరూ కూడా ఇది చాలా చిత్రమైన విషయంగా భావిస్తారు. మఱి నీవెలా ప్రాస్తావయ్యా అంటారేమో! చక్కనివివేకంతో కూడిన విద్వాంసులవలన విన్నాను. దానిని ఆకళింపునకు తెచ్చుకున్నాను. ఆరెండు సంస్కారాలవలన నాబుద్ధికి తోచినదానిని ధ్యానరూపంతో నిలుపుకొని అందరికీ అర్థమయ్యేట్లు అక్షరాలలో నిక్షేపిస్తాను.

# 17

**పోతన తన అదృష్టాన్ని తానై కొనియాడుకుంటున్నాడు. ఎందుకంటే తనకు పూర్వులైన నన్నయతిక్కనాదులు భాగవతం జోలికి పోలేదు. అట్టి తన భాగ్యాన్ని పైకి సంభావించుకుంటూ లోపలలోపల మహాకవుల మహోన్నతవైభవాన్ని లోకానికి తెలియజేస్తున్నాడు.**

**ఒనరన్ నన్నయతిక్కనాది కవులీయుర్విన్ పురాణావలుల్**
**తెనుగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో**
**తెనుగున్ జేయరు మున్ను భాగవతమున్ దీనిన్ తెనింగించి నా**
**జననంబున్ సఫలంబు సేసెద పునర్జన్మంబు లేకుండగన్.** **1.19**

అసమానప్రతిభగల నన్నయ, తిక్కన మొదలైనమహాకవులు పురాణాల సముదాయాలను తెలుగులో రచించటానికి పూనుకున్నారు. కానీ నేను పూర్వజన్మలలో చేసిన పుణ్యాలపంట ఎటువంటిదో కానీ భాగవతం రచించలేదు. అది నాకోసమే అన్నట్లుగా మిగిల్చారు. కనుక నేను భాగవతాన్ని తెలుగు కావ్యంగా రచించి నాపుట్టుక సఫలం అయ్యేట్లు చేసుకుంటాను. దీనితో నాకు మళ్లీ పుట్టనవసరం లేని మహాభాగ్యం కలుగుతుంది.

# 18

**భాగవతం ఒక కల్పవృక్షంలాగా కనపడుతున్నది పోతనమహాకవీంద్రునకు. కల్పవృక్షం కోరినకోరికలనన్నింటినీ తీర్చి ఆనందాన్నందిస్తుంది. భాగవతం కూడా అటువంటిదే అని పోతన్నగారి సంభావన.**

**లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం**
**జులతా శోభితమున్, సువర్ణసుమనస్సుజ్ఞేయమున్, సుందరో**
**జ్జ్వలవృత్తంబు; మహాఫలంబు విమల వ్యాసాలవాలంబునై**
**వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై.** **1.20**

ఇదిగోనండీ భాగవతమనే కల్పవృక్షం. ఈ వృక్షం బోదె చాలా సుకుమారంగా ఉంటుంది. అలాగే భాగవతంలో స్కంధాలు లలితంగా ఉంటాయి. ఆ చెట్టుమూలం సారవంతమైన నల్లరేగడి మట్టితో ఉన్నట్లుగా భాగవతం నల్లనయ్యయే మూలంగా ఒప్పారుతున్నది. చిలుకలు కమ్మని నాదాలతో చెట్టును మనోహరం చేస్తాయి. ఈ భాగవతం శుకమహర్షి ఆలాపాలతో హృదయంగమంగా అలరారుతున్నది. చెట్టు నల్లుకొని పూలతీగలు దాని సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తాయి. భాగవతం మంజులత్వంతో ప్రకాశిస్తూఉంటుంది. కనువిందుచేసే రంగురంగుల పూవులతో అందరినీ ఆకర్షిస్తుంది వృక్షం. ఈ భాగవతవృక్షం మంచిఅక్కరాలతో గొప్ప హృదయ సౌందర్యం కలవారికి చక్కగా తెలియవస్తుంది. అందమైనదీ కాంతులు విరజిమ్ముతూ ఉండేదే అయిన పాదు ఆ చెట్టును అలంకరిస్తున్నది. అందమైనవీ, వెలుగులుచిమ్ముతున్నవీ అయిన ఛందస్సునందలి వృత్తాలు ఈ భాగవతంలో ఉన్నాయి. అది గొప్ప ఫలాలను లోకానికి ఇస్తుంది. ఈ భాగవతం గొప్పదైన మోక్షం అనేఫలాన్ని ఇస్తుంది. ఆ చెట్టును మంచిపక్షులు ఆశ్రయించి బ్రదుకుతూ ఉంటాయి. ఈ భాగవతం సత్-ద్విజులు-అంటే ఉత్తమ సంస్కారం కలపండితులకు ఆశ్రయింపదగినదై విరాజిల్లుతున్నది.

## 19

**మనకావ్యాలలో ఒక సంప్రదాయం ఉన్నది. కవి తనకావ్యాన్ని ఎవనికి అంకితం ఇస్తున్నాడో అతని మహిమలను పేర్కొంటూ కొన్ని పద్యాలను పీఠికలో వ్రాస్తాడు. ఆవిశేషణాలన్నీ షష్ఠీవిభక్తితో అంతమవుతూ ఉంటాయి. కనుక వానిని షష్ఠ్యంతాలంటారు. పోతనకవీంద్రుడు ఆ షష్ఠ్యంతాలతో శ్రీకృష్ణచంద్రుని స్తుతిస్తున్నాడు.**

**హరికి, నందగోకులవిహారికి, చక్రసమీరదైత్య సం**
**హారికి, భక్తదు:ఖపరిహారికి, గోపనితంబినీమనో**
**హారికి, దుష్టసంపదపహారికి, ఘోషకుటీపయోఘృతా**
**హారికి, బాలకగ్రహ మహాసురదుర్వనితాప్రహారికిన్.** **భాగ. 1.27**

ఆ చిన్నారి కన్నయ్య అందరి హృదయాలను అలరింపజేసే అందగాడు. నందుని గోకులంలో విహారాలు చేసేవాడు. సుడిగాలిరూపంలో వచ్చిన రక్కసుని మక్కెలు విరుగదన్ని చంపినవాడు. భక్తుల దు:ఖాన్ని తొలగించేదయామూర్తి. గోపకాంతల మనస్సులను దొంగిలించే మహనీయుడు. చెడుగుణాల సంపదలను నాశనంచేసే మహాత్ముడు. గొల్లభామలు కుటీరాలలో దాచుకున్న పాలూ, నెయ్యీ మొదలైన వానిని కొల్లగొట్టిన వెన్నదొంగ. బాలకగ్రహరూపంలో వచ్చిన పాడురక్కసి పూతన ప్రాణాలను చనుబాలతో పాటు పీల్చి చంపివేసిన అద్భుత బాలకుడు. అటువంటి శ్రీకృష్ణచంద్రునకు నా కావ్యాన్ని అంకితం చేస్తున్నాను.

## 20

**శ్రీకృష్ణుని మహోన్నతగుణాలను మరింతగా కొనియాడుతూ మురిసి పోతున్నాడు భక్తశిఖామణి పోతన.**

**శీలికి, నీతి శాలికి, వశీకృతశూలికి, బాణహస్తని**
**ర్మూలికి, ఘోరనీరదవిముక్త శిలాహత గోపగోపికా**
**పాలికి, వర్ణధర్మపరిపాలికి, అర్జునభూజయుగ్మ సం**
**చాలికి, మాలికిన్, విపులచక్రనిరుద్ధమరీచిమాలికిన్. భాగ. 1.28**

అందరూ ఆయన మాననీచిత్తచోరుడంటారు కానీ నిజానికి ఆతడు గొప్ప శీలసంపద కలవాడు. లోకాలన్నింటినీ చక్కగా నడిపించే నీతితో అలరారేవాడు. త్రిశూలాన్ని ధరించిన శ్రీమహాశివుని తనగుండెగుడిలో నిలుపుకొన్న మహాత్ముడు. బాణాసురుని వేయిచేతులనూ విలాసంగా ముక్కలుగా గొట్టిన మహాబలశాలి. చాలా ఉద్ధృతంగా విజృంభించిన రాలవానతో దెబ్బతిన్న గొల్లల నందరినీ భద్రంగా కాపాడిన కృపామూర్తి. వర్ణధర్మాలను కాపాడి లోకాన్ని ఒకత్రాటిమీదనడిపించే దిట్ట. జంట మద్దిచెట్లను పసితనంలోనే కదిలించి కుదిలించి కూల్చినప్రోడ. నిరంతరం పూమాలలను ధరించి వానికి వన్నెతెచ్చిన అందగాడు. తనచక్రంతో సూర్యుని కిరణాలప్రసారాన్ని అడ్డగించిన సర్వేశ్వరుడు. అతనికి అంకితంగా నా భాగవత మహారచనను ప్రారంభిస్తున్నాను.

## 21

**అనంతకల్యాణ గుణసంపన్నుడైన శ్రీకృష్ణస్వామి భగవల్లక్షణాలను మరింత ఆనందపుపొంగుతో అభివర్ణించి మురిసిపోతున్నాడు పోతన. మనకు కూడా ఆ ఆనందాన్ని అందిస్తున్నాడు.**

**క్షంతకు, కాళియోరగవిశాలఫణోపరినర్తనక్రియా**
**రంతకు, ఉల్లసన్మగధరాజ చతుర్విధఘోర వాహినీ**
**హంతకు, ఇంద్రనందననియంతకు, సర్వచరాచరావళీ**
**మంతకు, నిర్జితేంద్రియ సమంచితభక్తజనానుగంతకున్. భాగ. 1.29**

నల్లని ఆసామి ఎట్టివానినైనా క్షమించే హృదయవైశాల్యం గలవాడు. కాళియసర్పరాజు విశాలమైన పడగలమీద నర్తనం చేయటం అనేపనిలో ఆనందించేవాడు. పొగరెక్కి మిడిసిపడుతున్న జరాసంధుని రథములు, ఏనుగులు, గుఱ్ఱాలు, కాలుబంటులు అనే నాలుగువిధాలైన సేనలను రూపుమాపినవాడు. ఇంద్రుని కుమారుడైన అర్జునునిరథానికి సారథి అయినవాడు. సమస్తమైన ప్రాణికోటికీ, కదలకుండా నిలిచిఉండే జడపదార్థాల సముదాయానికీ భావింపదగినవాడు, ఇంద్రియాలను తమ అదుపులో ఉంచుకొని యోగులైన గొప్పభక్తుల వెంటనంటి మెలగేవాడు. అట్టి నీలవర్ణశోభితుడైన కన్నయ్యకు నా కావ్యాన్ని అంకితం ఇస్తున్నాను.

## 22

శ్రీవాసుదేవుని గుణకథనంలో తృప్తితీరని పోతన, గొప్ప అలంకారాలతో అలరారుతున్న పద్యపుష్పంతో ఇంకా ఇలా కొనియాడుతున్నాడు.

**న్యాయికి, భూసురేంద్రమృతనందనదాయికి, రుక్మిణీ మన**
**స్థ్సాయికి, భూతసమ్మదవిధాయికి, సాధుజనానురాగ సం**
**ధాయికి, పీతవస్త్రపరిధాయికి, పద్మభవాండ భాండని**
**ర్మాయికి, గోపికానివహ మందిరయాయికి, శేషశాయికిన్.**

శ్రీకృష్ణస్వామి న్యాయప్రవృత్తి కలవాడు. తనగురువైన సాందీపనికి అతని చచ్చిన కుమారుని గురుదక్షిణగా సమర్పించిన మహాత్ముడు. రుక్మిణీదేవి హృదయాలయంలో సుస్థిరమైన గూడుకట్టుకొన్నవాడు. ఉత్తమశీలంగల జనులకు అనురాగాన్ని కూర్చేవాడు. చూడముచ్చట అయిన పట్టుపుట్టాన్ని కట్టేవాడు. బ్రహ్మాండములనే భాండములను నిర్మించేవాడు. గోపికల మందిరాలలో తిరుగాడేవాడు. శేషతల్పం మీద సుఖనిద్ర పొందేవాడు. అటువంటి శ్రీకృష్ణునికి అంకితముగా నేను శ్రీమదాంధ్రభాగవతాన్ని రచిస్తున్నాను.

## 23

భాగవతం అంటే ఏమిటి? దానినే ఎందుకు అధ్యయనం చేయాలి? చేస్తే కలిగే ప్రయోజనాలెట్టివి?-ఈ ప్రశ్నలకు పోతనగారు చక్కని సమాధానాలు చెబుతున్నారు.

**శ్రీమంతమై మునిశ్రేష్ఠకృతంబైన**
**భాగవతంబు సద్భక్తితోడ**
**వినగోరువారల విమలచిత్తంబుల**
**చెచ్చెర నీశుండు చిక్కుగాక**
**యితరశాస్త్రంబుల నీశుండు చిక్కునే**
**మంచివారలకు నిర్మత్సరులకు**
**కపట నిర్ముక్తులై కాంక్షసేయక యిందు**
**తగిలియుండుట మహాతత్వబుద్ధి**
**పరగ నాధ్యాత్మికాది తాపత్రయంబు**
**నడచి పరమార్థభూతమై యఖిలసుఖద**
**మై సమస్తంబు గాకయు నయ్యునుండు**
**వస్తు వెఱుగంగదగు భాగవతమునందు.** 1.34

భాగవతం జ్ఞానలక్ష్మితో ప్రకాశిస్తూ ఉంటుంది. మహర్షులలో శ్రేష్ఠుడు శ్రీవేదవ్యాసుడు దానిని రచించినవాడు. గొప్పభక్తితో దానిని వినాలనేకోరికగల నిర్మలచిత్తంగల వారిలో పరమేశ్వరుడు వడివడిగా చేరుకొని అక్కడ స్థిరనివాసం చేస్తాడు. ఇతరశాస్త్రాలవలన అటువంటిమహాఫలం సిద్ధించదు. సత్పురుషులు, మాత్సర్యంలేనివారు, కపటభావాలులేనివారూ మఱి దేనిని కోరకుండా ఈ భాగవతాన్నే అంటిపెట్టుకొని ఉంటారు. అట్టివారికి ఆధ్యాత్మికం, ఆధిదైవికం, ఆధిభౌతికం అనే తాపాలు మూడూ అణిగిపోతాయి. అప్పుడు వారి హృదయాలలో పరమతత్త్వం ప్రసన్నంగా ఉంటుంది. అది అన్నివిధాలైన సుఖాలనూ కలిగిస్తుంది. ఆవాసుదేవుడు అన్నీ తానే అయినవాడు, కానివాడు కూడా. అట్టి పరమాత్మను తెలుసుకోవాలంటే భాగవతాన్ని తెలుసుకోవాలి.

## 24

**భాగవతరసాన్ని ఆస్వాదించటం ఎంతటిమహాఫలితాన్ని ఇస్తుందో పోతన్న గారు చక్కని అలంకారభాషలో మనకు బోధిస్తున్నారు.**

**వేదకల్పవృక్షవిగళితమై శుక**
**ముఖసుధాద్రవమున మొనసియున్న**
**భాగవతపురాణ ఫలరసాస్వాదన**
**పదవి గనుడు రసికభావవిదులు.** **భాగ. 1.35**

రసికులైన తత్త్వమెరిగిన నరులారా! ఈభాగవతం అనే పురాణపు ఫలంనుండి జాలువారే రసాన్ని ఆస్వాదించే పదవిని పొందండి. ఈ పండు వేదాలనే కల్పవృక్షమునందే పండి క్రిందికి జారివచ్చింది. చిలుకవంటి శుకమహర్షి ముఖమందుండే అమృతద్రవాన్ని అంటించుకొని మరింతగా మాధుర్యాన్ని సంతరించుకొన్నది. నేలకు దిగివచ్చి మనకందరకూ అందుబాటులో కదలాడుతున్నది. రసికత ఉన్నవారైతే దీనిని కర్ణపుటాలతో జుఱ్ఱుకోండి. మీ జన్మ ధన్యమవుతుంది.

## 25

**నైమిశారణ్యంలో శౌనకుడు మొదలైనమహర్షులకు పురాణాలు చెప్పటంలో గొప్పప్రజ్ఞగల సూతుడు, భాగవతాన్ని వ్యాసమహర్షి రచించి తనకుమారుడైన శుక యోగీంద్రునిచేత చదివించాడు- అనిచెప్పగా శౌనకుడు, అయ్యా శుకునకు మోక్షం తప్పమరేమీ అక్కరలేదే. అతడు దేనినీ పట్టించుకోడే. అట్టివాడు భాగవతాన్ని ఎందుకు అభ్యసించాడు అని అడిగాడు. అప్పుడు సూతుడు ఇలా అన్నాడు.**

**ధీరులు నిరపేక్షులు నా**
**త్మారాములు నైన మునులు హరిభజనము ని**
**ష్కారణమ చేయుచుందురు**
**నారాయణు డట్టివాడు నవ్యచరిత్రా.** **భాగ. 1.137**

మహర్షీ! నీనడవడి కొనియాడదగినదయ్యా! విను. నీప్రశ్నకు బదులు చెబుతాను. గొప్పబుద్ధితో విలాసంగా విహరించేవారూ, ఏ అపేక్షతో అంటుసొంటులు లేనివారూ, ఆత్మతత్త్వమునందే ఆనందంపొందే శీలంకలవారూ అయిన మునులు శ్రీమహావిష్ణువు భజనను ఏకారణమూ లేకుండానే చేస్తూ ఉంటారయ్యా! ఆ నారాయణుడు అటువంటివాడు! ఏకోరికా లేనివారికి కూడా అతనిని పూజించాలనే కోరిక కలుగుతూ ఉంటుంది.

## 26

**శౌనకమహర్షికి శ్రీమహావిష్ణువును గూర్చి తెలియజెప్పే భాగవతం ఇంకా ఎంత గొప్పదో సూతుడు వివరిస్తున్నాడు.**

**నిగమములు వేయు చదివిన**
**సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్**
**సుగమంబు భాగవతమను**
**నిగమంబు పఠింప ముక్తినివసనము బుధా. 1.139**

మహర్షీ! ఈ సృష్టిలో వాక్కుల స్వరూపాలెన్నో ఉన్నాయి. ఆ అన్నింటిలో చాలా ఉన్నతమైనతావులో ఉన్నవి వేదాలు. అవి పరమాత్మకు సంబంధించిన జ్ఞానాన్ని భద్రంగా పట్టి ఇస్తాయి. కానీ ముక్తి అందచందాలను అందించటంలో అవి యోగ్యమైనవిగా కనపడటంలేదు. ఎందుకంటే అవి వేలకొలదిగా చదివినా సుఖంగా తెలియరావు. కానీ భాగవతం అనే వేదాన్ని శ్రద్ధతో చదివితే ముక్తి గుట్టుమట్టులన్నీ సులభంగా అందుకోవచ్చు.

## 27

**అశ్వత్థామ కసాయివానికంటె ఘోరంగా నిద్రిస్తూ ఉన్న పాండవకుమారులను, మరికొందరినీ నరికిప్రోవులు పెట్టాడు. ద్రౌపది ఆకడుపుకోతను తట్టుకోలేక కుమిలికుమిలి ఏడ్చింది. అర్జునుడు ఆమెను ఓదార్చి అశ్వత్థామను వధించటానికి కృష్ణునితోపాటు వెళ్ళాడు. అతడు దొరికాడు. కానీ గురుపుత్రుడని చంపక, కట్టితెచ్చి ద్రౌపదిముందు నిలిపాడు. అప్పుడా తల్లి ఇలా అన్నది.**

**ఉద్రేకంబున రారు; శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు; కిం**
**చిద్ద్రోహంబును నీకుజేయరు; బలోత్సేకంబుతో చీకటిన్**
**భద్రాకారుల పిన్నపాపల రణప్రౌఢక్రియాహీనులన్**
**నిద్రాసక్తుల సంహరింప నకటా నీచేతులెట్లాడెనో. 1.161**

అయ్యా! గురుపుత్రా! నాపసిబిడ్డలు నీమీదకు ఉద్రేకంతో నిన్నేదో చేసివేయాలని రాలేదే! ఆయుధాలు పట్టుకొని రణరంగంలో వీరవిహారం చేయలేదే! పైగా కండబలమూ, గుండెబలమూ పురికొల్పగా నీకు పిసరంత కూడా అపకారం చేసినవారు కారు గదా! చీకటిలో ఆదమరచి నిద్రిస్తున్నవారిని, యుద్ధంలో దుడుకు పనులుచేయటం చేతకానివారిని, చంపటానికి, అయ్యయ్యో! నీకు చేతులెలా ఆడాయి?

# 28

**పాండవులు సేసినపరాభవానికి కుమిలిపోయిన అశ్వత్థామ వెనుకా ముందూ చూడకుండా పాండవగర్భాలను మాడ్చివేసే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది అభిమన్యుని యిల్లాలు ఉత్తర గర్భంలో ఉన్న శిశువును కాల్చివేయబోతున్నది. అప్పుడు ఉత్తర మరొకదారిలేక శ్రీకృష్ణుణ్ణి ఇలా ప్రార్థించింది.**

**చెల్లెలికోడల; నీమే**
**నల్లుడు శత్రువులచేత హతుడయ్యెను; సం**
**ఫుల్లారవిందలోచన!**
**భల్లాగ్ని నణంచి శిశువు బ్రతికింపగదే. 1.179**

బాగా విప్పారిన పద్మాలవంటి కన్నులుగల కన్నయ్యా! నేను నీముద్దుల చెల్లెలి కోడలిని. నీకు ఎంతో ప్రియుడైన నీమేనల్లుడు పగవారికి చిక్కిప్రాణాలు కోల్పోయాడు. ఇదిగో అశ్వత్థామ వేసిన బాణం నా గర్భాన్ని కాల్చివేస్తున్నది. దానిని అణగగొట్టి కడుపులో ఉన్న నిసుగును బ్రతికించు మహాత్మా!

# 29

**ఉత్తర ఆర్తనాదం శ్రీకృష్ణుని దయాంతరంగాన్ని కదిలించివేసింది. వెంటనే అతడు క్షణమైనా ఆలస్యం చేయకుండా ఉత్తరకడుపును కాపాడటానికి పూనుకొన్నాడు.**

**తనసేవారతిచింత గాని పరచింతాలేశమున్ లేని స**
**జ్జనులం బాండుతనూజులన్ మనుపు వాత్సల్యంబుతో ద్రోణనం**
**దను బ్రహ్మాస్త్రము నడ్డపెట్ట బనిచెన్ దైత్యారి సర్వారి సా**
**దననిర్వక్రము రక్షితాఖిల సుధాంధశ్చక్రముం జక్రమున్. 1.182**

ఆ పాండురాజుకొడుకులకు ఎల్లవేళలా తనను సేవించుకోవటమనే భావనయే కానీ మరొక చింత రవంత కూడా లేదు. అట్టివారిని ఆదుకోవాలి అనే వాత్సల్యభావంతో రక్కసులను చీల్చిచెండాడేవాడైన శ్రీకృష్ణుడు అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని అడ్డుకోవలసినదిగా చక్రాన్ని ఆదేశించాడు. అది సుదర్శనమనేనామం గలది. పగవారి నందరినీ రూపుమాపటంలో గురితప్పనిది. అమృతమే అన్నమైన దేవతల సమాజా న్నంతటినీ కంటికి రెప్పలా కాపాడేది. అట్టిది తల్లికడుపులో ఉన్న చిన్నినిసుగును కాపాడకుండా ఎలా ఉంటుంది?

# 30

**శ్రీకృష్ణపరమాత్మ ఉత్తరకడుపున నున్న చిన్ని బిడ్డను కాపాడినతీరును పోతనమహాకవి అత్యద్భుతంగా వేదాంతరహస్యాలు పాఠకులహృదయాలలో వింతవెలుగులను ప్రసరింపజేసేవిధంగా వర్ణిస్తున్నాడు.**

**సకలప్రాణి హృదంతరాళముల భాస్వజ్జ్యోతి యై యుండు సూ**
**క్ష్మకళుం డచ్యుతు డయ్యెడన్ విరటజాగర్భంబు తా చక్రహ**
**స్తకుడై వైష్ణవమాయ గప్పి కురుసంతానార్థియై యడ్డమై**
**ప్రకటస్ఫూర్తి నణంచె ద్రోణతనయబ్రహ్మాస్త్రమున్ లీలతోన్.** 1.183

ఆపరమాత్మ ప్రాణంకల అందరి హృదయాలనే ఆలయాలలోపల దివ్యకాంతులతో వెలుగొందే మహాదీపం. సూక్ష్మమైన కళతో అలరారేవాడు. ఎక్కడా ఏవిధమైన జారుపాటూ లేనివాడు. అట్టిజ్ఞాన దీపమైన దేవుడు విరాటరాజపుత్రిక అయిన ఉత్తరగర్భంలో ప్రవేశించాడు. చూడనలవికాని వెలుగులను చిందిస్తున్న చక్రాన్ని చేతితో పట్టుకున్నాడు. ఆయన అందరిలో అన్నింటిలో లోపలా వెలుపలా సంచరించే విష్ణువు కదా! అట్టి వైష్ణవమాయతో కప్పివైచి కౌరవవంశానికి అంకురమైన బిడ్డను కాపాడటానికై, అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని విలాసంగా అణచివేశాడు.

# 31

శ్రీకృష్ణవాసుదేవుడు ఉత్తరగర్భంలో ఉన్న కురువంశాంకురాన్ని పరిరక్షించి తననివాసానికి బయలుదేరాడు. ఆసందర్భంలో శ్రీకృష్ణతత్త్వం చక్కగా తెలిసికొన్న కుంతీదేవి ఆ గోపాలబాలకుని ఇలా స్తుతించింది.

**శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగారరత్నాకరా!**
**లోకద్రోహినరేంద్రవంశదహనా! లోకేశ్వరా! దేవతా**
**నీకబ్రాహ్మణగోగణార్తిహరణా! నిర్వాణసంధాయకా!**
**నీకున్ మ్రొక్కెద త్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!** 1.190

శ్రీకృష్ణా! నీవు యదువు, శూరుడు, వాసుదేవుడు మొదలైన మహానుభావుల వంశానికి గొప్పఅలంకారం అయినవాడవు. నరుడైన అర్జునుడు నీకు ప్రాణమిత్రుడు. సౌందర్యం ఒక రత్నాలగనియైన సముద్రమైతే ఆ రత్నాకరుడవు నీవే. లోకాలకు కీడుచేసే రాజవంశాలను కాల్చిబూడిదచేసిన దయామయుడవు నీవు. పదునాలుగు లోకాలకూ ప్రభుడవు. దేవతల గుంపులకు, బ్రహ్మజ్ఞాన సంపన్నులకూ, గోవులకూ కలిగే ఆర్తిని హరించి వేస్తావు. నీవు భక్తులైనవారికి పరమసుఖాన్ని చక్కగా ప్రసాదిస్తావు. నిత్యమైనదయకు నిధివైన ఓస్వామీ! నీకు మ్రొక్కుతాను. సంసారంలో కట్టిపడవేసే బంధాలనే తీగలను త్రెంచివేయవయ్యా! నా తండ్రీ!

# 32

**కుంతీదేవి కన్నయ్య చిన్ననాటి లీలలను తలచుకొని తలచుకొని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయి యిలా అంటున్నది.**

**కోపముతోడ నీవు దధికుంభము భిన్నముసేయుచున్నచో**
**గోపిక త్రాట గట్టిన వికుంచిత సాంజనబాష్పతోయధా**
**రాపరిపూర్ణవక్త్రము కరంబుల ప్రాముచు వెచ్చనూర్చుచుం**
**బాపడవై నటించుట కృపాపర! నామది జోద్యమయ్యెడిన్.** భాగ.1.191

బాలకృష్ణా! నీవు అడిగినవెంటనే అమ్మ నీవడిగినది యివ్వలేదని అలుకచెంది పెరుగుకుండను పగులగొట్టావు. ఆమె తెచ్చిపెట్టుకొన్న కోపంతో నిన్నొక త్రాటితో కట్టివేసి ఓరగా నిన్ను చూస్తూ ఉన్నది. అప్పుడు నీవు కళ్ళుచికిలించుకొని కాటుకతో నిండిన కన్నీళ్ళు ధారలై జాలువారుతున్న మోమును చేతులతో పాముకుంటూ వేడిగా నిట్టూర్పులు పుచ్చుతూ బాలుడవై నటించటం, కృపాకరా! నామనస్సులో అబ్బురంగా భాసిస్తున్నది.

## 33

**కుంతీదేవి గొప్పజ్ఞానజ్యోతి గుండెలో దాచుకొన్న మహావ్యక్తి. పరమాత్మ అనుగ్రహాన్ని అందుకొనే భాగ్యం కలవారు స్వామిని ఏమి కోరాలో మనకు తనమాటల ద్వారా తెలియజేస్తున్నది. ఆమె మానవసమాజానికి గొప్పగురువు.**

**యాదవులందు పాండుసుతులందు అధీశ్వర నాకు మోహ వి**
**చ్ఛేదము సేయుమయ్య! ఘనసింధువు చేరెడి గంగభంగి నీ**
**పాదసరోజ చింతనముపై ననిశంబు మదీయబుద్ధి న**
**త్యాదరవృత్తితో కదియునట్లుగ చేయగదయ్య! యీశ్వరా! భాగ. 1.198**

సర్వకాలాలలో సర్వలోకాలనూ పాలించే ఓఈశ్వరా! నాకు నా పుట్టింటి వారైన యాదవులందూ, మెట్టినింటివారైన పాండవుల యందూ మోహం ఆవంత కూడా లేకుండా చేయి నాయనా! నీవు అన్నిలోకాలకూ పాలకుడవు. నాబుద్ధి సర్వకాలసర్వావస్థలలోనూ సముద్రంలోనికే చేరుకొనే గంగలాగా, నీపాదపద్మాలను మాత్రమే మిక్కిలి ఎక్కువ ఆదరంతో కలిసి పోయే విధంగా దయచూడు.

## 34

**అంపశయ్యపై వెలుగొందుతూ అవసానకాలాన్ని ఎదురు చూస్తున్న భీష్ముణ్ణి దర్శించుకోవటానికి ధర్మరాజు తమ్ములతో బంధువులతో సర్వలోకబాంధవుడైన వాసుదేవునితో కలిసి వెళ్ళాడు. ఆ సమయంలో పాండవులు పడ్డపాటులను, వారి భాగ్యసంపదను సంభావిస్తూ భీష్ముడు ఇలా అన్నాడు.**

**రాజట ధర్మజుండు; సురరాజసుతుండట ధన్వి; శాత్రవో**
**ద్వేజకమైన గాండివము విల్లట; సారథి సర్వభద్ర సం**
**యోజకుడైన చక్రియట! యుగ్రగదాధరుడైన భీము డ**
**య్యాజికి తోడు వచ్చునట యాపద గల్గుట యేమి చోద్యమో! 1.210**

ధర్మదేవతకుమారుడు ధర్మరాజు రాజట. దేవేంద్రునికుమారుడు అర్జునుడు గొప్పవిలుకాడట. పగవారి గుండెలలో గుబులుపుట్టించే గాండీవం ఆ అర్జునుడు ఉపయోగించే విల్లట. సర్వజనులకూ, సర్వవిధాలైన శుభాలను సమకూర్చే చక్రధారి కృష్ణుడు ఆగాండీవికి సారథిగా ఉన్నాడట పరమభయంకరమైన గదను చేతబట్టిన భీమసేనుడు ఆపోరులో తోడుగా ఉన్నాడట. ఇంత సాధనసంపత్తి ఉన్నా నాయనలారా! మీకు ఆపదకల్గినదట! ఇది యెంత అబ్బురమైన విషయం!

## 35

**తాత భీష్ముడు తాను కోరినప్పుడు మరణం పొందేవరం తండ్రివలన పొందినవాడు. తనకు మిక్కిలి ఆప్తులైన ఉత్తమపురుషులు పాండవులు, పురుషోత్తముడైన వాసుదేవుడూ తన్ను సేవిస్తూ తనదగ్గర ఉన్నారు. ఉత్తరాయణపుణ్యకాలం వచ్చింది. చేయవలసినపని ఏమీలేదు. దేహాన్ని వదలివేయాలని నిశ్చయించు కున్నాడు.**

**ఆలాపంబులు మాని చిత్తము మనీషాయత్తముంజేసి దృ**
**గ్జాలంబున్ హరిమోముపై పఱపి తత్కారుణ్యదృష్టిన్ విని**
**ర్మూలీభూత శరవ్యథా నిచయుడై మోదించి భీష్ముండు సం**
**శీలంబొప్ప నుతించె కల్మషగజశ్రేణీహరిన్ శ్రీహరిన్.** **1.215**

అనవసరమైన మాటలను మానివేశాడు. మనస్సును బుద్ధికి అధీనంలో ఉండేవిధంగా కూర్చుకొన్నాడు. చూపులన్నింటినీ శ్రీకృష్ణునిమోముమీదనే నిలిపి ఉంచాడు. ఆమహాత్ముడు వాసుదేవుని దయతో నిండిన చూపుల వలన యుద్ధమాడినపుడు ఒడలిలో గ్రుచ్చుకొన్న బాణపుములుకులు పెడుతున్న బాధలన్నీ మూలముట్టుగా తొలగిపోయాయి. ఆనందం తనలో తాండవిస్తూ ఉన్నది. మిక్కిలి ఉత్తమమైనశీలం ప్రకాశిస్తూ ఉన్నది. అలా అన్నింటినీ చక్కచేసుకొని పాపాలనే ఏనుగులపంక్తులను రూపుమాపే శ్రీహరిని స్తుతించాడు.

## 36

**అంపశయ్యమీద హాయిగా మేను వాల్చి శ్రీకృష్ణపరమాత్మను హృదయదేవాలయంలో భద్రంగా నిలుపుకొని ఆనందసామ్రాజ్యంలో విహరిస్తున్నాడు శంతనునికుమారుడు భీష్ముడు. అప్రయత్నంగా తనకు ఆత్మీయులైనపాండవులతో కలసి తాను ఉన్నచోటుకే వచ్చి నిలుచున్నాడు వాసుదేవుడు. ఆ పరమాత్ముని నోరారా కొనియాడుతున్నాడు భీష్ముడు.**

**త్రిజగన్మోహననీలకాంతి తను వుద్దీపింప, ప్రాభాత నీ**
**రజ బంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల, నీలాలక**
**వ్రజసంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా**
**విజయున్ జేరెడు వన్నెలాడు మది నావేశించు నెల్లప్పుడున్.** **భాగ. 217**

మూడులోకాలు మురిసిపోయే నీలవర్ణంలో అలరారే దేహం పైపైకి కాంతులను విరజిమ్ముతూ ఉన్నది. ఉదయకాలంలో సూర్యభగవానునివంటి ఉత్తరీయం ఆ నల్లనిదేహం మీద రంజిల్లుతున్నది. నిగనిగలాడే నల్లని ముంగురుల మొత్తాలు మోము అనేపద్మం మీద క్రమ్ముకొని దోబూచులాడుతున్నాయి. ఎంతసేపు చూచినా ఆ మొగం సొబగు ఇక చాలు అనిపించటం లేదు. ఆ విధమైన స్వరూపంతో మా ముద్దులమనుమడు అర్జునుని కడకు చేరుకొంటున్న వన్నెచిన్నెలస్వామి కన్నయ్య నాహృదయంలో ఎల్లప్పుడూ నెలకొని ఉండాలి.

## 37

**పరమభాగవతోత్తముడు గంగమ్మ ముద్దులబిడ్డడు, జ్ఞానసంపన్నుడు ఇంకా శ్రీకృష్ణపరమాత్మను గురించి యిలా అంటున్నాడు.**

**హయరింఖాముఖధూళిధూసరపరిన్యస్తాలకోపేతమై**
**రయజాతశ్రమతోయబిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో**
**జయమున్ పార్థున కిచ్చువేడ్క నని నా శస్త్రాహతిం జాలనొ**
**చ్చియు పోరించు మహానుభావు మదిలో చింతింతు నశ్రాంతమున్. 1.218**

ఆ కన్నయ్య మహానుభావుడు. ఊహల కందని గొప్పతనం కలవాడు. ఎందుకంటే ఆయన సాక్షాత్తూ పరమాత్మ అని తెలిసి కూడా నేను యుద్ధధర్మాన్ని పాటించి ఆయనదేహాన్ని కుళ్ళబొడిచాను. అయినా ఆయన నన్ను చంపటమో, యుద్ధభూమినుండి రథికుడైన అర్జునుని తొలగించుకొని పోవటమో చేయక ఏది ఏమైనా అతనికి జయమునే కలిగించాలని గొప్ప ఉత్సాహంతో పోరించిన మహానుభావుడు. గుఱ్ఱాల డెక్కల కొనల తాకిడికి లేచిన దుమ్ముతో నిండిన ముంగురులు మొగం మీద చిందులు త్రొక్కుతున్నాయి. వడివడిగా గుఱ్ఱాలను తోలటంవలన మోము అంతా చెమటబిందువులతో ఒప్పులకుప్పగా ప్రకాశిస్తున్నది. పరమమనోహరమైన ఆ మొగంతో అలరారే ఆ స్వామిని అలుపూ సొలపూ లేకుండా భావిస్తూనే ఉంటాను.

## 38

**ఎప్పుడో కురుక్షేత్రమహాసంగ్రామంలో తనముందు కదలాడిన చైతన్యమూర్తి శ్రీకృష్ణుడే అంపశయ్య మీద హాయిగా పవ్వళించిన భీష్ముని హృదయమందిరంలో మెరిసి పోతున్నాడు. ఆ అనుభూతిని మాటలతో అందరికీ అమృతప్రసాదంలాగా అందిస్తున్నాడు భక్తశిఖామణి భీష్ముడు-**

**నరుమాటల్ విని నవ్వుతో ఉభయసేనా మధ్యమక్షోణిలో**
**పరు లీక్షింప రథంబు నిల్పి పరభూపాలావళిం జూపుచున్**
**పరభూపాయువులెల్ల చూపులన శుంభత్కేళి వంచించు నీ**
**పరమేశుండు మెలంగుచుండెడు మన: పద్మాసనాసీనుడై. భాగ. 1.219**

కౌరవులూ, పాండవులూ కురుక్షేత్రంలో పోరాటానికి తలపడి నిలిచి ఉన్నారు. హఠాత్తుగా పాండవ పక్షంలోని పరమవీరుడు పార్థుడు అచ్యుతా! నారథాన్ని రెండుసేనల మధ్యలో నిలబెట్టు. నేనెవరితో పోరాడాలో ఒకసారి చూస్తాను – అన్నాడు. కన్నయ్యకు ఆమాటలు విన్నంతనే నవ్వువచ్చింది. పగవారు పట్టిపట్టి పరికిస్తూ ఉండగా రెండుసేనల మధ్యలో ఉన్ననేల మీద రథాన్ని నిలబెట్టాడు పార్థసారథి. శత్రువులైన రాజులనందరినీ చూపిస్తున్నాడు. ఆ చూపులతోనే పరరాజుల ఆయువు లన్నింటినీ విలాసమైన ఒక ఆటగా లాగివేసుకుంటున్నాడు. అట్టి పరమాత్మ నామనస్సు అనే పద్మంలో సుఖంగా నెలకొని మెలగుతూ ఉండాలి.

## 39

**పరమభాగవతశిఖామణి భీష్ముడు శ్రీకృష్ణవాసుదేవుని జ్ఞానకిరణాల ప్రసారాన్ని గురించి యిలా తనహృదయంలో ముచ్చటించుకుంటున్నాడు.**

**తనవారి చంపజాలక**
**వెనుకకు బో నిచ్చగించు విజయుని శంకన్**
**ఘనయోగవిద్య బాపిన**
**మునివంద్యుని పాదభక్తి మొరయున్ నాకున్.** భాగ. 1.230

అతనిపేరు విజయుడు. అది ఆషామాషీగా రాలేదు. అనేకయుద్ధాలలో సాధించిన గెలుపులకు సంకేతంగా వచ్చింది. అటువంటి మహావీరుడు అర్జునుడు తప్పనిసరిగా గెలువవలసిన కురుక్షేత్ర మహాసంగ్రామం దగ్గరకు వచ్చేసరికి నీరుకారిపోయాడు. చంపవలసినవారందరూ తనవారే. ఎలా చంపటం? ఇదీ అతని శంక. ఈ శంక కూడా ఆషామాషీగా పోయేది కాదని సర్వజ్ఞుడైన వాసుదేవునికి తెలుసు. అందుకని ఘనమైన యోగవిద్యను ఉపదేశింపవలసివచ్చింది. అదే యోగశాస్త్రమైన భగవద్గీత. అది వాసుదేవుని జ్ఞానాస్త్రం. దానితో అర్జునుని శంక నామరూపాలు లేకుండా పోయింది. గీతోపదేశం చేసిన జ్ఞానమూర్తి కనుకనే ఆయన మును లందరికీ వంద్యుడైనాడు. ఆమహాత్ముని పాదాల మీద భక్తి నాకు అనుక్షణమూ గుండెగుడిలో ఘంటలమ్రోతలాగా మ్రోగుతూ ఉండాలి.

## 40

**స్వామి భక్తులను సంరక్షించే కళలో గొప్పఉత్సాహం కలవాడు. కనుక తనస్థాయికి తగని ఏపనికైనా, ఆ ప్రయోజనం కోసం, సిద్ధపడతాడు. అందుకే అర్జునుని రథంలో కూర్చుని గుఱ్ఱాలను తోలడానికి పూనుకున్నాడు. అంటే మహాభక్తితో భక్తులసేవలందుకొనేస్వామి సేవకుడయ్యాడు. దానిని భావిస్తున్నాడు భీష్ముడు.**

**తనకున్ భృత్యుడు వీని గాచుట మహాధర్మంబు వొమ్మంచు అ**
**ర్జునసారథ్యము పూని పగ్గములు చే చోద్యంబుగా పట్టుచున్**
**మునికోలన్ వడి జూపి ఘోటకములన్ మోదించి తాడించుచున్**
**జనులన్ మోహము నొందజేయు పరమోత్సాహుం బ్రశంసించెదన్.** భాగ. 1.222

ఈ అర్జునుడు నాకు, తల్లికి కొడుకులాగా కంటికి రెప్పలాగా, కాపాడవలసినవాడు. వీనిని కాపాడటం మహాధర్మం అని అతని రథాన్ని నడపటానికి పూనుకొన్నాడు కృష్ణుడు. సారథులను ఎందరినో చూచాను. కానీ ఈయన పగ్గాలు పట్టుకొన్నతీరు తెన్నులు ఎంత అద్భుతంగా ఉన్నాయి! అలా ఒక చేతిలో పగ్గాలూ, మరొకచేతిలో చెన్నాకోల. దానితో పొగరు గుఱ్ఱాలను ప్రమోదంతో చిన్నిచిన్నిదెబ్బలు తగిలిస్తూ- అబ్బే తగిలిస్తున్నట్లు కనిపిస్తూ- యుద్ధరంగంలోని జనులను మోహపెడుతూ ఉండే పరమోత్సాహంగల స్వామిని తనివితీరా కొనియాడుతాను.

## 41

ఆయన మన కళ్ళముందు అందరిలాగా తిరుగుతూ మామూలుమనిషే అనిపిస్తాడు. కానీ జ్ఞానసంపన్నుడు భీష్ముని చూపునకు ఆయన పరమాత్మయే. ఆపరమరహస్యాన్ని ఎంత పరమసుందరంగా తెలియజేస్తున్నారో ఆచార్య భీష్ములు గమనిద్దాం.

**ఒక సూర్యుండు సమస్తజీవులకు తానొక్కొక్కడై తోచు పో**
**లిక నే దేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ**
**న్యకదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూన రూ**
**పకుడై యొప్పచునుండు నట్టి హరి నే ప్రార్థింతు శుద్ధుండనై.** భాగ. 1.225

ప్రతిదినం మనం ఆకాశంలో ఈ అంచున ఉదయించి ఆ అంచున అస్తమించే అంబరమణి సూర్య భగవానుని చూస్తూనే ఉంటాం. నిజానికి ఆయన ఒక్కడే. కానీ చూచే ప్రతివ్యక్తీ నాసూర్యుడు, నావాడే సూర్యుడు అనుకొనేట్లుగా కనబడుతూ ఉంటాడు. అలాగే ఇప్పుడు కృష్ణభగవానుని రూపంతో కానవస్తున్న ఈ దేవుడు అనంతమైన లీలతో తననుండి పుట్టిన ప్రాణుల గుంపుల హృదయాలనే పద్మాలలో నానావిధాలైన గొప్పగొప్పరూపాలతో కానవస్తూ ఉంటాడు. అట్టి పరమాత్ముణ్ణి, మనస్సులో, మాటలో, చేష్టలో సహజంగా ఏర్పడే మాలిన్యాన్ని పిసరంతకూడా మిగులకుండా తొలగించుకొని ప్రార్థిస్తూ ఉంటాను.

## 42

పోరు అతిక్రూరంగా జరుగుతున్నది. పరశురాము నంతటివానిని కదలించి కుదిలించి వైచిన భీష్ముడు ప్రళయకాలంలో రుద్రునిలాగా పాండవసేనను చీల్చిచెండాడుతున్నాడు. పరమశివుని బాణవిద్యలో మెప్పించిన అర్జునుడు తల్లడిల్లిపోతున్నాడు. తనప్రతిజ్ఞను కూడా ప్రక్కనపెట్టి భక్తరక్షణకళలో పేరుపొందిన కృష్ణుడు భీష్ముణ్ణి చంపి అర్జునుని కాపాడటానికి సంసిద్ధుడైనాడు. అప్పటి శ్రీకృష్ణుని సంరంభాన్ని ఇప్పటిదాకా హృదయంలో పదిలంగా నిలుపుకొన్న భీష్ముడు దానిని కమనీయవాక్కుల ద్వారా సంభావిస్తున్నాడు.

**కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి**
**గగనభాగం బెల్ల కప్పిగొనగ**
**ఉఱికిన నోర్వక ఉదరంబులో నున్న**
**జగములవ్రేగున జగతి కదల**
**చక్రంబుచేపట్టి చనుదెంచురయమున**
**పైనున్న పచ్చని పటము జార**
**నమ్మితి నాలావు నగుబాటు సేయకు**
**మన్నింపుమని క్రీడి మఱల దిగువ**
**కరికి లంఘించు సింహంబు కరణి మెఱసి**
**నేడు భీష్ముని జంపుదు నిన్నుగాతు**
**విడువు మర్జున! అనుచు మద్విశిఖవృష్టి**
**తెరలి చనుదెంచు దేవుండు దిక్కునాకు.** భాగ. 1.231

శ్రీకృష్ణుడు రథంలో సారథిస్థానంనుండి ఒక్క పెట్టున కుప్పించి పైకి లేచాడు. ఆ ఊపుతో అతని కుండలాలకాంతి గగనాన్నంతా క్రమ్మివేసింది. అదే వేగంతో క్రిందికి దూకాడు. బొజ్జలో ఉన్నలోకాలబరువునకు వెలుపలిజగత్తు కంపించిపోయింది. తల నరకటానికి చక్రాన్నిచేతిలో అమర్చుకొని తనపైకి వస్తున్నాడు. ఆవడికి ఉత్తరీయంగా వేసుకొన్న పచ్చని పట్టుబట్ట జారిపోతున్నది. స్వామీ! నిన్ను నమ్ముకొన్నాను. నా బలవిక్రమాలను నవ్వులపాలు చేయబోకు. నా పరువు కాపాడు అని ఇంద్రుడు మెచ్చిబహూకరించిన కిరీటం తలమీద మిలమిలలాడుతున్న అర్జునుడు వెనుకకు త్రిప్పటానికి బలమంతా ఉపయోగించి లాగుతున్నాడు. అయినా ఏనుగుమీదికి దూకే సింహంలాగా మెరసిపోతూ, ఉండు, ఉండు అర్జునా! నన్నువదలి పెట్టు. ఈనాడు భీష్ముణ్ణి చంపుతాను. నిన్ను కాపాడుతాను అంటూ నా బాణాలజడివానను తప్పించుకుంటూ నామీదికి వస్తూ ఉన్నాడు. అట్టిస్వామి, ఆవిధంగా వచ్చి నన్ను చంపాలని నేను కోరుకొంటున్న ఆ స్వామి, నాకు దిక్కు.

# 43

**కురుకులపితామహుడు భీష్మడు మానుషదేహాన్ని వదలివైచి తనస్థానానికి వెళ్ళిపోయాడు. ధర్మరాజు అతనికి శాస్త్రం చెప్పిన విధంగా పరలోకక్రియలు భక్తిశ్రద్ధలతో ఆచరించాడు. తరువాత ధర్మం తప్పకుండా రాజ్యపాలన చేస్తున్నాడు. జగన్నాయకుడు శ్రీకృష్ణుడు తిరిగి తన నివాసం అయిన ద్వారకకు చేరుకున్నాడు. అక్కడి ప్రజలు ఆనందంతో అతనిని ఇలా వాక్కులతో పూజిస్తున్నారు.**

**నీపాదాబ్జము బ్రహ్మపూజ్యముగదా! నీ సేవ సంసారసం**
**తాపధ్వంసిని యౌ గదా! సకలభద్రశ్రేణులం బ్రీతితో**
**ఆపాదింతుగదా! ప్రపన్నులకు కాలాధీశ! కాలంబుని**
**ర్వ్యాపారంబు గదయ్య! చాలరుగదా! వర్ణింప బ్రహ్మాదులున్.** **భాగ. 1.247**

**కృష్ణా! వాసుదేవా! ఈ పదునాలుగు లోకాలనూ సృష్టించే బ్రహ్మదేవునకు నీ అడుగుదామర పూజింప దగినది కదా! నిన్ను సేవిస్తే సంసార సంబంధమైన తాపమంతా రూపుమాసిపోతుంది. నీవే తప్పమరొక దిక్కులేదు అని నిన్ను చేరుకొన్నవారికి సమస్తకల్యాణపరంపరలను ప్రీతితో నీవు కూరుస్తావు. నీవు కాలానికి కూడా ప్రభుడవు. నీవు సంకల్పిస్తే కాలం కదలకుండా మెదలకుండా నిలిచిపోతుంది. నీగుణగణాలను వర్ణించటానికి నాలుగునోళ్ళున్న బ్రహ్మదేవుడు, వేయినోళ్ళున్న ఆదిశేషుడు మొదలైనవారు కూడా శక్తిలేనివారే అవుతారు.**

# 44

శ్రీకృష్ణచంద్రుడు ద్వారకలో రాజమార్గంలో విలాసంగా సంచరిస్తూ కానవస్తున్నాడు. ఆదివ్యసుందర మూర్తిని పురకాంతలు చూస్తూ పులకలెత్తిన దేహాలతో పొంగిపోతున్నారు. అప్పుడప్పుడే విరిసిన పూవులను కృష్ణునిపై వర్షిస్తున్నారు. అప్పటి కన్నయ్య ఉన్నతీరు ఎంత మనోజ్ఞంగా ఉన్నదో!

**జలజాతాక్షుడు చూడ నొప్పె ధవళచ్ఛత్రంబుతో, చామరం**
**బులతో, పుష్పపిశంగచేలములతో, భూషామణిస్ఫీతుడై**
**నలినీబాంధవుతో, శశిద్వయముతో, నక్షత్ర సంఘంబుతో**
**బలభిచ్చాపముతో తటిల్లతికతో భాసిల్లు మేఘాకృతిన్.** 1.256

నల్లనివాడు, పద్మనయనంబులవాడు అయిన శ్రీకృష్ణుడు ద్వారకలో ఊరేగింపుగా మెలమెల్లగా అందరికీ ఆనందాన్ని కలిగిస్తూ కదలుతున్నాడు. పైన తెల్లని గొడుగు. అటుఇటూ వింజామరలు. పూవులుకుట్టిన పచ్చనికాంతితో కనులపండుగ చేస్తున్న కమనీయవస్త్రాలు. నిలువెల్లా పెక్కుతీరులైన బంగారంలో పొదిగిన వజ్రాలు వైడూర్యాలు మొదలైనవి కల నగలు. ఆహా! ఎంత మనోహరరూపం. ఆయనను చూచిపైకి అలా భావనతో చూస్తే ఒక నల్లనిమేఘం. ఇక్కడి గొడుగు ఆమేఘం మీద వెలుగుల కుప్పలతో కప్పుచున్నసూర్యుణ్ణి తలపింపజేస్తున్నది. చామరాలు రెండు చందమామలలా ఉన్నాయి. నగలు నక్షత్రాలలాగా మెరిసిపోతున్నాయి. ఆభరణాలు ఇంద్రధనుస్సులాగా విరాజిల్లుతున్నవి. మణులు మెరుపుతీగలను స్ఫురింపజేస్తున్నాయి.

## 45

**శ్రీకృష్ణస్వామి అవతారప్రయోజనం ముగించుకొని తనవైకుంఠానికి వెళ్ళిపోయాడు. అర్జునుడు బరువెక్కిన హృదయంతో ద్వారకకు వెళ్ళి చేయవలసిన పనులన్నీ చేసి తిరిగి హస్తినాపురానికి వచ్చాడు. కళాకాంతులులేని ఆతనిమోమును చూచి కంగారుపడి ద్వారకలోని వార్తలడుగుతూ ధర్మరాజు ఇలా అన్నాడు.**

**అన్నా! ఫల్గున! భక్తవత్సలుడు బ్రహ్మణ్యుండు గోవిందుడా**
**పన్నానీక శరణ్యు డీశుడు జగద్భద్రానుసంధాయి శ్రీ**
**మన్నవ్యాంబుజపత్రనేత్రుడు సుధర్మామధ్య పీఠంబునం**
**దున్నాడా? బలభద్రు గూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్.** 1.348

నాన్నా! అర్జునా! మనసారథి మనసచివుడు ఇంకా ఎన్నెన్నో అయిన కృష్ణయ్య, భక్తులయందు పరమ వాత్సల్యం కలవాడు. బ్రహ్మజ్ఞానమే ఆకారం అయినవాడు, గోవులకు ఆనందం కలిగించేవాడు,ఆపదలలో వేదనలు పొందే భక్తులసముదాయాలకు సంరక్షణ కూర్చేవాడు, ప్రభువు, జగత్తులకు శుభాలను అమర్చిపెట్టేవాడు, చక్కని కాంతులతో అప్పుడప్పుడే వికసించిన తామరరేకులవంటి కన్నులున్న మహాత్ముడు, దేవలోకంలో సుధర్మ అనేదేవసభలో కొలువుతీరి ఉన్నదేవేంద్రునిలాగా ద్వారకలో తన కొలువులో సింహాసనం మీద, అన్నబలరామునితో కూడి సుఖంగా, ఉత్సాహంగా ఉన్నాడా?

## 46

**ద్వారకలో శ్రీకృష్ణవాసుదేవుడు తనువు చాలించి తనధామానికి వెళ్ళిపోయాడు. ఆయన నిత్యానంద మూర్తి. కానీ భక్తులు ఆయన అవతారం చాలించటం తట్టుకోలేరుకదా! అందునా అర్జునుని వంటి నిత్యసన్నిహితుల గుండెలు కుతకుతలాడిపోతాయి కదా! అటువంటి అర్జునుని చూస్తున్న అన్న ధర్మరాజునకు గుండె గుబగుబ లాడి పోతున్నది. తమ్మునితో ఇలా అంటున్నాడు.**

**మున్నుగ్రాటవిలో వరాహమునకై ముక్కంటితో పోరుచో**
**సన్నాహంబున కాలకేయుల వడిం జక్కాడుచో ప్రాభవ**
**స్కన్నుండై చను కౌరవేంద్రు పనికై గంధర్వులం ద్రోలుచో**
**కన్నీరెన్నడు తేవు తండ్రి! చెపుమా! కల్యాణమే? చక్రికిన్.** **1.350**

నాయనా! అర్జునా! నీకు లోగడ మహాభయంకరమైన కష్టాలు ఎన్నో వచ్చాయి. అతిభయంకరమైన అడవిలో పందికోసం మూడుకన్నుల దేవుడు పరమేశ్వరునితో పోరాడావు. కాలకేయులనే క్రూరరాక్షసులను ఒక్కడవై తుక్కుదూగరగా కొట్టావు. గుండెదిటవు చెడగొట్టుకొని గంధర్వులకు దొరకిపోయి కుమిలిపోతున్న కురుకులసార్వభౌముడు దుర్యోధనుని కాపాడటానికి గంధర్వులను తరిమికొట్టావు. ఇంకా ఇటువంటి మహాసాహస కార్యాలు చేసిన ఏ సమయంలోనూ నీవు కన్నులలో నీరుపెట్టలేదు. చెప్పు, త్వరగా చెప్పు. బాబూ! చక్రంతో దుష్టులను తునిమితూటాడే మహాత్ముడు శ్రీకృష్ణునకు క్షేమమేనా?

# 47

**అన్నమాటలు వింటున్న అర్జునునకు ఉల్లం మరింత ఎక్కువగా తల్లడిల్లిపోతున్నది. మాట పెగలటం లేదు. ఎలాగో తెమల్చుకొని కన్నీళ్ళుతుడుచుకొని నిట్టూర్పులు నిగుడిస్తూ ఇలా అన్నాడు.**

**మన సారథి, మన సచివుడు**
**మన వియ్యము, మన  సఖుండు, మన బాంధవుడున్**
**మన విభుడు, గురువు, దేవర**
**మనలను దిగనాడి చనియె మనుజాధీశా!** **1.358**

మహారాజా! మనలను రణరంగంలోనూ, జీవితంలోనూ భద్రంగా నడిపించిన సారథి, మనకు అవసరమైన అన్నిసమయాలలోనూ సరియైన ఆలోచనలను ఉపదేశించిన మంత్రి, మనయింటికి పిల్లనిచ్చిన సంబంధి, మనప్రాణాలకు ప్రాణమైన చెలికాడు, మన అమ్మకు మేనల్లుడైన దగ్గరిచుట్టము, మన ప్రభువు, మన గురువు, మన దేవుడు మనలను ఇక్కడనే వదలివేసి తనదారిని తాను వెళ్ళి పోయాడయ్యా!

# 48

**కృష్ణుడు తనకూ తనవారికీ చేసిన ఉపకారాలనూ, కంటికి రెప్పలా కాపాడిన సన్నివేశాలనూ తలచుకొని తలచుకొని, తక్కిన సోదరులముందర అన్నకు చెప్పుకొని కకావికలై పోతున్నాడు గాండీవి అయిన అర్జునుడు.**

**ఇభజిద్వీర్య! మఖాభిషిక్తమగు నీ యిల్లాలి ధమ్మిల్లమున్**
**సభలో శాత్రవు లీడ్చినన్ ముడువ కా చంద్రాస్య దు:ఖింపగా**
**అభయం బిచ్చి ప్రతిజ్ఞ చేసి భవదీయారాతికాంతాశిరో**
**జ భరశ్రీలు హరింపడే విధవలై సౌభాగ్యముల్ వీడగన్.** **1.360**

ఏనుగులను చీల్చిచెండాడే గొప్పశక్తిగల సింహంవంటి పరాక్రమం గల ధర్మరాజా! నీ ధర్మపత్ని ద్రౌపది రాజసూయమూ, అశ్వమేధమూ మొదలైన మహాయజ్ఞాలుచేసినప్పుడు నీతోపాటు అవభృథస్నానం చేసిన గొప్పపవిత్రమూర్తి. అట్టి ఆమె కొప్పును పట్టుకొని నీచులైన నీపగవారు ఈడ్చుకొని వచ్చారు. దానితో పగపట్టిన నాగుపాములాగే చంద్రునివంటి మోముగల ఆ యిల్లాలు కొప్పును ముడువక దు:ఖంతో పెద్దకాలం అలాగే ఉన్నది. అట్టి ఆ ఉత్తమవనితకు అభయం ఇచ్చి ఆపురుషోత్తముడు ఆపరమనీచులను పరిమార్చి వారి ఇల్లాండ్రను విధవలనుగా చేస్తానని ప్రతిజ్ఞచేశాడు. ప్రతిన ననుసరించి నీ పగవారి పడతుల తలవెంట్రుకల సౌభాగ్యం అంతరించి పోయేవిధంగా వారిని విధవలను చేశాడుకదా!

# 49

**అర్జునుడు కృష్ణుడు తనవారియెడల చూపిన కారుణ్యాన్ని మళ్ళీమళ్ళీ సంభావిస్తూ అన్నతో ఇలా అంటున్నాడు. ఆ మహాత్ముడు ద్రౌపది నిండుసభలో పొందినపరాభవాన్నీ, దానికి శ్రీకృష్ణుడు చేసిన ప్రతిక్రియనూ ఈ పద్యంలో స్మరిస్తున్నాడు.**

**వైరుల్ గట్టిన పుట్టముల్ విడువగా వారింప నావల్లభుల్**
**రారీవేళ ఉపేక్షసేయ దగవే? రావే? నివారింపవే?**
**లేరే? త్రాతలు కృష్ణ! యంచు సభలో లీనాంగియై కుయ్యిడన్**
**కారుణ్యంబున భూరివస్త్రకలితంగా చేయడే; ద్రౌపదిన్. 1.361**

పగవారు పరమనీచులు. నీతిమాలినవారు. గొప్పకులంలో పుట్టి గొప్పవారిని చేపట్టిన పరమ పతివ్రతను పాంచాలిని నిండుసభలో బట్టలను ఊడదీయటానికి ప్రయత్నించారు. అన్నా! కృష్ణా! నా భర్తలు ఈనీచమైన పనిని నిలువరించటానికి రాకున్నారు. నీవు కూడా ఉపేక్షచేస్తేఎలా! రావయ్యా! ఈ ఘోరకృత్యాన్ని ఆపవయ్యా! నన్ను రక్షింపగలవారు ఇంకెవరూ లేరు కదయ్యా! అంటూ సభలో కుంచించుకొనిపోయి కుయ్యిపెట్టింది. అంతటా అన్నిటా అన్నికాలాలలో ఉండేస్వామి ఆమెకు పెద్దయెత్తున వస్త్రాలనిచ్చి కాపాడాడు కదయ్యా!.

# 50

**అర్జునుడు శ్రీకృష్ణదేవునికరుణను ఇంకా ఇలా తలచుకుంటూ అన్నకు విన్నవించుకుంటున్నాడు. తాను పార్థుడు. ఆయన పార్థసారథి. జగన్నాటకప్రవర్తకుడు తనకు సారథి కావటం ఎంతటి మహాభాగ్యం!**

**గురుభీష్మాదుల గూడి పన్నిన కురుక్షోణీశచక్రంబులో**
**గురుశక్తిన్ రథయన్తయై, నొగలపై కూర్చుండి, యా మేటి నా**
**శరముల్ వాఙకమున్న వారలబలోత్సాహాయురుద్యోగత**
**త్వరతల్ చూడ్కుల సంహరించె నమితోత్సాహంబు నాకిచ్చుచున్. 1.364**

మనకు ఎదిరిపక్షంలో ఉన్నవారు దేవతలకు కూడా అడలుపుట్టింపగల ద్రోణుడు, భీష్ముడు మొదలైన వారు. వారు గొప్పగొప్ప వ్యూహాలు పన్నుకొని పోరికి శూరులై నిలిచి ఉన్నారు. ఈ స్వామి నారథానికి సారథి. చాలాగొప్పశక్తిని నింపుకొని బండి నొగలపై కూర్చుండినాడు. నేను నా శక్తినంతా ఉపయోగించి

పగవారిమీద బాణాలు గుప్పిస్తూ ఉన్నాను. కానీ అవి ఆ పోటుమగలను చేరకముందే వారి బలాన్నీ ఉత్సాహాన్నీ ఆయువునూ, పూనికనూ, శ్రద్ధనూ చూపులతోనే రూపుమాపివేశాడు. ఆపనితో నాకు పిక్కటిల్లిన ఉత్సాహాన్ని పెంపొందించాడు.

# 51

**శ్రీకృష్ణుని ఎడబాటును తట్టుకోలేకపోతున్నాడు మహాధీరుడైన పాండవమధ్యముడు. ఇంద్రాదులను గూడా ధనుర్విద్యలో మెప్పించిన కిరీటి. హృదయంలోని ఆరాటం అతనిని నిలువనీయటం లేదు. తన దు:ఖావేశాన్ని అన్నకు తెలుపుకుంటున్నాడు.**

**అటమటమయ్యె నాభజనమంతయు భూవర! నేడు చూడుమా!**
**యిటువలె గారవించు జగదీశుడు కృష్ణుడు లేని పిమ్మటన్**
**పటుతర దేహలోభమున ప్రాణములున్నవి వెంట బోక నే**
**కటకట! పూర్వజన్మమున కర్మము లెట్టివి చేసినాడనో! 1.371**

ప్రభూ! ఛీఛీ! చేసిన శ్రీకృష్ణభజనమంతా బూడిదలో పోసిన పన్నీరులాగా పనికిమాలిన దయిపోయింది. చూడు. నన్నింతగా ప్రేమాదరాలతో లాలించిన జగన్నాథుడు, శ్రీకృష్ణుడు లేనితరువాత కూడా నాప్రాణాలు ఈ కట్టెవంటి కాయంమీద మమకారంతో ఆయనవెంట పోకుండా నిలిచి ఉన్నాయి. పూర్వజన్మలో ఎట్టిపాడుపనులు చేసినానో కదా నేను!

# 52

**కర్మవశంచేత ధర్మాత్ముడైన పరీక్షిన్మహారాజు శమీకుడనేమహర్షి మెడలో చచ్చినపామును పడవైచి యింటికి పోయాడు. ఆమహర్షికొడుకు దానిని చూచి కుళ్ళికుళ్ళి ఏడ్చాడు. కోపం ఆపుకోలేక మాతండ్రిని ఈవిధంగా అవమానించిన పాపాత్ముడు ఏడురోజులలో తక్షకుని విషపుమంటలో మాడిపోవుగాక అనిశపించాడు. అది తెలిసికొని పరీక్షిత్తు పశ్చాత్తాపంతో తన్ను చూడవచ్చిన మహర్షులతో ఇలా అంటున్నాడు.**

**ఉరగాధీశ విషానలంబునకు మే నొప్పింతు శంకింప నీ**
**శ్వరసంకల్పము నేడు మానదు; భవిష్యజ్జన్మజన్మంబులన్**
**హరిచింతారతియున్ హరిప్రణుతిభాషా కర్ణనాసక్తియున్**
**హరిపాదాంబుజసేవయున్ గలుగ మీరర్థిన్ ప్రసాదింపరే. 1.501**

అయ్యలారా! ఆత్మస్వరూపులారా! నామనవిని ఆలకించండి. పాములరాజైన తక్షకుని విషం అనే అగ్నికి నాదేహాన్ని సమర్పించుకుంటాను. అందులో ఏమాత్రమూ శంకించను. ఈశ్వరుని సంకల్పం నేడు తప్పకుండా నెరవేరుతుంది. ఇంక ముందుముందు నాకు కలుగుబోయే జన్మలు ఏమయినా ఉంటే వానిలో నేను కోరుకొనేది ఒక్కటే. నా మనస్సు హరిని భావించటంలోనే ఆనందం పొందుతూ ఉండాలి. నావాక్కు శ్రీహరిని కొనియాడటంలోనూ, నాచెవులు శ్రీహరికీర్తనను ఆలకించటంలోనూ ఆసక్తికలవై ఉండాలి. నాదేహం శ్రీహరిపాదపద్మాలను నిరంతరం సేవించుకుంటూ ఉండాలి. ఈ మహాభాగ్యాన్ని నాకు మీరు ప్రసాదించండి.

# ద్వితీయ స్కంధము

## 1

పరీక్షిత్తు చిన్నతప్పిదం వలన శాపగ్రస్తుడైనాడు. అతనికి చాలా గట్టిగా ముక్తిపొందాలనే కోరిక కలిగింది. శ్రీ శుకమహర్షి యాదృచ్ఛికంగా అతని దగ్గరకు ఏతెంచాడు. పరీక్షిత్తు తనకోరికను విన్నవించుకొన్నాడు. శుకమహర్షి అతనికి ముక్తిమార్గాన్ని ఉపదేశిస్తూ ముందుగా ఇలా అన్నాడు.

**గోవిందనామ కీర్తన**
**గావించి భయంబు దక్కి ఖట్వాంగ ధరి**
**త్రీవిభుడు సూఱ గొని యెను**
**కైవల్యము తొల్లి రెండు గడియలలోనన్** **2.11**

నాయనా! పరీక్షిత్తూ! పూర్వం ఖట్వాంగుడనే మహారాజు ఒకడు ఉన్నాడు. ఆయన గోవిందుని నామాన్ని జపించి, సంసారభయాన్ని పోగొట్టుకొని రెండుగడియల కాలంలోనే ముక్తిని పొందాడు. ముక్తి అంటే పుట్టటం, చనిపోవటం అనే చక్రం మళ్ళీమళ్ళీ తిరుగుతూ ఉండటం అనేదానినుండి విడుదల పొందటం. దానినే కేవలత్వం, కైవల్యం అని కూడా అంటారు.

## 2

పరీక్షిత్తునకు ముక్తిని సాధించాలని గాఢమైనవాంఛ కలిగింది. అతనికి ఆ మహాఫలాన్ని అందించటానికి భగవంతుడే స్వయంగా పంపాడా అన్నట్లు అన్నిసంగాలనూ అవలీలగా వదలిపెట్టిన శుకయోగీంద్రుడు అతని దగ్గరకు వచ్చాడు. రాజు అతనిని సేవించుకొని కొన్నిప్రశ్నలు అడిగాడు. శుకుడు సమాధానాలు చెబుతూ ఇలా అన్నాడు.

**హరిమయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుండు సంశయము పనిలే దా**
**హరిమయము గాని ద్రవ్యము**
**పరమాణువు లేదు వంశపావన! వింటే** **2.17**

నాయనా! పరీక్షిన్మహారాజా! నీవు నీ వంశాన్ని నీపుట్టుకచేత పవిత్రం చేసినవాడవు. చూడు. పదునాలుగు లోకాల సముదాయమైన విశ్వమంతా శ్రీమహావిష్ణువుతో నిండిపోయినదే. ఆయనకంటె వేరుగా ఏమీలేదు. అంతేకాదు. ఆ హరివిశ్వమంతానిండి సర్వమూతానే అయి ఉన్నాడు. శ్రీహరితో వ్యాపించి ఉండని వస్తువు పరమాణుమాత్రమైనా లేదు. విన్నావా?

## 3

శుకమహర్షి ఆర్తుడైన పరీక్షిన్మహారాజునకు ప్రపంచసంబంధమైన భోగభాగ్యాలకోసం వెంపరలాడటం తగదనీ, అది మానవుణ్ణి ముక్తికి దూరం చేస్తుందనీ వివరిస్తూ ఇలా పలుకుతున్నాడు.

**కమనీయ భూమిభాగములు లేకున్నవే**
**పడియుండుటకు దూదిపరపులేల ?**
**సహజంబులగు కరాంజలులు లేకున్నవే**
**భోజనభాజన పుంజమేల ?**

**వల్కలాశాజినావళులు లేకున్నవే**
**కట్ట దుకూల సంఘాతమేల ?**
**కొనకొని వసియింప గుహలు లేకున్నవే**
**ప్రాసాదసౌధాదిపటలమేల ?**

**ఫలరసాదులు గురియవే పాదపములు ?**
**స్వాదుజలముల నుండవే సకలదనులు**
**పొసఁగ భిక్షయు పెట్టరే పుణ్యసతులు**
**ధనమదాంధుల కొలువేల ? తాపసులకు** **2.21**

మహారాజా! మోక్షం అనే మహాఫలంపొందాలి. అంటే మానవుడు తపస్సును వదలిపెట్టరాదు. అట్టివారే తాపసులు. పుట్టించిన భగవంతుడు ప్రాణులు సుఖంగా జీవించటానికి అవసరమైన అన్నింటినీ ఏర్పాటుచేసి అందుబాటులో ఉంచాడు. అది గమనింపక ఏదోకావాలని ఆరాటపడుతూ జీవనకాలాన్ని వ్యర్థం చేసుకోవటం ఎంత అవివేకం? చూడు. దేహానికి సుఖాన్నిచ్చే చక్కని ప్రదేశాలు చాలాఉన్నాయి. పడిఉండటానికి దూది పరుపులెందుకు? రెండు చేతులూ కలుపుకొని దోసిలిగా చేసుకొని ఏ పదార్థాన్నయినా నోటిలోనికి పెట్టుకోవచ్చు. తిండితినటానికి పాత్రలను ప్రత్యేకించి కూర్చుకోవాలా? నారచీరలు, చనిపోయిన జంతువుల చర్మాలూ కావలసినంతగా దొరుకుతాయి. వానికోసం అష్టకష్టాలూపడి పట్టువస్త్రాలు సంపాదించాలా? ఉండటానికి కొండగుహలు మెండుగా ఉన్నాయి. పెద్దపెద్ద ఇండ్లను కట్టుకోవటం ఏల? అడుగడుగునా ఎన్నో విధాలయినచెట్లు పండ్లరసాలను కురిపిస్తున్నాయి. నదులన్నీ ఎంతో కమ్మని జలాలను అందిస్తున్నాయి. కన్నతల్లులవంటి వనితలు భిక్షపెట్టి కడుపునింపుతారు. వీనికోసం ధనమదంతో కన్నుగాననివారిని కొలవటం ఎందుకు?

# 4

**మానవుడు ముందుగా వివేకం పండించుకోవాలి. ఆత్మతత్త్వాన్ని చక్కగా తెలుసుకోవాలి. తన్ను రక్షించేవాడు భగవంతుడొక్కడే అని నిరూపిస్తున్నాడు, శుకయోగీంద్రుడు.**

**రక్షకులు లేనివారల**
**రక్షించెద ననుచు చక్రి రాజైయుండన్**
**రక్షింపు మనుచు నొక నరు**
**నక్షము ప్రార్థింపనేల ఆత్మజ్ఞునకున్** **2.22**

అజ్ఞానం వలన కొందరు అయ్యో నన్ను రక్షించేవారు ఎవరున్నారు అని అనవసరంగా అలమటిస్తూ ఉంటారు. గొప్పపనితనంగల సుదర్శనచక్రాన్ని పట్టుకొని విష్ణువు నేను మీ అందరినీ రక్షిస్తాను అని పాలకుడై అన్ని కాలాలలో అన్నిదేశాలలో అండదండలిస్తూ నిలిచిఉన్నాడు. దానిని గమనింపక బాబూ నన్ను కాపాడు అంటూ ఆపనికి ఏమాత్రమూ సామర్థ్యంలేని ఒకమనిషిని దేబెరించటం ఆత్మతత్త్వం తెలిసినవానికి చేయదగిన పనికాదు.

# 5

**పరీక్షిత్తు పసితనంనుండీ పరమాత్మను అర్చించే శీలం కలవాడు. శుకమహర్షి వాసుదేవునియందే మూడుకరణాలనూ చెదరకుండా నిలుపుకొన్నవాడు. ఈయన ఆయనకు విష్ణుభావనలేని దౌర్భాగ్యాన్ని ఇలా వివరిస్తున్నాడు.**

**నారాయణుని దివ్యనామాక్షరములపై**
**కరగని మనములు కఠినశిలలు**
**మురవైరి కథలకు ముదితాశ్రురోమాంచ**
**మిళితమై యుండని మేను మొద్దు**
**చక్రికి మ్రొక్కని జడుని యౌదల నున్న**
**కనకకిరీటంబు కట్టెమోపు**
**మాధవార్పితముగా మనని మానవుసిరి**
**వనదుర్గ చంద్రికావైభవంబు**

**కైటభారిభజన కలిగియుండనివాడు**
**గాలిలోననుండి కదలుశవము**
**కమలనాభుపదము గననివాని బ్రదుకు**
**పసిడికాయలోని ప్రాణిబ్రతుకు** **2.51**

నారాయణునికి దివ్యమైననామం. ఆనామపు అక్షరాలను విని కరగనిమస్సులు బండరాళ్ళు. ఆయన మురవైరి. అంటే దుష్టులైన రక్కసులను రూపుమాపేవాడు. ఆయన కథలు వింటూఉంటే ఆనందభాష్పాలు జాలువారుతూ ఉంటాయి. అటువంటి ఆనందాన్ని పొందనివాని దేహం ఒక పెద్దమొద్దు. సుదర్శనం అనే చక్రాన్ని ధరించి అందరినీ కాపాడే ఆస్వామికి మ్రొక్కనివాడు జడుడు. వాని తలమీదనున్న కిరీటం కట్టెలమోపు. మాధవునిసేవకోసం కాకుండా బ్రదికేవాని సంపద అడవిలో కాచినవెన్నెల. శ్రీమహావిష్ణువు భజనలేనివాడు గాలిలో కదలాడే పీనుగు. బ్రహ్మదేవుని జన్మకు కారణమైన కమలం బొడ్డునందు కల లక్ష్మీపతి పాదాలను చూడలేనివాని బ్రదుకు మేడిపండులోని పురుగు బ్రదుకు.

# 6

**భగవంతుడు ఏ శక్తులను ఆశ్రయించి పెక్కురూపాలు పొందుతాడు? ఆయనకు ఈ జగత్తులను పుట్టించటం మొదలైన వినోదాలు ఎందుకు? మొదలైన ప్రశ్నలు పరీక్షిత్తునకు పుట్టాయి. శుకమహర్షిని అడిగాడు. సమాధానం చెప్పబోతూ ముందుగా శుకుడు ఆ పరమేశ్వరునకు నమస్కారం చేస్తున్నాడు.**

**ఏ విభు వందనార్చనము లేవిభుచింతయు నామకీర్తనం**
**బేవిభు లీల లద్భుతము లెవ్వనిసంశ్రవణంబు సేయదో**
**షావలి బాసి లోకము శుభాయతవృత్తి జెలంగు నండ్రునే**
**నావిభు నాశ్రయించెద నఘోఘనివర్తను భద్ర కీర్తనున్** **2.60**

పరమాత్మను చక్కగా తెలుసుకున్నవారు ఆయనకు మ్రొక్కటం, పూజలు చేయటం, భావిస్తూ ఉండటం, నామజపం చేయటం, లీలలను స్మరిస్తూ ఉండటం అనే పనులు అద్భుతాలని చెబుతూ ఉంటారు. ఆయన విభుడు. కనుక అన్నిరూపాలతో మనకు కానవస్తూ ఉంటాడు. దేవదేవుడైన అతనికథలు వినటం వలన పాపాలన్నీ తొలగిపోతాయి. లోకమంతా సమస్తశుభాలతో మెలగుతూ ఉంటుంది – అని కూడా పలుకుతారు. పాపాలరాశులను పోగొట్టి శుభపరంపరలను కలుగజేసే ఆ పరమేశ్వరుని నేను ఆశ్రయిస్తాను.

# 7

**పరీక్షిత్తు ప్రశ్నలకు సమాధానం చెప్పబోతూ పరమాత్మజ్ఞానాన్ని ప్రసన్నంగా తెలుసుకోవటానికీ, తెలియజెప్పటానికీ తన్ను తాను రూపొందించుకుంటూ శుకుడు చేస్తున్న ప్రార్థన.**

**ఏ పరమేశుపాదయుగ మెప్పడు కోరి భజించినేర్పరుల్**
**లోపలిబుద్ధిలో ఉభయలోకములందున సక్తి బాసి యే**
**తాపము లేక బ్రహ్మగతి తారుగతశ్రములై చరింతు రే**
**నా పరమేశు మ్రొక్కెద నఘౌఘ నివర్తును భద్రకీర్తనున్** **2.61**

వివేకం కలవారు ఆ పరమేశ్వరుని పాదాలజంటను నిరంతరమూ కోరి సేవించుకుంటూ బ్రదుకుతారు. గుండెలోపలి పొరలలో ఈలోకానికీ, ఆలోకానికీ చెందిన తగులాలను పోగొట్టుకుంటారు. ఏ బాధలూ లేనివారై బ్రహ్మమునందే దారి కలవారై శ్రమలను దూరం చేసుకొని మెలగుతూ ఉంటారు. అలా వివేకవంతులు ప్రవర్తించే పరమేశ్వరుడు పాపాలను పటాపంచలు చేసి శుభాలను కలిగిస్తూ ఉంటాడు. ఆయనకు నేను మ్రొక్కుతూ ఉంటాను.

## 8

**శుకమహర్షి తన జ్ఞానసంపదనంతా పద్యాలనే పెట్టెలో భద్రంగా నిక్షేపించి పరీక్షిత్తునకు ఉపదేశిస్తూ పరమాత్మను స్తుతిస్తున్నాడు.**

**తపములు చేసియైన మతిదానము లెన్నియు చేసియైన నే**
**జపములు చేసియైన ఫలసంచయ మెవ్వని చేర్పకున్న హే**
**యపదములై దురంత విపదంచిత రీతిగ నొప్పచుండు న**
**య్యపరిమితున్ భజించెద అఘౌఘ నివర్తను భద్రకీర్తనున్** **2.62**

పరమాత్మ పాపాల రాశులన్నింటినీ భస్మం చేసివేస్తాడు. ఆయనను కీర్తిస్తే సర్వశుభాలూ కలుగుతాయి. ఎన్ని తపస్సులు చేసినా, ఎన్నిదానాలు చేసినా, ఎన్ని జపాలు చేసినా వానిఫలాలన్నింటినీ ఆ పరమాత్మునకు సమర్పించుకోవాలి. లేకపోతే అవన్నీ పాడైపోయి దాటశక్యం కాని ఆపదలను కలిగిస్తాయి. అటువంటి కీడు కలుగకుండా నన్ను కాపాడవలసినదిగా ఏ కొలతలకు అందని ఆ పరమాత్మను సేవించుకుంటాను.

## 9

**శుకుడు భాగవత కథలను పరీక్షిత్తునకు వివరిస్తూ బ్రహ్మదేవునికీ నారదునకూ అయిన సంవాదాన్ని ప్రస్తావించాడు. అందులో నారదుడు బ్రహ్మను విశ్వప్రకారం తెలియజేయవలసినదిగా కోరగా ఆయన ఇలా అన్నాడు.**

**నానాస్థావరజంగమ ప్రకరముల్ నాయంత నిర్మింప వి**
**జ్ఞానం బేమియు లేక తొట్రుపడ నిచ్చన్ నాకు సర్వానుసం**
**ధానారంభవిచక్షణత్వము మహోదారంబుగా నిచ్చె ము**
**న్నేనా యీశ్వరు నాజ్ఞ గాక జగముల్ నిర్మింప శక్తుండనే ?** **2.81**

నాయనా ! నారదా ! ఈ విశ్వం అంతా పెక్కువిధాలయిన వ్యక్తులతో, వస్తువులతో నిండి ఉన్నది. అందులో కొన్ని స్థావరాలు. కదలిక లేక నిలిచి ఉండేవి. కొన్ని జంగమాలు. కదలుతూ ఉండేవి. ఇలా ఉండే వానినన్నింటినీ నా అంత నేను సృష్టిచేసే విజ్ఞానం కొంచెం కూడా లేక తికమకపడుతున్నాను. అప్పుడు తనకు తానుగా నాకు సాక్షాత్కరించి ఆ పరమేశ్వరుడు అన్నింటినీ కూర్చుకొని నిర్మింపగల వివేకాన్ని చాలా గొప్పగా నాకు కలుగజేశాడు. ఆయన ఆజ్ఞ లేకపోతే నేను ఈలోకాలనన్నింటినీ నిర్మించేశక్తి కలవాడనా?

# 10

బ్రహ్మ నారదునితో పరమాత్మవైభవాన్ని గూర్చి వివరిస్తున్నాడు. సృష్టి మొదలైన కార్యాలన్నీ ఆ మహాత్మునకు ఒక ఆట అని చెప్పాడు. ఆయన సర్వమునకూ పాలకుడని చెబుతూ ఇలా అంటున్నాడు.

**ఆ యీశు డనంతుడు హరి**
**నాయకు డీ భువనములకు నాకున్ నీకున్**
**మాయకు ప్రాణివ్రాతము**
**కేయెడలన్ లేదు ఈశ్వరేతరము సుతా** **2.85**

నాయనా! కుమారా! నారదా! ఆ పరమాత్మ మొదలూతుదీ లేనివాడు. ఆయనను హరి అంటారు. ఈ లోకాలన్నింటినీ, నాకూ, నీకూ ఆయనయే నాయకుడు. అలాగే ఎనభై నాలుగు లక్షల జీవుల రావులు ఉన్నాయి. ఆ అన్నింటికీ కూడా ఆయనయే నాయకుడు. దానికి ముందు మాయ అని ఒకటి ఉన్నది. మాయ అంటే ఆయనవలన ఏర్పడిన ప్రకృతియే. దానికి కూడా నడిపించేశక్తి పరమాత్మయే. ఎక్కడా కూడా ఆ పరమాత్మకంటే వేరైనది ఏదీలేదు.

# 11

పరమాత్ముని మహిమను నారదునకు బ్రహ్మ తెలియజెప్తున్నాడు. ఆయన దివ్యచరిత్రను భావించి భావించి ఆనందం పొందుతూ ఆ జ్ఞానాన్ని అమృతంలాగా కొనియాడుతూ ఇలా అంటున్నాడు.

**పరమాత్ముం డజు డీజగంబు ప్రతికల్పంబందు కల్పించు తా**
**పరిరక్షించును ద్రుంచు నట్టి యనఘున్ బ్రహ్మాత్ము నిత్యున్ జగ**
**ద్భరితుం గేవలు నద్వితీయుని విశుద్ధజ్ఞాను సర్వాత్ము నీ**
**శ్వరు నాద్యంతవిహీను నిర్గుణుని శశ్వన్మూర్తి చింతించెదన్** **2.110**

నారదా! ఆయనను పరమాత్ముడు అంటాయి వేదాలు. ఎందుకంటే ఆయన అజుడు. అంటే పుట్టుక లేనివాడు. కానీ ప్రతికల్పంలోనూ ఈ జగత్తును కల్పిస్తూ ఉంటాడు. దానిని కాపాడుతూ ఉంటాడు. కొంతకాలం తరువాత మళ్ళీ తనలో కలిపివేసుకుంటూ ఉంటాడు. ఆయనకు మనకులాగా ఏ పాపాలూ ఉండవు. ఏ కొలతలకూ అందని ఆత్మస్వరూపుడు. జీవులకువలె మరణం ఉండదు కనుక నిత్యుడు. జగములన్నింటను నిండిఉండేవాడు. ఆయనతో పోల్చిచెప్పటానికి ఆయనవంటితత్త్వం మరొకటి ఏదీలేదు. ఆవిధంగా ఆయనను అద్వితీయుడు, కేవలుడు అని వర్ణిస్తాయి వేదాలు. ఆయనది విశుద్ధమైనజ్ఞానం. ఆయన సర్వులకూ, సర్వమునకూ ఆత్మ. ఈశ్వరుడు. ఆయన మొదలు, తుదీలేనివాడు. ఏ గుణాలూ లేనివాడు. ఎల్లప్పుడూ ఉండేవాడు. అట్టి పరమాత్మనుగూర్చి భావిస్తూ ఉంటాను.

# 12

బ్రహ్మదేవుడు పరమాత్మ అయిన విష్ణువును గూర్చి తనకు తెలిసినదానినంతటినీ నారదునకు తెలియజేస్తున్నాడు. వరుసగా అవతార విశేషాలన్నింటినీ సంగ్రహంగాచెప్పి పరమాత్మను తెలుసుకోవటం అంత సులభమైన విషయం కాదని వివరిస్తున్నాడు.

**హరి పరమాత్ము నచ్యుతు ననంతుని చిత్తములం దలంచి సు**
**స్థిరత విశోకసౌఖ్యముల చెందిన ధీనిధు లన్యకృత్యముల్**
**మరచియు చేయనొల్లరు తలంచిన నట్టిదయౌ సురేంద్రుడుం**
**బరువడి నుయ్యి ద్రవ్వనె పిపాసితుడై సలిలాభిలాషితన్** **2.209**

ఆయన హరి. సర్వాన్నీ తనలోనికి తీసుకొనే స్వభావం కలవాడు. పరమాత్మ. అంతయూ తానే అయి అంతటా వ్యాపించి ఉండేవాడు. అనంతుడు. ఎక్కడనో అయిపోవటం అనే లక్షణం లేనివాడు. అట్టి మహాప్రభువును మనస్సులలో భావించి ఎప్పటికీ నశించినవీ, దు:ఖం అణువంతకూడా లేనివీ అయిన సుఖాలను పొందే బుద్ధిమంతులు ఇతరములైన పనులను, మరచికూడా, చేయటానికి ఇష్టపడరు. ఆలోచిస్తే అది అటువంటిదే. దేవేంద్రుడంతటివాడైనా దప్పిక కలిగినప్పుడు పారా, పలుగూ పట్టుకొని గబగబా నుయ్యి త్రవ్వుతాడా!

## 13

**భగవంతుని మహిమను నారదునికి బ్రహ్మదేవుడు ఇంకా ఇలా వివరిస్తున్నాడు. తొమ్మిది విధాలుగా అయిన భక్తిలో భగవంతుని గుణవిశేషాలను పాడుకొంటూ ఉండటం ఒక భక్తిమార్గం. దానిలో ప్రవర్తించి దానిద్వారా పరమస్థితికి చేరుకోవాలని తెలియజేస్తున్నాడు.**

**కారణకార్యహేతువగు కంజదళాక్షునికంటె నన్యు లె**
**వ్వారును లేరు, తండ్రి భగవంతు ననంతుని విశ్వభావనో**
**దారుని సద్గుణావళు లుదాత్తమతిం గొనియాడకుండినన్**
**చేరవు చిత్తముల్ ప్రకృతి చెందని నిర్గుణమైన బ్రహ్మమున్ 2.211**

శ్రీ మహావిష్ణువును పుండరీకాక్షుడు అంటారు. బాగా వికసించిన పద్మపు విశాలమైన రేకులవంటి కన్నులున్నవాడు. సృష్టిలో ఏర్పడే ప్రతిదానిని కార్యం అంటారు. దానికి కారణం ఒకటివేరుగా ఉంటుంది. విత్తనం కారణం. చెట్టు కార్యం. కాని పరమాత్మా, జగత్తూ రెండూ విష్ణువే. మరొకరులేరు. నాయనా! అటువంటి భగవంతునీ, అంతములేనివానినీ, లోకాల సముదాయాన్నంతటినీ భావిస్తూ ఉండేవానినీ భావిస్తూ ఉండాలి. నిజానికి ఆయనకు ఏ గుణాలూ లేవుగానీ మనలను ఉద్ధరించటానికి ఆయన కొన్నిగుణాలు ఏర్పరచుకొని మనయందు కృపతో తెలియవస్తూ ఉంటాడు. అటువంటి గుణాలను గొప్పగా సంస్కరించుకొన్న బుద్ధితో మనం కొనియాడుతూ ఉండాలి. అలా చేయకపోతే గుణాలులేని పరమాత్మను మన మనస్సులు చేరవు. అది చాలాపెద్ద ప్రమాదం.

## 14

**నారదునకు ఆయననాయన బ్రహ్మ భక్తినిగూర్చి గట్టిగా బోధిస్తున్నాడు. అదితప్ప వేరేగతి లేదంటున్నాడు. అదిలేకపోతే భగవంతునికోసం చేసే గొప్ప పనులన్నీ ఫలంలేనివైపోతాయని తెలియజేస్తున్నాడు.**

**ఉపవాసవ్రత శౌచశీలమఖ సంధ్యోపాసనాగ్ని క్రియా**
**జపదానాధ్యయనాది కర్మముల మోక్షప్రాప్తి సేకూర ద**
**చ్ఛపుభక్తిన్ హరి పుండరీకనయనున్ సర్వాతిశాయిన్, రమా**
**ధవు పాపఘ్ను పరేశు నచ్యుతుని నర్థిన్ గొల్వలేకుండినన్. 2.214**

కుమారా! నారదా! మానవులు కర్మబంధాలను త్రెంచివేసుకొని పుట్టుకా, చావూ అనే ఆగకుండా తిరుగుతూ ఉండే సంసారచక్రం నుండి బయటపడాలి. దానినే మోక్షం అంటారు. అది పొందటానికి శాస్త్రాలు కొన్ని మార్గాలను బోధించాయి. అవి ఉపవాసాలు, వ్రతాలూ, లోపలాబయటా పరిశుద్ధిని సాధించటం, మంచిశీలాన్ని పెంపొందించుకోవటం, యజ్ఞాలూ, సంధ్యావందనాలూ, అగ్నికార్యాలూ, భగవంతుని నామాన్ని జపిస్తూ ఉండటమూ, దానాలూ, వేదాలను వల్లించటమూ మొదలైనవి. ఈ అన్నింటిని

గానీ, కొన్నింటినిగానీ శక్తిమేరకు చేస్తూనే ఉండాలి. అయితే ఒక్క విషయాన్ని గట్టిగా పట్టుకోవాలి. అది పుండరీకాక్షుడూ, అందరికంటె, అన్నింటికంటె దాటిపోయిన మహిమకలవాడూ, లక్ష్మీపతీ, పాపాలను రూపుమాపేవాడూ, దేవతలకు కూడా దేవుడూ అచ్యుతుడూ అయిన శ్రీహరిని అచ్చమైన భక్తితో ఆరాధిస్తూ ఉండటం. అది లేకపోతే ఉపవాసాలూ మొదలైనవానితో మోక్షం కలుగదు.

# 15

**శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజునకు సృష్టితత్త్వాన్నీ, దానికి మూలకారణమైన పరమాత్మతత్త్వాన్నీ ఇలా తెలియజేస్తున్నాడు.**

**హరియందు నాకాశ మాకాశమున వాయు**
**వనిలంబువలన హుతాశనుండు**
**హవ్యవాహనునందు నంబువు లుదకంబు**
**వలన వసుంధర గలిగె; ధాత్రి**
**వలన బహుళప్రజావళి యుద్భవంబయ్యె**
**నింతకు మూలమై యెసగునట్టి**
**నారాయణుడు చిదానందస్వరూపు కుం**
**డవ్యయు డజరు డనంతు డాఢ్యు**

**డాది మధ్యాంతశూన్యు డనాదినిధను**
**డతనివలనను సంభూతమైన యట్టి**
**సృష్టిహేతుప్రకార మీక్షించి తెలియ**
**జాల రెంతటిమునులైన జనవరేణ్య! 2.278**

మహారాజా! మహావిష్ణువునుండి మొట్టమొదట ఆకాశం ఏర్పడింది. దానినుండి వాయువూ, దానినుండి అగ్నీ, దానినుండి నీరూ, దానినుండి భూమీ ఏర్పడ్డాయి. భూమినుండి పెక్కువిధాలైన ప్రాణులగుంపులు పుట్టుకొనివచ్చాయి. ఈ అంతటికీ మూలకారణం నారాయణుడు. నారాయణుడంటే ఉనికీ, జ్ఞానమూ, ఆనందమూ అనే మూడు మహావిషయాలరాశి. ఏవిధమైన మార్పులూ లేకుండా ఒకేతీరున ఉండేవాడు. ప్రాణులకులాగా ఆస్వామికి ముసలితనం ఉండదు. మరణం ఉండదు. అందువలననే ఆయనను అందరూ అన్నివేళలా ధ్యానిస్తూ ఉంటారు. పుట్టటం, ఉండటం, పోవటం అనే వికారాలు ఆయనకు లేవు. ఈ సృష్టి అంతా అతనివలననే వెలువడింది. దీనితత్త్వం పట్టుకోగలగటం ఎంతటితపశ్శక్తి కలవారికి కూడా సులభం కాదు.

# 16

**పరమాత్మ అంటే ఏమిటో విస్పష్టంగా తెలుసుకోవటానికి సహకరించే మఱికొన్ని జ్ఞానవిషయాలను శుకుడు పరీక్షిత్తునకు ఇలా తెలుపుతున్నాడు.**

**ధరణీశోత్తమ భూతసృష్టి నిటు సంస్థాపించి రక్షించు నా**
**హరి కర్తృత్వము నొల్ల కాత్మగత మాయారోపితంజేసి, తా**
**నిరవద్యుండు నిరంజనుండు పరుడున్ నిష్కించనుండాఢ్యుడున్**
**నిరపేక్షుండును నిష్కళంకు డగుచున్ నిత్యత్వముం బొందెడిన్ 2.279**

పరీక్షిన్మహారాజా! అంతాతానే అయిన ఆ శ్రీమహావిష్ణువు ఇదంతా నావలననే జరిగింది, నేనేకర్తను –

అనుకోడు. తనలోని మాయ దీనికి కారణం అని తెలియజేస్తూ ఉంటాడు. దానికి అనుగుణంగా నెలకొల్పటం, కాపాడటం చేస్తూ కూడా తామరాకుమీద నీటిబొట్టులాగా అంటుసొంటులు లేకుండా ఉంటాడు. అందువలన ఆయనలో అహంకారం మొదలైన ఏదోషాలూ ఉండవు. తగులములు ఉండవు. సృష్టి మొదలైనవానితో సంబంధంలేనిపరుడై ప్రకాశిస్తాడు. తనది అంటూ ఏమీలేనివాడూ, అందరిచేత కొనియాడబడేవాడూ అయి ఉంటాడు. పూర్ణకాముడు కనుక ఆయనకు కోరదగినది ఏమీలేదు. కోరికలు తీర్చుకోవటానికి కొన్ని సందర్భాలలో పాపాలు చేయవలసివస్తుంది. ఆవిధమైన మచ్చలు ఆయనకులేవు. కనుక ఆయన నిత్యుడు. సర్వకాలాలలో, సర్వదేశాలలో ఏబాధలూ లేకుండా ఆనందస్వరూపుడై విరాజిల్లుతూ ఉంటాడు.

# 17

**తెలుగులపుణ్యాలపెట్టె అయిన పోతనమహాకవి రెండవస్కంధం రచనను పూర్తిచేసి తనస్వామి శ్రీరామచంద్రునకు విన్నవించుకుంటూ ఆ పరమాత్మను ~~ఈ~~విధంగా స్తుతిస్తున్నాడు.**

**రామ! గుణాభిరామ! దినరాజకులాంబుధిసోమ! తోయద**
**శ్యామ! దశాననప్రబల సైన్యవిరామ! సురారిగోత్ర సు**
**త్రామ! సుబాహుబాహుబల దర్పతమః పటు తీవ్రధామ! ని**
**ష్కామ! కుభృల్లలామ! గరకంఠసతీసుతనామ! రాఘవా!** **2.285**

శ్రీరామా! నీగుణాలన్నీ చాలా మనోహరములయినవయ్యా! సూర్యదేవుని కులం అనే సముద్రంలో పుట్టిన చంద్రుడవు నీవు. నీలమేఘం వంటి మేనిచాయతో అలరారుతూ ఉంటావు. పదితలల రక్కసుని పిక్కటిల్లినబలం కలసేనలను రూపుమాపినవాడవు. దేవతల పగవారు అనే కొండలకు ఇంద్రుడవు. సుబాహువు అనే రాక్షసుని బాహువుల బలంవలన కలిగిన పొగరు ఒక చీకటి అయితే దానికి నీవు సూర్యుడవు. నీకు ఏ కోరికలూ లేవు. భూమిని పాలించేవారిలో మేలుబంతి అయినవాడవు. పరమేశ్వరుని యిల్లాలు పార్వతీదేవి నీనామాన్ని నిరంతరమూ జపిస్తూ ఉంటుంది. రఘువంశం నీవలన మహిమను పొందినది.

# తృతీయ స్కంధము

## 1

**పోతనగారు మూడవస్కంధం రచనను ప్రారంభిస్తూ సంప్రదాయాన్ని అనుసరించి తనకృతిపతి శ్రీరామచంద్రుని గుణగణాలను పేర్కొంటూ ఇలా ప్రార్థిస్తున్నారు.**

**శ్రీమహిత వినుత దివిజ**
**స్తోమ! యశస్సీమ! రాజసోమ! సుమేరు**
**స్థేమ! వినిర్జితభార్గవ**
**రామ! దశాననవిరామ! రఘుకులరామా! 2.11**

వాక్కుల సంపదలతో దేవతలు గుంపులు గుంపులుగా చేరి నిన్ను స్తుతిస్తూ ఉంటారు. నీకీర్తి చిట్టచివరి అంచులకు చేరినట్టిది. రాజులందరూ తారలు అనుకొంటే నీవు వారిలో చంద్రుడవు బంగారుకొండవలె సుస్థిరంగా నిలువగలవాడవు. ఇరవైయొక్క పర్యాయాలు రాజులనందరినీ ఊచకోతకోసిన పరశురాముడు నీచేతిలో చిత్తుచిత్తుగా ఓడిపోయాడు. పదితలల పెద్దరక్కసుడు రావణుడు నీతో పోరాడి ఘోరమైన చావు చచ్చాడు. స్వామీ! రఘువంశం నీవలన గొప్పమహిమను, అందచందాలనూ పొందింది. స్వామీ! అట్టినీవు నాకవిత్వాన్ని ఆలకించి నన్ను ధన్యుణ్ణి చెయ్యి!

## 2

**పరీక్షిత్తునకు శుకమహర్షి భాగవత రహస్యాలను వివరిస్తున్నాడు. అందులో భాగంగా విదురుడు ధృతరాష్ట్రునకు బోధిస్తున్న శ్రీకృష్ణుని మహిమను ఈక్రిందిపద్యం మనకు తెలియజేస్తున్నది.**

**ఏపరమేషుచే జగము లీ సచరాచరకోటితో సము**
**ద్దీపితమయ్యె; ఏవిభుని దివ్యకళాంశజు లబ్జగర్భగౌ**
**రీపతి ముఖ్యదేవమునిబృందము; లెవ్వడనంతు డచ్యుతుం**
**డాపురుషోత్తముండు కరుణాంబుధి కృష్ణుడు వో నరేశ్వరా!**

ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణవాసుదేవుడు సముద్రమంతటి దయగలవాడయ్యా! ఆయన పురుషోత్తముడు. అంటే పరమాత్మ అని వేదాలు ఎవనిని కొనియాడుతున్నాయో అటువంటివాడు. అచ్యుతుడు ఎక్కడా, ఎందునా జారుపాటులేనివాడు. అనంతుడు. అంతంలేని ఆనందమే అయినవాడు. కదలుతూ ఉండేవీ, కదలకుండా ఉండేవీ అయిన జీవరాశులతో నిండిన లోకాలన్నీ ఆదేవునిచేతనే వెలుగొందుతూ ఉన్నాయి. లోకాలనన్నింటినీ సృష్టిచేసే బ్రహ్మదేవుడూ, లయంచేసే పరమశివుడూ, ఇంకా దేవేంద్రుడు మొదలైన దేవతలూ, జ్ఞానసంపన్నులైన మహర్షుల సముదాయాలూ ఆ మహాత్ముని కళలవలననే ఏర్పడినవారు.

## 3

**తీర్థయాత్రలు చేసివచ్చిన విదురుడు శ్రీకృష్ణుని ప్రియమిత్రము ఉద్ధవుణ్ణి కలుసుకున్నాడు. ఆత్రంగా శ్రీకృష్ణాదుల క్షేమవార్తలను అడుగుతున్నాడు. ఆ సందర్భంలో వెనుక కౌరవసభకు దూతగా వచ్చినప్పటి శ్రీకృష్ణదేవుని అద్భుతమైన ప్రవృత్తిని తలచుకొని యిలా అంటున్నాడు.**

**అట్టి సరోజాక్షు డాత్మీయ పదభక్తు**
**లడవుల నిడుమల గుడుచుచుండ**
**దౌత్యంబు సేయ కొందఱు విరోధులు పట్టి**
**బద్ధుని జేయ సన్నద్ధులైన**

**బలహీను మాడ్కి మార్పడ లేడ యసమర్థు**
**డని తలంచెదవేని అచ్యుతుండు**
**పరుల జయింప నోపక కాదు విద్యాభి**
**జన ధనమత్తులై జగతి పెక్కు**

**బాధల నలంచు దుష్టభూపతుల నెల్ల**
**సైన్యయుక్తంబుగా నని సంహరించు**
**కొరకు సభలోన నప్పడా కురుకుమారు**
**లాడు దుర్భాషలాణములకు నలుగడయ్యె** **3.71**

ఉద్ధవా! ఆ పుండరీకాక్షుడు అడవులలో ఇడుములు పడుతున్న, తనవారైన పాండవులను గమనించాడు. వారికోసం కౌరవుల దగ్గరకు దూతగా వెళ్ళాడు. బుద్ధిలేని కొందరు అతనిని కట్టిపడవేయాలనుకొన్నారు. స్వామి వారిని అలవోకగా రూపుమాపగలడు. కానీ బలహీనునిలాగా నటించి వారిని బ్రదకనిచ్చాడు. ఎందుకంటే వారు కారణంగా దుర్మార్గుల నందరినీ మట్టుపెట్టాలి. వారు తమకున్న కొద్దిపాటి చదువు, కులమూ, ధనమూ అనేవానితో పొగరెక్కి ఉన్నారు. లోకాన్ని బాధిస్తున్నారు. అట్టి దుష్టులు బంధుమిత్ర పరివారంతో నాశనమైపోవాలి. దానిని మనస్సులో కుదురుకొల్పుకొని దుర్యోధనుడు మొదలైన నీచుల కాఱుకూతలను పట్టించుకోలేదు. వారిమీద అప్పటికి కోపాన్ని చూపలేదు.

# 4

**విదురుడు శ్రీకృష్ణదేవుని జన్మకర్మముల రహస్యాన్ని ఉద్ధవునకు ఈవిధంగా వివరిస్తున్నాడు. గీతలో భగవంతుడు నాజన్మమూ, నాకర్మమూ దివ్యములయ్యా! అని అర్జునునకు స్వయంగా చెప్పాడు. కనుక భగవంతుని దివ్యమైన జన్మకర్మములను విదురుడు తెలియజేస్తున్నాడు.**

**జననంబందులేని యీశ్వరుడు తా జన్మించు టెల్లన్ విరో**
**ధినిరాసార్థము; వీతకర్ముడగు నద్దేవుండు కర్మ ప్రవ**
**ర్తను డౌటెల్ల చరాచరప్రకట భూతశ్రేణులం కర్మవ**
**ర్తనులం జేయ దలంచి కాక కలవే దైత్యారికిన్ కర్మముల్** **3.72**

ఉద్ధవా! మనస్వామి వాసుదేవునకు పుట్టుక అనేదిలేదు. ఆయన అందరకు ఈశ్వరుడు. మఱి కృష్ణుడుగా పుట్టినాడు గదా! అంటావేమో. అది జగములకు పగవారైన దుష్టులను రూపుమాపటంకోసమే. అలాగే మనకులాగా ఆయనకు చేయవలసిన పనులేవీలేవు. కానీ ఎన్నో కర్మములు చేస్తున్నాడు. అది ఎందుకంటే లోకాలలోని స్థావరములు, జంగమములూ అయిన ప్రాణులనందరినీ వారివారికి ఏర్పడిన క్రియలలో ఎలా మెలగాలో తెలియజేయటానికి మాత్రమే. రక్కసులను మట్టుపెట్టే మహాత్ములకు కర్మలంటూ ఉంటాయా?

# 5

**విదురుడు ఉద్ధవునితో శ్రీకృష్ణుని లీలాస్వరూపాన్ని గురించి యిలా చెబుతున్నాడు. ఈ పద్యం కర్మబంధంలో చిక్కుకొన్న ప్రాణులకూ, కర్మబంధాలులేని భగవంతునకూ ఉన్నభేదాన్ని చక్కగా తెలియజేస్తుంది.**

**హరి నరుల కెల్ల పూజ్యుడు**
**హరి లీలా మనుజుడును గుణాతీతుడు నై**
**పరగిన భవ కర్మంబుల**
**పొరయండట, హరికి కర్మములు లీలలగున్.** **3.72**

మహానుభావా! ఉద్ధవా! కర్మవశం వలన పుట్టిన జీవులందరికీ శ్రీహరి పూజింపదగినవాడు. ఆయన కోరికోరి కొన్ని మహాకార్యాలను చేయటానికి భూమిపై పుడుతూ ఉంటాడు. అందువలననే ఆయనను లీలామనుజుడు అంటారు. జీవులందరు సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాలనుబట్టి మెలగుతూ ఉంటారు. దానివలన వారు బంధాలను వదలించుకోలేరు. కానీ శ్రీహరి గుణాలకు లోబడినవాడుకాడు. కాబట్టి ఆయనకు కర్మబంధాల అంటుసొంటులు ఉండవు. ఆయన చేసే కర్మములు ఆవిధంగా లీలలు అవుతాయి.

## 6

**పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు తన అవతారాన్ని చాలించిన సందర్భంలోని వింతలను వివరిస్తున్న ఘట్టం. శ్రీకృష్ణుడు సరస్వతీ నదీతీరంలో ఒకచెట్టు మొదట కూర్చున్నాడు. ఉద్ధవుణ్ణి బదరీవనానికి పొమ్మన్నాడు. కానీ అతడు పోలేక అతనినే అనుసరించాడు. అలా ఉండగా మహాభాగవతుడైన మైత్రేయ మహర్షి శ్రీకృష్ణ దర్శనభాగ్యాన్ని పొందటాన్ని ఈ పద్యం మనకు తెలియజేస్తున్నది.**

**కనియెం దాపసపుంగవుండఖిలలోకఖ్యాతవర్ధిష్ణు, శో**
**భనభాస్వత్పరిపూర్ణ యౌవనకళాభ్రాజిష్ణు, యోగీంద్ర హృ**
**ద్వనజాతైక చరిష్ణు, కౌస్తుభముఖోద్య ద్భూషణాలం కరి**
**ష్ణు నిలింపాహితజిష్ణు విష్ణుప్రభవిష్ణుం కృష్ణు రోచిష్ణునిన్. 3.148**

తాపసులలో తలమానికం అనదగిన మైత్రేయుడు శ్రీకృష్ణవాసుదేవుని దర్శించుకున్నాడు. ఆ మహాత్ముడు లోకాలన్నింటికీ బాగా తెలిసిన ఔన్నత్యం కలవాడు. గొప్పగా ప్రకాశించే నిండైన యౌవనపు కళతో విరాజిల్లుతున్నవాడు. మహాయోగుల హృదయాలనే కమలాలలో మాత్రమే సంచరించే శీలం కలవాడు. కౌస్తుభమూ మొదలౌన దివ్యములైన భూషణాలతో అలరారుతున్నవాడు. విష్ణుమూర్తి. రక్కసులను ముక్కలు ముక్కలుగా నరికిప్రోగులుపెట్టే శీలం కలవాడు. అంతటా వ్యాపించి ఉండేవాడు. సర్వకార్యాలనూ చక్కగా చేసే సామర్థ్యం కలవాడు. గొప్పదేహకాంతితో విరాజిల్లేవాడు.

## 7

**మైత్రేయుడు విదురునకు అనేక తత్త్వవిషయాలను బోధించాడు. అందులో ప్రళయకాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉండేస్థితిని ఈపద్యం అభివర్ణిస్తున్నది.**

**చారుపటీరహీరఘనసారతుషార మరాళ చంద్రికా**
**పూర మృణాళ హార పరిపూర్ణ సుధాకర కాశ మల్లికా**
**సారనిభాంగశోభిత భుజంగమతల్పమునందు యోగని**
**ద్రారతి చెందియుండు జఠరస్థిత భూర్భువరాది లోకుడై 3.356**

విదురా! శ్రీహరి ప్రళయ సమయంలో మహాసముద్రంలో శేషశయ్యమీద పవ్వళించి యోగనిద్రలో హాయిగా ఉంటాడు. ఆ శేషుడు ఎంత తెల్ల చల్లగా ఉంటాడో చెబుతాను. విను. మంచిగందంలాగా, వజ్రంలాగా, కర్పూరంలాగా, మంచుతుంపురులలాగా, హంసలాగా, వెన్నెలలాగా, తామరతూడులలాగా, ముత్యాలహారంలాగా, నిండుచందురునిలాగా, రెల్లుపూవులలాగా, మల్లెపూవులలాగా ఉంటాడు. అలా తెల్లని కాంతులను విరజిమ్ముతున్న ఆదిశేషుణ్ణి పానుపుగా చేసికొని పవ్వళించి ఉన్నాడు. ఆయన కడుపులో భూలోకం, భువర్లోకం, స్వర్లోకం మొదలైన లోకాలన్నీ చల్లగా ఉన్నాయి.

# 8

సనకసనందనాది జ్ఞానమూర్తులు ఏ అపేక్షలూ లేనివారు. కేవలం ఆనందంకోసం శ్రీమహావిష్ణువును దర్శించుకొనిపోదామని వైకుంఠ మహానగరానికి వెళ్లారు. వారు చేరుకొంటున్న వైకుంఠం ఎలా ఉన్నదో వివరిస్తున్నది యీ పద్యం.

**వరవైకుంఠము సారసాకరము, దివ్యస్వర్ణశాలాంకగో**
**పుర హర్మ్యావృతమైన తద్భవన మంభోజంబు తన్మందిరాం**
**తర విభ్రాజిత భోగి కర్ణిక, తదుద్యద్భోగ పర్యంకమ**
**దిరవొందన్ వసియించు మాధవుడు దా నేపారు భృంగా కృతిన్** **3.513**

వైకుంఠం చాలా మేలైనపురం. అది ఒక పద్మాలకొలను అనుకుంటే అందులోని పసిడి గోపురాలతో కూడినమేడల మధ్యనున్న శ్రీ మహావిష్ణువు ఉండే భవనం ఒకగొప్ప పద్మంలాగా ఉన్నది. ఆ భవనంలోపల విరాజిల్లుతున్న ఆదిశేషుడు, విష్ణువునకు సెజ్జగా నుండి ఎత్తిపట్టిఉన్న ఆ శేషుని తలలనే పానుపుమీద మాధవుడు మకరందాన్ని తనివితీరా గ్రోలటానికి వచ్చిన తుమ్మెదలాగా కనపడుతున్నాడు.

# 9

వైకుంఠంలో శేషశయ్యమీద పవ్వళించియున్న శ్రీమహావిష్ణువును మన కన్నులకు కట్టేవిధంగా వర్ణిస్తున్నాడు పోతన మహాకవి.

**నిఖిలమునీంద్ర వర్ణిత సస్మిత ప్ర స**
**న్నాన నాంబుజముచే నలరువాడు**
**విశ్రుతస్నేహార్ద్రవీక్షణ నిజభక్త**
**జనగుహాశయుడన దనరువాడు**
**మానిత శ్యామాయ మానవక్షమున నం**
**చితవైజయంతి రాజిల్లువాడు**
**నతజనావనకృపామృతతరంగితములై**
**భాసిల్లులోచనాబ్జములవాడు**

**అఖిల యోగీంద్ర జనసేవ్యుడైనవాడు**
**సాధుజనముల రక్షింపజాలువాడు**
**భువనచూడా విభూషయై భూరిమహిమ**
**మించు వైకుంఠపురము భూషించువాడు.** **3.537**

వైకుంఠంలో ఉన్న శ్రీమహావిష్ణువు గొప్పమునులందరూ వర్ణించే చిరునవ్వుతో కూడిన ప్రసన్నమైన పద్మంవంటి మోముతో అలరారుతున్నాడు. ప్రసిద్ధమైన చెలిమితో చెమ్మగిల్లిన కన్నులు ఉన్న తన భక్తజనులకు గుహవలె రక్షణ కల్పించేహృదయం కలవాడా అన్నట్లు ఉన్నాడు. ఆ దేహకాంతి చూడముచ్చటగా ఉంటుంది. అటువంటి దేహంలోని రొమ్ముభాగంలో కాంతులను విరజిమ్ముతున్న వైజయంతి అనే పూలమాల విరాజిల్లుతున్నది. తనకు మ్రొక్కులు చెల్లించే జనులను కాపాడేదయ అనే అమృతం అలలుఅలలుగా పైకి ఉబుకుతున్నదా అన్నట్లున పద్మాలవంటి కన్నులతో ప్రకాశిస్తున్నాడు. యోగివర్యులందరూ ఆయనను సేవించుకుంటూ అన్నివైపులా కూర్చున్నారు. ఆ వైకుంఠపురం భూమికంతటికీ ఒకగొప్ప అలంకారం అనుకుంటే దానికి అలంకారంగా వెలిగిపోతూ ఉన్న మహనీయుడు ఆయన.

# 10

**శ్రీ మహావిష్ణుమూర్తిని అక్షరాలచిత్రపటంలో చక్కగా రూపొందించి మనకు చూపిస్తున్నాడు మహాకవి.**

**కటి విరాజితపీతకౌశేయశాటితో**
**వితతకాంచీగుణద్యుతి నటింప**
**ఆలంబికంఠహారావళి ప్రభలతో**
**కౌస్తుభరోచులు క్రందుకొనగ**
**నిజకాంతిజిత తటిద్ధ్వజ కర్ణకుండల**
**రుచులు గండద్యుతుల్ ప్రోదిసేయ**
**మహనీయ నవరత్నమయ కిరీట ప్రభా**
**నిచయంబు దిక్కుల నిండ బర్వ**

**వైనతేయాం సవిన్యస్త వామహస్త**
**కలితకేయూరవలయ కంకణము లొప్ప**
**అన్యకరతల భ్రమణీ కృతానుమోద**
**సుందరాకారలీలారవింద మమర** **3.538**

నడుముమీద మెరిసిపోతున్న పట్టుపీతాంబరంమీద మొలత్రాడు దీప్తిచిందులు త్రొక్కుతున్నది. చాలా పొడవుగా వ్రేలాడుతున్న హారాలకాంతులను కౌస్తుభమణికాంతులు మించిపోతున్నాయి. తనకాంతులనే మెరపుల గుంపులను జయించిన చెవులకు ఆభరణాలైన కుండలాల కాంతులను చెక్కిళ్ళ వెలుగులు మరింత పెంపొందిస్తున్నాయి. చాలాగొప్పవి అయిన తొమ్మిదిరకాల రత్నాలు పొదిగిన కిరీటం ప్రభలు దిక్కులందంతటా వ్యాపిస్తున్నాయి. విలాసంగా ఆస్వామి తన పాదాలదగ్గర ఉన్న గరుత్మంతుడి బుజంమీద ఎడమచేతిని ఉంచాడు. ఆ చేతికున్న వలయాలు, కంకణాలు, కేయూరాలూ వెలుగులను వెదజల్లుతున్నాయి. రెండవచేతితో ఒక సుందరమైన పద్మాన్ని విలాసంగా త్రిప్పుతూ ప్రకాశిస్తున్నాడు ఆ స్వామి.

# 11

**తృతీయస్కంధంలో చాలాభాగం విదురమైత్రేయుల సంవాదం. మైత్రేయుడు విదురునకు కపిల, దేవహూతుల సంవాదాన్ని తెలియజేశాడు. అందులో తల్లి దేవహూతి కొడుకు కపిలుని వలన తత్త్వజ్ఞానం పొందిన సందర్భంలోని ఒక ఆణిముత్యాన్ని గమనిద్దాం.**

**భూరి మదీయమోహతమముం బెడబాప సమర్థు లన్యులె**
**వ్వారలు నీవు కాక? నిరవద్య! నిరంజన! నిర్వికార! సం**
**సారలతాలవిత్ర ! బుధసత్తమ! సర్వశరణ్య! ధర్మవి**
**స్తారక! సర్వలోక శుభదాయక! నిత్యవిభూతి నాయకా!**

నాయనా! కపిలా! నన్ను చాలా ఎక్కువైన అజ్ఞానం అనే చీకటి క్రమ్ముకొని ఉన్నది. దానిని తొలగించి వేయటానికి సమర్థులు నీకంటె వేరైనవారు ఎవ్వరూలేరు. ఎందుకంటే నీవు ఏ దోషాలు లేనివాడవు. ఏ అంటుసొంటులూ లేనివాడవు. ఏ వికారాలూ నీకులేవు. సంసారం అనే తీగలను కోసివేయగల కొడవలివంటి వాడవునీవు. సర్వమూ తెలిసినవారిలో మొదటిస్థానం నీది. అందరకూ నీవే దిక్కు. ధర్మాన్ని పెంపొందించే దైవస్వరూపుడవు నీవు. అన్ని లోకాలకూ శుభాలను ఇవ్వగలవాడవు. ఎన్నటికీ చెడిపోని మహిమలకు నాయకుడవు.

## 12

**కపిలుడు సర్వజ్ఞానాలూ నిండుగా ఉన్నవాడు. తల్లి దేవహూతికి పరమాత్మను చేరుకోవటానికి చెందిన అన్నియోగాలనూ బోధించాడు. అందులో భక్తియోగాన్ని గురించి తెలుపుతూ ఇలా అంటున్నాడు.**

**హరిమంగళ గుణకీర్తన**
**పరుడై తగ నార్జవమున భగవత్పరులం**
**గరమనురక్తి భజించుట**
**నిరహంకారముగ నుంట, నిశ్చలు డగుటన్ 3.961**

తల్లీ ! నారాయణునివన్నీ మంగళగుణాలే. వానిని కొనియాడుతూ ఉండటమే తనబ్రదుకు అనుకోవాలి సాధకుడు. భగవంతుని భక్తియేతప్ప మరొకటిపట్టనివారిని భాగవతులు అంటారు. అట్టివారి విషయంలో కల్లాకపటాలు లేకుండా, అనురాగంతో వారికి సేవలందిస్తూ ఉండాలి. అహంకారం అంటే నేనే గొప్ప అనుకోవటం. అది అణువంతైనా లేకుండా ప్రవర్తించాలి. భక్తి విషయంలో చపలచిత్తం లేకుండా మెలగాలి.

## 13

**కపిలాచార్యుడు తనతల్లి దేవహూతికి భక్తియోగాన్ని ఇంకా ఇలా వివరిస్తున్నాడు.**

**అనిశము సర్వభూతహృదయాంబుజవర్తి యనందనర్చు నీ**
**శునను నవజ్ఞచేసి మనుజుం డొగి మత్ప్రతిమార్చనా విడం**
**బనమున మూఢుడై యుచితభక్తిని నన్ను భజింపడేని అ**
**మ్మనుజుడు భస్మకుండమున మానక వేల్చిన యట్టి వాడగున్. 3.964**

అమ్మా! పరమాత్ముడనైన నేను సర్వకాలాలలో ప్రాణులందరి హృదయపద్మాలలోనే ఉంటాను. ఊరకనే ఉండటంకాదు. పరిపాలిస్తూ ఉంటాను. అట్టి నన్ను కొంచెంపాటి జ్ఞానంకూడాలేని మనిషి లెక్కచెయ్యడు. కానీ నా విగ్రహాలను ముందుపెట్టుకొని లోకం మెప్పును ఆశిస్తూ మూఢుడై మెలగుతూ ఉంటాడు. అది సరియైన భక్తికాదు. ఆవిధంగా ప్రవర్తించేవాడు బూడిదరాశిలో హోమద్రవ్యాలను వేసేవాడవుతాడు. జ్వాలలతో అలరారుతున్న అగ్నిలో హవ్యాలను వేయాలి. కానీ బూడిదలో వేస్తే అది పనికిమాలినదే అవుతుంది కదా!

## 14

**కపిలమహర్షి తల్లికి గర్భంలో పిండం ఎలా ఏర్పడుతుందో చెప్పాడు. ఆ వరుసలో తల్లిగర్భంలో ఉన్న జీవుడు భగవంతుణ్ణి ఎలా స్తుతిస్తాడో అనే విషయాన్ని కూడా వివరిస్తున్నాడు.**

**అనయమును భువనరక్షణ**
**మునకై స్వేచ్ఛానురూపమున పుట్టెడి వి**
**ష్ణుని భయవిరహితమగుపద**
**వనజయుగం బర్థి కొల్తు వారనిభక్తిన్ 3.993**

ఆ శ్రీ మహావిష్ణువు ఎల్లకాలాలలో లోకాలన్నింటినీ కాపాడటంకోసం తన యిష్టాన్నిబట్టి అవతరిస్తూ ఉంటాడు. ఆ మహాత్ముని పాదాలు పద్మాలవంటివి. వానిని ఆశ్రయిస్తే సంసారభయం తొలగిపోతుంది. నిశ్చలమైన భక్తితో ఆ పాదపద్మాలను నేను పూజించుకొంటూ ఉంటాను.

## 15

**తల్లిగర్భంలో పడి పెక్కుకష్టాలు అనుభవిస్తున్న జీవుడు పరమాత్మను పరమభక్తితో ఆరాధించటంతప్ప మరొక గతిలేదనుకుంటూ ఉంటాడని కపిలుడు దేవహూతికి చెబుతున్నాడు.**

**భరమగుచున్న దుర్వ్యసనభాజనమై, ఘనదు:ఖ మూలమై**
**యరయగ పెక్కుతూంట్లు గలదై క్రిమిసంభవమైన యట్టిదు**
**స్తరబహుగర్భవాసముల సంగతి మాన్పుటకై భజించెదన్**
**సరసిజనాభ భూరిభవసాగరతారక పాదపద్మముల్ 3.1003**

అయ్యయ్యో! తల్లిగర్భంలో ఉండటం ఎంత ఘోరమైన విషయం! ఎందుకంటే దానిని భరించటం చాలాకష్టం. అది చాలాచాలా వ్యసనాలకు పాదు. గొప్పదు:ఖాలకు మూలం. అన్నీ చిల్లులే. అంతేనా అక్కడ అసహ్యమైన సూక్ష్మజీవులు పుట్టి తనచుట్టూ తిరుగుతూ బాధిస్తూ ఉంటాయి. దానినుండి తప్పించుకోవటం తేలికపని కాదు. పైగా అటువంటివి లెక్కపెట్టటానికి కూడా సాధ్యంకానివి. అటువంటి మహాభయంకరమైన దు:ఖాన్ని తొలగించుకోవటంకోసం శ్రీ మహావిష్ణువు పాదపద్మాలను నిరంతరంగా సేవించుకుంటూ ఉంటాను. అవేకదా చాలాపెద్దది అయిన సంసారమనే సముద్రంనుండి జీవుణ్ణి తరింపజేసేవి!

## 16

**పుట్టినజీవికి వరుసగా బంధాలు పెరిగిపోతాయి. మొదట ఆలు, తరువాత పిల్లలూ, ఇల్లూవాకిలీ, గొడ్డూగోదా ఏర్పడతాయి. అవన్నీ జీవుణ్ణి సంసారంలో కట్టిపడవేసి భగవంతుణ్ణి గుర్తించకుండా చేస్తాయి. అది ఒక భయంకరమైన చావు. దీనిని తెలుసుకోవాలి అని తల్లికి కపిలుడు తెలియజేస్తున్నాడు.**

**ధనపశుపుత్ర మిత్ర వనితా గృహకారణభూతమైన యీ**
**తనువున నున్నజీవుడు పదంపడి యట్టి శరీరమెత్తినన్**
**అనుగతమైన కర్మఫల మందగపోవకరాదు, మింటబో**
**యిన భువి దూటినన్ దిశలకేగిన ఎచ్చటనైన దాగినన్. 3.1011**

ఒక్కమారు సంసారమనే ఊబిలో చిక్కుకొన్న జీవుని అవస్థ ఎలా ఉంటుందో, అమ్మా! గమనించు. వాడు ధన సంపాదనకోసం పాట్లుపడుతూ ఉంటాడు. పశువులు కావాలి. కొడుకులు, చెలికాండ్రు, స్త్రీలు, కొంపలు ఏర్పరచుకొంటూ ఉంటాడు. దీనికి మూలకారణం ఈ దేహం. అందులో ఉన్నజీవుడు అది పోయినతరువాత కూడా దానిబంధాలను పోగొట్టుకోలేడు. ఆకాశంలోనికి ప్రవేశించినా, భూమిలో దూరినా, దిక్కులకు పాతినా, ఎక్కడదాక్కున్నా వెనుక ప్రోగుచేసుకొన్న ఫలం వెంటతగులుకొని వస్తూనే ఉంటుంది. మళ్ళీ మరొక శరీరాన్ని పొందుతూ ఉంటాడు.

## 17

**కర్దమ ప్రజాపతి యిల్లాలు దేవహూతి. విష్ణుని అవతారమే అయిన తనకొడుకు కపిలుని వలన పరమార్థ జ్ఞానం అంతా ఆకళింపు చేసుకొన్నది. ఆనందంతో ఆ మహాత్ముని స్తోత్రం చేస్తున్నది.**

**నీనామస్తుతి శ్వపచుం**
**డైనను జిహ్వాగ్ర మందు ననుసంధింపన్**
**వానికి సరి భూసురుడుం**
**గానేరడు చిత్ర మిది జగంబుల నరయన్ 3.1037**

కుమారా! కపిలుని రూపంతో కానవస్తున్న పరమాత్మా! కుక్కమాంసం వండుకొని తింటూ బ్రతికే నీచుడయినా నీనామాలను తన నాలుకకొనమీద భద్రంగా ఉంచుకొని స్తుతిస్తే, అట్టివానికి గొప్ప పుట్టుక కలవాడనని అహంకరించే బ్రాహ్మణుడు కూడా సాటిరాడు. గమనిస్తే ఇది ఈ లోకాలలో చాలా చిత్రమైన విషయం.

# చతుర్థ స్కంధము

## 1

మైత్రేయమహర్షి విదురునకు అనేక పురాణవిషయాలను ఉపదేశించాడు. వరుసలో దక్షప్రజాపతి కథ వచ్చింది. దక్షుడు సరియైన జ్ఞానంలేక పరమశివునితో పగపెట్టుకున్నాడు. తనబిడ్డను, ఆమె భర్తనూ ఘోరంగా అవమానించాడు. తన తనయ దాక్షాయణి దానిని సహింపలేక తనదేహాన్ని అగ్నిలోవేసి బూడిద చేసుకున్నది. ఆ పనికిముందు దక్షునకు శివ మహిమను సుదీర్ఘంగా బోధించిన సందర్భంలోనిది ఈపద్యం.

**నెలకొని ధర్మపాలన వినిర్మలు భర్గు తిరస్కరించు న**
**క్కలుషుని జిహ్వ గోయదగు గా కటుసేయగ నోపడేని తా**
**పొలియుట యొప్పు ; రెంటికి ప్రభుత్వము సాలమికర్ణ రంధ్రముల్**
**బలువుగ మూసికొంచు చన పాడి యటందురు ధర్మవర్తనుల్.** 4.91

ఓయీ దక్షా! ఆ పరమేశ్వరుడు పట్టుదలతో ధర్మాన్ని కాపాడటంలో దిట్ట. అందులో రవంతమాలిన్యం కూడా అంటనివాడు. అధర్మాన్ని చీల్చిచెండాడే శీలంకలవాడు. అట్టి మహాత్ముణ్ణి కాదని కాఱుకూతలు కూసే పాపాత్ముని నాలుకను ముక్కలుముక్కలుగా కోసివేయాలి. ఆపని చేయలేకపోతే తన్ను తాను రూపుమాపుకోవాలి. అదీ చేతకాకపోతే చెవులు రెండూ గట్టిగా మూసుకొని అక్కడనుండి దూరంగా వెళ్ళిపోవాలి. ధర్మాన్ని భద్రంగా పాటించేవాళ్ళు చేసే ఉపదేశం ఇది.

## 2

దక్షుడు పదవీగర్వంతో పరమేశ్వరునకు ఘోరమైన అవమానం చేశాడు. సతీదేవి సహించలేక దక్షునిముందే అగ్నిలోపడి బూడిద అయిపోయింది. రుద్రుడు దక్షునిపని చూడమని వీరభద్రుణ్ణి పంపాడు. ఆ వీరభద్రుని ఆవిర్భావాన్ని అద్భుతంగా అభివర్ణిస్తున్నది యీ పద్యం.

**అభ్రంవిహాదభ్ర విభ్రమాభ్ర భ్రమ**
**కృన్నీల దీర్ఘ శరీర మమర**
**ప్రజ్వలజ్జ్వలనదీప్త జ్వాలికాజాల**
**జాజ్జ్వల మానకేశములు మెఱయ**
**చండ దిగ్వేదండ శుండాభ దోర్దండ**
**సాహస్రధృతి హేతిసంఘ మొప్ప**
**వీక్షణత్రయలోక వీక్షణ ద్యుతిలోక**
**వీక్షణతతి దుర్నిరీక్షముగను**

**క్రకచ కఠిన కరాళ దంష్ట్రలు వెలుంగ**
**ఘనకపాలాస్థివనమాలికలును దనర**
**అఖిలలోకభయంకరుడగుచు వీర**
**భద్రుడుదయించె మాఱట రుద్రుడగుచు.** 4.107

ఆకాశం అంచులుముట్టే ఊపుగల కాదు మేఘమా అనిపించే పొడవైన శరీరం ఒప్పారుతున్నది. భగభగా మండుతున్న అగ్నిజ్వాలలలాగా కేశములు వెలిగిపోతున్నాయి. భయం కలిగించే దిగ్గజాలు చాచిన పొడవైన తొండాలా అన్నట్లున్న వేయిచేతులలో వాడికత్తులు వేడిని క్రక్కుతూ కదలుతున్నాయి. మూడు

కన్నులూ మూడు మార్తాండబింబాలలాగా నిప్పులు క్రక్కుతూ లోకుల కన్నులకు చూడనలవికాకుండా మండిపోతున్నాయి. చాలా గట్టితనంగల రంపాలలాగా కోరలు పటపటలాడుతున్నాయి. పెద్దపెద్ద పుఱ్ఱెలతో ఎముకలతో ఏర్పడిన మాలలు మెడనుండి కాళ్ళవరకూ వ్రేలాడుతున్నాయి. దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేయటానికై వీరభద్రుడు ఇలా మహాభయంకరంగా ఉదయించాడు.

# 3

**దక్షయజ్ఞం సర్వనాశనం అయిపోయింది. ఆ యజ్ఞంలో పాల్గొన్న దేవతలు కూడా వీరభద్రుని ధాటికి నిలువలేకపోయారు. పరమేశ్వరుని కరుణను పొందాలనుకున్నారు. బ్రహ్మదేవునికి మొరపెట్టుకున్నారు. బ్రహ్మవారందరినీ కైలాసానికి తీసుకొనివెళ్ళాడు. ఆ కైలాసం ఎలాఉన్నదో ఈ పద్యం కమనీయంగా వివరిస్తున్నది.**

**భాసురలీల గాంచిరి సు పర్వులు భక్తజనైకమానసో**
**ల్లాసము కిన్నరీజన విలాసము నిత్యవిభూతి మంగళా**
**వాసము సిద్ధగుహ్యక నివాసము రాజితభూవికాసికై**
**లాసము కాంతినిర్జిత కులక్షితిభృత్సుమహద్విలాసమున్ 4.133**

పరమేశ్వరుని భక్తుల మనస్సులకు ఉల్లాసం కలిగించే ఒకే ఒకచోటు కైలాసం. అక్కడ కిన్నరకాంతల ఇంపుసొంపులు చూడముచ్చటగా ఉంటాయి. సర్వకాలాలలో వెలుగొందే వైభవాలూ, మంగళలూ అక్కడ కానవస్తాయి. సిద్ధులు, యక్షులూ మొదలైన దేవజాతుల వారికి అది నివాసం. వెండి వెలుగులు నిండిన భూమితో అలరారుతూ ఉంటుంది. ఆ కైలాసపర్వతం కాంతులలో ఏడు కులపర్వతాల గొప్పవిలాసాలన్నీ వెలతెలబొతూ ఉంటాయి. అటువంటి కైలాసపర్వతాన్ని దేవతలు చూచారు.

# 4

**బ్రహ్మ దేవతలనందరినీ వెంటబెట్టుకొని కైలాసానికి వెళ్ళాడు. వీరభద్రుని విజృంభణకు దెబ్బతిన్న దేవతలను కాపాడమని కైలాసవాసిని ప్రార్థించాలి. అక్కడ కైలాసంలో స్వామి ఒక మఱ్ఱిచెట్టు మొదట కూర్చున్నాడు. ఏ కొలతలకూ అందని స్వామికి ఆధారభూమి అయిన ఆ మఱ్ఱిచెట్టు ఎంతమహిమ కలదియో ఈ పద్యం వివరిస్తున్నది.**

**ఉజ్జ్వలంబయి శతయోజనంబుల పొడ**
**వొగి పంచసప్తతి యోజనముల**
**పఱపును గల్గి యే పట్టున తఱుగని**
**నీడ శోభిల్ల నిర్ణీతమగుచు**
**పర్ణశాఖా సమాకీర్ణమై మాణిక్య**
**ముల పోలగలఫలముల తనర్చి**
**కమనీయ సిద్ధయోగ క్రియామయమయి**
**యనఘ ముముక్షు జనాశ్రయంబు**

**భూరి సంసారతాప నివార కంబు**
**నగుచు తరురాజమనగ పెంపగ్గలించి**
**భక్తజనులకు నిచ్చలు ప్రమద మెసగ**
**వలయు సంపదలందు నావటము వటము 4.138**

స్వామి కూర్చున్న ఆ మఱ్ఱిచెట్టు కాంతులను విరజిమ్ముతున్నది. నూరు ఆమడల పొడవు, డెబ్బది అయిదు యోజనాల వైశాల్యంతో ఒప్పారుతున్నది. ఏవేళనయినా దానినీడ తఱుగదు. ఆకులు, కొమ్మలు దట్టంగా ఏర్పడిఉన్నాయి. దానిపండ్లు మాణిక్యాలను తలపింపజేస్తున్నాయి. సొంపైన సిద్ధులు అక్కడ యోగక్రియలను హాయిగా చేసుకుంటారు. ఆవిధంగా ముక్తిని కోరేవారికి అది విడిదిపట్టు. ఘోరమైన సంసారతాపాన్ని అది రూపుతుంది. ఇన్ని కారణాలుగా అది వృక్షాలకు రాజుగా పేరు పొందింది. భక్తులకు పరమానందాన్ని కలిగిస్తుంది. కోరిన సంపదలను కూర్పగల మహావృక్షం ఆ మఱ్ఱిచెట్టు.

# 5

**అటువంటి మఱ్ఱిచెట్టుక్రింద ధ్యానంలో కూర్చున్న మహాదేవుణ్ణి దర్శించుకోవటానికి మహాకవి మనకు ఒక పరమసుందరమైన అక్షరచిత్రాన్ని అందిస్తున్నారు.**

**ఇద్ధసనందాది సిద్ధసంసేవితు**
**శాంతవిగ్రహుని వాత్సల్యగుణుని**
**కమనీయలోక మంగళదాయకుని, శివు**
**విశ్వబంధుని జగద్వినుతయశుని**
**గుహ్యక సాధ్యరక్షోయక్షనాథకు**
**బేరసేవితుని దుర్వారబలుని**
**ఉదితవిద్యాతపోయోగయుక్తుని బాల**
**చంద్ర భూషణుని మునీంద్ర నుతుని**

**తాపసాభీష్టకరు భస్మదండలింగ**
**ఘనజటాజినధరుని, భక్తప్రసన్ను**
**వితతసంధ్యాభ్రరుచి విడంబితనూత్న**
**రక్తవర్ణు, సనాతను బ్రహ్మమయుని** **4.138**

శ్రీ దక్షిణామూర్తి మహాస్వామిని తేజస్సుతో వెలుగొందే సనందుడు మొదలైన సిద్ధులు చక్కగా సేవించుకుంటున్నారు. ఆయన నిలువెల్లా నిండుగా ఉన్న శాంతాకారం కలవాడు. అందరియందూ, అన్నింటియందూ, తల్లికి బిడ్డలయందు ఉండే వాత్సల్యం ఆయనలో కానవస్తున్నది. లోకంలో అందరికీ శుభాలను కలిగించేస్వామి శివుడు. విశ్వానికి బంధువు. లోకాలన్నీ ఆయన కీర్తిని ఎల్లవేళలా కొనియాడుతూ ఉంటాయి. గుహ్యకులు, సాధ్యులు, రక్షస్సులు, యక్షులు అనే దేవజాతులవారికందరికీ ఏలిక అయిన కుబేరుడు ఆయనను భక్తితో సేవిస్తున్నాడు. ఆ ప్రభువుబలాన్ని ఎవ్వరూ నిలువరించలేరు. పైకి పొంగుకొని వస్తున్న విద్యలూ, తపస్సూ, యోగమూ అతని సొమ్ములు. నెలవంక ఆయన తలపై అలంకారంగా విరాజిల్లుతున్నది. మునీంద్రులు నోరారా ఆయనను కొనియాడుతున్నారు. తపస్సుల కోరికలన్నీ ఆయనవలన తీరుతున్నాయి. భక్తుల యెడల ప్రసన్నంగా ఉంటాడు. సంజకెంజాయలను మరపింపజేసే ఎఱ్ఱని కాంతులతో చూడముచ్చటగా ఉన్నాడు. సనాతనుడు. సాక్షాత్తూ పరబ్రహ్మమే.

# 6

**బ్రహ్మదేవుడు, దేవేంద్రుడు మొదలైన మహాత్ములు శ్రీ దక్షిణామూర్తి అయిన మహాదేవుని ఇలా సందర్శించుకుంటున్నారు.**

**అంచితవామ పాదాంభోరుహము దక్షి**
**ణోరుతలంబున నొయ్య నునిచి**

**సవ్యజానువుమీద భవ్యబాహువు సాచి**
**వలపలి ముంజేత సలలితాక్ష**
**మాలిక ధరియించి మహనీయ తర్కము**
**ద్రాయుక్తుడగుచు చిత్తంబులోన**
**అవ్యయంబయిన బ్రహ్మానందకలిత స**
**మాధినిష్ఠుడు వీతమత్సరుండు**

**యోగపట్టాభిరాముడై ఉచితవృత్తి**
**రోషసంగతి బాసి కూర్చున్న జముని**
**యనువుననను దర్భరచిత బ్రుస్యాసనమున**
**నున్న మునిముఖ్యు నంచితయోగ నిరతు** **4.140**

ఆ దక్షిణామూర్తి మహాదేవుడు తన ఎడమకాలిని కుడి తొడపై చక్కగా పెట్టుకొని ఉన్నాడు. ఎడమ మోకాలిమీదికి చేతిని చాపిఉంచాడు. కుడి ముంజేతితో మిక్కిలి సుకుమారమైన స్ఫటికమాలను పట్టుకొని ఉన్నాడు. కుడిచేతితో చాలా గొప్పభావాన్ని తలపించే జ్ఞానముద్రను ప్రదర్శిస్తున్నాడు. ఆ జ్ఞానమూర్తిని పరిశీలిస్తుంటే ఆయన హృదయంలో బ్రహ్మానందం తాండవిస్తున్న స్ఫూర్తి కలుగుతుంది. మాత్సర్యం ఏమాత్రమూ లేనివాడు. యమధర్మరాజు రోషాన్నంతటినీ వదలించుకొని యోగపీఠంమీద పట్టాభిషిక్తుడై ఉన్నాడా అనిపిస్తున్నాడు. దర్భలతో అల్లిన ఆసనంమీద కూర్చుండి యోగసంపదను నిరంతరంగా సంపాదించుకుంటున్నాడు. అట్టి దక్షిణామూర్తిని బ్రహ్మాదులు సందర్శించుకొన్నారు.

# 7

ప్రజాపతి అయిన దక్షుడు ఒక గొప్పయజ్ఞం చేస్తున్నాడు. దానిని చూచి ఆనందం పొందటానికి దేవతలు, దేవతా సార్వభౌములూ చాలామంది వచ్చారు. సర్వలోకాలకూ గురువైన శ్రీమన్నారాయణుడు కూడా విచ్చేశాడు. ఆ రాకను వివరిస్తున్న సందర్భంలోనిది ఈ పద్యం.

**మానితశ్యామాయ మానశరీర దీ**
**ధితులు నల్దిక్కుల దీటుకొనగ,**
**కాంచనమేఖలా కాంతులతోడ, కౌ**
**శేయ చేలద్యుతుల్ చెలిమిసేయ**
**లక్ష్మీసమాయుక్త లలితవక్షంబున**
**వైజయంతీ ప్రభల్ వన్నెసూప**
**హాటకరత్న కిరీటకోటిప్రభల్**
**బాలార్కరుచులతో మేలమాడ**

**లలితనీలాభ్రరుచి కుంతలములు తనర**
**ప్రవిమలాత్మీయ దేహజప్రభ సరోజ**
**భవభవామరముఖ్యుల ప్రభలు మాప**
**అఖిలలోకైక గురుడు నారాయణుండు** **4.163**

మన్నన పొందటానికి వీలైన నీలదేహం కాంతులు నాలుగుదిక్కులకూ వ్యాపిస్తున్నాయి. బంగారు మొలత్రాటి ప్రభలతో పట్టుపీతాంబరం వెలుగులు చెలిమిచేస్తున్నాయి. లక్ష్మీదేవికి ఆటపట్టయిన వక్షఃస్థలం మీద వైజయంతి కాంతులు వెలిగిపోతున్నాయి. రత్నాలు పొదిగిన బంగారు కిరీటపుశోభలు ఉదయిస్తున్న

సూర్యుని ప్రభలతో ఆడుకుంటున్నాయి. సుకుమారమైన నల్లనిమేఘం వన్నెలతో స్వామి కేశాలు విరాజిల్లుతున్నాయి. మిక్కిలి నిర్మలమైన ఆ ప్రభువుదేహం నుండి వెలువడే దీప్తి బ్రహ్మ, శివుడు, దేవేంద్రుడు మొదలైనవారి ప్రభలను తక్కువచేస్తున్నది. ఈయీ కాంతిపుంజములతో ప్రకాశిస్తున్న సర్వలోకాలకూ గురువైన శ్రీమన్నారాయణుడు దక్షయజ్ఞానికి విచ్చేశాడు.

## 8

**దక్షయజ్ఞం దర్శించటానికి విచ్చేసిన శ్రీమన్నారాయణ స్వామిని బ్రహ్మాదులు చాలా గొప్పగా స్తుతించారు. అందులో దేవేంద్రుడు చేసిన స్తుతి ఈవిధంగా ఉన్నది.**

**దితిసంతాన వినాశసాధన సముద్దీప్తాష్ట బాహాసమ**
**న్వితమై యోగిమనోనురాగపదమై వెల్గొందునీ దేహమా**
**యతమైనట్టి ప్రపంచముం బలెను మిథ్యాభూత ముంగామి శా**
**శ్వతముంగా మదిలో తలంతు హరి! దేవా! దైవచూడామణీ. 4.181**

స్వామీ! దేవా! దేవతాసార్వభౌమా! శ్రీమన్నారాయణా! నీయీదేహం ఎనిమిది పెద్దచేతులతో అలరారుతూ ఉన్నది. ఆచేతులు రక్కసిమూకల నాశనానికి సాధనాలై గొప్పకాంతులతో వెలిగిపోతున్నాయి. యోగుల హృదయాల అనురాగానికి తావు అయినది నీదేహం. అతివిశాలమైన ఈ ప్రపంచంలాగా అది అబద్ధమైనది కాదు. అందువలన ఈనీదేహం ఎన్నటికీ నిలిచిఉండేది, ఎన్నటికీ నాశనం పొందనిది అని నేను భావిస్తున్నాను.

## 9

**దక్షయాజ్ఞాన్ని చక్కదిద్దటానికి వచ్చిన శ్రీమహావిష్ణువును కనుగొని యోగీశ్వరు లీవిధంగా స్తుతించారు.**

**విశ్వాత్మ! నీయందు వేఱుగా జీవుల**
**గన డెవ్వడట వానికంటె ప్రియుడు**
**నీకు లేడు; అయినను నిఖిలవిశ్వోద్భవ**
**స్థితి విలయంబులకతన నైన**
**సంగతి నిర్భిన్నసత్త్వాదిగుణవిశి**
**ష్టాత్మీయ మాయచే నజభవాది**
**వివిధభేదము లొందుదువు; స్వస్వరూపంబు**
**నందుండుదువు; వినిహతవిమోహి**
**వగుచునందువు గద; నిన్ననన్యభక్తి**
**భృత్యభావంబు తాల్చి సంప్రీతి గొల్చు**
**మమ్ము రక్షింపవే కృపామయి! రమేశ!**
**పుండరీకాక్ష! సంతత! భువనరక్ష. 4.193**

స్వామీ! నారాయణా! విశ్వమంతా నీవే! నీకంటె వేరుగా జీవులు ఉన్నారు అనుకోవటం అజ్ఞానం. ఆ అజ్ఞానం లేనివారికంటె నీకు ప్రియమైనవాడు లేడు. అంటే నీకు జ్ఞానులంటే చాలాఇష్టం. అయినా ఈ విశ్వమంతా ఏర్పడటానికీ, నిలిచిఉండటానికీ, మళ్ళీ నీలో కలసిపోవటానికీ నీవే వేరువేరుగా రజస్సు, సత్త్వము, తమస్సు అనే గుణాలతో కూడిన నీదే అయిన మాయతో బ్రహ్మగా, విష్ణువుగా, శివుడుగా ఇంకా పెక్కు దేవతలుగా రూపాలను పొందుతూ ఉంటావు. అయినా నీకు నీదయినజ్ఞానం ఏమాత్రమూ జారిపోదు. కనుక నిలువెల్లా కృపయే అయినదేవా! లక్ష్మీపతీ! పద్మములవంటి కన్నులున్న ప్రభూ! అంతటా వ్యాపించి ఉండు సర్వాత్మకా! లోకాలనన్నింటినీ కాపాడే ఆదిదేవా! నిన్ను మాత్రమే భక్తితో, సేవకులమై మిక్కిలి ప్రీతితో కొలిచే మమ్ములను కాపాడు తండ్రీ!

# 10

ప్రేమతో తండ్రి ఒడిలో కూర్చోవటానికి ఉబలాటపడిన ధ్రువుణ్ణి సవతితల్లి త్రోసివేసిఅవమానించింది. బాలునిగుండె కుతకుతలాడిపోయింది. తల్లి అనుమతితో తపస్సు చేసుకోవటానికి బయలుదేరాడు ధ్రువుడు. భాగ్యవశంచేత అతనికి దారిలో నారద మునీంద్రుడు కనపడి శ్రీమన్నారాయణ తత్త్వాన్ని, తపస్సు పద్ధతినీ ఉపదేశిస్తూ ఇలా అంటున్నాడు.

**హారకిరీట కేయూర కంకణఘన**
**భూషణుం డాశ్రితపోషణుండు**
**లాలిత కాంచీకలాపశోభితకటి**
**మండలుం డంచిత కుండలుండు**
**మహనీయ కౌస్తుభమణియుక్తమైన గ్రై**
**వేయకుండానందదాయకుండు**
**సలలితఘనశంఖచక్రగదా పద్మ**
**హస్తుండు భువన ప్రశస్తు డజుడు**

**కమ్రసౌరభవనమాలికా ధరుండు**
**హతవిమోహుండు నవ్యపీతాంబరుండు**
**లలితకాంచన నూపురాలంకృతుండు**
**నిరతిశయసద్గుణుడు దర్శనీయతముడు** **4.251**

నాయనా! ధ్రువా! నారాయణుడు హారాలు, కిరీటమూ, బాహుపురులూ, వలయాలూ మొదలైన గొప్ప నగలతో అలంకరింపబడినవాడు. తన్ను ఆశ్రయించినవారిని పోషిస్తూ ఉంటాడు. చక్కని మొలత్రాడు పేటలతో శోభలను వెలువరిస్తున్న నడుము కలవాడు. కాంతులతో అలరారుతున్న కుండలాలు కలవాడు. వెలకట్టరాని కౌస్తుభమణిలో కూడియున్న కంఠంలో వ్రేలాడుతున్న సువర్ణహారం కలవాడు. అందరికీ ఆనందం అందిస్తున్నవాడు. అందచందాలతో ప్రకాశిస్తున్న శంఖము, చక్రము, గద, పద్మము చేతులందు ఉంచుకొన్నవాడు. అందువలననే ఆతనిని లోకులందరూ కొనియాడుతూ ఉంటారు. కమ్మని సువాసనలతో గుబాళిస్తున్న వనమాలను ధరించి ఉంటాడు. ఇన్ని మహావస్తువులు ఉన్నా దేనియందూ వ్యామోహంలేని మహాత్ముడు. ఎప్పటికప్పుడు క్రొత్త పట్టువస్త్రాలు ధరిస్తూ ఉంటాడు. చీలమండల దగ్గర మనోహరమైన అందియలు సొంపును పెంపుచేస్తున్నాయి. అతని సద్గుణాలను మించేవి సృష్టిలో మరెక్కడా ఉండవు. ప్రాణులందరికీ చూడముచ్చట అయినవాడు.

# 11

నారద మునీంద్రుడు కుమారుడైన ధ్రువునకు పరమాత్మ అయిన నారాయణుని ఏవిధంగా పూజించాలో చక్కగా ఉపదేశిస్తున్నాడు.

**దూర్వాంకురంబుల దూర్వాంకురశ్యాము**
**జలజంబులను చారుజలజనయను**
**తులసీదళంబుల తులసికా దాముని**
**మాల్యంబులను సునైర్మల్యచరితు**
**పత్రంబులను పక్షిపత్రుని, కదువన్య**
**మూలంబులను ఆదిమూలఘనుని**

**అంచిత భూర్జత్వగాది నిర్మిత వివి**
**ధాంబరంబులను పీతాంబరధరు**

**తనరుభక్తిని మృచ్ఛిలా దారురచిత**
**రూపములయందు గాని నిరూఢమైన**
**సలిల ములయందు గాని సుస్థలములందు**
**గాని పూజింపవలయు నక్కమలనాభు** **4.254**

కుమారా! ధ్రువా! పరమాత్మా మన సౌకర్యంకోసం ఆకారం ధరించి మనముందు మెలగుతూ ఉంటాడు. ఆ స్వరూపానికి మనం పూజలు చేస్తూ పుణ్యం సంపాదించుకోవాలి. ఆ స్వామి లేత గరికవంటి దేహకాంతి కలవాడు. కాబట్టి లేతగరికలు ఆయనకు సమర్పించుకోవాలి. అందమైన పద్మాలవంటి నేత్రాలు ఆయనవి. వానిని భావిస్తూ పద్మాలతో పూజించాలి. ఆయనకు తులసీదళాలమాలను ధరించటం ఇష్టం. కాబట్టి తులసీదళాలను సమర్పించుకోవాలి. ఆయన అతి నిర్మలమైన నడవడి కలవాడు. మాలలతో అర్పించాలి. స్వామికి వాహనం పక్షి. పూజకు పనికివచ్చే పత్రాలు ఆయనకు ఇచ్చుకోవాలి. సృష్టికీ, దేవతలకూ, సర్వమునకూ ఆయన మూలకారణం. కాబట్టి వనాలలోని మొక్కలవ్రేళ్ళను తెచ్చి పూజలు చేయాలి. ఆయన పచ్చని పట్టుబట్ట ధరిస్తాడు. మేలైన బూరుగుచెట్టు మొదలైనవాని పట్టలతో నేసిన వస్త్రాలు అందించాలి. మట్టితోగానీ, రాతితో గానీ, కొయ్యతో గానీ రూపొందించుకొన్న విగ్రహాన్ని ముందు పెట్టుకొని అర్చనలు చెదరనిభక్తితో చేయాలి. లేదా పవిత్రమైన నదీజలములయందు కూడా చేయవచ్చు. అలాగే మహిమగల క్షేత్రాలలో కూడా ఆచరించవచ్చు. ఆయన కమలనాభుడు. ఈ సృష్టినంతా చేస్తున్న బ్రహ్మకు జన్మనిచ్చిన పద్మం బొడ్డునందు ఉన్నవాడు.

# 12

**ధ్రువుని తపస్సు పంట పండింది. స్వామి సాక్షాత్కరించాడు. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిన అతని చెక్కిలిపై నారాయణుడు వేదమయమైనది, నాదమయమైనదీ అయిన శంఖాన్ని తాకించినంతనే ధ్రువునివదనం నుండి కమనీయస్తుతి వాక్యాలు వెలువడ్డాయి. అందులోనిది యీ పద్యం.**

**సర్వేశ! కల్పాంత సమయంబునందు నీ**
**యఖిల ప్రపంచంబు నాహరించి**
**అనయంబు శేషసహాయుండవై శేష**
**పర్యంకతలమున పవ్వళించి**
**యోగనిద్రారతినుండి నాభీసింధు**
**జస్వర్ణలోకకంజాతగర్భ**
**మందు చతుర్ముఖు నమర పుట్టించుచు**
**రుచి నొప్ప బ్రహ్మస్వరూపివైన**

**నీకు మ్రొక్కెద అత్యంతనియమ మొప్ప**
**భవ్యచారిత్ర! పంకజపత్రనేత్ర!**
**చిరశుభాకార! నిత్యలక్ష్మీవిహార**
**అవ్యయానంద! గోవింద! హరి! ముకుంద.** **4.287**

సర్వమునకూ పాలకుడవైన ప్రభూ! గొప్ప చరిత్రగల స్వామీ! పద్మపత్రాలవంటి నేత్రాలుగల సుందరమూర్తీ! నీయందు నిరంతరం శ్రీదేవి విహరిస్తూ ఉంటుంది. సర్వకాలాలలో తరుగుపోని ఆనందం

నీది. గోవిందా! హరీ! ముక్తిప్రదాతా! నీవు కల్పం ముగిసేసమయంలో ఈ సర్వప్రపంచాన్నీ నీలో కలుపుకుంటావు. ఆదిశేషుడు నీకు సహాయుడు. ఆ శేషశయ్యమీద పవ్వళించి యోగనిద్రలో ఆనందం పొందుతూ ఉంటావు. నీబొడ్డు అనేది ఒకనది. అందులోని బంగారు భవనంనుండి నాలుగుమోముల దేవుడు బ్రహ్మను పుట్టిస్తూ ఉంటావు. నీవు పరబ్రహ్మమవు. అట్టి నీకు గట్టిపట్టుదలతో మ్రొక్కుతూఉంటాను.

## 13

**ఇది పృథుచక్రవర్తి కథలోని పద్యం. పృథువు చాలా గొప్పమనీషి. ఆయన పేరుతోనే భూమికి పృథివి అనే పేరు ఏర్పడింది. ఆయన మహాత్మకు సంతోషించి శ్రీమన్నారాయణుడు అతనికి దర్శనం అనుగ్రహించాడు. పృథువు విష్ణువును స్తుతిస్తూ ఇలా అన్నాడు.**

**అదిగాన, పద్మలోచన**
**సదమలభవదీయఘనయశము వినుటకునై**
**పదివేల చెవులు కృప ని**
**మ్మదియే నాయభిమతంబు నగును ముకుందా! 4.551**

దేవా! పుండరీకాక్షా! నాకు నీపాదపద్మాల భక్తియే కావాలి. నీకీర్తిని సర్వకాలాలలో అన్ని అవస్థలలో పాడుకుంటూ ఉండాలి. కాబట్టి ఆవంతయినా మచ్చలేనిదయిన నీ గొప్పకీర్తిని వినటానికై దయతో నాకు పదివేల చెవులివ్వు. నీవు ముకుందుడవు. భక్తులకు ముక్తినిచ్చే ప్రాభవం కలవాడవు. నాకు అదే యిష్టమైన వరం. వేరువరం నేను కోరను.

# పంచమ స్కంధము

## 1

నాభి అనే ఒకమహానుభావునకు ఉత్తమసంతానం పొందాలని కోరిక కలిగింది. యజ్ఞపురుషుడైన వాసుదేవుణ్ణి గొప్పభక్తిశ్రద్ధలతో ఆరాధించాడు. ఆ ఆరాధనలో తన సహధర్మచారిణికి కూడ అవకాశం కల్పించాడు. పుండరీకాక్షుడు తన సుందరరూపాన్ని వారికి అనుగ్రహించాడు. అప్పుడు ఆనందపారవశ్యంతో ఇలా అంటున్నారు.

**క. పరిపూర్ణుడ వై యుండియు, మఱవక మా పూజలెల్ల మన్నింతువు నీ**
**చరణారవింద సేవయు, ధర బెద్దలు చెప్పినటులు దగ జేసెద మౌ. 5-1-45**

దేవా! నీవు పరిపూర్ణుడవు. విశ్వమంతా నీలోనే నిలుపుకొన్న అనంతమైన రూపం కలవాడవు. అయినా ఏమరుపాటు ఏమాత్రములేక మమ్మల్నీ, మేముచేసే పూజలనూ మన్నిస్తూ ఉంటావు. ఇంత దయామూర్తివైన నీ చరణారవిందాల సేవను మేము వదలము. అనుభవం పండించుకొన్న ఆత్మారాములు ఉపదేశించిన విధానంతో నీపాదపద్మాల సేవను మేము చేసుకుంటూనే ఉంటాము. ఔను. ఇది మావ్రతం.

## 2

భరతుడనే మహారాజు సహజంగా వైరాగ్యం పొంది బ్రదుకుతున్నాడు. కొన్ని పరిస్థితులలో ఒక దిక్కుమాలిన లేడికి సంరక్షకుడయ్యాడు. దానిమీద కొండంత మమకారం పెంచుకున్నాడు. మరణ సమయంలో కూడ దానినే స్మరించటంవలన మరుజన్మలో లేడి అయ్యాడు. అయినా వెనుకటి పుట్టుక జ్ఞాపకాలు పోలేదు. ఆ తరువాతి జన్మలో ఒక అవధూతగా పుట్టి రహూగణుడనే రాజుకు ఈవిధంగా తత్త్వబోధన చేశాడు.

**సీ. ధరలోన బ్రహ్మంబు తపమున దానంబులను గృహధర్మంబులను జలాగ్ని**
**సోమ సూర్యులచేత శ్రుతులచే నైనను బరమభాగవతుల పాదసేవ**
**బొందినమాడ్కిని బొందంగ రా దని పలుకుదు రార్యులు పరమమునులు**
**ఘన తపో బాహ్యసౌఖ్యములకు విముఖులు నై పుణ్యులు హరిగుణానువాద**
**మోదితాత్ములు నగుబుధపాదసేవ**
**ననుదినంబును జేసిన నంతమీద**
**మోక్షమార్గంబునకును పద్మాక్షునందు**
**పట్టువడియుండు నెప్పుడు పరగ బుద్ధి 5-1-162**

రాజా! ఈలోకంలో బ్రహ్మజ్ఞానంకోసం తపస్సులూ, దానాలూ, గృహధర్మాలూ చక్కగా చేస్తూ ఉంటారు. అలాగే నీరు, నిప్పు, చందమామ, భాస్కరుడు మొదలైన దేవతలను ఆరాధిస్తూ ఉంటారు. వేదాలు వల్లిస్తూ ఉంటారు. కానీ పరమభాగవతుల పాదసేవ చేస్తేగానీ బ్రహ్మము పట్టుపడదని మహాత్ములూ, మహర్షులూ పలుకుతూ ఉంటారు. గొప్పతపస్సుతో సంబంధంలేని సౌఖ్యాల విషయంలో పెడమొగంపెట్టిన పుణ్యాత్ములు శ్రీహరి గుణాలను వదలకుండా పలుకుతూ మహానందం అనుభవిస్తూ ఉంటారు. అట్టి జ్ఞానమూర్తుల పాదసేవను నిత్యమూ చేస్తూఉంటే కొంతకాలానికి బుద్ధి మోక్షమార్గానికి కట్టుబడి ఉంటుంది. శ్రీహరిమీద నెలకొని ఉంటుంది.

## 3

**ఆంగిరసుని పుత్రుడై పుట్టినజ్ఞాని భరతుడు అవధూతస్థితిలో రహూగణుడనే రాజునకు ఉత్తమ జ్ఞానవిద్యను ఉపదేశించాడు. దానిని శ్రద్ధగా విన్న ఆసింధురాజు అవధూతతో ఇలా పలుకుతున్నాడు.**

**క.** **అక్కట ! మానుషజన్మం, బెక్కువ యై యుండు నెపు డభేదమతిం బెం**
**పెక్కిన యోగిసమాగమ, మక్కజముగ గలిగెనేని యఖిలాత్ములకున్.** **5-1-176**

ఆహా! స్వామీ! ఈసృష్టిలో అన్నివిధాలవారికి, నేనువేరు, బ్రహ్మమువేరు అనే భావనలేకుండా, ఉన్నది ఒక్కటే అనేజ్ఞానం పూర్తిగా కలిగిన ఆ మహాయోగులతో కలయిక కలిగితే ఆమానవజన్మయే నిజమైన మానవజన్మఅయి మెచ్చుకొనదగినదవుతుంది.

## 4

**పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రుణ్ణి స్వామీ! ఈ భూమి ఏడుద్వీపాలుగా, ఏడు సముద్రాలుగా అయినట్లు చెప్పారు మీరు. ఈ లోకాలనుగూర్చి తెలుసుకుంటే లోకేశ్వరుణ్ణి తెలుసుకున్నట్లే. కాబట్టి ద్వీపాలు, వర్షాలు అనేవాని విశేషాలను నాకు తెలియజెప్పండి అని ప్రార్థించాడు. శ్రీశుకులు ఆసందర్భంలో భారతవర్షం మహిమను అభివర్ణిస్తున్నారు.**

**ఉ.** **భారతవర్ష జంతువుల భాగ్యము లేమని చెప్పవచ్చు ! నీ**
**భారతవర్షమందు హరి పల్మఱు పుట్టుచు జీవకోటికిం**
**ధీరతతోడ దత్త్వ ముపదేశము సేయుచు జెల్మిసేయుచు**
**న్నారయ బాంధవాకృతి గృతార్థుల జేయుచునుండు నెంతయున్** **5-2అ-55**

రాజా! మహాపురుషులు భారతవర్షాన్ని గొప్పగా కొనియాడుతారు. అప్పటివారి మాటలు ఇలా ఉంటాయి. ఆహాహా! భారతవర్షంలో పుట్టిన జంతువుల భాగ్యాలు చెప్పటానికి మాకు సాధ్యమవుతుందా? ఎందుకంటే ఈ పవిత్రమైన భారతవర్షంలో శ్రీమహావిష్ణువు పెక్కుమారులు అవతరిస్తూఉంటాడు. జ్ఞానం పండినబుద్ధితో ప్రాణికోటులకు బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశిస్తూ ఉంటాడు. ఆబోధచేసే సమయంలో ఆకరుణామయుడు వారిని ఉద్ధరించాలనే తపనతో కొందరితో చెలిమిచేస్తూ ఉంటాడు. మఱికొందరితో చుట్టరికం కలుపుకుంటూ ఉంటాడు. ఆవిధంగా వారిని కృతార్థులను చేస్తూ ఉంటాడు.

## 5

**శ్రీకృష్ణవాసుదేవుని దయ ఎంతగొప్పదో, శ్రీశుకులు పరీక్షిత్తునకు మనోజ్ఞంగా తెలుపుతున్నారు.**

**క.** **తన జన్మకర్మములనుం, గొనియాడెడివారి కెల్ల గోరిన వెల్లన్**
**దనియగ నొసగుచు మోక్షం, బనయము గృపసేయు గృష్ణు డవనీనాథా !** **5-2-56**

రాజా! శ్రీకృష్ణపరమాత్మ భారతవర్షంలో ప్రాణులను ఉద్ధరించటానికి అవతరించాడు. ఆమహాత్ముడు భూమిలో తాను అవతరించినప్పటి విశేషాలనూ, తాను లోకరక్షణకోసం చేసిన మహాకార్యాలను శ్రద్ధతో, ఆదరంతో చెప్పుకొనే వారికందరికీ తనివితీరా కోరినవన్నీ ప్రసాదిస్తాడు. అంతేకాదయ్యోయ్! ఎంతో పుణ్యం పండించుకొన్న మహనీయులకు, గొప్పతపస్సు చేసిన యోగులు మొదలగువారికి కూడా లభించని మోక్షం కూడా అనుగ్రహిస్తాడయ్యా !

# షష్ఠ స్కంధము

## 1

తెలుగు భాగవతంలో ఆరవ స్కంధాన్ని ఏర్చూరి సింగయ రచించాడు. తనకు మార్గదర్శకుడైన బమ్మెర పోతన్న గారిని పరమభక్తితో స్తుతిస్తున్నాడు సింగయ.

**ఉ. ఎమ్మెలు సెప్పనేల ? జగ మెన్నగ పన్నగరాజశాయికిన్**
**సొమ్ముగ వాక్యసంపదలు సూఱలు చేసినవాని, భక్తి లో**
**నమ్మినవాని, భాగవత నైష్ఠికు డై తగువాని, పేర్మితో**
**బమ్మెర పోతరాజు కవిపట్టపురాజు దలంచి మ్రొక్కెదన్. 6-12**

వినోదం మాటలు ఎందుకులెండి. ఉన్నమాట ఉన్నట్టు అంటాను అంటారు మాగురువు పోతన్నగారు. అందువలననే ఆదిశేషుని పడగలమీద పవ్వళించే పరమాత్మకు సొమ్ము అయ్యేతీరుతో వాక్యాలసంపదలు కొల్లలుగా నివేదించుకున్నారు. దానిని జగమంతా కొనియాడింది. పరమభక్తితో ఆస్వామినే నమ్మికొని జీవించారు. భగవంతుని కథలమీదా, భగవంతుని భక్తులకథలమీదా పరమనిష్ఠగల భాగవతోత్తములు వారు. అట్టి కవిసార్వభౌముడని కొనియాడదగిన బమ్మెర పోతనగారిని స్మరిస్తూ మ్రొక్కులు చెల్లించుకుంటాను.

## 2

ఏర్చూరి సింగన బమ్మెర పోతనను భక్తితో ఉపాసించిన ఉత్తమకవి. ఆ ప్రభావంతో ఏర్పడిన సంస్కార బలంతో భాగవతం ఒక పరమమంత్రంగా సంభావించి దానిని పలుకుతానంటున్నాడు.

**ఉ. ఎయ్యది కర్మబంధముల నెల్ల హరించు, విభూతికారణం**
**బెయ్యది, స న్మునీంద్రులకు నెల్ల గవిత్వసమాశ్రయంబు ము**
**న్నెయ్యది, సర్వమంత్రముల నేలిన దెయ్యది, మోక్షలక్ష్మిరూ**
**పెయ్యది, దాని బల్కెద సుహృద్యము భాగవతాఖ్య మంత్రమున్. 6-14**

భాగవతం అంటే భగవంతునికి సంబంధించిన గుణగణాలను ప్రపంచించిచెప్పే ఒకమహామంత్రం. అది కర్మలవలన కలిగే బంధాల నన్నింటినీ తొలగించివేస్తుంది. పొందదగిన గొప్పసంపదలనన్నింటినీ భక్తులకు సిద్ధింపజేస్తుంది. నిత్యసత్యమైన పరతత్త్వాన్ని మాత్రమే పలకాలనే పట్టుదలగల మహర్షులు వాల్మీకికీ, వ్యాసుల వారికీ అత్యద్భుతమైన కవిత్వభిక్ష పెట్టింది. మంత్రాలనన్నింటినీ ఏలిన మహామంత్రం అది. ఒక్కమాటలో చెప్పాలంటే అది అందరూ అందుకోవలసిన మోక్షలక్ష్మియే. భక్తుల హృదయాలలో భద్రంగా నెలకొని ఉండేది ఆ మంత్రమే. కనుక నేను దానినే వాక్కులతో ఉపాసిస్తాను.

## 3

భాగవతం మరొకరూపంలో మనకు దొరకినవేదం. అది జ్ఞానదీపం. దానిని తెలిసి పలకటం తేలికపనికాదు. ఆ గౌరవాన్ని చక్కగా గమనించి పలుకుతున్నాను అంటున్నాడు సింగయ్య కవి.

**ఆ. భాగవతము తేటపఱుప నెవ్వడు సాలు ?**
**శుకుడు దక్క నరుని సకుడు దక్క**
**బుద్ధి దోచినంత, బుధులచే విన్నంత,**
**భక్తి నిగిడినంత పలుకువాడ. 6-23**

భాగవతం స్పష్టంగా తెలియజెప్పటానికి చాలినవారు ఇద్దరు మాత్రమే. ఒక మహాత్ముడు శుకయోగీంద్రుడు. రెండవవాడు సాక్షాత్తు పరమాత్మయే అయిన శ్రీకృష్ణవాసుదేవుడు. నాబుద్ధిని ప్రేరణచేసి స్వామి ఎంత అందిస్తాడో అంత పలుకుతాను. జ్ఞానసంపన్నులైన పండితులు చెప్పగా చెవులబడినంత పట్టుకొని పలుకుతాను. అన్నింటికంటె ముఖ్యమైనది భక్తి. అది ఎంతదూరం సాగితే అంత చెబుతాను.

# 4

**పరీక్షిత్తు శుకయోగీంద్రులను పాపపంకిలం నుండి బయటపడటం ఎలా అని ప్రశ్నచేశాడు. దానికి సమాధానంగా శుకులు ఇలా వివరిస్తున్నారు.**

**ఉ. కొందరు పుణ్యవర్తనులు గోపకుమార పదారవింద జా**
**నంద మరందపాన కలనా రత షట్పదచిత్తు లౌచు, గో**
**విందపరాయణుల్ విమలవేషులు దోష మడంతు రాత్మలం**
**జెందిన భక్తిచేత రవి చేకొని మంచు నడంచుకై వడిన్. 6-52**

రాజా! లోకంలో కొందరు సర్వకాలాలలో పుణ్యకార్యాలే చేస్తూ ఉంటారు. వారి నడవడి అంతా పవిత్రంగానే ఉంటుంది. వారు గోపకుమారుడున్నాడే కృష్ణయ్య ఆయన పాదాలను పద్మాలుగా భావించి అందునుండి జాలువారే ఆనందం అనే మకరందాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు. ఆస్థితిలో వారి హృదయం తుమ్మెదవంటిదవుతుంది. ఆవిధంగా గోవిందుడే పరమగతి అన్నభావనలో నిశ్చలంగా ఉండే భక్తులు స్వచ్ఛమైన వేషం తాల్చి పాపాలను పటాపంచలు చేసుకుంటారు. వారి ఆత్మలలో చక్కగా కుదురుకొన్న భక్తిచేత, సూర్యుడు మంచును అణచివేసినట్లుగా, పాపాలను బాపుకుంటారు.

# 5

**విష్ణుభక్తిని పెంపొందించుకుంటే పరమాత్మను చేరుకొనే దారిలోని అడ్డంకులన్నీ తొలగిపోవటాన్ని శ్రీశుకులు పరీక్షిత్తునకు తెలియజేస్తున్నారు.**

**క. హరిభక్తి చేత కొందఱు, పరిమార్తురు మొదలు ముట్ట బాపంబుల ని**
**ష్ఠురతర కరముల సూర్యుం, డరుదుగ, బెనుమంచుపించ మణచినభంగిన్ 6-53**

మానవులను పట్టిపల్లార్చేవి పాపాలు. వానిని మూలముట్టుగా మట్టుపెట్టటం మానవునకు తప్పనికర్తవ్యం. ఆపనిచేయకపోతే కలిగేది భ్రష్టతయే. సూర్యభగవానుడు తనతీవ్ర కిరణాలతో బాగా క్రమ్ముకొన్న మంచు పొగరు అణచివేయకపోతే మానవునకు దారి కానరాదు. సూర్యుడు మంచును చీల్చి వెలుగును ప్రసాదించినట్లుగా శ్రీవాసుదేవభక్తి పాపాలను సమూలంగా తొలగించివేస్తుంది. భగవద్దర్శనానికి అడ్డంగా ఉన్నతెర దానితో తొలగిపోతుంది.

## 6

**శ్రీశుకయోగీంద్రులు పరీక్షిన్మహారాజునకు కృష్ణభక్తి వలన లభించే మహాఫలాన్ని మధురములైన మాటలతో వివరిస్తున్నాడు.**

**చ. సతతము కృష్ణ పాదజలజంబులయందు మనంబు నిల్పు సు**
**వ్రతులు తదీయ శుద్ధ గుణరాగులు కాలుని యుగ్రపాశ సం**
**హతుల ధరించు తత్సుభటవర్గములం గలలోన గానరే**
**గతులను దుష్టకర్మములు గైకొని వారల జెందనేర్చునే ? 6-58**

రాజా! శ్రీకృష్ణుడు పరమాత్మ. నామరూపాలులేని పరమాత్మ లోకాలను అనుగ్రహించటం పనిగా శ్రీకృష్ణమూర్తియై భూమికి దిగివచ్చాడు. ఆయన పాదపద్మాలయందు నిరంతరం మనస్సును నిక్షేపించాలి. అలా చేసేవారిని 'సువ్రతులు' అంటారు. ఆ మహాత్ముడు మానవులను ఉద్ధరించటంకోసం భూమిపై సంచరించిన కాలంలో కొన్ని గుణాలను లీలలుగా ప్రకటించాడు. మనం అట్టి అతని శుద్ధగుణాలయందు చెదరని అనురాగం కలవారం అయిపోవాలి. అలా అయిన వారు భయంకర పాశాల దెబ్బలను వడ్డించే యమభటుల గుంపులను కలలో కూడా చూడరు. ఎటువంటి ఘోరమైన కర్మములు చేయగల అధికార పురుషులైనా కృష్ణభక్తుల దాపునకు ఏవిధంగానూ రాలేరు.

## 7

**అజామీళుడు అనే ఒకబాపడు పాపాలపుట్ట. కన్యాకుబ్జంలో ఉండేవాడు. సంసారలంపటంలో మునిగి తేలుతూ ఎనభై ఎనిమిదేండ్ల జీవితం వ్యర్థం చేసుకున్నాడు. చివరికి పోగాలం దాపురించింది. యమభటులు ఎదురుగా హృదయం అదరిపోయేలా నిలబడిఉన్నారు. ఆ సమయంలో అతనికి తన కడగొట్టు ముద్దులపట్టి నారాయణుడు తలపులో మెదిలాడు.**

**క. దూరమున నాడు బాలుడు, బోరన దన చిత్తసీమ బొడగట్టిన నో**
**నారాయణ ! నారాయణ ! నారాయణ ! యనుచు నాత్మనందను నొడివెన్ 6-72**

తాను ముచ్చటపడి అతనితోడిదే బ్రతుకు అన్నట్లు కనిపెంచిన నారాయణ నామంగల కొడుకు దూరాన ఆడుకొంటున్నాడు. ఒకవంక యమభటులు తర్జిస్తూ గర్జిస్తూ ప్రాణాలను గుంజుకొనిపోవటానికి సిద్ధంగా ఉన్నారు. అదృష్టవశాన నారాయణుడు గుర్తుకువచ్చాడు. అప్పుడా మహాపాతకశిరోమణి నారాయణా! నారాయణా! నారాయణా! అని మూడుమారులు గొంతెత్తి పిలిచాడు. కొడుకు నారాయణుడు పలికాడో లేదో కానీ పరమాత్మ అయిన నారాయణుడు అనుగ్రహించి పాపాలన్నీ పోగొట్టి అతనిని అక్కున చేర్చుకున్నాడు.

## 8

**పాపాలపుట్ట అయిన అజామీళుని విషయంలో ధర్మదూతలకూ, భగవద్దూతలకూ పెద్దవాగ్వాదం జరిగింది. భగవద్దూతలు ధర్మని దూతలకు ఒక ధర్మసూక్ష్మాన్ని దృష్టాంతపూర్వకంగా బోధిస్తున్నారు.**

గీ. నెమ్మి తొడలమీద నిద్రించు చెలికాని
నమ్మదగినవాడు నయము విడిచి
ద్రోహబుద్ధి జంప దొడరునే ? యెం దైన
బ్రీతి లేక ధర్మదూతలార ! 6-113

ధర్మరాజభటులారా ! ఒకడు ప్రేమతో ఒకచెలికానిని నిండుగా నమ్మి అతనితొడలమీద ఆదమరచి నిద్రపోతున్నాడు. రెండవవాడు నీతిమాలి ద్రోహబుద్ధితో ప్రీతితప్పి వానిని చంపటానికి పూనుకుంటాడా ఎక్కడైనా? అన్నారు విష్ణుభటులు. అజామీళుడు పాపాలన్నీ చేసినవాడే. కానీ అంత్యకాలంలో అసంకల్పితంగా నయినా భగవన్నామాన్ని ఉచ్చరించాడు. అదే అతడు నమ్మి నెమ్మితో చెలికాని తొడలమీద నిద్రించటం. అట్టివానికి ద్రోహం చేయరాదని భగవద్దూతల అభిప్రాయం.

# 9

హరినామ సంకీర్తనం అత్యద్భుతమైన ఫలాలను ప్రసాదిస్తుంది. కీర్తన చేసేవాని పాపాల చిట్టాను చూడవలసిన అవసరం దానికి లేదు. అని నిరూపిస్తున్నారు అజామీళుని తీసుకొనిపోవటానికి వచ్చిన యమభటులతో విష్ణుభక్తులు.

సీ. బ్రహ్మహత్యానేక పాపాటవుల కగ్ని కీలలు హరినామ కీర్తనములు
గురుతల్ప కల్మష క్రూరసర్పములకు గేకులు హరినామ కీర్తనములు
తపనీయ చౌర్య సంతమసంబునకు సూర్య కిరణముల్ హరినామ కీర్తనములు
మధుపాన కిల్బిష మదనాగ నమితికి కేసరుల్ హరినామ కీర్తనములు

మహిత యోగోగ్ర నిత్యసమాధి విధుల
నలరు బ్రహ్మాది సురులకు నందరాని
భూరి నిర్వాణసామ్రాజ్యభోగభాగ్య
ఖేలనంబులు హరినామ కీర్తనములు 6-117

యమభటులారా! ఈ విషయం మీరు సరిగా తెలుసుకోండి. బ్రహ్మహత్య మొదలైన ఘోరపాపాలనే కారడవులను కాల్చిపారవేసే అగ్నిజ్వాలలు హరినామ కీర్తనలు. తల్లులే అయిన గురుపత్నులను కామదృష్టితో చూచే విషసర్పాలకు నెమళ్ళు హరినామ కీర్తనములు. బంగారాన్ని దొంగిలించటం అనే కాఱుచీకటికి సూర్యుని కిరణాలు శ్రీహరికీర్తనలు. మద్యపానం అనేపాపం ఒక మదించిన ఏనుగులమంద అయితే దానికి సింహాలవుతాయి శ్రీహరినామ కీర్తనలు. మహాయోగవిద్యను అతికఠినియమాలతో అలవరచుకొని నిత్యసమాధి విధులతో ఆనందమందే బ్రహ్మ మొదలైన దేవతలు కూడా అందుకోలేని మోక్షసామ్రాజ్య భోగభాగ్యాలతోడి క్రీడలు హరినామ సంకీర్తనలు

## 10

నామజపం మహాపుణ్యప్రదం. విష్ణుభక్తులు యమభటులకు దానిని చక్కగా వివరిస్తున్నారు. అజామీళోపాఖ్యానంలోని ఒక అద్భుతమైన పద్యం ఇది.

**క. కామంబు, పుణ్యమార్గ, స్థేమంబు, మునీంద్ర సాంద్ర చేతస్సరసీ**
**ధామంబు, జిష్ణు నిర్మల, నామంబు దలంచువాడు నాథుడు గాడే ? 6-119**

యమభటులారా! శ్రీమహావిష్ణువునకు 'జిష్ణుడు' అని కూడా వ్యవహారం ఉన్నది. అంటే సర్వలోకాలలో సర్వదేశాలలో జయించటమే ఆయనశీలం. అట్టి మహాత్ముని మచ్చలేని నామాన్ని జపించటం అందరికీ కోరదగిన విషయం. పుణ్యాల మార్గంలో జపంచేసేవానిని జారిపోకుండా నిలుపుతుంది. మహర్షివరేణ్యు లందరూ తమ హృదయాలనే సరస్సులను దానికి దేవాలయంగా నిర్మించుకుంటారు. అట్టి నామాన్ని గట్టిగా భావించే పుణ్యాత్ముడు 'స్వామి' కాకుండాపోతాడా ?

## 11

భగవంతుని నామాన్ని ఏవిధంగా పలికినా పాపాలు పారిపోతాయి అని యమభటులకు విష్ణుభక్తులు వివరిస్తున్నారు.

**గీ. బిడ్డపేరు పెట్టి పిలుచుట, విశ్రామ**
**కేళి నైన, మిగుల గేలి నైన,**
**పద్య గద్య గీత భావార్థముల నైన**
**కమలనయను తలప కలుషహరము. 6-121**

అయ్యా! యమభటులారా! కొడుకునకు స్వామి పేరుపెట్టుకొని పిలవటమూ, తీరిక సమయాలలో ఆటలాడుకొంటూ కానీ, వేళాకోళానికి కానీ, పద్యాలలో, గద్యాలలో పాటలలో, కూనిరాగాలలో కానీ కమలాక్షుణ్ణి స్మరించటమూ పాపాలను రూపుమాపివేస్తుంది. కాగా నిష్ఠతో చేసే జపము మొదలైన వానిఫలం ఏ ఎత్తులో ఉంటుందో ఎవరు చెప్పగలరు ?

## 12

విష్ణుదూతలు యమదూతలకు పాపాలస్వభావాలను, వానికి పరిహారాలను, వానికి సంబంధించిన విశేషాలను బోధిస్తున్నారు. పరమపురుష పాదపద్మసేవవలన కలిగేసిద్ధిని కూడా తెలుపుతున్నారు.

**సీ. అతిపాపములకు ప్రయత్నపూర్వకముగ తనుపాపములకు మితంబుగాగ**
**సన్ముని వరులచే సంప్రోక్తమై యుండు నిర్మలం బగు పాప నిష్కృతములు**
**క్రమరూపమున నుపశమనంబు లగు గాని తత్క్షణంబున నవి దరువలేవు**
**సర్వకర్మంబుల సంహార మొనరించి చిత్తంబునకు తత్త్వ సిద్ధి నొసగు**

**ఒనర నీశుసేవ, యోగి మానస సరో**
**వాసుసేవ హేమవాసుసేవ,**
**వేదవేద్యుసేవ, వేదాంతవిభుసేవ**
**పరమపురుష పాదపద్మసేవ. 6-123**

యమభటులారా! అతిఘోరమైన మహాపాతకాలు బ్రహ్మహత్య మొదలైనవి ఉంటాయి. దానికి ఎంతో ప్రయత్నంచేసి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. చిన్నిచిన్ని పాపాలకు కొద్దిపాటి ప్రాయశ్చిత్తాలుంటాయి. ఈ అన్నింటినీ మహర్షులు లోకానికి చక్కగా చెప్పిఉన్నారు. వాని నాచరించి పాపాలను పోగొట్టుకొని మానవులు నిర్మలమానసులు కావాలి. అలా కావటం హఠాత్తుగా జరిగేపనికాదు. క్రమక్రమంగా, కాలం గడచినమీదట ఆ పాపాలు ఉపశమనం పొందుతాయి. కానీ యోగిహృదయపద్మాలే ఆలయం అయినవాడూ, పట్టుపుట్టాలు కట్టేమహాస్వామీ, వేదాలముఖంగానే తెలియదగిన ఆత్మస్వరూపుడూ, వేదాంతాలకు ప్రవర్తకుడూ, పరమపురుషుడూ అయిన వాసుదేవుని పాదసేవమాత్రం, అన్ని కర్మలనూ, వాని ఫలాలనూ అప్పటికప్పుడు రూపుమాపి చిత్తానికి తత్త్వసిద్ధిని కలిగిస్తుంది.

# 13

**అజామీళుని యమలోకానికి ఈడ్చుకొనిపోవటానికి వచ్చిన యమభటులు విష్ణుభక్తుల విమలవిచార వివేకవాక్యాలకు విస్మయం పొంది తమదారిని తాము వెళ్ళిపోయారు. అజామీళుడు వారి సంవాదమంతా విన్నాడు. తీవ్రమైన పశ్చాత్తాపంతో గాఢమైన పరితాపం పొందాడు. అతని హృదయంలో వైష్ణవ జ్ఞానదీపం చక్కగా వెలుగొందింది. ఇలా అనుకొన్నాడు.**

**క. హరిభక్తులతో మాటలు, ధర నెన్నడు జెడని పుణ్యధనముల మూటల్**
**వర ముక్తికాంత తేటలు, నరిషడ్వర్గంబు చొరని యరుదగు కోటల్ 6-152**

శ్రీ మహావిష్ణువునందు చెదరని భక్తికల మహాత్ముల మాటలు పుణ్యధనాల మూటలు. వానికి భూమిలో ఎన్నటికీ చేటు ఉండదు. ఎన్నిజన్మలకోగానీ అందుకోరాని మోక్షలక్ష్మి అనుగ్రహించే ప్రసన్నతలు. మనలోనే దొంగలవలె దూరి మనకొంపేముంచే కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము అనే ఆరుగురు పగవారికి ఆవంతైనా అవకాశం ఇవ్వని అద్భుతమైన కోటలు.

# 14

**పరమనికృష్టమైన బ్రదుకుబ్రదికి యమభటుల చిత్రహింసలకు గురికాబోయే పాపాత్ముడు అజామీళుడు మాటవరుసకు 'నారాయణా' అంటే వివేకవిజ్ఞానాలు కలిగి సద్యోముక్తి పొందాడు. ఇక సహజంగా సద్భక్తితో స్వామిని స్మరిస్తే దానిఫలం ఎట్టిదని చెప్పాలి అంటున్నారు శ్రీశుకులు.**

**క. కోరినవారల కెల్లను, జేరువ కైవల్యపదము, సిరివరుని మదిం**
**గోరనివారల కెల్లను, దూరము మోక్షాప్తి యెన్నిత్రోవల నైనన్ 6-158**

పరీక్షిన్మహారాజా! శ్రియఃపతి అయిన శ్రీనివాసుని బుద్ధిపూర్వకంగా సేవించేకోరిక ఉన్నవారికి కైవల్యపదం చేరువలోనే సిద్ధిస్తుంది. చావుపుట్టుకల చక్రంలో సుఖంలేకుండా తిరగుతూ ఉండటమే సంసారం. దానినుండి భగవదనుగ్రహం వలన బయటపడటమే కైవల్యం. అది కావాలి అనే కాంక్షలేనివారికి ఎన్ని పోకలుపోయినా మోక్షలాభం దూరమే అవుతుంది. అట్టివారికి వద్దనుకొనే దుఃఖం వద్దకు వస్తూనే ఉంటుంది.

# 15

**యమభటులు అజామీళుని విషయంలో అవమానంపొంది తమ ప్రభువుదగ్గరకుపోయి తమపాట్లు తెలుపుకున్నారు. స్వామీ! ఈ సృష్టిలో నీకంటె మించిన శాసకుడు మరొకడు ఉన్నాడా? అని అడిగారు. అప్పుడు యమధర్మరాజు శ్రీమహావిష్ణువును హృదయంలో నిలుపుకొని ఆయన మహామహిమను తనభటులకు హృద్యంగా బోధించాడు.**

**చ. అభవు, నమేయు, నవ్యయు, ననంతు, ననారతు పూని మేనిలో**
**నుభయము నై వెలుంగు పురుషోత్తము గానరు చిత్త కర్మ వా**
**గ్విభవ గరిష్ఠు లై వెదకి వీటిడి ప్రాణులు; సర్వవస్తువుల్**
**శుభగతి జూడనేర్చి తను జూడగనేరని కంటిపోలికన్. 6-171**

భటులారా! శ్రీమహావిష్ణువు పుట్టుకలేనివాడు. ఏ ఊహలకూ అందనివాడు. దేశకాలాదులు తెచ్చే ఎట్టిమార్పులకూ లోబడకుండా ఏకమైన ఆకృతితో ఉంటాడు. తుదీ, మొదలూ లేనివాడు. అనారతుడు. అంటే ఎక్కడా, ఎప్పుడూ తెరపిలేనివాడు. ఉండటమేతప్ప మఱియొక స్థితిలేనివాడు. అట్టివాడు మనదేహంలో కర్మఫలాలు అనుభవించే జీవుడూ, సాక్షిమాత్రంగా నిలిచిఉండే దేవుడుగానూ రెండు విధాలుగా ఉన్నాడు. అందువలననే ఆయనను పురుషోత్తముడంటారు. కానీ జీవులు ఆయనను చూడలేరు. మనస్సుతో, చేష్టతో, మాటతో శక్తిని పుష్కలంగా సంపాదించుకొని వెదకి కూడా విసిగివేసారిపోతారు కానీ తెలుసుకోలేరు. ఇది ఎటువంటిదంటే కన్ను చక్కనిచూపుతో సర్వవస్తువులను చూస్తుంది. కానీ తన్నుతాను చూచుకోలేదుగదా.

# 16

**యమధర్మరాజు తన దూతలకు శ్రీమహావిష్ణుతత్త్వం తెలుసుకోవటం సులభంకాదనీ మహాజ్ఞాన సంపన్నులైన కొందరు మాత్రమే ఆ యెఱుకకలవారనీ బోధిస్తున్నాడు.**

**సీ. వర మహాద్భుత మైన వైష్ణవజ్ఞానంబు తిరముగా నెవ్వరు తెలియగలరు ?**
**దేవాదిదేవుండు త్రిపురసంహరు డొండె, కమలసంభవు డొండె, కార్తి కేయ**
**కపిల నారదు లొండె, గంగాత్మజుం డొండె, మను వొండె, బలి యొండె, జనకు డొండె**
**ప్రహ్లాదు డొండె, నేర్పాటుగా శుకు డొండె, భాసురతరమతి వ్యాసు డొండె**

**కాక యన్యులతరమె? యీలోకమందు**
**నీ సుబోధంబు సద్బోధ మీ పదార్థ**
**మీ సదానంద చిన్మయ మీయగమ్య**
**మీవిశుద్ధంబు గుహ్యంబు నీశుభంబు 6-177**

అది చాలాగొప్పది. అద్భుతమైనది. అటువంటి విష్ణుసంబంధమైన జ్ఞానాన్ని చెదరిపోకుండా హృదయంలో నిలుపుకోగలవారు కొందఱు మాత్రమే ఉన్నారు. అందులో మొట్టమొదటగా చెప్పుకోవలసినవాడు దేవతలకు కూడా ఆదిదేవుడైన పరమేశ్వరుడు. ఆయన త్రిపురాసురులకు సంహరించినవాడు. తరువాత విష్ణువు నాభిలో వెలుగొందుతున్న కమలంనుండి పుట్టిన నాలుగుమోముల దేవర. అటు పిమ్మట చెప్పుకోదగినవాడు కుమారస్వామి. ఆయన ఆరుమొగాల అద్భుతదైవం. పిమ్మట వచ్చేవారు కపిలమహర్షి,

నారదమహర్షి. ఇంక భూమికి దిగివస్తే గంగ కొడుకు భీష్ముడు, మనువు, బలిచక్రవర్తి, జనకమహారాజు, ప్రహ్లాదుడు, శుకుడూ, వ్యాసులవారూ. ఈ పన్నెండుగురకు తప్ప ఇతరులకు తెలియదు. ఇది చక్కని తెలివి. చక్కని ఉపదేశం. మంచి వస్తువు. ఇది సదానందం. జ్ఞానమయమైనది. ఒకపట్టాన పొందనలవి కానిది. పరమశుద్ధ మైనది. గొప్పరహస్యం. మంగళకరం.

# 17

**భావం దృఢంగా కుదురుకోవటానికి యమధర్మరాజు ఆవిషయాన్నే మళ్ళీ బోధిస్తున్నాడు.**

**క. ఈ పన్నిద్దఱు తక్కగ, నోపరు త క్కొరులు తెలియ నుపనిష దుచిత**
**శ్రీపతినామ మహాద్భుత, దీపిత భాగవతధర్మ దివ్యక్రమమున్ 6-178**

ఇది పరమాత్మజ్ఞానాన్ని ప్రసన్నంగా మూలముట్టుగా బోధించే ఉపనిషత్తులో నెలకొన్న తత్త్వం. లక్ష్మీనాధుని నామజపానికి సంబంధించిన మహాద్భుతమైనదీ, ప్రకాశించేదీ అయిన భాగవత ధర్మపు దివ్యక్రమం. దీనిని ఇప్పుడు చెప్పుకొన్న పరమశివుడు, బ్రహ్మదేవుడు, కుమారస్వామి, కపిలుడు, నారదుడు, భీష్ముడు, మనువు, బలిచక్రవర్తి, జనకమహారాజు, ప్రహ్లాదుడు, శుకుడు, వ్యాసుడు అనే పన్నెండుగురు తప్ప ఇతరులు తెలియజాలరు.

# 18

**యముడు తన దూతలకు హరికీర్తనమును గురించి యింకా ఇలా తెలియజేస్తున్నాడు.**

**తే. ఏది జపియింప నమృత మై యెసగుచుండు**
**నేది సద్ధర్మపథ మని యెఱుగ దగిన**
**దదియె సద్భక్తి యోగంబు నలవరించు**
**మూర్తిమంతంబు దా హరికీర్తనంబు 6-179**

హరినామాన్ని జపిస్తే అది అమృతమై విరాజిల్లుతుంది. పరమాత్ముని ధర్మమార్గం ఇదే అని తెలియ దగినది హరికీర్తనమే. అదే సద్భక్తి యోగాన్ని అలవాటు చేస్తుంది. అది భక్తియోగానికి ఏర్పడిన ఆకారం.

# 19

**యమధర్మరాజు తన భటులకు భగవంతునియందు నిండుగా భక్తి ఉన్నవారి గొప్పతనాన్ని చాలాగొప్పగా అభివర్ణిస్తున్నాడు.**

**సీ. శ్రుత్యంత విశ్రాంత మత్యనుక్రమణీయ భగవ త్ప్రసంగతుల్ భాగవతులు**
**సనకాదిముని యోగిజన సదానందైక పరమ భాగ్యోదయుల్ భాగవతులు**
**కృష్ణపద ధ్యాన కేవలామృతపాన పరిణామ యుతులు శ్రీభాగవతులు**
**బహుపాత కానీక పరిభవ ప్రక్రియా పరుషోగ్ర మూర్తులు భాగవతులు**

**భావతత్త్వార్థవేదులు భాగవతులు**
**బ్రహ్మవాదానువాదులు భాగవతులు**
**సిరులు దనరంగ నెన్నడు చేటులేని**
**పదవి నొప్పారువారు వో భాగవతులు 6-186**

ఉపనిషత్తులు భగవత్తత్త్వాన్ని చాలా స్పష్టంగా వివరిస్తాయి. భాగవతుల ప్రసంగాలు ఉపనిషద్ జ్ఞానాన్ని అనుసరించి మాత్రమే వెలుగొందుతూ ఉంటాయి. జ్ఞానమూర్తులైన సనకుడు మొదలైన మునులూ, యోగి జనులూ పొందే సదానందపరమభాగ్యమై ఒప్పారే మహాత్ములు భాగవతులు. శ్రీకృష్ణుని పాదాలధ్యానం అనే సాటిలేని అమృతాన్ని త్రావటంచేత పాకానికివచ్చిన అంతరంగం కలవారు భాగవతులు. పెక్కువిధాలైన పాతకాల సేనలకు పరాభవం చేయటంలో అతికఠినమైన ఆకృతులు కలవారు భాగవతులు. పరమాత్మ తత్త్వాన్ని బాగుగా తెలిసినవారు భాగవతులు. బ్రహ్మమును గూర్చిన పలుకులను అనుసరించి పలికేవారు భాగవతులు. ఐశ్వర్యం అంబరమంటి, ఎప్పుడూ చేటులేని స్థానాలలో ప్రకాశించేవారు భాగవతులు.

# 20

**యమదూతలకు యమధర్మరాజు విష్ణుభక్తిలేని వారిని తీసుకొనిరావలసినదిగా ఆజ్ఞాపిస్తున్నాడు. అజామీళుని అద్భుతగాథలోని పద్యం ఇది.**

**సీ. ఎకసక్కెమునకైన నిందిరారమణుని బలుకంగలేని దుర్భాషితులను**
**కలలోన నైన శ్రీకాంతుని సత్పాద కమలముల్ సూడని కర్మరతుల**
**నవ్వుచునైన కృష్ణప్రశంసకు చెవి దార్పనేరని దుష్కథా ప్రవణుల**
**యాత్రోత్సవంబుల నైన నీశుని గుడిత్రోవ ద్రొక్కగలేని దుష్పదులను**

**పరమభాగవతుల పాదధూళి సమస్త**
**తీర్థసారమనుచు తెలియలేని**
**వారి వారివారి వారిజేరినవారి**
**తొలుత గట్టి తెండు దూతలార. 6-188**

దూతలారా! వేళాకోళానికైనా ఇందిరారమణునిపేరు పలుకలేని పాడుకూతలవారినీ, కలలోనైనా శ్రీపతి శ్రీపాదకమలాలను చూడని పాడుచేతలవారినీ, నవ్వులాటలోనైనా శ్రీకృష్ణుని ప్రశంసకు చెవులొగ్గని పాడుకథల పాండిత్యం కలవారినీ, యాత్రలో జరిగే పండుగలలోనైనా పరమేశ్వరుని ఆలయం దారిని త్రొక్కలేని పాడు పాదాలవారినీ, భగవంతుని మహాభక్తుల పాదధూళి మహాతీర్థాలన్నింటిసారం అని తెలిసికోలేని పాడుతెలివి వారినీ, వారివారినీ, వారిని చేరినవారినీ మొట్టమొదటగా కట్టి నాదగ్గరకు తీసుకొనిరండి.

# 21

**భగవద్భక్తులు కాని వారి దౌర్భాగ్యజీవితాన్ని యమధర్మరాజు వెక్కిరింతగా కక్కసించుకుంటున్నాడు.**

**తే. అరయ దనదు జిహ్వ హరిపేరు నుడువదు**
**చిత్త మతని పాదచింత జనదు**
**తలప దమకు ముక్తి తంగేటి జున్నొకో ?**
**సకల విష్ణుభక్తులకును బోలె 6-190**

తన నాలుక ఒక్కమారైనా హరిపేరును పలుకదు. చిత్తం శ్రీపతిపాదాలను పొరపాటున కూడా భావించదు. కానీ నిరంతరం నామజపం, హరిధ్యానం చేసేవారికి లాగా ముక్తి అనే తంగేటిజున్ను కావాలంటాడు బుద్ధిహీనుడు. ఇంతకంటె మూర్ఖత్వం ఏముంటుంది ? ఏమాత్రమూ వివేకంలేనివాని తీరు ఇలా ఉంటుంది.

# 22

**నా భటులారా! మీకొక హెచ్చరిక. శ్రద్ధగా వినండి అంటున్నాడు ధర్మమూర్తి సమవర్తి అయిన యమధర్మరాజు.**

**ఆ.  పద్మనయను మీది భక్తి యోగం బెల్ల**
**ముక్తి యోగ మనుచు మొద లెఱుంగు**
**వారి, వారివారి, వారి జేరినవారి**
**త్రోవ బోవవలదు దూతలార !  6-191**

జీవులు మరణించే సమయంలో మనలోకాలకు రావలసినవారెవరో, రాగూడని వారెవరో వివేకంతో గమనించండి. ఆ పద్మపత్రాలవంటి అందాలు చిందించే అద్భుతమైన కన్నులుగల శ్రీ మహావిష్ణువునందు చెదరని భక్తి ఉండటమే ముక్తియోగం. ఆ జ్ఞానం ఉన్నవారూ, వారివారూ, వారిని చేరినవారూ పోయిన దారిలో కూడా మీరు పోరాదు.

# 23

**అజామీళుని కథ వింటున్న పరీక్షిన్మహారాజునకు హృదయం పరవశించిపోతున్నది. మెల్లగా తేరుకొని శ్రీశుకులవారిని మరొక విషయం అడుగుతున్నాడు.**

**క.  స్వాయంభువ మనువేళల, నో యయ్య ! సురాసు రాండ జోరగ నర వ**
**ర్గాయత సర్గము దెలిపితి, పాయక యది విస్తరించి పలుకం గదవే !  6-193**

స్వామీ! జ్ఞానమూర్తీ! శుకమహర్షీ! ఇంతకుపూర్వం నీవు స్వాయంభువమన్వంతరంలో ఉన్న దేవతలను, రాక్షసులను, పక్షులను, పాములను, నరులను ఇంకా తక్కినజాతులను, వారికి సంబంధించిన సృష్టినీ గురించి చెప్పావు. దానిని మఱికొంత విస్తరించి చెప్పు మహాత్మా !

# 24

**ఒకప్పుడు ప్రచేతసుని కుమారులు ప్రాచీనబర్హి మొదలైన పదిమంది సముద్రంనుండి భూమిమీదకు వచ్చారు. భూమి అంతా చెట్లతోనిండి ఉన్నది. అది చూచినవారికి ఒళ్ళుమండింది. ముఖాలనుండి గొప్ప గాలితో కూడిన అగ్నిని పుట్టించి చెట్లను కాల్చివేస్తున్నారు. అప్పుడు చంద్రుడు అది గమనించి యిలా అంటున్నాడు.**

**ఉ.  తప్పక యర్భకావళికి తల్లియు దండ్రియు, నేత్రపంక్తికిన్**
**ఱెప్పలు, నాతికిం బతి, నరేంద్రుడు లోకుల కెల్ల, నర్థికి**
**న్నొప్ప గృహస్థు, మూఢులకు నుత్తము లెన్నగ వీరు బంధువుల్**
**ముప్పున గావలేని కడుమూర్ఖులు గారు నిజాల బంధువుల్  6-200**

పుణ్యాత్ములారా! పసిపిల్లలకు అమ్మానాన్నలు, కన్నులకు రెప్పలు, నాతికి పతి, లోకులందరికీ రాజూ, అడుగుకొనేవారికి గృహస్వామీ, మూఢులకు ఉత్తములూ నిజమైన చుట్టాలయ్యా! మనకు కీడు మూడినపుడు రక్షింపలేని మూర్ఖులు కారు. ఈ చెట్లు నిజమైన బంధువులు. ఎవరైనా ప్రేమనిండారిన తమవారిని తగుల బెట్టుకోవాలనుకుంటారా?

## 25

శ్రీమహాభాగవతంలో భక్తులను పదిలంగా కాపాడే మహామంత్రాలవంటి సందర్భాలు కొన్ని ఉన్నాయి. అందులో శ్రీమన్నారాయణ కవచం ఒకటి. జనమేజయునికి శ్రీశుకయోగీంద్రులు పరమాదరంతో బోధించిన ఆ కవచంలోని ఒక అంశం ఇది.

**చ. గరుడుని మూపుపై పదయుగంబు ఘటిల్లగ శంఖ చక్ర చ**
**ర్మ రుచిరశార్ఙ్గ ఖడ్గ శర రాజితపాశ గదాది సాధనో**
**త్కర నికరంబు లాత్మకరకంజములం ధరియించి భూతిసం**
**భరిత మహాష్టబాహుడు కృపామతితో నను గాచు గావుతన్ 6-300**

శ్రీమహావిష్ణుదేవుడు వేదాత్మకుడైన గరుత్మంతుని మూపుమీద పాదాలు రెండూ చక్కగా నెలకొల్పి ఆసీనుడైయున్నాడు. అప్పటి ఆస్వామి హస్తాలు ఎనిమిది. వానిలో శంఖము, చక్రము, డాలు, వెలుగులు విప్పారజేసేవిల్లు శారఙ్గము, నందకమనేఖడ్గము, బాణాలు, పాశము, గద మొదలైన సాధనాలు అమరిఉన్నాయి. అవి మహాబాహువులు కనుక ఎన్నింటికైనా ఏవిధంగానైనా పట్టుకోగలవు. అదేవానివైభవం. అటువంటి శ్రీమహావిష్ణువు దయార్ద్రహృదయుడై నన్నుకాపాడుగాక!

## 26

శ్రీమన్నారాయణ కవచంలోనిదే మరొకప్రార్థన. జనుడు ఎప్పుడూ ఒక్కచోటనే ఉండడుకదా! ఎక్కడెక్కడో, ఏవేవో పనులమీద తిరుగుతూ ఉంటాడు. ఒకవేళ అతడు జలాలలో విహరిస్తూ ఉంటే కాపాడవలసివస్తే ఎలా ప్రార్థన చేయాలో తెలుపుతున్నారు.

**ఆ. ప్రకట మకర వరుణ పాశంబులందుల**
**జలములందు నెందు బొలియకుండ**
**గాచుగాక నన్ను ఘను డొక్కడైనట్టి**
**మత్స్యమూర్తి విద్యమానకీర్తి 6-301**

ఆ దేవాదిదేవుడు అన్నివిధాలైన జీవులనూ కంటికి రెప్పఅయి కాపాడటానికి అనేక అవతారాలు ఎత్తాడు. అందులో మత్స్యావతారం ఒకటి. అది మహోదాత్తమహాకార్యాలు చేసి మహాకీర్తితో వెలుగొందుతున్నది. ఆ అవతారం పొందిన ఆస్వామి నన్ను మొసళ్లు, మహాభయంకరమైన వరుణపాశాలూ గల కల జలాలలో ఎక్కడా ఏ ప్రమాదానికీ లోనుకాకుండా నన్ను రక్షించుగాక. రక్షిస్తాడు ఎందుకంటే ఆయన అందరికంటె, అన్నింటికంటె ఘనమైనవాడు. ఇంకెవరినీ ప్రార్థించి ప్రయోజనంలేదు. ఎందుకంటే ఆయన ఒక్కడే సర్వరక్షకుడు.

## 27

జీవుడు స్థలంమీద తిరుగుతూ ఉన్నప్పుడు కూడా కాపాడవలసినది ఆ దేవదేవుడే. అది తెలిసికొని ప్రార్థించమంటున్నది శ్రీమన్నారాయణ కవచంలోని యీపద్యం.

**క. నటుడు సమాశ్రిత మాయా, నటుడు బలి ప్రబల శోభన ప్రతిఘటనో**
**ద్భటుడు త్రివిక్రమదేవుడు, చటుల స్థలమందు నన్ను సంరక్షించున్ 6-302**

స్వామి గొప్పనటుడు. లోకరక్షకుడు ఏవేషం అవసరమయితే ఆవేషం వేసుకొని ఆవిధమైన మహిమను ప్రదర్శింపగలవాడు. ప్రపంచాన్నంతా త్రిప్పుతున్న మహామాయ ఆయనను చక్కగా ఆశ్రయించుకొని తన పనితాను చేస్తున్నది. బలిచక్రవర్తి గొప్పబలానికి చాలా అందమైనవిధంగా ప్రతిక్రియ చేసిన మహాశక్తిడ సంపన్నుడు. మొదటవామనుడై అలాఅలా బ్రహ్మాండాంతందాకా పెరిగిన త్రివిక్రమదేవుడు. అట్టి ముప్పోకల పోయిన ముకుందుడు నన్ను నేలనెలవులమీద చక్కగా కాపాడుగాక!

# 28

**ప్రాణికి ప్రాణభయం కలిగే తావులన్నింటిలో ఆమహాస్వామి శ్రీనృసింహమూర్తియై కాపాడుగాక! అని ప్రార్థించమంటున్నది శ్రీమన్నారాయణ కవచం.**

**చ. అడవుల, సంకటస్థలుల, నాజిముఖంబుల, నగ్నికీలలం**
**దెదరుల నెల్ల నాకు నుతి కెక్కగ దిక్కగుగాక శ్రీనృసిం**
**హుడు కనకాక్ష రాక్షస వధోగ్రుడు విస్ఫురి తాట్టహాస వ**
**క్త్రుడు ఘన దంష్ట్రపావక విధూత దిగంతరు డప్రమేయు డై 6-303**

అడవులలో, ఆపదలుమూడిన ఘోరప్రదేశాలలో, యుద్ధరంగాలలో, అగ్నికీలలలో, ఇంకా విపత్తులు చుట్టుముట్టిన సమయాలలో నాకు ఆస్వామి దిక్కయి నిలుచుగాక. ఆయన నరసింహస్వామి. హిరణ్యాక్షుడనే భయంకర రాక్షసుని వధించిన ఉగ్రమూర్తి. దిక్కులదరిపోయే అట్టహాస ధ్వనులను వెలువరించే వదనం కలవాడు. చాలా గొప్పవైన కోరలనే అగ్నిజ్వాలలతో దిగంతాలను కూడా దూరదూరతీరాలకు చెదరగొట్టిన మహానుభావుడు. ఎవ్వరికీ, ఏ కొలతలకూ అందని అప్రమేయుడు.

# 29

**మానవుడు బ్రదుకుబాటలో ఎన్నోబాటలలో పయనించవలసివస్తున్నది. అనుక్షణం అచ్యుతుని అండదండలుంటేకానీ అడుగైనా ముందుకు పడదు. అందువలన ఆ అచ్యుతుడు ఆదివరాహరూపంలో అడుగడుగునా కాపాడుగాక అని ప్రార్థించమంటున్నది శ్రీనారాయణ కవచం.**

**చ. అరయగ నెల్లలోకములు నంకిలి నొంద మహార్ణవంబులో**
**నొరగి నిమగ్నమైన ధర నుద్ధతి గొమ్మున నెత్తినట్టి యా**
**కిరిపతి, యజ్ఞకల్పు, డురుఖేలుడు నూర్జిత మేదినీమనో**
**హరుడు, కృపావిధేయుడు సదాధ్వముల న్నను గాచు గావుతన్ 6-304**

లోకాలన్నీ తల్లడిల్లిపోతున్నాయి. భూదేవి రక్కసుని ఉక్కుకోరలలో చిక్కుకొని మహాసముద్రంలో ఒరిగి మునిగిపోయింది. శ్రీమహావిష్ణువు ఒక్కపెట్టున ఆదివరాహమూర్తియై, యజ్ఞస్వరూపం కల్పించుకొని, గొప్ప ఆటగా తనకొమ్ముతో ఆమెను ఉద్ధరించాడు. భూదేవి హృదయాన్ని కొల్లగొట్టాడు. సర్వలోక వాసులందరియందు జాలువారే కరుణతో అలరారేవాడు. అట్టిస్వామి నేను పోయేదారులన్నింటిలో నన్ను కాపాడుగాక!

## 30

**నేను ఏ కొండకొమ్ములందో తిరుగవలసివస్తుంది. కొండకొమ్ములంటే ఘోరమైన ఆపదలు. అక్కడ నాకు సంభవించే ఆపదలనుండి నన్నుకాపాడే స్వామి ఆ భార్గవరాముడే.**

**క. రాముడు, రాజకులైక వి, రాముడు, భృగు సత్కులాభిరాముడు, సుగుణ**
**స్తోముడు, నను రక్షించును, శ్రీమహితోన్నతుడు నద్రిశిఖరములందున్ 6-305**

ఆయన రాముడు. యోగులందరికీ ఆనందమందించే మనోహరుడు. లోకకంటకులైన నీచక్షత్రియులను వెదకివెదకి ఇరవై యొక్కమారులు సంహరించిన దుష్టశిక్షకుడు. భృగుమహర్షి వంశానికి ఆనందం కలిగించిన మహాత్ముడు. గొప్పగుణాలన్నీ ఆయనను ఆశ్రయించి ప్రమోదం పొందాయి. శౌర్యలక్ష్మికి ఆటపట్టయి ఉన్నతశిఖరాలందుకొన్న ఆ పరశురాముడు పర్వతశిఖరాలమీద నన్ను పరిరక్షించాలి.

## 31

**దుష్టశిక్షణకోసం, శిష్టరక్షణకోసం, ధర్మస్థాపనకోసం తన మహావైభవాన్నంతా తగ్గించుకొని మానవుడై అవతరించి మహాద్భుతకార్యాలు ఆచరించిన దశరథ మహారాజు తనయుణ్ణి ప్రార్థించి పరదేశాలలో సంభవించే పాటులనుండి కాపాడుకోమంటున్నది శ్రీ నారాయణ కవచం.**

**సీ. తాటక మర్దించి తపసి జన్నము గాచి హరువిల్లు విఱిచి ధైర్యమున మెఱసి**
**ప్రబలు లైనట్టి విరాధ కబంధోగ్ర ఖరదూషణాది రాక్షసుల దునిమి**
**వానరవిభు నేలి వాలి గూలగ నేసి జలరాశి గర్వంబు జక్కజేసి**
**సేతువు బంధించి చేరి రావణ కుంభకర్ణాది వీరుల గడిమి ద్రుంచి**

**అలవిభీషణు లంకకు నధిపుజేసి**
**భూమిసుత గూడి సాకేతపురమునందు**
**రాజ్యసుఖములు గైకొన్న రామవిభుడు**
**వరుస నను ప్రోచుచుండు ప్రవాసగతుల. 6-306**

శ్రీరామచంద్రుడు పసితనంలోనే కరకురక్కసి తాటకను సంహరించాడు. తాపసి అయిన విశ్వామిత్రుని యజ్ఞాన్ని రక్షించాడు. శివుని విల్లు ఫెళ్ళున విరిచి సీతమ్మను చేపట్టాడు. ధైర్యంతో విజృంభించి మహాబలవంతులైన విరాధుడు, కబంధుడు, ఖరుడు, దూషణుడు మొదలైన రాక్షసులను రాచి రంపాన పెట్టాడు. కోతుల ఏలిక అయిన సుగ్రీవుణ్ణి ఏలుకున్నాడు. వాలినొక్క కోలతో కూలనేశాడు. లంకకు చేరుకోవటానికి దారి ఇవ్వకపోతే సముద్రాన్ని గడగడలాడించాడు. సాగరానికి సేతువుకట్టాడు. లంకకు చేరుకొని రావణుడు, కుంభకర్ణుడు మొదలైన క్రూరాత్ములను క్రుళ్ళబొడిచి చంపివేశాడు. రాక్షసుడైనా ఉత్తమగుణాలు గల విభీషణుణ్ణి లంకకు రాజుగా చేశాడు. భూదేవి ముద్దుబిడ్డ అయిన జానకితో కూడుకొని సాకేతపురంలో జనరంజకంగా రాజ్యమేలాడు. అటువంటి రామభద్రుడు నన్ను పరసీమలలో పరిరక్షించుగాక!

## 32

**వృత్రాసురుడు దేవతలపాలిట తోకచుక్క అయి వారిని కాల్చుకుతింటున్నాడు. అతని బాధలకు తాళలేని ఇంద్రుడు మొదలైన దేవతలు శ్రీ మహావిష్ణువునకు మొరపెట్టుకున్నారు. ఆయన అనుగ్రహబుద్ధితో వారికి దర్శనం అనుగ్రహించాడు. వారు ఆయనను ఇలా స్తుతిస్తున్నారు.**

**సీ. దండంబు యోగీంద్రమండల నుతునకు దండంబు శార్ఙకోదండునకును**
**దండంబు మండిత కుండలద్వయునకు దండంబు నిష్ఠుర భండనునకు**
**దండంబు మత్తవేదండ రక్షకునకు దండంబు రాక్షసఖండనునకు**
**దండంబు పూర్ణేందుమండల ముఖునకు దండంబు తేజః ప్రచండునకును**

**దండ మద్భుత పుణ్య ప్రధానునకును**
**దండ ముత్తమ వైకుంఠధామునకును**
**దండ మాశ్రితరక్షణ తత్పరునకు**
**దండ మురుభోగినాయక తల్పునకును 6-336**

మహాయోగుల మండలమంతా గొంతెత్తి నీగుణగణాలను నుతిస్తూ ఉంటుంది. అట్టినీకు దండం. 'శారం' అనే గొప్పకోదండంతో దుష్టలను దండించే దండిమగనికి నీకు దండం. అత్యద్భుత ప్రభలను వెదజల్లే కుండలాలజంటతో అలరారే స్వామికి దండం. అతిఘోరమైన పోరులలో ఆరితేరిన అయ్యకు దండం. మదించిన గొప్పగజేంద్రుణ్ణి కాపాడిన కరుణామయునికి దండం. రాక్షసులను ముక్కలుముక్కలుగా నరికిపోగులుపెట్టే స్వామికి దండం. నిండుజాబిల్లివంటి నెమ్మోముతో విరాజిల్లే సుందరమూర్తికి దండం. ఎట్టివారికైనా తట్టుకోరాని తేజస్సుతో అతితీవ్రంగా ప్రకాశించే అద్భుతమూర్తికి దండం. అద్భుతమైన పుణ్యం ప్రధానమై భాసిల్లే స్వామికి దండం. ఉత్తమమైన వైకుంఠం మందిరమైన మాధవునకు దండం. ఆశ్రయించిన వారిని రక్షించటానికి ఆరాటపడే దయామూర్తికి దండం. వేయిపడగలలో విరాజిల్లే ఆదిశేషునిపై పవ్వళించే పరమాత్మకు దండం.

## 33

**వృత్రాసురుడుపెట్టే చిత్రహింసలకు తట్టుకోలేని దేవతలు మొరపెట్టుకుంటున్నారు. కాపాడవలసినదిగా శ్రీవాసుదేవునికి విన్నవించుకుంటున్నారు.**

**తే. అకట! దిక్కుల కెల్ల దిక్కైన మాకు**
**నొక్క దిక్కును లేదు కా లూన నైన**
**దిక్కు గావయ్య ! నేడు మా దిక్కు జూచి**
**దిక్కు లేకున్నవారల దిక్కు నీవ 6-339**

దేవా! మేము దిక్కులన్నింటికీ పాలకులం. కానీ స్వామీ మేము కాలుపెట్టటానికైనా దిక్కులేని వారమైనాము. నేడు మాదిక్కుచూచి మమ్ములను కాపాడు. దిక్కులేనివారలకు దిక్కు నీవేకదా!

## 34

**వైకుంఠవాసునకు దిక్పాలకులైన దేవతలు మొరపెట్టుకుంటున్నారు. వృత్రాసురుని చిత్రహింసల నుండి సంరక్షించే బాధ్యత నీదే అంటున్నారు.**

**క. నీ దిక్కు గానివారికి, నే దిక్కును వెదక నుండ దిహపరములకున్**
**మోదింప దలచువారికి, నీదిక్కే దిక్కు సుమ్ము! నీరజనాభా ! 6-340**

పద్మనాభా! నీవైపు చూపుపెట్టనివారికి ఎంతవెదకినా ఎక్కడవెదికినా ఈలోకంలోనయినా, పరలోకంలో నయినా ఏదిక్కూ ఉండదు. ప్రమోదం పొందాలనుకునేవారికి నీదిక్కే దిక్కుసుమా! కనుక మమ్మందరినీ ఆదుకొనే ఆదిదేవా! అసురమర్దనా! కాపాడు. కాపాడు. కాపాడు.

# సప్తమ స్కంధం

## 1

పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రునితో ఇలా అన్నాడు. 'మహానుభావా! సర్వభూతాలకూ సముడైన నారాయణుడు ఇంద్రునికోసం రక్కసులను వెదకివెదకి ఎందుకు చంపాడు? అలా చంపితే దేవతలవలన తనకేమైనా ప్రయోజనం ఉందా? నిర్గుణుడైన అతనికి రక్కసులవలన కలిగే భయమేమైనా ఉన్నదా? చూడగా ఇదంతా చాలా ఆశ్చర్యంగా ఉన్నది. దీనిని గురించి నీ ప్రజ్ఞంతా ఉపయోగించి నాకు సమాధానం చెప్పు. అప్పుడు శుకమహర్షి ఇలా అన్నాడు.

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతా లవిత్రంబులు స**
**న్మిత్రంబులు మునిజనవన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్** 7.6

రాజా! నీప్రశ్న చాలా కొనియాడదగినది. శ్రీమన్నారాయణుని సచ్చరిత్రం మహాచిత్రమైనది. ఆవిష్ణుదేవుని చరిత్రలు చాలా చిత్రమైనవి. మూడులోకాలనూ పవిత్రం చేస్తాయి. సంసారమనే తీగలకు అవి కొడవండ్లు. సజ్జనులకు నెచ్చెలులు. మహర్షుల సముదాయాలనే పూదోటలను విరియబూయించే చైత్రమాసాలు. వసంతంలో చెట్లన్నీ క్రొత్తచిగురాకులతో, పూలతో కళాకాంతులతో ఒప్పారుతాయి కదా!

## 2

శ్రీశుకులు శ్రీమన్నారాయణుని దివ్యలీలలను వినిపిస్తున్నాడు. రాజా! విష్ణునికి రాగద్వేషాలు లేవు. ఆయన కొట్టినా తిట్టినా అది అనుగ్రహమే. ఈవిషయాన్ని మునుపు నారదమహర్షి రాజసూయయాగ సందర్భంలో ధర్మరాజునకు చక్కగా తెలియజెప్పాడు. ఆ మాటలను నీవు ఆలకించు.

**అలుకనైన చెలిమినైన కామంబున**
**నైన బాంధవమున నైన భీతి**
**నైన తగిలి తలప నఖిలాత్ముడగు హరి**
**జేరవచ్చు వేఱుసేయ డతడు** 7.14

నాయనా! ధర్మరాజా! శ్రీమహావిష్ణువుతో వ్యవహారం లోకంలో లోకులతో అయ్యేవ్యవహారం వంటిదికాదు. కోపంతోనైనా, చెలిమితోనైనా, చుట్టరికంతోనైనా, భయంతోనైనా ఆమహాత్ముణ్ణి అంటిపెట్టుకొని తలపోస్తూ ఉండాలి. దీనినే ఎడతెగనిధ్యానం అంటారు. దానిలో, కోపతాపాలేస్థాయిలో ఎంతగా ఉన్నా మనస్సూ, మాటా, చేష్టా మాధవుని మీదనే ఉంటాయి. అప్పుడు హరి అటువంటివానిని తనలో చేర్చుకుంటాడు. ఆయన సర్వమూ తానే అయినవాడుకదా! కాబట్టి కోపతాపాలను తనపై చూపినదానిని కూడా వేరుచేయడు.

## 3

నారదుడు ధర్మరాజునకు వేరువేరుభావాలతో శ్రీమహావిష్ణువును ఎలా ఆరాధించాలో దృష్టాంతాలతో వివరిస్తున్నాడు. లోకవ్యవహారంలో మంచిచెడు అనేవి ఉంటాయి. భగవంతునిపరంగా ఏదీ దోషాలతో కూడుకున్నది కాదు. చూడు అంటున్నాడు.

**కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైరక్రియా**
**సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్, సంబంధులై వృష్ణులున్,**
**ప్రేమన్ మీరలు, భక్తి నేము, నిదె చక్రిం గంటి మెట్లైనను**
**ధ్ధ్యానమధ్యాన గరిష్ఠుడైన హరి చెందన్ వచ్చు ధాత్రీశ్వరా !**

మహారాజా! యుధిష్ఠిరా! పొంగిపొరలిన కామంతో గోపికలూ, భయంతో కంసుడూ, పగపెట్టుకొని దానికి కావలసిన వస్తువులను కూర్చుకొని శిశుపాలుడు మొదలైనరాజులు, చుట్టరికంతో వృష్ణివంశంవారూ, నెయ్యంతో మీరూ, భక్తితో మేమూ ఇదిగో అద్భుతమైన చక్రంచేత పట్టుకొన్న నారాయణుని కనుగొనగలిగాము. ఉపాయం ఎట్టిదైనా కావలసినది చాలాహెచ్చుస్థాయికి చెందిన ధ్యానం. అది మహోజ్జ్వలంగా ఉంటే శ్రీహరి అటువంటి తనబిడ్డలను అక్కున చేర్చుకుంటాడు.

# 4

**రక్కసులరేడు హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుని గురించి చాలాఘోరమైన తపస్సు చేశాడు. బ్రహ్మకు అతని ఘోరతపస్సు చాలాతృప్తిని కలిగించింది. అతనికి సాక్షాత్కరించాడు. నాయనా! దేహాన్ని పురుగులు తొలచివేస్తున్నా లెక్కచేయక తపస్సు చేశావు. నీకోరికలన్నీ తీరుస్తాను అడుగు అన్నాడు. హిరణ్యకశిపుడు పొంగులెత్తిన ఆనందంతో బ్రహ్మను కొనియాడి చివరకు తనకోరికను ఇలా అడిగాడు.**

**గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్**
**రేలన్ ఘస్రములన్ తమఃప్రభల భూరిగ్రాహ రక్షోమృగ**
**వ్యాళాదిత్య నరాదిజంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ**
**స్త్రాళిన్ మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పింపవే.** 7.90

స్వామీ! సర్వలోకాలకు ప్రభూ! గాలిలో, నేలలో, నిప్పులో, నీటిలో, నింగిలో, దిక్కులలో, రాత్రులలో, పగళ్ళలో, చీకట్లలో, వెలుగులలో, గొప్పగొప్ప దేహాలు గల మొసళ్ళు, రక్షస్సులు, క్రూరమృగాలు, పెనుబాములు, దేవతలు, నరులు మొదలైన ప్రాణులతో సంభవించే పెనుయుద్ధాలలో అన్నివిధాలైన అస్త్రాలతో శస్త్రాలతో, ఇంకాపెక్కువిధాలైన ఆయుధాలతో చావులేని బ్రదుకు నాకు అనుగ్రహించవయ్యా!

# 5

**హిరణ్యకశిపుని కోరికను తీరికగా ఆలకించాడు సృష్టికర్త బ్రహ్మ. అతడు చావుద్వారాలన్నీ మూసివేశాననుకున్నాడు. ఏదో ఒకసందు ఉండకపోదనుకున్నాడు బ్రహ్మ. నెమ్మదితో నీకోరికను తీర్చానన్నాడు. కరుణతో అతనితో ఇలా పలికాడు.**

**అన్నా! కశ్యపపుత్ర! దుర్లభము లీ యర్థంబు లెవ్వారికిన్**
**మున్నెవ్వారలు కోరరీ వరములన్ మోదించితి న్నీయెడన్**
**నన్నుం గోరినవెల్ల నిచ్చితి ప్రవీణత్వంబుతో బుద్ధి సం**
**పన్నత్వంబున నుండుమీ! సుమతివై భద్రైకశీలుండవై** 7.92

అన్నా! కశ్యపమహర్షి కుమారా! ఎటువంటివారికైనా ఈ ప్రయోజనాలు పొందనలవికానివి. మునుపు ఎవరూ ఇటువంటి వరాలుకోరలేదు. నేను నీవిషయంలో నిండుసంతోషం పొందాను. నీవు నన్నడిగినవన్నీ ఇచ్చాను. కానీ నీవు బుద్ధిసంపదను నిండుగా పెంచుకొని గొప్పనేర్పుకలవాడవై, మంచి భావనాబలమూ, శుభాలను మాత్రమే సాధించాలి అనే శీలమూ కలవాడవై ఉండు. ఈ విషయంలో ఏమరుపాటు పొందకు.

## 6

**బ్రహ్మ అనుగ్రహించిన వరాలతో హిరణ్యకశిపుడు కన్నూమిన్నూ కాననివాడయ్యాడు. బ్రహ్మచేసిన హెచ్చరికను అతడు పట్టించుకోలేదు. సర్వలోకాలను అతిక్రూరంగా హింసింపదొడగినాడు. దేవతలందరూ శ్రీమన్నారాయణుని శరణు కోరారు. ఆతడు వారిని ఓదార్చి నేను చూచుకుంటాను అని మాటయిచ్చి పంపించాడు. ఆ సమయంలో హిరణ్యకశిపునకు విచిత్రమైన చరిత్రలు గల నలుగురు కొడుకులు కలిగారు. అందులో ఒకడు ప్రహ్లాదుడు. అతడు -**

**తనయందు నఖిల భూతములందు నొకభంగి**
**సమహితత్వంబున జరుగువాడు**
**పెద్దల బొడగన్న భృత్యునికైవడి**
**చేరి నమస్కృతుల్ సేయువాడు**
**కన్నుదోయికి నన్యకాంతలడ్డంబైన**
**మాతృభావన సేసి మరలువాడు**
**తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను**
**దీనుల గావ చింతించువాడు**
**సముల యెడ సోదరస్థితి జరుపువాడు**
**దైవతములందు గురువుల దలచువాడు**
**లీలలందును బొంకులు లేనివాడు**
**లలితమర్యాదుడైన ప్రహ్లాదు డధిప!** **7.115**

రాజా! ఆ ప్రహ్లాదుడు లలితమైన మర్యాదలను పాటించేశీలం కలవాడు. మర్యాదలంటే ప్రవర్తనకు సంబంధించిన పద్ధతులు. వానిలో కొన్నింటిని మనం మెలకువతో పట్టుకోవాలి. అతడు తనయందూ అఖిల ప్రాణులయందూ, వస్తువులయందూ సమము ఉన్నతీరుతో ప్రవర్తిస్తాడు. సమమంటే బ్రహ్మము కదా! విద్యలో, జ్ఞానంలో, వయస్సులో తనకంటె పెద్దవారు కంటపడితే సేవకునిలాగా దగ్గరకు చేరుకొని నమస్కారాలు చేస్తూ ఉంటాడు. అంటే తానొక మహాచక్రవర్తి కుమారుడను అనే అహంకారం అతనిలో మందునకైనా కనబడదు. లోకంలో ఏ స్త్రీ అయినా ఆమెలో అతడు అమ్మనే చూస్తాడు. తినటానికి తిండీ కట్టటానికి గుడ్డలేని అనాథులైన వ్యక్తులు తారసిల్లినపుడు తల్లిదండ్రులు వారిని కాపాడేవిధంలో ఆదుకోవాలని ఆరాటపడతాడు. తన యీడు బాలకులను తన అన్నదమ్ములే అన్నట్లుగా వ్యవహరిస్తాడు. గురువులను దైవములనుగానే భావిస్తాడు. ఆటపాటలలో పరిహాసానికి కూడా బొంకులులేని వాక్కులశుద్ధి ఉన్నవాడు.

## 7

**ప్రహ్లాదునకు ప్రపంచమంతా విష్ణుమయమే, విష్ణువును అన్ని యింద్రియాలతో, మనస్సుతో గమనిస్తూ విశ్వాన్ని స్మృతిపరిధిలోనికి రాకుండా చేసుకోగల మహాజ్ఞాని ఆరాక్షసబాలకుడు. భాగవతం అటువంటి జ్ఞానం మనం అందుకొని ఆచరణలో పెట్టి తరించాలని ఉపదేశించటంకోసం ప్రహ్లాదుని ప్రవృత్తిని పరమోదాత్తంగా ప్రకటిస్తున్నది.**

**పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ**
**లానిద్రాదులు చేయుచున్ దిరుగుచున్ లక్షింపుచున్ సంతత**
**శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం**
**ధానుండై మఱచెన్ సురారిసుతుడేతద్విశ్వమున్ భూవరా ! 7.123**

జనమేజయమహారాజా! దేవతలపగవాడైన హిరణ్యకశిపుని కడుపుపంట అయిన ప్రహ్లాదుడు నీరూ, పాలూ మొదలైన పానీయాలు త్రాగుతూ, అన్నం తింటూ, ఆయా లోకవ్యవహారానికి సంబంధించిన మాటలు పలుకుతూ, నవ్వులలో, ఆటలలో, నిద్ర మొదలైన తనవశంలో ఉండని దశలలో మెలగుతూ, తిరుగుతూ ప్రపంచాన్ని చూస్తూ కూడా ఎల్లవేళలా శ్రీమన్నారాయణుని పాదపద్మాల జంటను భావించటం అనే అమృతాన్ని జుఱ్ఱుకోవటమే పనిగా పెట్టుకొని ఈ విశ్వాన్ని మరచిపోతూ ఉండేవాడు.

## 8

**కొడుకు తీరుతెన్నులు తండ్రి హిరణ్యకశిపునకు నచ్చలేదు. అతడు అచ్చమైన రక్కసుడై విష్ణువును కక్కసించుకొనే దిక్కుమాలిన శీలం కలవాడయ్యాడు. అందువలన కొడుకు కూడా అటువంటివాడే కావాలని కోరుకుంటున్నాడు. ఒకనాడు కుమారుని పిలిచి పుత్రా! నీకేది భద్రమైయున్నది? అని బుజ్జగిస్తూ అడిగాడు. ప్రహ్లాదుడు జంకుగొంకులు లేకుండా ఇలా అన్నాడు.**

**ఎల్ల శరీరధారులకు నిల్లను చీకటి నూతిలోపలం**
**ద్రెళ్ళక వీరు నేమను మతిభ్రమణంబున ఖిన్నులై ప్రవ**
**ర్తిల్లక సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునం**
**దుల్లము చేర్చి తారడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ! 7.142**

రాత్రి సమయాలలో దొంగచాటుగా తిరుగుతూ ప్రాణులకు ద్రోహంచేసేవారికి నాయకుడవైన మహానుభావా! ఈ ఇల్లు అనే సంసారం ఉన్నదే అది పెద్ద పాడుబడ్డ చీకటిబావి. శరీరం ధరించిన ప్రతిజీవునకూ మొట్టమొదట కలుగవలసినజ్ఞానం అందులో కూలిపోరాదు – అని. వీరువేరు, మేమువేరు అనేభావన భయంకరమైన ఒకవెఱ్ఱితనం. దానివలన కలిగేది పరమదు:ఖం. దానిలో మెలగరాదు. మూడవమెట్టు చాలాగొప్పది. దానికంటె మించినజ్ఞానం లేదు. అదేమంటే కనిపించేది, తోచేది, ఉన్నది అంతా ఆ శ్రీమహావిష్ణువునకు సంబంధించిన దివ్యమైన కళతో నిండినది – అనే నిశ్చయబుద్ధి. కాబట్టి ఆజ్ఞానం చక్కగా కుదురుకోవాలి, దాని ప్రయోజనం పొందాలి అంటే కృత్రిమ వాతావరణంతో లోకాన్ని మోసగిస్తున్న గ్రామాలూ, నగరాలూ పనికిరావు. సహజసుందరమైన అడవిలో ఉండాలి. అదే మేలైన దారి.

## 9

**కొడుకు పలికిన జ్ఞానపూర్ణమైన వాక్కునకు హిరణ్యకశిపుని తలతిరిగిపోయింది. అయినా కొంత ఓర్పును తెచ్చిపెట్టుకొని రాక్షసప్రవృత్తిని ఉపదేశించటానికి పూనుకున్నాడు. ప్రహ్లాదునకు అదేమీ తలకెక్కలేదు. తనవైఖరిని మొగమాటం లేకుండా కమనీయమైన మాటలతో ఇలా ప్రకటించాడు.**

**మందారమకరంద మాధుర్యము దేలు**
**మధుపంబు వోవునే మదనములకు**
**నిర్మలమందాకినీ వీచికల దూగు**
**రాయంచ చనునె తరంగిణులకు**
**లలితరసాల పల్లవ ఖాదియై చొక్కు**
**కోయిల చేరునే కుటజములకు**
**పూర్ణేందుచంద్రికా స్ఫురితచకోరకం**
**బరుగునే సాంద్రనీహారములకు**

**అంబుజోదరదివ్యపాదరవింద**
**చింతనామృతపానవిశేషమత్త**
**చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు**
**వినుతగుణశీల! మాటలు వేయునేల ? 7.150**

తండ్రీ! పదిమంది పరవశించి కొనియాడే గుణాలతో కూడిన శీలం ఉండవలసినవాడవు నీవు. నీకు వెయ్యిమాటలు చెప్పటం ఎందుకు? ప్రపంచాన్ని పరీక్షించు. మనకంటె నీచస్థాయివి అనుకొనే పశువులు, పక్షులూ కూడా మహావస్తువుల రుచిమరగి నీచపదార్థాలవైపు కంటిని కూడా త్రిప్పవే. గమనించు. అదిగో తుమ్మెద. మందారపుష్పంలోని తేనె తియ్యదనంలో తేలియాడుతున్నది. ఎవరెంత ప్రయత్నించినా అది ఉమ్మెత్తలను చేరుకుంటుందా?

ఆ రాజహంసను చూడు. నిర్మలమైన గంగానది అలలలో తేలి మైమరచి ఆడుకుంటున్నది. అది సారంలేని ఏరులవైపు పయనిస్తుందా? చాలామృదువుగా ఉన్న తీయమామిడిచిగుళ్ళు తింటూ పరవశించిపోతున్న కోకిల కొండమల్లెలకోసం పోతుందా? పున్నమిచందురుని వెన్నెలతో పొంగిపోయే చకోరపక్షి దట్టమైన మంచుదిబ్బలవైపు వెళ్తుందా?

అలాగే అన్నిలోకాలను పుట్టించిన బ్రహ్మను పుట్టించిన బొడ్డుతామర గల శ్రీమహావిష్ణువు దివ్యమైన పాదాలనే పద్మాలను భావించటమే అమృతం. అది పుచ్చుకోవటంచేత చాలా ఎక్కువగా మదించిన నాచిత్తం మరొకదానిని ఎలా చేరగలదు?

## 10

**తనయుని జ్ఞానవాక్కులకు తండ్రికీ, తప్పుడు చదువులుచెప్పే గురువులకూ తల దిమ్మెక్కిపోయింది. గురువులు రాజుమెప్పుకోసం నానాహంగామా చేసి ఇటుపై మెలకువతో మూడుపురుషార్థాలను బోధించి తీసుకొని వస్తామని రాజునకు మాటఇచ్చి ప్రహ్లాదుణ్ణి తీసుకొనిపోయారు. కొన్నాళ్ళకు అతనిని రాజు దగ్గరకు కొనివచ్చారు. తండ్రి ముచ్చటపడి నీవెరిగిన శాస్త్రంలో ఒక పద్యాన్ని తాత్పర్యంతోపాటుగా పలుకుమన్నాడు. అప్పుడు ప్రహ్లాదుడు -**

**చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థముఖర శాస్త్రంబులు నే**
**చదివినవి కలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ! 7.166**

అంటూ ప్రారంభించి పరమసుందరమైన జ్ఞానవాహినికి ఒక చక్కని రేవును రూపొందించాడు.

నాయనా! నన్ను గురువులు చదివించారు. ధర్మము, అర్థము మొదలైన శాస్త్రాలు గట్టిగానే చదువుకున్నాను. అంతేకాదు. ఇంకా నేను చదివినవి చాలా ఉన్నాయి. కానీ నిజమైన చదువు అంటే పరమాత్మ జ్ఞానమేనయ్యా! అటువంటి అనంతంగా ఉన్న చదువులలోని మర్మమంతా నేను చదువుకున్నాను.

# 11

**చదువులలో మర్మం ఏమిటో ప్రహ్లాదుడు గురువులకు గురువై బోధిస్తున్నాడు. ముందుగా భక్తికి సంబంధించిన తొమ్మిది పద్ధతులను కమ్మగా వివరిస్తున్నాడు.**

**తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్, చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరి న్నమ్మి స**
**జ్జనుడై యుండుట భద్రమంచు తలతున్ సత్యంబు దైత్యోత్తమా 7.167**

మహారాజా! నీవు దైత్యులలో ఉత్తముడవు. కాబట్టి ఎవడో జ్ఞానసంపన్నుడు ఉపదేశింపకపోతే నీకు తెలియదు కనుక చెప్తున్నాను. భక్తికి సంబంధించి తొమ్మిది మార్గాలు ఉన్నాయి. పట్టుదలతో తొమ్మిదింటినీ సాధించాలి. లేదా శక్తిననుసరించి కొన్నింటినైనా పట్టుకోవాలి. మానవులకు భగవంతుడు దేహాన్నీ, మనస్సునూ, మాటనూ అనుగ్రహించాడు. ఆమూడింటినీ ఒక్కత్రాటిపైకి తెచ్చుకొని భగవంతునితో చెలిమి చేయటం మొదటిపద్ధతి. సంస్కృతంలో సఖ్యం అంటే ఒకే ప్రాణమన్నంతటి చెలిమి. భగవంతుని గూర్చి వింటూ ఉండటం రెండవత్రోవ. భగవంతునికి దాసుడైపోవటం మూడవదారి. నమస్కారం చేస్తూ ఉండటం నాలుగవదిగా, పూజలు చేయటం అయిదవ మార్గం. స్వామికి ఏదో ఒకరూపంలో సేవచేయటం ఆరవది. ఆత్మలో భగవంతుని జ్ఞానాన్ని నిండుగా తెలిసికొని నిలుపుకొనటం ఏడవమార్గం. భగవంతుని తత్త్వం తెలిపే పాటలు పాడుకుంటూ కాలం గడపటం ఎనిమిదవది. నిరంతరంగా భావిస్తూ ఉండటం తొమ్మిదవది. ఈ తొమ్మిది మార్గాలతో శ్రీహరి సర్వాత్ముడు అని నమ్మి మానవుడు సజ్జనుడై ఉండటమే భద్రమైనది అని నేను భావిస్తూ ఉంటాను. ఇది సత్యం.

# 12

**ప్రహ్లాదుడు అత్యద్భుతమైన మనోవికాసం పొంది, అదిలేని తండ్రికీ, తండ్రివంటివారికీ విష్ణు భక్తిలేనివారి దౌర్భాగ్యాన్ని వివరిస్తున్నాడు.**

**అంధేందూదయముల్ మహాబధిరశంఖా రావముల్ మూకస**
**ద్గ్రంథా ఖ్యాపనముల్ నపుంసకవధూకాంక్షల్ కృతఘ్నావళీ**
**బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడ స**
**ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్ 7.168**

శ్రీహరియందు భక్తిలేనివారి బ్రదుకులు వట్టివి. పనికిమాలినవి. అవి ఎటువంటివంటే గ్రుడ్డివాని ఎదుట చంద్రుడు ఉదయించటం, అరచిగీపెట్టినా వినపడని చెవిటివానికి శంఖనాదం చేయటం, మూగివానికి గొప్పవేదాంత గ్రంథాలను బోధించమనటం, పేడివానికి ఆడువారిపై కోరికపుట్టటం, చేసినమేలు సుఖంగా మరచిపోయి ద్రోహం చేయటానికి వెనుకాడని వారితో చుట్టరికాలు చేయటం, బూడిదలో హోమద్రవ్యాలను క్రుమ్మరించటం, పిసినిగొట్టులకు సంపదలు దొరకడం, పందులకు మంచిగంధాలను అందించటం వంటివి.

# 13

**భగవంతుడు మానవులకు కాళ్ళూచేతులూ మొదలైన అంగాలు ఇచ్చినది వానిని శ్రీహరిని సేవించుకోవటానికి మాత్రమే. ఆపని చేయకపోతే అవి అవి అనటానికి వీలులేదని ప్రహ్లాదుడు తండ్రికి విస్పష్టంగా వక్కాణిస్తున్నాడు.**

**కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వా**
**సురరక్షకుని చూచు చూడ్కులు చూడ్కులు**
**శేషశాయికి మ్రొక్కుశిరము శిరము**
**విష్ణునాకర్ణించు వీనులు వీనులు**
**మధువైరి తవిలిన మనముమనము**
**భగవంతు వలగొను పదములు పదములు**
**పురుషోత్తముని మీది బుద్ధిబుద్ధి**

**దేవదేవుని జింతించు దినము దినము**
**చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు**
**కుంభినీధవు చెప్పెడి గురుడు గురుడు**
**తండ్రి! హరి జేరుమనియెడి తండ్రి తండ్రి** **7.169**

తండ్రీ! కమలాలవంటి కన్నులున్న ఆస్వామిని పూజించే చేతులే నిజమైన చేతులు. లక్ష్మీపతి అయిన నారాయణుని గుణగణాలను కొనియాడేనాలుకయే నాలుక. దేవతలను కాపాడే ప్రభువును చూచే చూపులే చూపులు. ఆదిశేషుని పాన్పుగా చేసికొన్న వైకుంఠనాథునికి మ్రొక్కే తలయే తల. విష్ణువును గూర్చి వినే శీలంకల చెవులే చెవులు. మధువును మట్టుపెట్టిన మాధవుని అంటిపెట్టుకొని ఉండే మనస్సే మనస్సు. భగవంతునకు ప్రదక్షిణం చేసే పాదాలే పాదాలు. పురుషోత్తమునిపై నిశ్చలంగా నెలకొనిఉన్న బుద్ధియే బుద్ధి. ఆయన దేవులందరకు దేవుడు. అట్టివానిని భావించే దినమే దినము. చక్రం చేతబట్టి దుష్టసంహారం చేసే స్వామిని తెలియజెప్పే చదువే నిజమైన గురువు. ఈ సర్వభూమికీ అధినాయకుడైన మహాప్రభువును బోధించే గురువే గురువు. శ్రద్ధగా వినవయ్యా! హరిని చేరుకో నాయనా అని ఉపదేశం చేసే తండ్రియే తండ్రి.

## 14

భగవంతునికోసం వినియోగింపనిదేదీ పనికిమాలినదే అవుతుంది. కనుక రాక్షసరాజా! బుద్ధిశక్తులను వినియోగించి దీనిని గట్టిగా తెలుసుకో అంటున్నాడు ప్రహ్లాదుడు తండ్రి హిరణ్యకశిపునితో.

**కంజాక్షునకు గాని కాయంబు కాయమే**
**పవనగుంభిత చర్మభస్త్రిగాక**
**వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే**
**ఢమఢమధ్వనితోడి ఢక్కగాక**
**హరిపూజనములేని హస్తంబు హస్తమే**
**తరుశాఖనిర్మిత దర్విగాక**
**కమలేశు జూడని కన్నులు కన్నులే**
**తనుకుడ్య జాలరంధ్రములుగాక**

**చక్రి చింతలేని జన్మంబు జన్మమే**
**తరళ సలిల బుద్బుదంబుగాక**
**విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుడే**
**పాదయుగముతోడి పశువుగాక !** **7.170**

రాక్షసచక్రవర్తీ ! మనదేహం మాధవుని సేవకు మాత్రమే వినియోగింపబడాలి. లేకపోతే అది కాయమే కాదు. గాలితో నింపిన తోలుతిత్తి అయిపోతుంది. మననోరు వైకుంఠస్వామిని స్తుతిస్తూ ఉండాలి. లేకపోతే అది నోరేకాదు. ఢమఢమా అంటూ చప్పుడుచేసే ఢక్క అయిపోతుంది. మనచేయి శ్రీహరి పాదసేవనం చేయాలి. అప్పుడే అది హస్తం అవుతుంది. కాకపోతే చెట్టుకొమ్మతో చేసిన తెడ్డుకూ దానికీ తేడా ఉండదు. లక్ష్మీపతి అయిన శ్రీమన్నారాయణుని చూచే శీలంగల కన్నులే నిజమైన కన్నులు. ఆ పనిచేయకపోతే శరీరమనే గోడలోపెట్టిన గవాక్షాలయిపోతాయి. చక్రపాణిని ధ్యానించే జన్మమే జన్మం. అదిలేకపోతే క్షణంలో పగిలిపోయే నీటిబుడగ. విష్ణుభక్తిలేని పండితుడు పండితుడుకాదు. రెండు కాళ్ళున్న పశువు.

## 15

మానవుడు మాధవుడు కావాలి. మానవాధముడై దానవుడు కారాదు. దానికి కొన్ని మంచిపనులు చేయాలి. ప్రహ్లాద కుమారుడు తండ్రికి ఆ మంచిపనులను ప్రయోజనాత్మకంగా వివరిస్తున్నాడు.

**సంసారజీమూత సంఘంబు విచ్చునే**
**చక్రిదాస్యప్రభంజనము లేక**
**తాపత్రయాభీల దావాగ్ను లాఱునే**
**విష్ణుసేవామృత వృష్టిలేక**
**సర్వంకషాఘౌఘ జలరాశులింకునే**
**హరిమనీషా బడబాగ్నిలేక**
**ఘనవిపద్గాఢాంధకారంబు లణగునే**
**పద్మాక్షునుతిరవిప్రభలు లేక**

**నిరుపమాపునరావృత్తి నిష్కళంక**
**ముక్తినిధి గానవచ్చునే ముఖ్యమైన**
**శార్ఙ్గి కోదండ చింతనాంజనము లేక**
**తామరస గర్భునకు నైన దానవేంద్ర !**

రాక్షసరాజా! సంసారం ఒక కారుమబ్బుల సముదాయం. అది విచ్చిపోవాలంటే శ్రీమహావిష్ణువునకు దాస్యం చేయాలి. అది ఆమబ్బులపాలిట పెనుగాలి. ప్రతివ్యక్తీ మూడువిధాలైన తాపాలతో – మంటలతో – ఉడికిపోతూ ఉంటాడు. ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అని ఆతాపాల పేర్లు. అవి దట్టంగా పెరిగిన కారడవులలో పుట్టిన దావాగ్ని వంటివి. అవి ఆరిపోవాలంటే విష్ణుసేవ అనే అమృతవర్షం కురవాలి. పాపాల ప్రోవులున్నాయే అవి అన్నింటికీ రాపిడిపెట్టే జలరాశులవంటివి. అవి ఇంకిపోవాలంటే విష్ణువునందు నెలకొన్నబుద్ధి అనే బడబాగ్ని కావాలి. పట్టనలవికాని ఆపదలనే కాఱుచీకట్లు అణగిపోవాలంటే పద్మాలవంటి కన్నులున్న మాధవుడనే భాస్కరుని ప్రభలు ఉండాలి. మానవుడు అతిముఖ్యంగా తప్పనిసరిగా సాధించి తీరవలసిన గొప్పనిధి ఒక్కటే ఒక్కటి ఉన్నది. దానిని ముక్తి అంటారు. దానికి సాటి అయినది మరొకటిలేదు. అది సిద్ధిస్తే కలిగే గొప్పలాభం మరల పుట్టటం గిట్టటం అనే తిరుగుళ్ళు ఉండకపోవటం. ఆనిధిని కనుగొనాలంటే ఒక గొప్పశక్తిగల కాటుకను ధరించాలి. ఆ కాటుక ఏమిటో తెలుసా! శార్ఙ్గం అనే వింటిని ధరించి సర్వలోకాలను రక్షిస్తున్న శ్రీహరిని నిరంతరం భావన చేయటమే. ఇది నీకూ నాకూ మాత్రమే కాదు. లోకాలన్నింటినీ సృష్టిచేస్తున్న బ్రహ్మదేవునకు కూడా అదే దిక్కు.

## 16

**ప్రహ్లాదుని ఉపన్యాసం వింటున్న హిరణ్యకశిపునకు ఒళ్ళుమండిపోతున్నది. గురువులు చెప్పని యీ తెలివి నీకెలా వచ్చిందిరా? అని గొంతు చించుకుంటూ కోపంతో ఊగిపోతూ అడిగాడు. దానికి ప్రహ్లాదుడు ఇలా బదులు పలుకుతున్నాడు.**

**కాననివాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువున్**
**గానని భంగి కర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై**
**కానరు విష్ణు; కొంద ఱట గందురకించన వైష్ణవాంఘ్రి సం**
**స్థానరజోభిషిక్తులగు సంహృతకర్ములు దానవేశ్వరా!**

దానవులకు ప్రభువవైన ఓతండ్రీ ! కళ్ళు లేనివాడొకడు ఏదో మేలైన వస్తువును చూడాలని మరొక గ్రుడ్డివాని చెయ్యి పట్టుకొన్నాడు. వానికి ఆ వస్తువు కానవస్తుందా? అలాగే కొందరు యజ్ఞం మొదలైన కర్మములను పట్టుకొంటారు. అవి వారికి తెగద్రెంచుకోవటానికి వీలులేని సంకెళ్ళయిపోతాయి. దానివలన విష్ణువును చూడలేని దౌర్భాగ్యం వారిని పట్టుకొంటుంది. కానీ వివేకం పండించుకొన్న జ్ఞానులు ఉందో లేదో అన్నంత స్వల్పంగా ఉన్న శ్రీమహావిష్ణువు పాదాలమీది దుమ్ముకణంతో తలమున్కలుగా స్నానమాడి కర్మబంధాలను త్రెంపివేసుకొని విష్ణుదర్శన మహాభాగ్యం పొందుతారు.

# 17

ప్రహ్లాదుని విష్ణువిజ్ఞానం హిరణ్యకశిపునకు గుండెలో గ్రుచ్చుకొన్న శల్యం అయిపోయింది. దానివేదనతో ఓరీ కొడుకా! ఈ సృష్టిలో నేనే బలవంతుణ్ణి. ఒంటరిగా పోరి మహాబలులైన దేవతలనందరినీ గెలిచాను. అటువంటి నాతో ప్రతివీరుడవై నాకు మారుమాటలు పలుకుతున్నావు. ఇది నీకు ఎవనిబలంవలన కలిగిందిరా! అన్నాడు. దానికి బదులు చెబుతున్నాడు, ప్రహ్లాదుడు.

**బలయుతులకు దుర్బలులకు**

**బల మెవ్వడు, నీకు నాకు బ్రహ్మాదులకున్**

**బల మెవ్వడు, ప్రాణులకును**

**బల మెవ్వం డట్టి విభుడు బలమసురేంద్రా !** **7.264**

రాక్షసరాజా! నేను చాలా బలంగలవాడనని నీవు గొప్పలు చెప్పుకుంటున్నాయి. కానీ వివేకంతో పరీక్షించితే సర్వలోకాలను వ్యాపించి ఉన్న ప్రభువు శ్రీమహావిష్ణువే అందరికీ, అన్నింటికీ బలం. బలం ఉన్నవాళ్ళకూ, లేనివాళ్ళకూ, నీకూ, నాకూ, బ్రహ్మ మొదలైన దేవుళ్ళకూ, ప్రాణం కలవారందరికీ బలం ఆయనే. గుర్తించినవాడు నావంటి భక్తుడు. గుర్తింపనివాడు నీవంటి రాక్షసేంద్రుడు.

# 18

నీవు చెప్పే ఆ విష్ణువు ఎక్కడ ఉంటాడురా? ఏవిధంగా తిరుగుతూ ఉంటాడు? ఏదారినుండి వస్తాడు? నేను చాలామారులు వెదికాను. వాడీవిశ్వంలో ఎక్కడాలేడు - అన్నాడు హిరణ్యకశిపుడు. అతడలా అంటున్నకొద్దీ ప్రహ్లాదునికి పట్టశక్యంకాని ఆనందం పొంగులెత్తి వస్తున్నది. ఎందుకంటే తనకావిష్ణువు సర్వమయుడై కనిపిస్తున్నాడు. ఆ ఆనందపారవశ్యంతో గంతులువేస్తూ చెబుతున్నాడు.

**కల డంభోధి గలండు గాలి గలడాకాశంబునన్ గుంభినిన్**

**కలడగ్నిన్ దిశలన్ బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్**

**కలడోంకారమునం ద్రిమూర్తుల త్రిలింగవ్యక్తులం దంతటన్**

**కలడీశుండు కలండు తండ్రి వెదకంగా నేల యీ యాయెడన్** **7.274**

తండ్రీ ! ఆ శ్రీమహావిష్ణువు సముద్రంలో ఉన్నాడు. గాలిలో ఉన్నాడు. గగనంలో ఉన్నాడు. నేలమీద ఉన్నాడు. అగ్నిలో ఉన్నాడు. అన్ని దిక్కులలో ఉన్నాడు. పగళ్ళలో, రాత్రులలో, సూర్యునిలో, చంద్రునిలో జీవాత్మలలో, ఓంకారంలో, సృష్టి, స్థితి, లయములను చేసే బ్రహ్మవిష్ణుమహేశ్వరులలో, స్త్రీలలో, పురుషులలో, ఆ రెంటికీ చెందని వ్యక్తులలో ఉన్నాడయ్యా! ఇక్కడా అక్కడా వెదకటం ఎందుకు ?

# 19

మాకు వెదకనక్కరలేదు. రాక్షసప్రవృత్తి కలవానికి విష్ణువు వెదకి చూడవలసినవాడే! రాక్షసరాజా! దీనిని మెలకువతో గమనించు అంటున్నాడు ప్రహ్లాద కుమారుడు.

**ఇందుగల డందులేడని**

**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**

**డెందెందు వెదకి చూచిన**

**అందందే కలడు దానవాగ్రణి వింటే.** **7.275**

నీవు రాక్షస స్వభావం చిటారుకొమ్మ మీద ఉన్నవాడవు కాబట్టి చక్రి ఎక్కడ ఉన్నాడు అని అడుగుతున్నావు. తండ్రీ ! ఆ చక్రంచేతబట్టి నీవంటివారి తలతరగటం కోసమే ఆ శ్రీమహావిష్ణువు అవకాశం కోసం చూస్తూ ఉన్నాడు. ఇక్కడ ఉన్నాడు, అక్కడలేడు అనే సందేహం వలదు. ఆయన సర్వంలో సర్వులకూ చాలా దగ్గరగా అందుబాటులోనే ఉన్నాడు. కాకపోతే నీవంటివాడు వెదకి చూడాలి. ఎక్కడ ఎక్కడ వెదికిచూస్తే అక్కడ అక్కడనే ఉన్నాడు. ఈ మాటను చాలా జాగరూకతతో వింటున్నావా?

## 20

**తండ్రీ కొడుకుల తగవులాట చాలా రసవత్తరంగా జరుగుతున్నది. వారిద్దరిమధ్యా శ్రీహరి చిద్విలాసంతో ఊగిపోతున్నాడు. దుష్టుణ్ణి శిక్షించటానికీ, భక్తుణ్ణి పరిరక్షించటానికీ ఆ సర్వజగన్నాయకుడు ఏమి చేస్తున్నాడో మహాభక్తశిఖామణి పోతన్నగారు రమణీయపద్యం మనకందిస్తున్నారు.**

**హరి సర్వాకృతులం గలండనుచు ప్రహ్లాదుండు భాషింప స**
**త్వరుడై యెందును లేడులేడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ**
**నరసింహాకృతి నుండె నచ్యుతుడు నానాజంగమ స్థావరో**
**త్కర గర్భంబుల నన్నిదేశముల నుద్దండ ప్రభావంబునన్ 7.277**

ప్రహ్లాదుడు తండ్రితో శ్రీహరి అన్నివిధాలైన ఆకారాలతో అన్ని ఆకారాలలో ఉన్నాడు అని నొక్కి వక్కాణిస్తున్నాడు. ఆమాట వినీవినకుండానే గట్టిగా. ఎక్కడా లేడు, లేడు అని గొంతుచించుకొని అరుస్తున్నాడు. అక్కడ ఆగలేదు. కొడుకును మాటలతో, చేష్టలతో బెదిరిస్తున్నాడు. ఆ సంఘర్షణ అలా సాగుతూ ఉండగా ఎక్కడా ఏవిధమైన జారుపాటులేని నిత్యసత్యశివసుందరాత్మకుడైన అచ్యుతుడు నరాకృతినీ, సింహాకృతినీ కలగలుపుకొని అన్నివిధాలైన కదలనివి, కదిలేవీ అయిన భూతాలన్నింటిలో, అన్నిదేశాలలో రక్కసుని ఉక్కడగించటానికి అవసరమైన సన్నాహంతో ఉన్నాడు.

# అష్టమ స్కంధము

## 1

అత్యద్భుతమైన గజేంద్ర మోక్షణకథ ప్రపంచ వాఙ్మయంలోనే తలమానికం వంటిది. ఎనిమిదవ స్కంధం భాగవతంలో ఈ కథతోనే మొదలవుతున్నది. పరీక్షిన్మహారాజు శుకమహర్షిని ఇలా అడుగుతున్నాడు.

**క. నీరాట వనాటములకు, పోరాటం బెట్లు గలిగె, పురుషోత్తము చే**
**నారాట మెట్లు మానెను, ఘోరాటవిలోని భద్రకుంజరమునకున్ 8.19**

స్వామీ! ఒకటి నీటిలో తిరుగాడే జంతువు. మరొకటేమో అడవులలో సంచరించే ఏనుగు. పట్టుకొన్నది మొసలి. పట్టుపడినది భద్రగజం. అబ్బో! ఎంతదేహం! ఎంతబలం! అటువంటి ఆ రెండు మహాజంతువులకూ పోరాటం ఎలా కలిగింది? ఎందుకు కలిగింది? పోనీ కలిగిందే అనుకుందాం. సృష్టిలో ఎన్నో ప్రాణులు కొట్టుకొని చస్తూ ఉంటాయి. కానీ మీరు ఘోరమైన అడవిలో ఆభద్రగజం ఆరాటాన్ని పురుషోత్తముడు పోగొట్టాడంటున్నారు! అది ఎలా జరిగింది ? అంతా ఆశ్చర్యంగా ఉన్నది. నాకు వినాలని వేడుక పుట్టింది. వినిపించండి.

## 2

**శ్రీశుకులవారు పరీక్షిన్మహారాజునకు గజేంద్ర మోక్షణ కథను వివరిస్తున్నారు. రాజా! త్రికూటం అనే గొప్ప పర్వతం ఉంది. దానినుండి ఒకపెద్ద ఏనుగుల మంద దప్పిక తీర్చుకోవటానికీ, జలవిహారం చేయటానికీ బయలుదేరింది. ఆమందలరేడు ఒక గొప్పగజరాజునకు ఒక పెద్దజలాశయం కంటబడింది. అది -**

**మ. ఆట గాంచెంగరిణీవిభుండు నవ పుల్లాంభోజ కల్హారమున్**
**నట దిందిందిర వారమున్ గమఠ మీన గ్రాహ దుర్వారమున్**
**వట హింతాల రసాల సాల సుమనో వల్లీ కుటీ తీరమున్**
**చటులోద్ధూత మరాళ చక్ర బక సంచారంబు కాసారమున్ 8-42**

అప్పుడప్పుడే విచ్చుకుంటున్న తామరపూవులతో కలువపూవులతో కళకళలాడుతున్నది. వానిమీద మదించిన తుమ్మెదలు నాట్యాలు చేస్తున్నాయి. దానినిండా పెద్దపెద్ద తాబేళ్ళూ, చాలా పెద్దచేపలూ, ఇంకా పెద్దమొసళ్ళూ విహరిస్తున్నాయి. వానితో అది ఎవ్వరికీ ప్రవేశింప నలవి కాకుండా ఉంది. దాని ఒడ్డులమీద రావిచెట్లూ, ఒకజాతి తాటిచెట్లూ, మామిడిచెట్లూ, మద్దిచెట్లూ, పూల తీగలతో అల్లుకొన్న పొదరిళ్ళూ చూడముచ్చటగా ఉన్నాయి. అటూ ఇటూ గొప్ప ఉత్సాహంతో ఎగురుతున్న హంసలూ, చక్రవాకాలూ, కొంగలూ మొదలైన పక్షులు కన్నులకు విందుచేస్తున్నాయి. అటువంటి పెద్దజలాశయాన్ని ఆ గజరాజు చూచాడు.

# 3

ఏనుగులన్నీ జలక్రీడలు మొదలుపెట్టాయి. నీటిలోనికి ప్రవేశించాయి. ముందుగా కడుపునిండా నీరు త్రాగాయి. ఆ త్రాగటం ఎలా ఉన్నదంటే,

**మ. తొండంబుల పూరింపుచు, గండంబుల జల్లుకొనుచు గళగళ రవముల్**
**మెండుకొన వలుదకడుపులు, నిండన్ వేదండకోటి నీరుం ద్రావెన్. 8-45**

తొండాలతో నీటిని నింపుకున్నాయి. ఒకదాని చెక్కిలిమీద మరొకటిగా చిమ్మనగ్రోవితో చిమ్మినట్లు జల్లుకొన్నాయి. అప్పటి ఆధ్వనులు చెవులకు ఇంపుగా గళగళమని వినవస్తున్నాయి. కొన్ని లక్షల సంఖ్యలో ఉన్నాయికదా! వాని గళగళధ్వనులు మిన్నుముట్టుతున్నాయి. కావలసినంత నీరు ఉన్నది. తక్కువేమి మనకు అన్నట్లుగా కడుపులు నిండేవిధంగా ఆ ఏనుగుల మందలు నీరు త్రాగాయి.

# 4

ఏనుగుల నాయకుడు కడుపునిండా నీరుత్రాగి తరువాత తన నీటిఆటలను మొదలుపెట్టాడు. ఆ సహజసుందర సన్నివేశాన్ని పోతన్నగారు మనకన్నులకు కట్టిస్తున్నారు.

**మ. ఇభలోకేంద్రుడు హస్తరంధ్రముల నీ రెక్కించి పూరించి చం**
**డభమార్గంబున కెత్తి నిక్కి వడి నుడ్డాడించి పై జిమ్ము నా**
**రభటి న్నీరములోన పెల్లెగసి నక్రగ్రాహ పాఠీనముల్**
**నభమం దాడెడు మీన కర్కటములన్ బట్టెన్ సురల్ వ్రాన్పడన్. 8-47**

ఏనుగుల మందలకు నాయకుడైన ఆగజరాజు తొండాల రంధ్రాలలోనికి నీరెక్కించాడు. సందు లేకుండా నింపాడు. తొండాన్ని ఆకాశంవైపునకు బాగా ఎత్తిపట్టాడు. ఊపుకోసం నిక్కినిలుచున్నాడు. లోపలి నీటిని బాగా పుక్కిలిపట్టాడు. ఒక్కపెట్టున పైకి చిమ్మాడు. ఆ దెబ్బకు ఆ జలాశయంలోని మొసళ్ళు, పెద్దచేపలూ, మిగిలిన జలజంతువులూ గగనంలోనికి దూసుకొంటూ పోయాయి. ఆకాశంలో ఉన్న మీనము, కర్కాటకమూ అనే గ్రహాలను పట్టుకున్నాయి. దేవతలు అది చూచి చేష్టలుదక్కి నిలుచుండిపోయారు.

# 5

ఆ గజేంద్రుని ఆటలఆర్భాటాలు ఇంకా ఈవిధంగా చూడముచ్చటగా ఉన్నాయి.

**సీ. కరిణీ కరోజ్ఝిత కంకణ చ్ఛట దోగి సెలయేటి నీలాద్రి చెలువు దెగడు**
**హస్తినీ హస్తవిన్యస్త పద్మంబుల వేయుగన్నులవాని వెఱపు సూపు**
**కలభ సముత్కీర్ణ కల్హార రజమున కనకాచలేంద్రంబు ఘనత దాల్చు**
**కుంజరీ పరిచిత కుముద కాండంబుల ఫణిరాజమండన ప్రభ వహించు**

**ఆ. మదకరేణుముక్త మౌక్తిక శక్తుల మిఱుగు మొగిలుతోడ మేలమాడు**
**నెదురులేని గరిమ నిభరాజమల్లంబు వనజగేహకేళి వ్రాలునపుడు.**

ఆ ఏనుగులరేనికి ఎదురేలేదు. ఆడినది ఆటగా ఆపెద్ద చెఱువులో విహరిస్తున్నది. దాని ఆడ ఏనుగులన్నీ తొండాలతో తుంపురులను దానిమీదకు చిమ్ముతున్నాయి. అప్పుడది సెలయేటిలోని నల్లనికొండలాగా అలరారుతున్నది. అలాగే ఆపెంటి ఏనుగులు చెరువులోని పద్మాలను కుప్పలు తెప్పలుగా దానిమీద వేస్తున్నాయి. అవన్నీ దానిమీద నిలిచి వేయికన్నుల యింద్రుణ్ణి తలపింపజేస్తున్నాయి. గున్నయేనుగులు కలువపూవుల పొడిని దానిమీద చల్లుతున్నాయి. అప్పుడది బంగారుకొండలాగా వెలిగిపోతున్నది. ఆడ ఏనుగులు తామరతూడులను లాగి దానిమీదకు విసరుతున్నాయి. ఆవిధంగ పాములు అలంకారాలుగా భాసిల్లే పరమశివునిలాగా చూపట్టుతున్నది. మదించిన ఏనుగుభామలు పైనిచల్లిన ముత్యాలుగల ముత్యపు చిప్పలతో మెఱుగుతీగలతో విరాజిల్లుతున్న మేఘంలాగా శోభిల్లుతున్నది.

# 6

**కొలను ఆ ఏనుగుల చిలిపి ఆటలకు అతలాకుతలం అయిపోతున్నది. అది గమనించింది అందులో ఉన్న ఒకమకరం. అది ఈ ఏనుగుకంటె ఏమీ తక్కువతిన్నది కాదు. పట్టనలవికాని పట్టుదలతో ఏనుగును ఒడిసిపట్టుకొన్నది.**

**సీ॥ భుగభుగాయుత భూరి బుద్బుద చ్ఛటలతో, కదలుచు దివికి భంగంబు లెగయ**
**భువన భయంకర ఫూత్కార రవమున ఘోర నక్రగ్రాహకోటి బెగడ**
**వాలవిక్షేప దుర్వార ఝుంఝూనిల వశమున ఘుమఘుమావర్త మడర**
**కల్లోల జాల సంఘట్టనంబుల తటీ తరులు మూలములతో ధరణి గూల**
**సరసిలో నుండి పొడగని సంభ్రమించి యుదిరి కుప్పించి లంఘించి హుంకరించి**
**భాను కబళించి పట్టు స్వర్భానుపగిది నొక్కమకరేంద్ర డిభరాజు నొడిసిపట్టె. 8.51**

ఏనుగులరేడు ఒడలుతెలియకుండా ఆడుకుంటున్నది. దానిని గమనించింది కొలనులో ఉన్న ఒక పెద్దమొసలి. దానికి స్థానబలం ఉన్నదికదా! అది తనముందు దీని ఆటలను సాగనిస్తుందా? విజృంభించింది. భుగభుగ అని పొంగుకొని వస్తున్న బుడగలతో అలలు ఆకాశాన్నంటుతున్నాయి. జనాల గుండెలు అదరిపోయేవిధంగా అది చేస్తున్న ఫూత్కారనాదంతో మహాభయంకరమైన మొసళ్ళ గుంపులు కూడా అదలిపోతున్నాయి. తోకను ఈడ్చిఈడ్చి కొడుతున్నది. దానివలన పెల్లురేగిన పెద్దగాలిచేత ఘుమఘుమలాడే సుడి గిరగిరా తిరుగుతున్నది. అలలు ఒకదానికొకటి కొట్టుకొనగా ఒడ్డులనున్న మహావృక్షాలు పెల్లగిల్లిపోతున్నాయి. ఆమొసలి ఒక్కపెట్టున పట్టు చిక్కించుకొని కుప్పించి హుంకరించి ఏనుగును ఒడిసిపట్టుకొన్నది. అది సూర్యగ్రహాన్ని పట్టుకొన్న రాహుగ్రహంలాగా ఉన్నది.

# 7

**పట్టుకొన్న మొసలి, పట్టుచిక్కిన ఏనుగూ పంతం విడనాడకుండా గుంజుకొంటున్నాయి. ఆరెంటి గుంజులాటను కవి కమనీయంగా వర్ణిస్తున్నాడు.**

**క. కరి దిగుచు మకరి సరసికి, కరి దరికిని మకరి దిగుచు కరకరి బెరయన్**
**కరికి మకరి మకరికి గరి, భర మన ని ట్లతల కుతల భటు లదిరిపడన్. 8-54**

మొసలి ఏనుగును కొలనులోనికి గుంజుకొనిపోతున్నది. భగభగమంటున్న పగ అనే నిప్పుతో ఏనుగు మొసలిని నేలమీదకు లాగుతున్నది. ఈగుంజులాటను నేలపై, నింగిపైనున్న వీరాగ్రేసరులందరూ వింతగ చూస్తున్నారు. కరికి మకరి బరువైపోతున్నది. కాదుకాదు మకరికే కరి బరువైపోతున్నది. అనుకొంటూ ఒక నిర్ణయానికి రాలేక ఊగులాడిపోతున్నారు.

## 8

**ఏనుగుల ఏలిక మొసలిపట్టునుండి విడిపించుకోవటానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తున్నది. పడరాని పాట్లన్నీ పడుతున్నది. దాని విజృంభణను మన కన్నులకు కట్టిస్తున్నాడు కవీంద్రుడు.**

**శా. ఆటోపమ్మున జిమ్ము ఔమ్మగల వజ్రాభీల దంతమ్ములన్**
**దాటించున్ మెడ జుట్టి పట్టి హరి దోర్దండాభశుండాహతిన్**
**నీటన్ మాటికి మాటికిం దిగువగా నీరాటము న్నీటి పో**
**రాటం దోటమిపాటు జూపుట కరణ్యాటంబు వాచాట మై. 8-57**

ఏనుగుల ఏలిక వజ్రాలవంటి అతికఠినమైన దంతాలతో ఆమొసలిని రొమ్ముపగిలే విధంగా కొడుతున్నది. శ్రీమహావిష్ణువుభుజదండంవంటి తొండంతో మొసలి మెడను బిగించిపట్టుకొంటున్నది. ఆమొసలి మాటిమాటికీ శక్తినంతా ఉపయోగించి నీటిలోపలికి గుంజివేస్తున్నది. స్థానబలం ఉండటంవలన మొసలికి ఓడిపోతానేమో అని ఏనుగు పెనుఘీంకారాలతో దిక్కులను ముక్కలు చేస్తున్నది.

## 9

**మొసలి విజృంభణకు ఏనుగు తల్లడిల్లిపోతున్నది. మకరానికి అంతకంతకూ ఉత్సాహం ఉవ్వెత్తున పొంగిపొరలుతున్నది. నీటిలో మునిగితేలటంలో ఆరితేరిన ఆమొసలి పరాక్రమం ఇలా ఉన్నది.**

**శా. పాదద్వంద్వము నేల మోపి పవనున్ బంధించి పంచేంద్రియో**
**న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ మాఱాకు హత్తించి ని**
**ష్ఖేద బ్రహ్మపదావలంబన గతిం గ్రీడించు యోగీంద్రు మ**
**ర్యాద న్నక్రము విక్రమించె కరి పాదాక్రాంత నిర్వక్ర మై. 8-65**

రెండుకాళ్ళనూ గట్టిగా నేలకు తన్నిపట్టి, ఉచ్ఛ్వాస నిశ్వాసాలను గొప్పసాధనతో నిలిపిఉంచాడు. చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు అనే అయిదు ఇంద్రియాల పిచ్చితిరుగుళ్ళను మచ్చిక చేసుకొని తనవశంలో పెట్టుకున్నాడు. బుద్ధి అనే లతకు మాఱాకు తొడిగాడు. అణువంత దు:ఖం కూడాలేని బ్రహ్మపదాన్ని చేరుకొనేదారిలో విహరించే పరమయోగి ఇలా ఉంటాడు. ఇక్కడ మొసలి ఆయోగీంద్రుని తీరుతెన్నులను మనకు స్ఫురింపజేస్తూ ఏనుగు పాదాలపట్టులో ఏమాత్రమూ సడలింపులేనిదై పరాక్రమిస్తున్నది.

## 10

**గజరాజు మహాశక్తితో ఆజలగ్రహంతో పెక్కేండ్లు పోరాడినది. దేహశక్తి సన్నగిల్లిపోతున్నది. తన పగవానిబలం పెరిగిపోతున్నది. దీనిని గెలవటం అసాధ్యం అనుకొన్నది. అప్పుడు దానికి పూర్వపుణ్యాం వలన దివ్యజ్ఞానం పెల్లుబికి వచ్చింది. ఇలా అనుకుంటున్నది.**

శా. ఏ రూపంబున దీని గెల్తు, నిటమీ దే వేల్పు చింతింతు, నె
వ్వారిం జీరుదు, నెవ్వ రడ్డ మిక, ని వ్వారిప్రచారో త్తమున్
వారింపం దగువార లెవ్వ, రఖిల వ్యాపారపారాయణుల్
లేరే, మ్రొక్కెద దిక్కుమాలిన మొ ఱాలింపం ప్రపుణ్యాత్మకుల్. 8-71

ఈ మొసలిని ఏరూపంతో నేను గెలుస్తాను? ఇకపైన ఏ దేవతను తలచుకుంటాను? ఎవ్వరిని ఆశ్రయిస్తాను? ఎవరితో మొరపెట్టుకుంటాను? నాకూ ఈ మొసలికీ అడ్డపడి నన్ను రక్షించేవారెవ్వరు? దీనిని నిలువరించేవారెవ్వరు? ఎటువంటి అలవికాని పనినైనా అలవోకగా చేసి ఆశ్రయించినవారి ఆర్తిని పోగొట్టే దీక్షగల మహాపుణ్యాత్ములు దిక్కుమాలినవారి మొరలను చెవినిపెట్టే మహాత్ములు లేరా? ఉంటే వారికి మ్రొక్కుతాను.

## 11

**ఏనుగునకు తనవెనుకటి వైభవం గుర్తుకువచ్చింది. కడుపులో చల్ల కదలకుండా హాయిగా ఉండే అవకాశాన్ని చేసేతులా జారవిడుచుకొని యిక్కడికి రావటం తనబుద్ధిలేనితనం అనుకొంటున్నది.**

శా. నానానేకప యూథముల్ వనములోనం బెద్దకాలంబు స
న్మానింపన్ దశలక్షకోటి కరిణీనాథుండ నై యుండి మ
ద్దానాంభ: పరిపుష్ట చందన లతాంత చ్ఛాయలం దుండలే
కీ నీరాశ నిటేల వచ్చితి, భయం బెట్లోకదే, యీశ్వరా ! 8-72

నేను ఎంతగొప్పవాడను ! మహారణ్యంలో పెక్కుఏనుగుల గుంపులు నన్ను మన్ననతో సేవిస్తూ ఉంటాయి. నాసుఖభోగాలకు ఇష్టపడి నన్ను ఆనందింపజేస్తున్న ఆడఏనుగులు పదిలక్షల కోట్ల సంఖ్యలో ఉన్నాయి. నాఒడలినుండి వెలువడే మదజలంతో ఏపుగా పెరిగిన, తీగలల్లుకొన్న మంచిగందపు చెట్ల నీడలలో నేను విలాసంగా, వినోదంగా తిరుగుతూ ఉండవచ్చు. కానీ కర్మప్రాబల్యంవల్ల అక్కడ ఉండలేక దప్పిక తీర్చుకోవటానికి ఇక్కడకు ఎందుకు వచ్చిపడ్డాను? గుండెలో గుబులు కలుగుతున్నదయ్యా ఈశ్వరా !

## 12

**గజేంద్రునకు గుండె నిలువటంలేదు. అయినా పూర్వపుణ్యఫలంవలన దివ్యజ్ఞాన సంపద అమృతపు బుగ్గలాగా పొంగుకొనివస్తున్నది. పరమాత్మ చైతన్యం అంతరాంతరాలలో పరవళ్ళు త్రొక్కుతున్నది. దానివలన వెలువడే పలుకులు ఉపనిషత్తులను తలపింపజేస్తున్నాయి.**

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీన మై
యెవ్వనియందు డిందు పరమేశ్వరు డెవ్వడు మూలకారణం
బెవ్వ డనాది మధ్య లయు డెవ్వడు సర్వము తాన యైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్. 8-73

ఈ జగత్తు అంతా ఏపరమాత్మవలన పుట్టినదో, ఎవనిలోపల భద్రంగా వేరుచేయటానికి వీలుకాకుండా ఉంటుందో, చివరకు ఎవనిలో లయమైపోతుందో, ప్రభువులకు కూడా ప్రభువై పాలించే మహాత్ముడు

ఎవడో, సర్వమునకు మొట్టమొదటి కారణం ఎవడో, మొదలు, నడుమ, చివర అనే దశలు ఎవనికి ఉండవో, సర్వమూ తానే అయినవాడెవడో అట్టి ఈశ్వరుని, అవసరాన్నిబట్టి తనంతతాను అవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన చేసే పరమాత్మను నాకు రక్షకుడై రావలసినదని ప్రార్థిస్తూ ఉంటాను.

## 13

**గజేంద్రుని హృదయంలో ఉపనిషత్తుల దివ్యజ్ఞానం కదలాడుతున్నది. అతని సుకృతం పండి మొసలిపట్టు అతనికి ఆర్తిని కలిగించింది. దానితో అద్భుత వేదాంతరహస్యాలు అతనినోటినుండి వెలువడుతున్నాయి.**

**క. ఒకపరి జగములు వెలినిడి, యొకపరి లోపలికి గొనుచు నుభయము దా నై**
**సకలార్థ సాక్షి యగు న, య్యకలంకుని వాత్మమూలు నర్థి దలంతున్ 8-74**

పరమాత్మ ఈ జగములనన్నింటినీ ఒకమారు వెలుపలికి తెస్తూ ఉంటాడు. మరొకమారు, అల్లిన గూటిని సాలెపురుగులాగా, లోపలికి తీసుకుంటూ ఉంటాడు. ఆవిధంగా వెలుపలికి వచ్చిన ప్రపంచమూ తానూ ఒకటే అయిపోతాడు. ఈ ఆటకు తనబాధ్యత ఏమీలేకుండా కేవలం సాక్షిగా అంటుసొంటులు లేనివాడై అలరారుతూఉంటాడు. జీవులందరికీ ఆదికారణం అయిన ఆపరమాత్మను స్మరిస్తూ ఉంటాను.

## 14

**అది ఒకగొప్పవెలుగు. అయితే దానిని గుర్తించటం చాలా కష్టం. కానీ గుర్తించితీరాలి. ఎందుకంటే దానికంటె వేరొకటి లేదు. అంటున్నది గజేంద్రం.**

**క. లోకంబులు లోకేశులు, లోకస్థులు తెగినతుది నలోకం బగు పెం**
**జీకటి కవ్వల నెవ్వడు, నేకాకృతి వెలుగు నతని నే సేవింతున్ 8-75**

ఎన్నెన్ని లోకాలో ! ప్రతిలోకానికి కొంతకాలపరిమితికి లోబడి ఒకపాలకుడు ఉంటాడు. అటువంటి లోకేశులు ఎందరు వచ్చి వెళ్ళిపోయారో! ఇంకా ఎందరు రానున్నారో? ఇక ఆ లోకాలలో ఏర్పడి, కొంతకాలం ఉండి, మళ్ళీ అంతరించిపోతున్న జీవకోట్లు ఎన్నికోట్ల కోట్లసంఖ్యలో ఉన్నారో! ఆ లోకాలూ, ఆ లోకపాలకులూ, ఆ లోకంలోనివారూ పరమాత్మలాగా శాశ్వతంగా ఉండరు. లయమై పోతారు. ఆపని అయిన తరువాత ఏమీ ఉండదు. దానినే 'అలోకం' అంటారు. ఆలోకం పెద్దవెలుగు. అలోకం పెనుచీకటి. దానికి ఆవలివైపున ఒక మహావ్యక్తి, ఒక మహాశక్తి, చెక్కుచెదరని ఆకారంతో ప్రకాశిస్తూ ఉంటాడు. ఆయనే పరమాత్మ. అలా ఉన్న పరమాత్మణ్ణి నేను సేవించుకుంటాను.

## 15

**ప్రపంచంలో ఎంతోమంది వ్యక్తులూ, ఎన్నెన్నో పదార్థాలూ మనకు కానవస్తున్నాయి. తత్త్వదృష్టితో గమనిస్తే అందరూ, అన్నీ ఆపరమాత్మయే. నా ఆర్తిని అంతంచేసి నన్ను కాపాడే ఆస్వామిని నేను కొనియాడుతాను.**

**క. నర్తకునిభంగి పెక్కగు, మూర్తులతో నెవ్వ డాడు మునులున్ దివిజుల్**
**కీర్తింప నేర రెవ్వని, వర్తన మెరు లెఱుగ రట్టి వాని నుతింతున్ 8-76**

అతడు ఎన్నివేషాలయినా వేసి రక్తి కట్టింపగల మహానర్తకుడు. ఏక్షణాన ఏరూపంతో, ఏవిధంగా ఆడుకుంటాడో, తపస్సంపన్నులయిన మునులూ, పుణ్యాలపంట పండించుకొని దేవలోకంలో సుఖంగా తిరుగుతున్న దేవతలూ కూడా తెలుసుకోలేరు. అతని తీరుతెన్నులు ఈవిధంగా ఉంటాయి అని ఎవరూ కొనియాడలేరు. అట్టి పరమాత్మని నాకు తెలియవచ్చినవిధంగా స్తోత్రం చేస్తాను.

## 16

**ఆర్తిలో నిలువెల్లా మునిగినవానికి అన్నీ అనుమానాలే. 'ఉన్నాడు' అనుకొన్నవాడు నిజంగా ఉన్నాడా? లేడా? అని సందేహం కలిగింది గజేంద్రునికి. దానినే చెప్పుకుంటున్నాడు.**

**క. కల డందురు దీనులయెడ, గల డందురు పరమయోగి గణములపాలం,**
**గల దందు రన్ని దిశలను, కలడు కలం డనెడువాడు కలడో లేడో 8-86**

ఆ పరమాత్మ దిక్కులేని దీనులపట్ల ఉంటాడు అని తత్త్వం తెలిసినవారు విస్పష్టంగా ప్రకటిస్తున్నారు. అలాగే పరమమైన యోగసాధన చేసి ఫలసిద్ధి పొందిన యోగుల సముదాయాల సంరక్షణకోసం 'ఉన్నాడు' అంటారు. అన్ని దిక్కులందూ ప్రతి అణువులోనూ 'ఉన్నాడు' అంటారు. కానీ అలా ఢంకా బజాయించి ఉన్నాడు, ఉన్నాడు అని చెప్పుకొనే ఆస్వామి నిజంగా ఉన్నాడో, లేడో !

## 17

**గజేంద్రునకు మెల్లమెల్లగా తన సంరక్షకునియందు నమ్మకం కలుగుతున్నది. కానీ ఆపరమాత్మ తనను ఆదుకోవటానికి ఎందుకు రావటం లేదు ఆరాటం పెరిగిపోతున్నది. ఇలా అనుకుంటున్నాడు.**

**సీ. కలుగడే నాపాలి కలిమి సందేహింప కలిమిలేములు లేక గలుగువాడు**
**నా కడ్డవడ రాడె నలి నసాధువులచే బడిన సాధుల కడ్డపడెడు వాడు**
**చూడడే నా పాటు చూపుల జూడక చూచువారల కృప జూచువాడు**
**లీలతో నా మొ ఱాలింపడే మొఱగుల మొఱ లెఱుంగుచు దన్ను మొఱగువాడు**

**అఖిలరూపులు తనరూపమైనవాడు**
**ఆది మధ్యాంతములు లేక యడరువాడు**
**భక్తజనముల దీనుల పాలివాడు**
**వినడె, చూడడె, తలపడె, వేగరాడె. 8.87**

నాపట్ల ఉన్నాడా అని సందేహిస్తున్నాను. నిజానికి ఆయనకు ఉండటమూ, లేకుండటమూ లేదు. మరెందుకు నన్ను వచ్చి రక్షింపడు? ఇతరులకు పీడించటమే శీలం అయిన వారి పాలబడిన సజ్జనులకు అడ్డంగా నిలిచి రక్షించేస్వామి నాకు అడ్డపడరాడేమిటి? లోపలిదృష్టితో చూడగలిగిన యోగులను, భక్తులను కృపతో చూచే దయాశీలి నాపాటు చూడడేమి? మోసగాళ్ళ ఆర్తనాదాలు వినికూడా గుట్టుగా ఉండి మంచివారిని మాత్రమే కాపాడే ఆ దేవుడు నామొఱలు ఆలకింపడేమి? సృష్టిలో ఉన్న అన్ని రూపాలూ తనరూపాలే అయినవాడు. ఆదిమధ్యాంతములు లేక వెలుగొందేవాడు. భక్తజనములయెడలా, దీనులయెడలా అండగా నిలిచేవాడు అయిన ఆపరమాత్మ వినడేమి? కనడేమి? నన్నుగూర్చి పట్టించుకోడేమి? వడివడిగా రాడేమి?

## 18

గజేంద్రుడు పరిపరివిధాలైన భావాలకు లోనవుతున్నాడు. చిట్టచివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు. దానిమీద స్థిరంగా నిలిచిఉన్నాడు. అంటున్నాడు వింటున్న విష్ణువుతో -

**శా. లా వొక్కింతయు లేదు, ధైర్యము విలోలం బయ్యె, బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె, తనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్,**
**నీవే తప్ప నిత: పరం బెఱుగ, మన్నింపందగున్ దీనునిన్,**
**రావే యీశ్వర ! కావవే వరద ! సంరక్షించు భద్రాత్మకా ! 8-90**

ఈశ్వరా! ఇంక నాలో సత్తువ కొంచెం కూడా లేదు. ధైర్యం చెల్లాచెదరైపోయింది. ప్రాణాలు ఏక్షణానసైనా జారిపోయేవిధంగా తమతమతావులనుండి వెలుపలికి వచ్చాయి. మూర్ఛ వస్తున్నది. శరీరం బడలిపోయింది. అలసత నిలువెల్లా ఆక్రమించింది. నన్ను కాపాడేవాడవు నీవు కాక మరొకరు లేరు. ఇటుగాని అటుగాని ఏదీ నాకు తెలియరాకున్నది. దీనుణ్ణి. నన్ను మన్నించు. రావయ్యా! రా! నీవు భక్తులు కోరిన వరాలిచ్చేవాడవు గదా! నన్ను కాపాడు. భద్రాత్మకా! నన్ను సంరక్షించు.

## 19

గజేంద్రుడు ఎలుగెత్తి ఆక్రోశిస్తున్నాడు. స్వామి మహాగుణాలను సంభావిస్తూ పిలుస్తున్నాడు. తననే రక్షకునిగా సంభావిస్తున్న సంగతిని ఆయనకు నివేదించుకుంటున్నాడు.

**ఓ కమలాప్త! ఓ వరద! ఓప్రతిపక్షవిపక్షదూర! కు**
**య్యో! కవియోగివంద్య! సుగుణోత్తమ! ఓ శరణాగతమరా**
**నోకహ! ఓ మునీశ్వర మనోహర! ఓ విపుల ప్రభావ! రా**
**వే! కరుణింపవే! తలపవే శరణార్థిని నన్ను గావవే! 8-92**

స్వామీ! కమలాపతీ! అందరికీ కోరినవరాలిచ్చే కరుణాశాలివి. పగవారిని కూడా పగవారుగా భావింపని దయామయా! గొప్పమేధాబలంగల యోగులు కూడా నిన్ను నిరంతరం ఆరాధిస్తూ ఉంటారు. నీ గుణాలన్నీ సద్గుణాలే. వానివలన నీవు పురుషోత్తముడవు కదయ్యా! శరణు కోరివచ్చిన వారికి నీవు కల్పవృక్షానివి. మునిశ్రేష్ఠుల మనస్సులను హరించేవాడవు. నీ ప్రభావానికి ఎటువంటి ఎల్లలూ లేవు. రా తండ్రీ! నన్ను కరుణించు. నన్ను ఒక్కసారి 'వీడు నావాడు' అనుకో. రక్షణ కోరి నిన్నాశ్రయించిన నన్ను కాపాడు మా అయ్యా!

## 20

గజేంద్రుడు ఆర్తభక్తుడు. సుకృతి. తనగోడు తన స్వామికి అరమరికలు లేకుండా విన్నవించు కుంటున్నాడు. అతనిమొర అచ్యుతునికి వినిపించింది. అచ్యుతుడు మాత్రమే పట్టించుకున్నాడు.

**ఆ. విశ్వమయత లేమి వినియు నూరక యుండి**
**రంబుజాసనాదు లడ్డపడక**
**విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు**
**భ క్తియుతున కడ్డపడ దలంచి 8-94**

పరమాత్మ అయిన విష్ణువొక్కడే విశ్వమయుడు. అంటే విశ్వమంతా తానే అయి ఉన్నవాడు. అటువంటిస్థితి బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు మొదలైనవారికి లేదు. అందువలన ఆగజేంద్రుని ఆర్తనాదం విని కూడా వారు అతనికి అడ్డపడక ఊరక ఉండిపోయారు. విశ్వమయుడైన విష్ణువు మాత్రం ఎక్కడ కావాలంటే అక్కడ, ఏరూపం కావాలంటే ఆరూపంతో ఏర్పడగలవాడు కనుకనూ, ఎల్లవేళలా జయమే పొందగలవాడు కనుకనూ తనయందు అచంచలమైన భక్తిగల ఆ గజేంద్రుణ్ణి కాపాడదలచుకున్నాడు.

# 21

**స్వామి సద్భక్తుణ్ణి సంరక్షించటానికి బయలుదేరాడు. ఆపదలో చిక్కుకొన్న అర్భకుణ్ణి కాపాడి అక్కున చేర్చుకోవటానికి ఆరాటపడే అమ్మలా బయలుదేరాడు. అక్కడ దేనితో ఏమి పనిపడుతుందో అనే ఆలోచన కూడా ఆయనకు కలుగలేదు.**

**మ. సిరికిం జెప్పడు శంఖ చక్ర యుగముం జేదోయి సంధింప డే**
**పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణి కాం**
**తర ధమ్మిల్ల ము జక్క నొత్తడు; వివాద ప్రోద్ధత శ్రీ కుచో**
**పరి చేలాంచల మైన వీడడు గజ ప్రాణావనోత్సాహి యై. 8-96**

తన ప్రియకాంత శ్రీదేవికి చెప్పలేదు. అక్కడ అవసరమవుతాయేమో అని రెండు చేతులలో శంఖాన్నీ, చక్రాన్నీ కూర్చుకోలేదు. ఎవ్వనితో ఏమిపనిపడుతుందో అనుకొని సేవకుల నెవ్వరినీ రండయ్యా! నాతోరండి అని పిలువలేదు. ఎంతదూరం ఎలా పోవాలో అని తన వాహనమైన గరుత్మంతుణ్ణి సిద్ధం చేసికోలేదు. చెవి కమ్మలమీద చీకాకు కలిగిస్తూ చెదరిపడుతున్న కేశపాశాన్ని ముడివేసుకోలేదు. ఆర్తునిపోలికేక వినకముందు అమ్మవారితో ఆడుకుంటూ వినోదపు కలహంలో చేత చిక్కించుకొన్న ఆమె వక్షస్థలం మీది వస్త్రం అంచును కూడా వదలిపెట్టలేదు. ఏనుగు ప్రాణాలను కాపాడాలి అనే ఉత్సాహం ఒక్కటే సర్వమూ అయిన స్వామి పరుగులు తీస్తున్నాడు.

# 22

**అయితే ఏమవుతుంది ? కావలసిన కార్యమంతా చక్కగా జరిగిపోతుంది. స్వామిచిత్తం ఎరిగిన అందరూ, అన్నీ ఆయనవెంట అప్రయత్నంగా అంగలు వేసుకుంటూ బయలుదేరటాన్ని పోతనగారు అతి రమణీయంగా మనకు తెలియజేస్తున్నారు.**

**మ. తనవెంటన్ సిరి, లచ్చివెంట నవరోధ వ్రాతమున్, దాని వె**
**న్కను పక్షీంద్రుడు, వాని పొంతను ధను: కౌమోదకీ శంఖ చ**
**క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు రా వచ్చి రో**
**య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాల గోపాలమున్. 8-98**

స్వామి అలా బయలుదేరాడో లేదో ఎప్పుడూ విడచిఉండని లక్ష్మీదేవి వెంటబడింది. ఆమె వెనుక అంత:పురంలోని అంగనామణులందరూ బయలుదేరారు. వారిని చూచి పక్షిరాజు గరుత్మంతుడు దూకుకుంటూ వస్తున్నాడు. అతనిననుసరించి శారఙ్గమనే విల్లూ, కౌమోదకి అనే గదా, పాంచజన్యమనే శంఖమూ, సుదర్శనమనే చక్రమూ మొదలైనవన్నీ వరుసలో నిలిచి ఉరకలు వేస్తున్నాయి. నిరంతరమూ నారాయణ స్మరణతో ఆనందం పొంగులెత్తే అంతరంగం గల నారదుడు వచ్చి చేరాడు. సేనాపతి విష్వక్సేనులవారు చేరుకున్నారు. ఇంక చెప్పేదేముంది ? వీరందరినీ చూచి వైకుంఠపురంలో ఉన్న పసిపిల్లలు మొదలుకొని గోవులను కాచుకొనే గోపాలుర వరకూ అందరూ గజేంద్రుడున్న తావునకు తరలివచ్చారు.

## 23

బయలుదేరిందికానీ అమ్మవారి అంతరంగంలో అనేకమైన ఆలోచనలు. ఎక్కడికి, ఏపనిమీద, ఎంత దూరం పోవాలి? అనే భావపరంపర ఆమెను నిలువనీయటంలేదు.

**మ. తన వేంచేయు పదంబు పేర్కొన, డనాథ స్త్రీ జనాలాపముల్**
**వినెనో, మ్రుచ్చులు మ్రుచ్చిలించిరొ ఖలుల్ వేదప్రపంచంబులన్,**
**దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో, భక్తులం**
**గని చక్రాయుధు డేడి చూపు డని ధిక్కారించిరో దుర్జనుల్. 8-100**

నాస్వామి తాను ఎక్కడికిపోతున్నాడో చెప్పలేదు. దిక్కులేని అబలల ఆర్తనాదాలు చెవిని పడ్డాయేమో! నిలువెల్లా విషమే అయిన నీచులు దొంగలై వేదరాశులను దొంగిలించారేమో! రక్కసిమూకలు దేవతల రాజగృహాలమీద దండెత్తినవేమో! పాడుబుద్ధిగల వివేకహీనులు భక్తులను చూచి, చక్రం చేతబట్టి ఏదో అద్భుతాలు చేస్తాడంటున్నారే ఆ బోడిచక్రాయుధుడు ఎక్కడ ఉన్నాడో చూపండిరా అని ధిక్కరించి పలుకుతున్నారేమో!

## 24

శ్రీమహాలక్ష్మికి చిత్తం చెదరిపోతున్నది. స్వామి సంరంభం ఏమిటో తెలుసుకోవాలి. ఒకవేళ తనతో అయ్యే పనిఏదైనా ఉంటే చేయటానికి నడుముకట్టాలి కదా! అందుకని తెలుసుకోవటానికి ఆరాటపడుతున్నది. ఆ ఆరాటాన్ని అద్భుతమైన అక్షరాల చిత్రంతో మనకందిస్తున్నాడు పోతన.

**క. అడిగెద నని కడువడి జను, నడిగిన దను మగుడ నుడుగ డని నడ యుడుగున్**
**వెడ వెడ చిడిముడి తడబడ, నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్.**

అడిగివేస్తాను అని ఆయనకంటె కొంచెం వడినిపెంచి ముందుకు పోతున్నది. ఇంతలోనే యీ మహానుభావుడు తనవైపు తిరిగి సావధానంగా చెబుతాడో లేదో అని మళ్ళీ వెనక్కి తిరుగుతున్నది. మనస్సంతా గందరగోళంగా ఉన్నది. అడుగులు తడబడుతున్నాయి. అడుగువేయాలి అనుకోవటమే కానీ అడుగుముందుకు పడటంలేదు. కాళ్ళల్లో కదలిక లేనిస్థితి ఏర్పడుతున్నది.

## 25

లోకమాత లక్ష్మీదేవి స్వామివెన్నంటిపోతూ అష్టకష్టాలు పడుతున్నది.

**సీ. నిటలాలకము లంటి నివుర జుం జు మ్మని ముఖసరోజము నిండ ముసరు తేంట్లు**
**అళుల జోపగ చిల్క లల్ల నల్లన జేరి ఓష్ఠబింబ ద్యుతు లొడియ నుఱుకు**
**శుకముల దోల జక్షుర్మీనములకు మందాకినీ పాఠీనలోక మెగుచు**
**మీనపంక్తులు దాట మెయిదీగెతో రాయ శంపాలతలు మింట సరణి గట్టు**

ఆ. శంపలను జయింప చక్రవాకంబులు కుచయుగంబు దాకి క్రొవ్వు చూపు
మెలత మొగిలుపిఱిది మెఱుగు దీగెయుబోలె జలదవర్ణువెనుక జరుగునపుడు 8-104

విష్ణుదేవుని వెన్నంటి భక్తరక్షణకోసం పరువులు తీస్తున్న అమ్మవారి పరిస్థితి ఎలా ఉందంటే – నుదుటి మీద ముంగురులు క్రమ్ముకొంటున్నాయి. వానినంటుకొని మోముదామరమీద జుంజుం అంటూ మధురనాదం చేస్తూ తుమ్మెదలు ముసరుకొంటున్నాయి. వానిని పూనికతో తోలే ప్రయత్నంలో ఉండగా రామచిలుకలు మెల్లమెల్లగా చేరి క్రిందిపెదవి కాంతులను ఒడిసిపట్టుకుంటున్నాయి. చిలుకలను తరిమివేసిన వెంటనే కన్నులనే ఒంపుసొంపుల చేపలను మిన్నేటిలోని పెద్దచేపలు తరుముకొని వస్తున్నాయి. ఆచేపల వరుసలను దాటుకోగా మేను అనే తీగతో మెఱుపుతీగలు మింటిలో రాసుకుంటున్నాయి. మెఱుపుతీగలను ప్రక్కకు తొలగింపగా చక్రవాకాలు పాలిండ్లపై వ్రాలి క్రొవ్వుచూపుతున్నాయి. మబ్బువెనుక మసలే మెఱుపుతీగలాగా నీలమేఘశ్యాముని వెంటనంటిన లక్ష్మీదేవి స్థితి ఇలా ఉన్నది.

## 26

**శ్రీమహావిష్ణువు ఆకాశవీధిలో పయనిస్తూ ఏనుగును రక్షించటానికి వస్తున్నాడు. ఆదర్శనం కవివరేణ్యుని హృదయంలో కమనీయరసభావాలను ఉప్పొంగజేస్తున్నది. ఆ పొంగును పాఠకుని హృదయంలో పరవళ్ళు త్రొక్కించటానికై వర్ణిస్తున్నాడు పోతన మహాకవి.**

మ. వినువీథిం జనుదేర గాంచి రమరుల్ విష్ణున్, సురారాతి జీ
వనసంపత్తి నిరాకరిష్ణు, గరుణా వర్ధిష్ణు, యోగీంద్ర హృ
ద్వన వర్తిష్ణు, సహిష్ణు, భక్తజన బృందప్రాభవాలంకరి
ష్ణు, నవోఢోల్లసదిందిరా పరిచరిష్ణున్, జిష్ణు, రోచిష్ణునిన్. 8-105

గగనమార్గంలో వస్తూ ఉండగా దేవతలు పారవశ్యంతో పరమాత్మను దర్శించుకున్నారు. ఆ మహాత్మునిలో దేవతలపగవారైన రక్కసుల బ్రదుకుపంట బండలపాలు కావటం కానవస్తున్నది. భక్తులయెడల దయను ఆస్వామి మరింతగా పెంపొందిస్తున్నాడు. యోగంలో మిన్నులుముట్టినవారి హృదయాలనే వనాలలో విహరిస్తున్నాడు. భక్తులకోసం ఎంతలేసి కష్టాలనైనా సహించేశీలం అతనిది. భక్తజనుల గుంపుల సంపదలే ఆయన అలంకారాలుగా చేసుకుంటాడు. ఎల్లవేళలా క్రొత్తపెండ్లి కూతురే అయిన ఇందిర పరిచర్యలను ప్రేమతో లాలనతో అందుకుంటూ ఉంటాడు. జయమందుకోవటమే ఆయన శీలం. అతని దేహపు వెలుగులు ప్రపంచాన్నంతటినీ ప్రకాశింపజేస్తూ ఉంటాయి.

## 27

**భక్తరక్షణ కళాసంరంభంతో భూమికి దిగివస్తున్న శ్రీహరినిగూర్చి పారవశ్యంతో ఒకరినొకరు హెచ్చరించుకుంటూ స్వామికి మ్రొక్కులు చెల్లించుకుంటున్నారు దేవతలు.**

మ. చనుదెంచెన్ ఘను డల్ల వాడె హరి, పజ్జం గంటిరే లక్ష్మి, శం
ఖనినాదం బదె, చక్ర మల్లదె, భుజంగధ్వంసియున్ వాడె, క్ర
న్నన నేతెంచె నటంచు వేల్పులు నమో నారాయణా యేతి ని
స్వను లై మ్రొక్కిరి మింట హ స్తిదురవస్థావక్రికిం చక్రికిన్. 8-107

'చూచారా చూచారా! అదిగో హరి మహానుభావుడు విచ్చేశాడు. అదిగో ఆప్రక్కనే లోకమాత లక్ష్మీదేవి నిలిచిఉన్నది. శంఖంనాదం అదిగో. అదిగదిగో చక్రం. అతడే కదయ్యా సర్పాలను సర్వనాశనం చేసే గరుత్మంతుడు. వడివడిగా వచ్చాడు'. అని ఆనందంతో దర్శించుకుంటూ 'ఓం నమో నారాయణాయ' అనే మంత్రాన్ని జపిస్తూ ఏనుగు దురవస్థను రూపుమాపటానికి వస్తున్న చక్రధరునికి మ్రొక్కుతున్నారు దేవతలు. వారి గుంపులతో, ఘోషలతో గగనమంతా నిండిపోయింది.

## 28

**స్వామి మకరేంద్రుణ్ణి మట్టుపెట్టాడు. గజేంద్రుణ్ణి గట్టెక్కించాడు. అందరికీ ఆనందాన్ని అందించాడు. కాగా తరువాతి కథలో ఆ ఏనుగు వెనుకటి జన్మలో ఎవరో తెలియజేస్తున్నారు.**

**మ. అవనీనాథ ! గజేంద్రు డా మకరితో నాలంబు గావించె, మున్**
**ద్రవిళాధీశు డతండు పుణ్యతము డింద్రద్యుమ్న నాముండు, వై**
**ష్ణవముఖ్యుండు, గృహీత మౌననియతిన్ సర్వాత్ము నారాయణు**
**సవిశేషంబుగ బూజ చేసెను మహాశైలాగ్ర భాగంబునన్ 8-122**

పరీక్షిన్మహారాజా! మొసలితో పెద్దకాలం పోరాడిన ఆగజేంద్రుడు వెనుకటి జన్మలో ద్రవిడదేశానికి ఏలిక. గొప్పపుణ్యం మూటకట్టుకొన్న మనీషి. ఆయనపేరు ఇంద్రద్యుమ్నుడు. విష్ణుభక్తులలో పేరుప్రఖ్యాతులు సంపాదించినవాడు. మౌనవ్రతాన్ని అవలంబించి సర్వాత్ముడైన శ్రీమన్నారాయణుని శ్రద్ధాభక్తులతో గొప్ప కొండకొమ్ముమీద కూర్చుండి ఆరాధించాడు.

## 29

**మహాభక్తుడే. మహోదాత్తవ్యక్తియే ఆ ఇంద్రద్యుమ్నుడు. కానీ ధ్యాననిష్ఠలో ఉండగా ఒక అపచారం జరిగిపోయింది. దానివలన ఏనుగైపుట్టాడు. ఆ వివరం చెబుతున్నాను. విను అంటున్నారు శుకయోగీంద్రులు.**

**మ. ఒకనా డా నృపు డచ్యుతున్ మనములో నూహింపుచున్ మౌని యై**
**యకలంకస్థితి నున్నచో గలశజుం డ చ్చోటికిన్ వచ్చి లే**
**వక పూజింపక యున్న రాజు గని నవ్యక్రోధు డై మూఢ ! లు**
**బ్ధ కరీంద్రోత్తమ యోని బుట్టు మని శాపం బిచ్చె భూవల్లభా ! 8-123**

రాజా! ఒకనాడు ఆరాజు మనస్సులో అచ్యుతుని నిలుపుకొన్నాడు. మనస్సును చెదరకుండా నిగ్రహించుకున్నాడు. మహావిష్ణువునే భావిస్తున్నాడు. చుట్టుప్రక్కల ఏమి జరుగుతున్నదో తెలిసికొనే స్థితిలో లేడు. మాటలాడటం మానివేశాడు. అతని ధ్యానంలో రవంత కళంకం కూడా లేదు. అదిగో ఆస్థితిలో అక్కడకు అగస్త్య మహాముని ఏతెంచాడు. ఆయన అన్నివిధాలా పూజింపదగిన తపస్సంపన్నుడు. ఈయనఏమో ధ్యానంలో ఉన్నకారణంగా లేవలేదు. పూజింపలేదు. అటువంటి రాజును చూచిన మునివర్యునకు పట్టనలవికాని కోపం చెలరేగింది. మూఢా! లుబ్ధా! ఏనుగు కడుపులో పుట్టు – అని శపించాడు.

# 30

'గజేంద్రమోక్షం' అనేది భాగవతంలో ఒక విలక్షణమైన కథ. జీవుడు సంసారం అనే మొసలి కోరలలో చిక్కుకొని భగవంతుని అనుగ్రహంతో విడుదలపొందటం ఇందులో ప్రతీకాత్మకంగా తెలియజెప్పారు. కాబట్టి దీనిని జాగరూకతతో భావించి నరుడు సంసారంనుండి విముక్తిని పొందాలి. దానిని స్ఫురింపజేస్తూ ఫలశ్రుతిని వివరిస్తున్నారు.

**సీ. నరనాథ ! నీకును నాచేత వివరింప బడిన యీ కృష్ణానుభావ మైన**
**గజరాజ మోక్షణ కథ వినువారికి యశము లిచ్చును గల్మషాపహంబు**
**దుస్స్వప్న నాశంబు దుఃఖసంహారంబు బ్రొద్దుల మేల్కాంచి పూతవృత్తి**
**నిత్యంబు పఠియించు నిర్మలా త్మకు లైన విప్రులకును బహువిభవ మమరు**

**ఆ. సంపదలు గల్గు; పీడలు శాంతిబొందు; సుఖము సిద్ధించు; వర్ధిల్లు శోభనములు;**
**మోక్షమఱచేతిదైయుండు ముదము చేరు; ననుచు విష్ణుండు ప్రీతుడై ఆనతిచ్చె 8-185**

రాజా! పరీక్షిత్తూ! నేను నీకు వివరించిన ఈ గజేంద్రమోక్షణ కథ శ్రీకృష్ణుని మహిమను చక్కగా వివరిస్తుంది. ఈకథ వినేవారికి కీర్తిని కలిగిస్తుంది. పాపాలను పోగొడుతుంది. పాడుకలలను నశింపజేస్తుంది. పాడుకలలంటే పాడుబ్రదుకులే. దుఃఖాన్ని తొలగించివేస్తుంది. సూర్యోదయం కాకముందే నిద్రనుండి మేల్కొని పవిత్రమైన నడవడితో ప్రతిదినమూ ఈ కథను పఠించే నిర్మలమైన అంతరంగం గల విద్యావంతులకు అనేక విధాలైన సంపదలు కలుగుతాయి. పీడలు శాంతిస్తాయి. మంగళములు వృద్ధి పొందుతాయి. మోక్షం అరచేతిలో ఉన్న వస్తువులాగా ఉంటుంది. ఆనందం కలుగుతుంది. అని సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే చెప్పాడు.

# 31

**భాగవతమహాకావ్యంలో వామనచరిత్ర ఒక ఆనందలహరి. ఆ కథకు అంకురార్పణవంటిది పరీక్షిత్తు అడుగుతున్న ఈ ప్రశ్న.**

**మ. బలి నంభోరుహనేత్రు డేమి కొఱకై పాదత్రయిన్ వేడె; ని**
**శ్చలుడుం బూర్ణుడు లబ్ధకాముడు రమాసంపన్నుడై తా పర**
**స్థలికిన్ దీనునిమాడ్కి నేల చనియెన్; దప్పేమియున్ లేక ని**
**ష్కలుషున్ బంధన మేల చేసెను; వినం గౌతూహలం బయ్యెడిన్. 8-437**

స్వామీ! శుకయోగీంద్రా! బలిచక్రవర్తిని పద్మాలవంటి విశాలసుందరాలైన కన్నులున్న హరి మూడడుగుల నేలను దేనికోసం అడిగాడు ? ఆయన జీవులకులాగా చంచలమైనచిత్తం కలవాడు కాదు. ఏ లోపమూ లేనివాడు. అన్ని కోరికలూ నిండుగా తీరినవాడు. అంటే ఏమీ అక్కరలేనివాడు. అట్టి పురుషోత్తముడు దీనునిలాగా పరులతావునకు వెళ్ళాడు. అంతేకాదు ఏ తప్పులేని మహాత్ముడు, పుణ్యాత్ముడు అయిన బలిని బంధించాడు. ఇది వింత అయిన విషయం. దీనిని వివరంగా తెలుసుకోవాలని గుండెనిండా కోరిక ఉన్నదయ్యా! నాకోరిక తీర్చు మహానుభావా!

# 32

శ్రీమహావిష్ణువు అవతారప్రయోజనం సాధించటంకోసం తల్లిదండ్రులనుగా అదితికశ్యపులను ఎన్నుకున్నాడు. తన నిజస్వరూపాన్ని మరుగుపరచి కపట వటువువేషం తాల్చి అమ్మముందర ఆటలాడు కుంటున్నాడు. తల్లి అదితి అతనిని చూచి ఆనందపారవశ్యంతో ఇలా అంటున్నది.

**ఆ. నన్ను గన్నతండ్రి ! నాపాలి దైవమ !**
**నా తప: ఫలంబ ! నా కుమార !**
**నాదు చిన్నివడుగ ! నా కులదీపక !**
**రాగదయ్య ! భాగ్యరాశి వగుచు. 8-514**

నా చిన్నికుమారా ! నీవు నన్నుగన్నతండ్రివి. నాపాలిదైవానివి. నేను చేసుకొన్న తపస్సులపంటవు. నాచిన్నివడుగ ! నాకులానికి చిన్నిదీపం అయినవాడా! నా భాగ్యాలరాశివై రా నాయనా!

నిలువెల్లా వాత్సల్యం అనే అమృతంతో నిండిన ఏతల్లి అయినా కన్నకొడుకును ఇలాగే పిలుస్తూ ఉంటుంది. కానీ లోకుల విషయంలో అవన్నీ కల్పనలు. ఇక్కడమాత్రం పరమసత్యాలు. ఎందుకంటే ఇక్కడి పసికూన పరమాత్మ కదా! కనుక అందరికిలాగానే అమ్మకు కూడా తండ్రియే. దైవమే. తపస్సుల ఫలమే. కులమంటే లోకాల సముదాయం. దానికి వెలుగును ప్రసాదించే దీపమే.

# 33

మహావిష్ణువు సర్వసంపదలకు నిలయమైన మహాలక్ష్మికి భర్త. కానీ ఇప్పుడు చిల్లిగవ్వలేని భిక్షుకుడై ఇంద్రునికోసం రాక్షసేంద్రుని దగ్గరకు బిచ్చమెత్తడానికి వెళ్ళాడు. దానిని సమర్థిస్తున్నారు శుకయోగీంద్రుడు.

**క. హరిహరి సిరియురమునగల, హరి హరిహయు కొఱకు దనుజునడుగన్ జనియెన్**
**బరహిత రతమతియుతు లగు, దొరలకు నడుగుటలు నొడలి తొడవులు పుడమిన్**

హరిహరీ! లక్ష్మీదేవిని వక్ష:స్థలంమీద నిలుపుకొన్న శ్రీహరి హరిహయుడైన ఇంద్రునికోసం ఒకరాక్షసుని దగ్గరకు బిచ్చమెత్తడానికి వెళ్ళాడు. ఇది ఎంత వింత! కాదులే. ఇతరులకు మేలు చేయటమే ఎల్లప్పుడు కోరిక అయిన దొరలకు ఇలా బిచ్చమెత్తటాలు దేహానికి అలంకారాలు అవుతాయి. దానిని ఒకలీలగా సంభావించి సంతోషించండి. భగవంతుడు ఏమిచేసినా అందులో ఆయన గొప్పతనమే తెలియవస్తుంది.

# 34

బలిచక్రవర్తి ఒక గొప్పయజ్ఞం చేస్తున్నాడు. హరి వామనుడై అవతరించి ఆయజ్ఞశాలకు చేరుకున్నాడు. బుడిబుడి నడకలు చూచేవారిని ఆనందసాగరంలో ముంచియెత్తుతున్నాయి. చక్రవర్తిని చూచి పవిత్రము, అక్షతలు గల కుడిచేతిని ఎత్తి ఇలా ఆశీర్వదిస్తున్నాడు.

**ఉ. స్వస్తి జగత్త్రయీ భువన శాసనక ర్తకు, హాసమాత్ర వి**
**ధ్వస్త నిలింపభ ర్తకు, నుదారపద వ్యవహ ర్తకున్, మునీం**
**ద్రస్తుత మంగళాధ్వర విధానవిహ ర్తకు, నిర్జరీ గళ**
**న్యస్త సువర్ణ సూత్ర పరిహర్తకు, దానవలోకభ ర్తకున్. 8-545**

మూడులోకాలకూ ఏలిక అయినవానికి, నవ్వినంత మాత్రాన దేవేంద్రుడంతవానిని కూడా రూపు మాపగల శక్తినిండుగా ఉన్నవానికి, ఉదారుడు అనే పదంతో వ్యవహరింపదగినవానికి, మునివర్యుల స్తుతులతో కూడిన శుభప్రదమైన యజ్ఞవిధులలో ఎల్లవేళలా విహరించేవానికి, దేవకాంతల మెడలలోని మంగళసూత్రాలను తొలగించి వేసే పరాక్రమశాలికీ, రాక్షసలోకానికి పాలకుడైనవానికీ బలిమహాప్రభువునకు స్వస్తి.

# 35

**బలిచక్రవర్తి గొప్పదానశీలుడు. ఇప్పుడు తనదగ్గరకు వచ్చినవాడు ముద్దులు మూటగడుతున్న మోహన బ్రహ్మచారి. అతడు తన గొప్పతనాన్ని గొప్పమాటలతో పేర్కొని స్వస్తి వాచనం చేశాడు. దానికి ఆనందపడి ఇలా అంటున్నాడు.**

**వడుగా ! ఎవ్వరివాడ వెవ్వడవు ? సంవాసస్థలంబెయ్యది**
**య్యెడకున్ నీవరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మమున్;**
**కడుధన్యాత్ముడనైతి నీమఖము యోగ్యంబయ్యె; నాకోరికల్**
**గడతేఱెన్; సుహుతంబులయ్యె శిఖులుం; కల్యాణ మిక్కాలమున్ 8-549**

బ్రహ్మచారీ ! నీ తల్లిదండ్రులెవ్వరు ? నీవు ఎవడవు ? నీవు ఉండే ఊరేది ? ఇప్పుడు నీవు ఇక్కడకు రావటంవలన నా వంశమూ, నాపుట్టువూ పొందవలసిన ప్రయోజనాన్ని పొందాయి. నాయనా ! నేను చాలా ధన్యాత్ముడనయ్యాను. నాయీ యజ్ఞం యోగ్యమై ఒప్పారుతున్నది. నా కోరికలన్నీ తీరినవి. నా అగ్నిహోత్రాలు గొప్ప పదార్థాలైన హోమద్రవ్యాలతో, ఏజారుపాటూలేని మంత్రతంత్రాలతో వెలుగొందుతున్నాయి. నేను కోరుకొనే శుభాలను అనుగ్రహించే మంచికాలం ఇది.

# 36

**తన ధన్యతను మేలైన ఉదాత్తవాక్యాలతో ప్రకటించి ఆ బ్రహ్మచారి తననుండి ఏదైనా దక్షిణగా గ్రహించి మరింత ధన్యుణ్ణి చేయాలనే కోరికతో బలిచక్రవర్తి ఇలా అంటున్నాడు.**

**మ. వరచేలంబులొ, మాడలో, ఫలములో, వన్యంబులో, గోవులో,**
**హరులో, రత్నములో, రథంబులొ, విమృష్టాన్నంబులో, కన్యలో,**
**కరులో కాంచనమొ నికేతనములో గ్రామంబులో భూములో**
**ధరణీఖండమొ, కాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా ! 8-550**

బ్రాహ్మణవరేణ్యా! నీకు కోరినది సమర్పించుకొని నేను యాగఫలం పొందుతాను. అడుగు. మేలుజాతి వస్త్రాలు కావాలా ? బంగారు నాణేలు ఇత్తునా ? రుచికరములైన పండ్లు ఇవ్వమంటావా ? అడవులలో లభించే పుట్టతేనె వంటివి కోరుకుంటావా? ఆవులను అడుగుతావా ? గుఱ్ఱాలా ? రత్నాలా ? రథాలా ? పంచభక్ష్యపరమాన్నాలతో కూడిన భోజనాలా ? కన్యలా ? ఏనుగులా ? బంగారమా ? గొప్పభవనాలా ? అగ్రహారాలా ? భూములా ? లేక నేను పరిపాలించే రాజ్యంలో భాగమా ? ఇంకా నేను పేర్కొనని ఏది అయినా అడుగు. నేను ఆనందంతో ఇస్తాను.

# 37

**బలిచక్రవర్తి మాటలన్నీ విన్నాడు మాయాబ్రహ్మచారి. పైకి దిక్కుమాలినవాడనే భావన కలిగే విధంగానూ, లోపల దేవదేవుడైన పరమాత్మ అనే అర్థం స్ఫురించే విధంగానూ ఇలా తన తత్త్వాన్ని తెలియజేస్తున్నాడు.**

సీ. ఇది నాకు నెలవని యేరీతి బలుకుదు ఒకచోటనక ఎందునుండనేర్తు
ఎవ్వనివాడ నంచేమని పలుకుదు నా యంతవాడనై నడవనేర్తు
ఈనడవడి యని యెట్లు వక్కాణింతు పూని ముప్పోకల పోవనేర్తు
అదినేర్తు నిదినేర్తు నని యేల చెప్పంగ నేరుపు లన్నియు నేన నేర్తు

ఆ. ఒరులు గారు నాకు నొరులకు నేనౌదు; నొంటివాడ; చుట్టమొకడు లేడు
సిరియు తొల్లి గలదు; చెప్పెద నాటెంకి; సుజనులందు తఱచు చొచ్చియుందు. 8-552

ఓ చక్రవర్తీ ! ఇది నేనుండేచోటు అని ఎలా చెప్పగలనయ్యా! ఒకచోటు అనకుండా అన్నిచోట్లా ఉండగలుగుతాను. ఎవ్వరివాడవు అని అడిగావు. దానికి బదులుపలకటం సాధ్యంకాదు. ఎందుకంటే నేను సర్వతంత్ర స్వతంత్రుడను. నీనడవడి ఎటువంటిది అంటే ఏమి చెప్పను? నా సంకల్పంతో నేను మూడు పోకలతోపోతూ ఉంటాను. అవి నేలమీదా, నింగిలోను, నీటిపైనా కావచ్చు. ఏవిద్యలు నేర్చుకున్నావు అంటావనుకో అన్ని విద్యలూ నాలో అద్భుతంగా అలరారుతున్నాయి. నాకెవరూ ఏమీకారు. కానీ నేనందరికీ అన్నీ అవుతాను. నేను ఏకాకిని. చుట్టం ఒక్కడు కూడా లేడు. సంపద వెనుక ఉండేదిలే! అడిగావు కనుక నానెలవు చెబుతాను. సాధారణంగా మంచివారిలో కలసిమెలసి ఉంటాను.

## 38

**నీవు ఏది కావాలంటే అది ఇస్తాను అంటున్నాడు బలిచక్రవర్తి. వచ్చినవాడు ఏకోరికలూ లేని పూర్ణకాముడని తెలియదు. ఆయనకు తగినట్లుగానే బదులు పలుకుతున్నాడు పరమాత్ముడైన వామనమూర్తి.**

ఆ. ఒంటివాడ; నాకు నొకటి రెం డడుగుల
మేర యిమ్ము సొమ్ము మేర యొల్ల
కోర్కెదీర బ్రహ్మకూకటి ముట్టెద
దానకుతుకసాంద్ర ! దానవేంద్ర ! 8-566

దానాలు చేయాలనే ఉబలాటం గుండెనిండా ఉన్న ఓ రాక్షసరాజా! నేను ఒంటరివాడను. ఒకటి, రెండడుగుల నేల నాకు చాలు. ఇవ్వు. సొమ్ములూ, కొమ్మలూ నాకు అక్కరలేదు. ఆ మూడడుగుల కోరిక తీరిందనుకో. దానితో బ్రహ్మదేవుని జుట్టు ముడిని ముట్టినంతగా సంబరపడిపోతాను.

భగవంతుడు ఒక్కడే. భగవంతుళ్ళు లేరు. ఆయన అనంతుడు. ఇప్పుడు బలిచక్రవర్తిని ఉద్ధరించటానికి మూడడుగులనేల కావాలి. బ్రహ్మకూకటిని త్రివిక్రమమూర్తియై ఎలాగూ తాకుతాడు. అని పరమాత్మ లక్షణాన్ని సూచనగా తెలియజేస్తున్నాడు.

## 39

**బలికి వామనుని పలుకులు వింతగా తోచాయి. ఇలా అన్నాడు. మహానుభావా! నీవన్న మాటలన్నీ నిజాలే. కానీ ఇంతకొంచెమా అడగటం. దాత పెంపునైనా తలపవద్దా, ఇదిగో చూడు.**

మ. వసుధాఖండము వేడితో, గజములన్ వాంఛించితో, వాజులన్
వెస నూహించితొ, కోరితో యువతులన్, వీక్షించి కాంక్షించితో
పసిబాలుండవు, నేర వీ వడుగ, నీ భాగ్యంబు లీపాటిగా
నసురేంద్రుండు పదత్రయం బడుగ నీ యల్పంబు నీనేర్చునే. 8-569

నేనేలే భూభాగంలో కొంతమేర కోరరాదూ. ఏనుగులను అడుగరాదా ? గుఱ్ఱాలను అడుగవచ్చు కదా! అందచందాలతో మంచి వయస్సులో ఉన్న కాంతలను ఇమ్మంటే ఇవ్వనా ? పాపం పసివాడవు. ఏమి కోరుకోవాలో నీకు తెలియదు. నీభాగ్యాలు ఈమాత్రానివి అయినంత మాత్రాన మూడడుగుల నేలను ఇవ్వటానికి రాక్షస చక్రవర్తికి మనస్సు ఒప్పుతుందా ?

# 40

**బలిచక్రవర్తి తన దానసామర్థ్యానికి తగినట్లు ఇవ్వగలవానికి సంబంధించిన పట్టికను ఏకరువుపెట్టాడు. కానీ పొట్టివడుగు సుకుమారంగా తనకు ఏది కావాలో ఆపట్టికను ఆయన విప్పుతున్నాడు.**

**గొడుగో జన్నిదమో కమండలువొ నాకున్ ముంజియో దండమో,**
**వడుగేనెక్కడ ? భూములెక్కడ ? కరుల్ వామాక్షులశ్వంబు లె**
**క్కడ ? నిత్యోచితకర్మమెక్కడ ? మదాకాంక్షామితంబైన మూ**
**డడుగుల్ మేరయు త్రోవ కిచ్చుటయ బ్రహ్మాండంబు నాపాలికిన్.** **8-571**

మహారాజా! నేను కోరదగినవి చాలా చిన్నవస్తువులు గొడుగో, జన్నిదమో, కమండలువొ, దర్భల మొలత్రాడో, మోదుగదండమో. బ్రహ్మచారినైన నాకు భూములతో, ఏనుగులతో, సుందరాంగులతో, గుఱ్ఱాలతో పని ఏమున్నదయ్యా! నేను ప్రతిదినము శ్రద్ధతో చేసుకొనే సంధ్యావందనం మొదలైన పనులకు నీవు చెప్పినవి ఏవీ ఉపయోగపడవుకదా! కాబట్టి నాకోరికకు లోబడి ఉన్న మూడడుగుల నేలను కాదనకుండా ఇవ్వటమే నాపాలిట బ్రహ్మాండం ఇచ్చినట్లు.

# 41

**అంతేకాదు. ఇవ్వగలిగినవాడు ఇస్తున్నకొద్దీ పుచ్చుకొనేవానికి ఆశ పెరుగుతూ ఉంటుంది. ఆమాయ రోగానికి మందు ఉందా అనిపిస్తుంది. అంటున్నాడు వామనుడు -**

**శా. ఆశాపాశము దా గడు న్నిడుపు; లే దంతంబు రాజేంద్ర !; వా**
**రాశిప్రావృత మేదినీవలయ సామ్రాజ్యంబు చేకూడియుం**
**గాసిం బొందిరి గాక వైన్య గయ భూకాంతాదులు న్నర్థకా**
**మాశన్ బాయగనేర్చిరే మును; నిజాశాంతంబులం జూచిరే.** **8-574**

రాజా! ఆశ అనేది ఒక మహాపాశం. అది చాలాచాలా పొడవైనది. దానికి అంతంలేదు. సముద్రాలు చుట్టుకొన్న భూవలయ సామ్రాజ్యం చేతికి చిక్కినా పృథువు, గయుడు మొదలైన రాజులు ఆశను చంపుకోలేక తామే నాశనమయ్యారు కానీ అర్థకామాలమీది ఆశను వదలగలిగారా ? ఆశకు అంతం చూడగలిగారా ?

# 42

**బాలుడు తన ప్రలోభాలకు ఏమాత్రం తలఒగ్గే తీరులో లేడు. మహాదానం ఇవ్వలేకపోతున్నాననే దిగులు బలికి మనస్సులో ఉన్నా అడిగినది ఇచ్చి తృప్తిపడదామనుకొని దానమివ్వటానికి పూనుకున్నాడు. అప్పుడు గురువు శుక్రాచార్యుడు ఇలా అంటున్నాడు -**

**సీ. దనుజేంద్ర ! యీతడు ధరణీసురుడు గాడు; దేవకార్యంబు సాధించుకొఱకు**
**హరి విష్ణు డవ్యయుం డదితిగర్భంబున గశ్యపసూను డై గలిగె; నకట**
**యెఱుగ వీతనికోర్కె; నిచ్చెద నంటివి; దైత్యసంతతి కుపద్రవము వచ్చు;**
**నీ లక్ష్మి తేజంబు నెలవు నైశ్వర్యంబు వంచించి యిచ్చును వాసవునకు;**

**ఆ. మొనసి జగములెల్ల మూడుపాదంబుల నఖిలకాయు డగుచు నాక్రమించు**
**సర్వధనము విష్ణుసంతర్పణము చేసి బడుగుపగిది యెట్లు బ్రదికె దీవు 8-577**

రాక్షస చక్రవర్తీ! ఈ వచ్చినవాడు బ్రాహ్మణ బాలకుడు కాదు. దేవతలపని చక్కబెట్టటానికి వచ్చిన విష్ణువు. అవ్యయుడు. ఎట్టి మార్పులూ ఎగుడు దిగుళ్ళూ లేనివాడైనా తన పూనికతో అదితి కడుపులో కశ్యప ప్రజాపతికుమారుడై అవతరించిన మహాత్ముడు. నీకు తెలియదు. కోరిక తీరుస్తానంటున్నావు. నీ నిర్ణయంవలన మన రాక్షస కులమంతా నాశనం అయిపోతుంది. నీ సంపదను, నీ తేజస్సును, నీ స్థానాన్నీ, నీ ప్రభుత్వ మహిమను కపటమార్గంలో కొల్లగొట్టి యింద్రునికిస్తాడు. మూడు అడుగులతో లోకాలనన్నింటిని హద్దూపద్దూలేని దేహంతో ఆక్రమిస్తాడు. నీకున్న ధనం మొత్తంగా విష్ణువునకు సంతర్పణం చేసి పరమదరిద్రుడవై ఎలా బ్రదుకుతావయ్యా ?

## 43

**ఇస్తాను అనిమాట ఇచ్చాను. ఇప్పుడు ఇవ్వను అనటం బొంకు అవదూ ! పలికి బొంకేవాడు పాపాత్ముడంటున్నాయి ధర్మశాస్త్రాలు. ఆపాపం మూట ఎలాకట్టుకోను అంటావేమో. విను -**

**ఆ. వారిజాక్షులందు, వై వాహికములందు,**
**ప్రాణ విత్త మాన భంగమందు,**
**చకిత గోకులాగ్రజన్మ రక్షణమందు**
**బొంకవచ్చు; నఘము పొంద దధిప ! 8-584**

రాజేంద్రా! స్త్రీల విషయంలోను, వివాహ వ్యవహారాలలోను, ప్రాణభంగం, విత్తభంగం, మానభంగం సంభవించినప్పుడూ, భయపడిన ఆలమందలను, బ్రాహ్మణులను రక్షించవలసిన సందర్భాలలోను బొంకవచ్చు. దానివలన పాపం కలుగదు అని రాక్షసగురువైన శుక్రాచార్యులవారు, రాక్షసరాజైన బలిచక్రవర్తికి బోధించారు.

## 44

**శుక్రాచార్యులవారు శిష్యవాత్సల్యంతో బలిచక్రవర్తిని కాపాడాలని హితం చెప్పాడు. కానీ బలికి లౌకికమైన హితంమీద చూపులేదు. అతడు కోరుకొనేది పారమార్థిక హితం. గురువుమీది గౌరవానికి భంగంలేకుండా తన అభిప్రాయాన్ని గట్టిగా తెలియజేస్తున్నాడు.**

**శా. కారే రాజులు, రాజ్యముల్ గలుగవే, గర్వోన్నతిం బొందరే**
**వా రేరీ ? సిరి మూటగట్టుకొని పోవంజాలిరే, భూమిపై**
**పే రై నం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాము లై**
**యీరే కోర్కులు; వారలన్ మఱచిరే యి క్కాలమున్ భార్గవా ! 8-589**

పరమపవిత్రమైన భృగువంశంలో పుట్టిన పూజ్యగురుదేవా! మనకు ముందు ఎందరు రాజులు కాలేదు. ఎన్ని రాజ్యాలు లేవు? మేము సార్వభౌములము అని పొగరు సోపానాల చివరిదాకా పోలేదా ? వారేరీ ? సంపాదించిన ధనాన్ని మూటగట్టుకొని పోగలిగారా ? భూమిమీద పేరైనా నిలుపుకోగలిగారా? కీర్తిసంపద తప్ప. ఆర్తిని అందలం ఎక్కించే ఐశ్వర్యాన్ని అణుమాత్రమైనా అభిలషించని శిబి మొదలైన మహాత్ములు, ఏమికోరినా, ఎంతకోరినా ఇష్టంతో ఇచ్చారు. చిరంజీవులై వెలుగొందుతున్నారు. ఎన్నియుగాలు గడచినా వారిని మానవులు మఱచిపోయారా ?

## 45

**మహానుభావా! అడుగుతున్నవాడు అచ్యుతుడు. అన్ని లోకాలకూ ఆవలిభాగంలో అనంతంగా అలరారే ఆస్వామి పొట్టివాడై కోరి నాదరికి వచ్చి అడుగుతున్నాడు. నావంటివాడు ఇవ్వకపోవటం ధర్మం కాదే ! అయినా నాభాగ్యం ఎంత గొప్పదో గమనించండి.**

**శా. ఆదిన్ శ్రీసతి కొప్పుపై, తనువుపై, అంసోత్తరీయంబుపై**
**పాదాబ్జంబులపై, గపోలతటిపై, పాలిండ్లపై నూత్న మ**
**ర్యాదం జెందు కరంబు క్రిం దగుట, మీ దై నా కరం బుంట మే**
**ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే. 8-591**

ఆ శ్రీమహావిష్ణువు చేయి మొట్టమొదట మహాలక్ష్మీదేవి కొప్పుమీద వివాహ సమయంలో జీలకర్రా బెల్లం పెట్టినప్పుడు నిలిచిఉన్నది. తరువాత ఆమె సువర్ణమయ దేహాన్నంతటినీ సుకుమారంగా స్పృశించింది. కొన్ని సందర్భాలలో భుజంమీది ఉత్తరీయం అంచులను సవరించింది. మఱికొన్ని వేళలలో పద్మాలవంటి పాదాలను పరామర్శించింది. చెక్కిళ్ళపై చిందులాడింది. పాలిండ్ల మీద పారవశ్యంతో ప్రేమ వెల్లువతో కదలాడింది. ఆ మర్యాదలన్నీ ఎప్పటికప్పుడు క్రొత్తక్రొత్త అనుభూతులను స్వామికి కలిగించినట్టివి. అటువంటి భాగ్యసంపదగల ఆస్వామిచేయి క్రిందుగా ఉండటమూ, నాచేయి పైన ఉండటమూ, అహో ! ఎంత మహాభాగ్యమయ్యా! ఈ రాజ్యమూ గీజ్యమూ ఏ క్షణంలో ఉంటుందో, ఏ క్షణంలో ఊడుతుందో తెలియదు. దేనిని నమ్ముకొని మనం ఏదో బాముకుందామనుకుంటున్నామో ఆయీ దేహం కూడ అనుక్షణం అపాయంతో అలమటించేదేకదయ్యా! ఈ దౌర్భాగ్యంకోసం ఆ మహాభాగ్యాన్ని చేజార్చుకొనే అవివేకి ఎవడైనా ఉంటాడా?

## 46

**గురుదేవా! మరొక్కమనవి చేసుకుంటాను. బిచ్చమెత్తటానికి నిచ్చలు ఎందరో వచ్చిపోతూ ఉంటారు. కానీ ఈ గుజ్జువడుగును చూడు. అతడడిగినది యివ్వక పంపివేయటం నాకు సాధ్యమయ్యే పనికాదు - ఎందుకంటే -**

**మ.కో. ఎన్నడుం పరు వేడబోడట; యేకలం బట; కన్నవా**
**రన్నదమ్ములు నై న లేరట; యన్నివిద్యల మూలగో**
**ష్ఠి న్నెఱింగిన ప్రోడగు జ్జట చేతు లొగ్గి వసింప నీ**
**చిన్ని పాపని ద్రోసిపుచ్చగ చిత్త మొల్లదు సత్తమా ! 8-595**

ఏ సమయంలోనూ ఇతరులను వేడుకోవటానికి పోయినవాడు కాడట ! తోడూనీడా ఎవరూ లేనివాడట! కన్నతల్లిదండ్రులు గానీ తోడబుట్టువులు గానీ ఎవ్వరూ లేరట! పరమాత్మను తెలిపే సర్వవిద్యల మూలరహస్యాలను నిండుగా తెలిసిన ప్రౌఢబాలుడట ! భిక్షాందేహి అని చేతులు జోడించి ఎదురుగా నిలిచిఉన్నాడు. ఇట్టి చిన్నిపాపని త్రోసివేయటానికి చిత్తం రావటంలేదయ్యా ! గురుదేవా !

# 47

**బలిచక్రవర్తి గురుదేవుని ఒప్పించి మూడడుగుల నేలను ధారాపూర్వకంగా దానం ఇచ్చివేసాడు. వచ్చిన పనిని చక్కబెట్టటానికి వామనదేవుడు పెరిగిపోతున్నాడు. ఆపెంపును పోతనగారి అక్షరచిత్రంలో దర్శించి ఆనందిద్దాం -**

**శా. ఇంతిం తై వటు డింత యై మఱియు దా నింతై నభోవీథిపై**
**నంతై తోయద మండలాగ్రమున కల్లం తై ప్రభారాశిపై**
**నంతై చంద్రుని కంత యై ధ్రువునిపై నంతై మహర్వాటిపై**
**నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధి యై. 8-620**

మొదట ఇంత ఉన్న ఆబ్రహ్మచారి మరింతగా పెరిగాడు. ఇంకా పెంపొందాడు. నేలబారుజీవులు తలలు బాగాపైకి ఎత్తుకొని చూడవలసినంతగా ఆకాశమార్గంలోనికి చొచ్చుకొనిపోతున్నాడు. మేఘ మండలం దాటిపోయాడు. కాంతిగోళాలైన నక్షత్రాలపైకి పెరిగిపోయాడు. చంద్రమండలాన్ని దాటుకొని పైకిపోతున్నాడు. ధ్రువనక్షత్రం పైభాగం తాకుతున్నాడు, భూమినుండి నాలుగవది అయిన మహర్లోకాన్ని కూడ క్రిందుగా ఉంచుకొని పెరుగుతున్నాడు. అన్నింటికంటె చిట్టచివరిదైన సత్యలోకాన్ని కూడా క్రిందుచేస్తూ పైకిపోతున్నాడు. బ్రహ్మాండం ఆవలి అంచులను దాటుకొని విక్రమిస్తున్నాడు.

# 48

**బలిచక్రవర్తి దానధారను మంత్రపూర్వకంగా వదలిన వెంటనే వామనస్వామి త్రివిక్రముడయ్యాడు. ఆ పెరుగుదల క్రమంలో సూర్యబింబం గతి ఏవిధంగా ఉన్నదో తెలియజేస్తున్నాడు తెలుగులపుణ్యాపేటి పోతన మహాకవి.**

**మ. రవిబింబం బుపమింప పాత్ర మగు ఛత్రం బై, శిరోరత్న మై,**
**శ్రవణాలంకృత మై, గళాభరణ మై, సౌవర్ణ కేయూర మై,**
**ఛవిమత్కంకణ మై, కటిస్థలి నుదంచ ద్వస్త్ర మై, నూపుర**
**ప్రవరం బై, పదపీఠ మై, వటుడు దా బ్రహ్మాండము న్నిండుచోన్. 8-621**

క్రింద వామనుడు. పైన ఎక్కడో ఆకాశం అంచులలో సూర్యబింబం. అది మొదట ఆ మహాస్వామికి పట్టిన గొడుగులాగా ఉన్నది. పెరుగటంలోని రెండవదశలో ఆభానుబింబమే స్వామికి తలమానికంలాగా కనుపట్టింది. మూడవదశలో చెవికి పెట్టుకొన్న వజ్రాల ఆభరణం అయింది. తరువాత మెడలో ధరించిన హారంలోని నాయకమణియై అలరారినది. అటుపై భుజానికి అలంకరించుకొన్న బంగారుకేయూరమై ప్రకాశించింది. ఆవెనుక కాంతులతో వెలిగిపోతున్న ముంజేతికంకణమై ప్రకాశించింది. అటుపిమ్మట నడుము దగ్గర వింతవింత కాంతులతో విరాజిల్లుతున్న పీతాంబరమై అలరారింది. మరికొంతసేపటికి మడమభాగంలో అలంకరించుకొన్న అందెఅయి అందాలు చిందించింది. చివరకు ఆయన విలాసంగా పాదాలుపెట్టుకొనే పీఠం అయిపోయింది. ఈవిధంగా శ్రీమహావిష్ణువు ఏ కొలతలకూ అందనితనాన్ని మన అనుభవంలోనికి తెస్తున్నది ఈ పద్యం.

# నవమ స్కంధము

## 1

శ్రీహరికి పరమభక్తుడు అంబరీషుడు. విష్ణుప్రీతికై ఏకాదశినాడు ఉపవసించి ద్వాదశి గడియలు దాటకముందు నిష్ఠతో అతిథులకు అన్నంపెట్టి తాను తింటాడు. ఇది అతనివ్రతం. దుర్వాసమహర్షి అతనికి ఒక పరీక్షపెట్టాడు. చిన్నితప్పునకు, నిజానికి తప్పుకాదు, తాను తప్పనుకొని మహాకోపంతో అంబరీషునిపై కృత్యను ప్రయోగించాడు. శ్రీహరి కరుణించి వెఱ్ఱి తపసికి బుద్ధిచెప్పమని చక్రానికి చెప్పి పంపించాడు. అది దుర్వాసుని వెంటబడింది.

మ. భువిఁ దూఱన్ భువిఁ దూఱు నబ్ధిఁ జొర నబ్ధిం జొచ్చు నుద్వేగి యై
దివిఁ బ్రాఁకం దివిఁ బ్రాఁకు దిక్కులకుఁ బో దిగ్వీథులం బోవుఁ, జి
క్కి వెసన్ గ్రుంకినఁ గ్రుంగు, నిల్వ నిలుచున్, గేడింపఁ గేడించు, నొ
క్కవడిన్ దాపసు వెంటనంటి హరిచక్రం బన్యదుర్వక్రమై. 9-106

దుర్వాసుడు ప్రాణాలను దక్కించుకోవటానికి భూమిలోనికి దూరాడు. అతనివెంటనే చక్రమూ దూరింది. సముద్రంలోనికి చొరబాఱాడు. అది కూడా సముద్రంలోనికి దూరింది. గుండెలదరిపోతుండగా గగనంలోనికి గెంతులు వేశాడు. చక్రం కూడా ఆకాశంలో చిత్రచిత్రంగా తిరుగుతూ వెంటబడింది. దిక్కులకు పరువులెత్తాడు. ఏ దిక్కునకు పోతే ఆ దిక్కునందే అతనిని తరిమితరిమి కొడుతున్నది. దొరకిపోయాడనుకొన్నంతలో కొంచెం ముడుచుకొని తప్పించుకొనే ప్రయత్నం చేశాడు. అది కూడా అలాగే కుంచించుకొని పట్టుకోబోయినది. పరువెత్తలేక నిలబడిపోయాడు. చక్రంకూడా నిలిచిపోయింది. ఒడుపుగా తప్పించుకోబోయాడు. చక్రంకూడా ఒడుపుగా పట్టుకోబోయింది. ఈ విధంగా సుదర్శనచక్రం ఒక్కపెట్టున భక్తునికి బాధ కలిగించిన తాపసుని వెంటబడింది. దాని సత్తాను అడ్డుకొనే శక్తి మరెవ్వరికీలేదు.

## 2

దుర్వాసుడు అంబరీషునికి అపకారం చేయబోయి శ్రీ సుదర్శనచక్రం కలిగించే ఆపదను కొనితెచ్చుకున్నాడు. బ్రహ్మాదులను రక్షించవలసినదిగా ప్రార్థిస్తూ కాళ్ళా వేళ్లా పడ్డాడు. వారు శ్రీ మహావిష్ణువు తప్ప ఇతరులెవరూ రక్షించేవారు లేరని స్పష్టంగా చెప్పారు. గత్యంతరంలేక గజేంద్రవరదుని కాళ్ళమీద పడ్డాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు ఇలా అన్నాడు.

చ. చలమున బుద్ధిమంతు లగు సాధులు నా హృదయంబు లీల దొం
గిలి గొనిపోవుచుండుదు రకిల్బిష భక్తిలతాచయంబుల
న్నిలువగ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభి కైవడిన్;
వలలకు జిక్కి భక్తజనవత్సలతన్ జనుచుందు తాపసా ! 9-117

ఓయీ ! తపోధనా ! బుద్ధిపుష్కలంగా ఉన్న సాధుజనులు పట్టుదలతో నా హృదయాన్ని దొంగిలించుకొని పోతారు. ఏమాలిన్యమూలేని భక్తి అనే లతలతో వారి దగ్గరనే ఉండిపోయేవిధముగా మంచినేర్పుతో మదించిన మహాగజాన్నిలాగా కట్టిపడవేస్తారు. నేను ఏమి చేయగలను? ఆ భక్తజనులమీది వాత్సల్యంతో వారు పన్నిన వలలలో చిక్కి వారి త్రిప్పినట్లు తిరుగుతూ ఉంటాను.

## 3

**శ్రీహరి దుర్వాసునితో శ్రీమహావిష్ణు భక్తులకూ, తనకూ ఉన్న సంబంధాన్ని గూర్చి యిలా వివరిస్తున్నాడు.**

**ఆ. నాకు మేలు గోరు నాభక్తు డగువాడు**
**భక్తజనుల కేన పరమ గతియు**
**భక్తు డెందు జనిన బఱతెంతు వెనువెంట**
**గోవువెంట దగులు కోడె భంగి 9-118**

మహర్షీ ! భక్తితత్త్వాన్ని వివరిస్తున్నాను. విను. నాయందు నిర్మలమైన భక్తి ఉన్నవాడు నాకు మేలు కోరుతాడు. అంటే భక్తులను కంటికి రెప్పలాగా కాపాడాను అనే తృప్తి నాకు కలిగించటమే నాకు మేలు. అలాగే భక్తుల విషయంలో నేనే పరమగతి అయినవాడను. నేను వారిని పరిరక్షించగలిగినట్లు ఈ సృష్టిలో మరొకవ్యక్తిగాని శక్తిగానీ రక్షించలేదు. కాబట్టి నాభక్తుడు ఎక్కడకుపోతే అక్కడకు నేను వెంటబడి పరుగులెత్తుతూ పోతూ ఉంటాను. పాడి ఆవువెంట వదలకుండా పోతూఉండే దూడను చూచి ఉంటావు కదా! నేను భక్తుని వెంటపోవటం అలా ఉంటుంది.

## 4

**భక్తులు చాలా మహిమ కలవారయ్యా ! వారికి లోకసంబంధమైన బంధాలు ఏమీ ఉండవు. ఒక్క నాయందు మాత్రమే సంబంధం ఉంటుంది వారికి. అట్టివారి విషయంలో నేను ఎలా ఉంటానో గమనించు - అంటున్నాడు శ్రీహరి దుర్వాసునితో ...**

**ఆ. తనువు మనువు విడిచి తనయుల చుట్టాల**
**నాలి విడిచి సంపదాలి విడిచి**
**నన్నె కాని యన్య మెన్నడు నెఱుగని**
**వారి విడువ నెట్టివారి నైన. 9-120**

వారికి దేహంతో ముడిఉండదు. కన్నకొడుకులను, కట్టుకొన్న భార్యనీ, చుట్టాలనూ, సంపదలను అన్నింటినీ విడిచివేస్తారు. నన్నుతప్ప మరి దేనినీ వారుకోరరు. అటువంటివారు ఎట్టివారైనాసరే నేను విడిచిపెట్టను.

## 5

**అంబరీషోపాఖ్యానంతో దుర్వాసునకు శ్రీమహావిష్ణువు భక్తునిలక్షణాన్నీ భగవంతుని లక్షణాన్నీ ఇలా వివరిస్తున్నాడు.**

**క. సాధుల హృదయము నాయది, సాధుల హృదయంబు నేను జగముల నెల్లన్**
**సాధుల నేనే యెఱుగుదు, సాధు లెఱుంగుదురు నాదు చరితము విప్రా ! 9-122**

గొప్ప విద్యాతత్త్వం ఎరిగిన మహర్షీ ! పరమపవిత్రమైన జీవితం గడపేవారిని సాధువులంటారు. ఒక్క రహస్యం చెప్పనా ! అట్టివారి హృదయం నాదేనయ్యా! కాదుకాదు సాధువుల హృదయమే నేను. ఈ ప్రపంచంలో ఉన్న సాధువుల నందరినీ నేను మాత్రమే తెలుసుకోగలను. నాచరిత్రమును సాధువులు మాత్రమే తెలుసుకోగలరు. మరికొంత విప్పిచెప్పనా ? నేనేభక్తుడు. భక్తుడే నేను. నా భక్తులకు ద్రోహం చేయటమంటే నాకు ద్రోహం చేయటమే అని గుర్తించాలి.

# 6

విష్ణుదేవుని మాటలు వీనులారా విన్నాడు దుర్వాసుడు. మరొక గతిలేక భక్తశిఖామణి అయిన అంబరీషుని పాదాలమీద పడ్డాడు. అంబరీషుడు అది చూచి తట్టుకోలేకపోయాడు. హరిచక్రాన్ని అత్యద్భుతంగా స్తుతించాడు. అందులోని ఒక అమూల్యరత్నం ఈ పద్యం.

**ఉ. చీకటి వాపుచున్ వెలుగు సేయుచు సజ్జనకోటి నెల్ల స**
**శ్రీకుల జేయు నీరుచులు చెల్వుగ ధర్మసమేత లై నినున్**
**వాకున నిట్టి దట్టి దని వర్ణనసేయ విధాత నేరడ**
**స్తోకము నీదు రూపు గలదుం దుది లేదు పరాత్పరాద్య మై. 9-131**

ఓ సుదర్శనచక్రరాజమా ! నీవు అజ్ఞానమనే చీకటిని పటాపంచలు చేస్తావు. జ్ఞానమనే వెలుగు సజ్జనుల హృదయాలలో నిండుగా నిలుపుతావు. అట్టి నీవయిన కాంతులు ధర్మంతో నిండినట్టివి. అవి ఉత్తమపురుషుల సముదాయాలను సంపదల వెల్లువలు కలవానినిగా చేస్తాయి. అట్టి నిన్ను మాటలతో కొనియాడటం బ్రహ్మదేవునకు కూడా సాధ్యంకాదు. నీరూపం చాలా గొప్పది. దానికి అంతమంటూలేదు. అది పరములకు అన్నింటికి పరమమైనది. నీవలెనే సనాతనమైనది.

# 7

అంబరీషుడు సుదర్శన చక్రస్వామిని స్తుతిస్తూనే ఉన్నాడు. అసలు విషయానికి వచ్చి ఆపదలో పీకల వరకు మునిగి ఉన్న మహర్షిని కాపాడు అని ప్రార్థించి చివరకు ఇలా అంటున్నాడు.

**ఆ. ఏ నమస్కరింతు నింద్రశాత్రవ ధూమ**
**కేతువునకు ధర్మసేతువునకు**
**విమల రూపమునకు విశ్వగోపమునకు**
**చక్రమునకు గుప్త శక్రమునకు. 9-134**

స్వామీ! చక్రరాజమా! నీవు ఇంద్రుని పగవారికి బ్రదుకులేకుండా చేసే తోకచుక్కవు. ధర్మమునకు జారుపాటులేకుండా కాపాడే అడ్డుకట్టవు. నీది విమలమైన రూపం. విశ్వాన్నంతటినీ కంటికి రెప్పలా కాపాడే గొప్పశక్తి నీది. వాళ్ళూవీళ్ళూ అనటం ఎందుకు? సాక్షాత్తు మూడు లోకాలను ఏలే దేవేంద్రుణ్ణి కూడా రక్షించగల శక్తిసంపదకలవాడవు. అటువంటి సుదర్శన స్వామీ! నీకు నేను నిరంతరమూ నమస్కారం చేస్తాను.

# 8

అంబరీషుని అనుగ్రహం వలన సుదర్శన చక్రస్వామి అగ్నిజ్వాలలకు ఆహుతి అయిపోకుండా బయటపడ్డ దుర్వాస మహర్షి అతనిభక్తి సంపదను నోరారా కొనియాడుతూ ఇలా అన్నాడు.

**మ. ఒకమా టెవ్వనిపేరు కర్ణములలో నొయ్యార మై సోకినన్**
**సకలాఘుంబులు పల్లటిల్లి తొలగున్ సంభ్రాంతితో నట్టి స**
**త్సుకరున్ మంగళతీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశు దా**
**రకలంకస్థితి గొల్చు భక్తులకు లే దడ్డంబు రాజాగ్రణీ ! 9-141**

శ్రీ మహావిష్ణువు నామం అలవోకగానైనా చెవులలో పడితే అన్నిపాపాలూ గుండె గుబులుతో కంగారుపడుతూ పారిపోతాయి. రాజవరేణ్యా ! ఆయన భక్తులకు మేలుచేయటమే వ్రతం అయినవాడు. శుభాలను కలిగే పవిత్రనదీజలంవంటి పాదాలు కలవాడు. దేవతలకు ప్రభువులైన ఇంద్రుడు మొదలగువారికి కూడా ప్రభువు. అన్నింటినీ తనదిగా చేసుకొనేవాడు. ఇందుగలడందులేడని సందేహించనవసరం లేకుండా అంతటా వ్యాపించిఉండేవాడు. అట్టి పరమాత్ముని నిర్మలములైన మూడు కరణాలతో సేవించే భక్తులకు ఎక్కడా ఏ అడ్డూ ఉండదయ్యా !

## 9

**మహాభాగవతంలో పరమాద్భుతమైన భాగవతుల కథలు ఎన్నో ఉన్నాయి. అందులో భగీరథ చక్రవర్తి ఆకాశగంగను అవనికి తెచ్చినకథ మరింత అద్భుతమైనది. శుకమహర్షి పరీక్షిత్తునకు ఆ గాథను చెప్పి చివరకు ఇలా అన్నాడు.**

**మ. హరు మెప్పించి మహాతపో నియతుడై యాకాశగంగానదిన్**
**ధరకుం దెచ్చి నితాంత కీర్తిలతికా స్తంభంబుగా నవ్య సు**
**స్థిరలీలం బితృకృత్య మంతయు నొనర్చెన్ వారితానేక దు**
**స్తర వంశవ్యధు డా భగీరథుడు నిత్యశ్రీకరుం డల్పుడే. 9-231**

ఆమహానుభావుడు ఆషామాషీ దేవతలను కాదు. సాక్షాత్తూ పరమేశ్వరుణ్ణి తన తపస్సుతో మెప్పించాడు. ఆతపస్సు మానవమాత్రునకు సాధారణంగా సాధ్యంకాని నియమాలతో కూడినట్టిది. ఆతపఃఫలితంగా ఆకాశ గంగానదిని అవనికి తీసుకొనివచ్చాడు. అది అతని కీర్తిలతకు ఆధారంగా నిలిచిన మహాస్తంభమై అలరారుతున్నది. ఆపుణ్యనది పవిత్ర జలాలతో పితృకార్యం అంతటినీ శ్రద్ధతో నిర్వహించాడు. తనవంశంలోని పూర్వుల దాటనలవికాని వ్యథలనన్నింటినీ తొలగించివేశాడు. ఆ వంశంవారికి నిత్యమైన సౌభాగ్య సంపదలను సమకూర్చాడు. అట్టి భగీరథుడు సామాన్యుడా ?

## 10

**భాగవతులలో ఒక ప్రత్యేకత కలవాడు ఖట్వాంగ మహారాజు. సూర్యవంశంలో ఒకజాతిరత్నం. ఒకమారతడు దేవతలకోసం రాక్షసులతో యుద్ధంచేసి వారిని చంపాడు. దేవతలను తన ఆయువు ఎంత అని అడిగాడు. ఎక్కువలేదు. ఏదైనా వరం వేగంగా కోరుకో అన్నారు. అతడేమీ కోరకుండా ఇంటికివెళ్ళి వైరాగ్యం పొంది యిలా అనుకున్నాడు.**

**మ. ఇలమీదం బ్రతుకేల ? వేల్పుల వరం బేలా ? ధనం బేల చం**
**చల గంధర్వపురీ విడంబనము లైశ్వర్యంబు లేలా ? జగం**
**బుల బుట్టించు తలంపునం బ్రకృతితో బొత్తై తుదిం బాసి ని**
**ర్మల మై వాఙ్మనసామితం బగు పరబ్రహ్మంబు నే జెందెదన్. 9-254**

ఎందుకండీ ఈ భూమిమీద బ్రదుకు ? దేవతల వరాలెందుకు ? ధనాలెందుకు ? ఆకాశంలో మేఘాల కదలికతో ఏర్పడి క్షణంలో మాయమయ్యే గంధర్వ నగరాలవంటి ఐశ్వర్యాలెందుకు? ఇవన్నీ క్షణభంగురాలు. కనుక వీనితో నాకు పనిలేదు. ఆ పరమాత్మ ఈ జగత్తులనన్నీ పుట్టించే భావనతో ప్రకృతి అయిన మాయతో సంబంధం పెట్టుకుంటాడు. తన యిష్టం మేరకు మళ్ళీ పొత్తును వదలివేస్తాడు. అతనిలో ఏదోషమూ ఉండదు. అతనిని వాక్కులతోగానీ మనస్సుతోగానీ పట్టుకోలేము. అతనిలో ఐక్యం అయితే అతనివలె శాశ్వత స్థితిని పొందుతాను. అని భావించి రెండు క్షణాలలో కైవల్యమనే మహాఫలం పొందాడు.

# 11

**ఖట్వాంగుని వంశంలోనివాడే దశరథుడు. ఆ సూర్యవంశాన్ని స్థూలంగా పరిచయం చేస్తున్నది భాగవతం. దశరథునకు శ్రీరామచంద్రుడు పుత్రుడుగా అవతరించిన ఆనందకర సన్నివేశాన్ని పోతనగారు మనకు అమృతంలాగా అందిస్తున్నారు.**

**మ. అమరేంద్రాశకు పూర్ణచంద్రు డుదితుం డైనట్లు నారాయణాం**
**శమునం బుట్టె మదాంధ రావణ శిరస్సంఘాత సంఛేదన**
**క్రమణోద్దాముడు రాము డా గరితకున్ గౌసల్యకుం సన్నుతా**
**సమ నైర్మల్య కతుల్య కంచిత జను స్సంసార సాఫల్యకున్. 9-258**

తూర్పుదిక్కు అనే కాంతకు పూర్ణచంద్రుడు ఉదయించిన విధంగా కౌసల్యా మహాదేవికి శ్రీరామచంద్రుడు అవతరించాడు. ఆమె అందరకూ కొనియాడదగిన సాటిలేని నిర్మలత్వం రూపు తాల్చినదా అన్నట్టిది. ఆమెకు ఆమెయే సాటి. ఎన్నో పుట్టుకలతో అనంతంగా సాగుతూపోయే సంసారంలో సాఫల్యం పొందినట్టిది. ఆ పుట్టిన మహాత్ముడో! నారాయణుని కళ అయినవాడు. పొగరుతో కన్నులు మూసుకొనిపోయిన రావణాసురుని తలలవరుసను తరిగివేయటంలో గొప్పపాటవం కలిగిన శ్రీరామచంద్రుడు.

# 12

**రమణీయమైన రామాయణ గాథను రసవత్తరంగా అభివర్ణిస్తున్నాడు భాగవత ప్రవక్త భారతవంశకర్త అయిన పరీక్షిత్తునకు. జగత్తులన్నింటికీ కల్యాణాలను కలిగించే సీతారాములు దాంపత్యాన్ని సూచనామాత్రంగా చెబుతున్నాడు.**

**క. భూతలనాథుడు రాముడు, ప్రీతుం డై పెండ్లియాడె పృథుగుణమణి సం**
**ఘాతన్ భోగ్యోపేతన్, సీతన్ ముఖకాంతి విజిత సితఖద్యోతన్ 9-262**

యోగులందరూ ఎవనిని భావించి ఆనందసముద్రంలో మునిగితేలుతూ ఉంటారో అటువంటి శ్రీరామచంద్రుడు సీతాదేవిని పెండ్లియాడాడు. ఏదో లాంఛనంకోసం కాదు ప్రీతితో. నిజానికి భార్యాభర్తలు కాబోయేవారికి అనురాగం నిండుగా ఉండాలి. అలా ఉండటానికి లోకసామాన్యంగా కొన్ని కారణాలు ఉం డాలి. వానిని తెలియజేస్తున్నారు పోతనమహాకవి. ఆ సీతమ్మ తల్లి చాలాగొప్ప గుణాలనేమణులరాశి. ధర్మంతప్పని భోగపదార్థాలన్నీ ఆమెకు అందుబాటులో ఉన్నాయి. మోము వెలుగులు చందమామను వెక్కిరిస్తున్నాయి. అటువంటి జానకిని శ్రీరామచంద్రుడు ప్రీతితో పెండ్లియాడాడు.

# 13

**శ్రీరామచంద్రులవారికి సీతాదేవితో కల్యాణం అయినతరువాత పరిస్థితుల ప్రాబల్యంవలన పట్టాభిషేకం భంగమైపోయింది. దశరథుడు తనమూడవ భార్యకు ఇచ్చిన వరాలనుబట్టి రాముడు అరణ్యాలకు పోవలసి వచ్చింది.**

ఉ. పుణ్యుడు రామచంద్రు డట వోయి ముదంబున గాంచె దండకా
రణ్యము, దాపసోత్తమ శరణ్యము, నుద్ధత బర్హిబర్హ్వలా
వణ్యము, గౌతమీ విమల వా: కణ పర్యటన ప్రభూత సా
ద్గుణ్యము, నుల్లస త్తరు నికుంజ వరేణ్యము నగ్రగణ్యమున్. 9-267

పుణ్యమూర్తి శ్రీరామచంద్రుడు అలా అడవులలోనికి ప్రవేశించాడు. అందులో ఒక ప్రత్యేకప్రదేశం దండకారణ్యం. అది చాలాగొప్ప తపస్సుచేసిన మునీశ్వరులకు నివాసస్థలం. అక్కడ చక్కగా పెంపొందిన నెమళ్ళు పురులువిప్పుకొని నృత్యంచేస్తున్నాయి. గోదావరి నదిలోని స్వచ్ఛమైన నీటితుంపురుల కదలికలతో ఏర్పడిన గొప్పచల్లదనం నిలువెల్లా నింపుకొన్నట్టిది ఆవనం. పెద్దపెద్దచెట్లూ, నేలమీది పొదలూ ఆనందపారవశ్యంతో ఊగులాడిపోతున్నాయి. ఈ అన్నింటితో కలసి ఆ అరణ్యం అరణ్యాలన్నింటికీ అగ్రగణ్యం అయి ప్రకాశిస్తున్నది.

## 14

**శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణులతో తండ్రిమాటమీద అరణ్యావాసం చేస్తున్నాడు. మాయలమారి రాక్షసుడు రావణుడు మోసంచేసి సీతాదేవిని అపహరించుకొని వెళ్ళాడు. పుట్టెడుదుఃఖంతో పుట్టలూ, గుట్టలూ దాటుకుంటూ తిరుగుతున్నారు రామలక్ష్మణులు. వారికి హనుమంతుడు సుగ్రీవునితో చెలిమికలిగించాడు. తరువాత**

క. లీలన్ రామవిభుం డొక, కోలన్ గూలంగ నేసె గురు నయశాలిన్
శీలిన్ సేవితశూలిన్, మాలిన్ వాలిం దశాస్యమానోన్మూలిన్. 9-272

శ్రీరామచంద్రుడు సుగ్రీవుని అన్న వాలిని, అతడు చేసిన ధర్మద్రోహానికి శిక్షగా, ఒక్కబాణంతో లీలగా కూలనేశాడు. ఆవాలి తక్కువవాడేమీ కాదు. గొప్పనీతిశాలి. శూలం చేతబట్టిన శివమహాదేవుణ్ణి సేవించే గొప్పశీలం కలవాడు. అతనిమెడలో ఒక మహిమగల పూలమాల ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉండేది. దేవతలకు కూడా దిగులుపుట్టించే బలపరాక్రమాలు గల పదితలల రావణుని మానాన్ని పెల్లగించిపారవేసిన మహాబలుడు ఆవాలి.

## 15

**సుగ్రీవునితో చెలిమిచేసికొని అతనికి ఘోరమైన అపకారం చేసిన వాలిని చంపివైచి శ్రీరామచంద్రుడు తనప్రాణమే అయిన జానకిజాడలు తెలుసుకొని రావటానికి సరియైన వ్యక్తి ఎవరా అని పరికిస్తున్నాడు. అతని ఎట్టఎదుటనే చేతులుకట్టుకొని భక్తిపారవశ్యంతో నిలిచిఉన్నాడు హనుమ.**

క. ఇలమీద సీత వెదకగ, నలఘుడు రాఘవుడు వనిచె హనుమంతు నతి
చ్ఛలవంతున్ మతిమంతున్, బలవంతున్ శౌర్యవంతు ప్రాభవవంతున్. 9-273

ఆయనపేరు హనుమంతుడు. వజ్రపుదెబ్బకు ఉబ్బి అందంగా అలరారుతున్న చెక్కిలి గలవాడు. గొప్పమాటకారితనం నిండుగా ఉన్నవాడు. ఎవ్వరూ ఊహింపజాలని బుద్ధిబలం కలవాడు. ఇంక దేహబలం సంగతి సరేసరి. ఆ విషయంలో అతనికి అతడేసాటి యనదగినవాడు. పరాక్రమం అందామా, పగవానిమీద ఒక్కపెట్టునదూకి చీల్చిచెండాడగల శౌర్యం అతనిసొమ్ము. అన్నింటినీ, అందరినీ తన అదుపులో ఉంచుకోగల నిర్వహణ సామర్థ్యం కూడ అనంతంగా అమరినవాడు. అట్టి హనుమంతుణ్ణి మహాత్ముడైన శ్రీరాముడు సీతను వెదకటానికి పంపించాడు.

## 16

హనుమన్న జానకమ్మ జాడలు గుర్తించి రావణుని గుట్టుమట్టులన్నీ తెలిసికొని లంకను తోకచిచ్చుతో తగులబెట్టి శ్రీరామచంద్రుని దగ్గరకు తిరిగివచ్చాడు. రామలక్ష్మణులు కపిసేనతో సముద్రాన్ని దాటుకొని లంకకు చేరుకున్నాడు. రామరావణ మహాసంగ్రామం లోకభయంకరంగా జరిగింది. చిట్టచివరకు శ్రీరామచంద్రుడు -

మ. బలువింటన్ గుణటంకృతంబు నిగుడన్ బ్రహ్మాండ భీమంబుగా
ప్రళయోగ్రానల సన్నిభం బగు మహాబాణంబు సంధించి రా
జలలాముం డగు రాము డేసె ఖర భాషాశ్రావణున్, దేవతా
బల విద్రావణు, వైరిదారజన గర్భస్రావణున్, రావణున్. 9-302

తనవిల్లు చాలాగొప్పది. దాని అల్లెత్రాటినుండి రాముడు చేస్తున్న అతిఘోరమైన టంకారాలు బ్రహ్మాండమంతటికీ హడలు పుట్టిస్తున్నాయి. అటువంటి వింటికి ఒక మహాబాణం సంధించాడు. అది ప్రళయకాలంలోని ఉగ్రమైన అగ్నియా అన్నట్లు మంటలు క్రక్కుతున్నది. రాజులందరిలో తలపూవువంటి దాశరథి ఆబాణాన్ని రావణునిమీదికి మహావేగంతో వదలాడు. ఆ రావణుడు కారుకూతలతో దేవతలను కూడా అతలాకుతలం చేసేవాడు. గుంపులుగుంపులుగా తనమీదికి దూకుతూవచ్చే దేవతలను తరిమితరిమికొట్టే సాహసం కలవాడు. అతనిధాటికి పగవారిభార్యలు గర్భస్రావాలతో పరుగులుతీస్తూ ఉండేవారు. అటువంటి రావణునిమీద ఇటువంటి గొప్పబాణాన్ని ప్రయోగించాడు.

## 17

శ్రీరామచంద్రుడు రావణాసురుణ్ణి పుత్రమిత్రపరివార సమేతంగా పరిమార్చాడు. అగ్నిపరీక్షతో పవిత్ర అయిన జానకిని సగౌరవంగా సమీపానికి చేర్చుకున్నాడు. దారిలో భక్తశిఖామణి అయిన భరతుణ్ణి ఆనందపరచి అయోధ్యకు మహావైభవంతో పరివారంతో బయలుదేరాడు శ్రీరామచంద్రుడు.

కవగూడి యిరుదెస కపిరాజు రాక్షస
  రాజునొక్కెడ చామరములు దీవ
హనుమంతు డతి ధవళాతపత్రముపట్ట
  పాదుకల్ భరతుండు భక్తి తేర
శత్రుఘ్ను డమ్ములు చాపంబు గొనిరాగ
  సౌమిత్రి భృత్యుడై చనవు చూప
జలపాత్ర చేపట్టి జనకజ గూడిరా
  కాంచనఖడ్గ మంగదుడు మోవ

లా. పసిడి వేడె మర్థి భల్లూకపతి మోచి
కొలువ పుష్పకంబు వెలయ నెక్కి
గ్రహము లెల్ల గొలువ గడునొప్పు సంపూర్ణ
చంద్రుపగిది రామచంద్రు డొప్పె. 9-318

ఒకవంక వానరులు, మరొకవంక రాక్షసులు, ఇంకొకవంక తపస్సంపన్నులైన మహర్షులు. అదిగో అల్లదిగో దివ్యమైన పుష్పకవిమానం. దానిలో మహోన్నతపీఠంమీద సీతారాములను కూర్చోపెట్టారు. వానరరాజు సుగ్రీవుడూ, దానవరాజు విభీషణుడూ కొంచెం వెనుకవైపుగా జంటగా నిలుచుండి వింజామరలు వీస్తున్నారు. పరమభక్తాగ్రేసర చక్రవర్తి పవమానసుతుడు తెల్లని కాంతులతో విరాజిల్లే వెలిగొడుగును స్వామికిపట్టి నిలుచున్నాడు. నిలువెల్లా భక్తియే అనదగిన భరతుడు స్వామి పాదుకలను పాదాలదగ్గరకు చేరుస్తున్నాడు. చిన్నితమ్ముడు శత్రుఘ్నుడు వింటినీ, అమ్ములనూ భద్రంగా పట్టుకున్నాడు. సుమిత్ర పెద్దబిడ్డ లక్ష్మణుడు ఎప్పుడు ఏసేవ స్వామికి అవసరమౌతుందో అని ఏమాత్రమూ ఏమఱుపాటు లేకుండా కాచుకొనిఉ న్నాడు. లోకమాత సీతమ్మ పూర్ణజలకుంభం పదిలంగా పట్టుకొని స్వామికి చేరువలో కూర్చున్నది. అంగదుడు బంగారు ఖడ్గాన్ని మోస్తున్నాడు. మండలాకారంతో ఉన్న పసిడిగద్దెను జాంబవంతుడు పట్టుకున్నాడు. ఇలా వీరందరూ ఒక్కొక్కసేవ చేస్తూఉండగా పుష్పకం ఎక్కిన శ్రీరామచంద్రుడు గ్రహాలన్నీ చుట్టూనిలిచి కొలుస్తున్న నిండుజాబిల్లి లాగా ప్రకాశించాడు.

## 18

**లోకకల్యాణంకోసం రాక్షససంహారం చేసి శ్రీరామచంద్రుడు సీతామహాసాధ్వితో తిరిగివస్తున్నాడని తెలిసికొన్న అయోధ్యాపురవాసులందరూ ఆనందంతో పొంగిపోతూ స్వాగతసన్నాహాలు చేశారు.**

**సీ. వీధులు నున్నగావించి తోయంబులు చల్లి రంభాస్తంభచయమునిలిపి**
**పట్టుచీరలు చుట్టి బహుతోరణంబులు గలువడంబులు మేలుకట్లుకట్టి**
**వేదిక లలికించి వివిధరత్నంబుల మ్రుగ్గులు పలుచందములుగ బెట్టి**
**కలయగోడల రామకథ లెల్లవ్రాయించి ప్రాసాదములు దేవభవనములును**

**తే. గోపురంబుల బంగారు కుండ లెత్తి**
**యెల్ల వాకిండ్ల కానుక లేర్పరించి**
**జనులు కైసేసి తూర్యఘోషములతోడ**
**నెదురు నడతెంచి రా రాఘవేంద్రు కడకు. 9-320**

నగరంలోని బాటలనన్నింటిని ఎగుడు దిగుళ్ళు లేకుండా నున్నగా చేసుకున్నారు. చక్కగా, దుమ్ములేవకుండా నీళ్ళు చల్లారు. బాటలపొడవునా అరటిస్తంభాలు నిలిపారు. పట్టుచీరలు వానికి చుట్టారు. అందమైన తోరణాలను వీధులలో కమనీయంగా కట్టారు. ఇళ్లముందరి అరుగులను అలికి పెక్కురత్నాల పొడులతో పెక్కురకాల మ్రుగ్గులు పెట్టారు. ఇండ్లగోడలమీద రామకథలను వ్రాయించారు. ఎత్తైనమేడలమీదా, దేవాలయాలమీదా, గోపురాలమీదా బంగారుకుండ లెత్తించారు. వీథులలో శ్రీరామచంద్రులవారికి సమర్పించుకోవటానికి కానుకలు సిద్ధంచేసుకొని ఉంచారు. తాము కూడా చక్కగా చూడముచ్చటగా అలంకరించుకున్నారు. నాలుగువిధాలైన వాద్యాల కమ్మనినాదాలు వినవస్తూ ఉండగా శ్రీరామచంద్రులవారిని తోడ్కొని రావటానికి ఎదురుగా బయలు దేరారు.

## 19

**శ్రీరామచంద్రులవారిని చూచినవెంటనే అయోధ్యాపురకాంతలందరికీ హృదయంలో ఒక ఆనందపు పొంగు వెల్లివిరిసింది. ఆ మహాత్ముని మహిమలను ఒకరికొకరు చెప్పుకుంటూ తక్కినవారిని గుర్తుపడుతూ ఇలా అనుకుంటున్నారు.**

**మ. ఇతడే రామనరేంద్రు డీ యబల కా యింద్రారి ఖండించె న**
**ల్లతడే లక్ష్మణు డాతడే కపివరుం డా పొంతవాడే మరు**
**త్సుతు డాచెంగట నా విభీషణు డటంచుం జేతులం జూపుచున్**
**సతులెల్లం బరికించి చూచిరి పురీ సౌధాగ్ర భాగంబులన్.** 9-324

ఏమిటీ! ఈయనా శ్రీరామచంద్రమహారాజు! ఈ అమ్మవారికోసమా ఇంద్రశత్రువైన రావణాసురుణ్ణి ముక్కలుగా నరికి ప్రోవులుపెట్టాడు! అడుగడుగో లక్ష్మణస్వామి. అతడేకదయ్యా కోతులరేడు సుగ్రీవుడు! ఆ ప్రక్కన ఉన్నాడే ఆయనయే వాయుపుత్రుడు హనుమన్న. అతనికి కొంచెం ప్రక్కగా ఉన్నవాడే లంకారాజ్యానికి కొత్తఏలిక విభీషణుడు. అంటూ చేతులతో చూపిస్తూ ఆ మహానగరం భవనాలపై భాగాలలో నిలిచి కాంతలందరూ తదేకంగా శ్రీరామచంద్రపరివారాన్ని చూచి మురిసిపోతున్నారు.

## 20

**శ్రీరామచంద్రుడు అయోధ్యలో ప్రవేశించి అమ్మలకు, అయ్యవారలకు, పూజ్యులకు నమస్కరించి వారి కోరికమేరకు పట్టాభిషేకం చేసుకున్నాడు. జగములన్నీ ప్రమోదం పొందేవిధంగా పాలన చేస్తున్నాడు. ఆ మహాత్ముని పాలనలో విశ్వం ఎలాఉన్నదో అభివర్ణిస్తున్నారు.**

**సీ. కలగుటెల్లను మానె కంధులేడింటికి, చలనంబు మానె భూచక్రమునకు,**
**జాగరూకత మానె జలజలోచనునకు, దీనభావము మానె దిక్పతులకు**
**మాసియుండుటమానె మార్తాండ విధులకు, కావిరిమానె దిక్తటములకును**
**ఉడిగిపోవుటమానె ఉర్వీరుహముల, కణగుటమానె త్రేతాగ్నులకును**

**ఆ. గడిది వ్రేగు మానె గరి గిరి కిటి నాగ**
**కమఠములకు, ప్రజల కలక మానె**
**రామచంద్రవిభుడు రాజేంద్రరత్నంబు**
**ధరణి భరణరేఖ దాల్చు నపుడు.** 9-332

శ్రీరామచంద్ర అనే మహారాజు భూభారాన్ని వహించటంతోనే ఏడుసముద్రాలూ సంక్షోభం లేనివయ్యాయి. భూమికి కంపంలేకుండాపోయింది. ఎప్పుడు ఏ దుష్టుడు ఏ ప్రళయం తెచ్చిపెడతాడో అని మేలుకొనియే ఉండే శ్రీమహావిష్ణువు శాంతచిత్తుడై ఒక కునుకు తీయటానికి సిద్ధపడుతున్నాడు. ఇంతవరకు రావణుని భయంవలన బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తున్న దిక్పతులు దీనతలేనివారయ్యారు. సూర్యుడు, చంద్రుడు మాసిపోవటంలేదు. దిక్కుల అంచులను కావిరికమ్ముకొనటంలేదు. పెద్దపెద్ద చెట్లు క్రుంగిపోవటంలేదు. ఆహవనీయము, దక్షిణము, గార్హపత్యము అనే మూడు అగ్నులు అణగిపోకుండా ఉన్నాయి. భూమిని నిరంతరంమోసే ఎనిమిది దిగ్గజాలు, ఏడు కులపర్వతాలు, ఆదివరాహము, ఆదిశేషుడు, ఆదికూర్మము బరువు దించుకొని ఊరటపొందాయి.

## 21

**భారతీయ దాంపత్యంలో చాలప్రముఖమైన అంశం ఇల్లాలు ఇంటిఆయనను సర్వసమర్పణ భావనతో గౌరవించటం. స్త్రీలోకానికి అన్ని విషయాలలో ఆదర్శప్రాయ అయిన సీతాదేవి రాముని హృదయాన్ని ఆకట్టుకొన్న తీరును చక్కగా అభివర్ణిస్తున్నారు.**

**ఆ. సిగ్గువడుట గల్గి సింగారమును గల్గి**
**భక్తి గల్గి చాల భయము గల్గి**
**నయము ప్రియము గల్గి నరనాథు చిత్తంబు**
**సీత దనకు వశము చేసికొనియె. 9-337**

అనుభవజ్ఞులు లజ్జ ఉంటే కులటా, లేకుంటే కులకాంతా చెడిపోతారు అంటారు. సిగ్గుపడటం ఒక ఉదాత్తమైన ప్రవర్తనకు చిహ్నం. సీతాదేవి ఆ గుణంతో రాముని హృదయాన్ని ఆకట్టుకున్నది. అలాగే సహజ సౌందర్యాన్ని పెంపొందించే అలంకారాలను ధరిస్తూ ఉండేది. తనభర్తయందు అచంచలమైన భక్తి ఆమెకు అనుక్షణమూ ఉండేది. అటువంటి ఉత్తమగుణాలు ఏ చాపల్యంవలననైనా జారిపోతాయేమో అనేభయం ఉండేది. ఈ గుణాలతో సీతాదేవి తనభర్త చిత్తాన్ని తనవశం చేసుకున్నది.

## 22

**శ్రీరామచంద్రుడు సాక్షాత్తు పరమాత్మ. ఆయన అనేక మహాకార్యాలు అలవోకగా చేశాడు. పదునొకండు వేలఏండ్లు భూమిని పాలించి తనమొదటి తావునకు వెళ్లిపోయాడు. ఆయనను మనం ఏవిధంగా అర్థం చేసుకోవాలో కవి తెలుపుతున్నారు.**

**లా. ఆది దేవు డైన యా రామ చంద్రుని**
**కబ్ధి గట్టు టెంత ? యసురకోటి**
**జంపు టెంత ? కపుల సాహాయ్య మది యెంత ?**
**సురల కొఱకు క్రీడ చూపె గాక. 9-358**

శ్రీరామచంద్రుడు ఆదిదేవుడు. ఎంత అసాధ్యమైన మహాకార్యాలైనా ఆయనకు ఆటలే. ఇది మనం గమనించాలి. సాగరానికి వారధి కట్టటం మనకు అసాధ్యమేమో కానీ ఆయనకు అదెంతపని ? దేవతలను దిక్పాలకులను గడగడలాడించిన పేరుప్రఖ్యాతులు గల రాక్షసులను చంపివేయటం ఆ మహాత్మునకు ఒక బరువా? కోతిసేనల సాయంపొందటం చెప్పుకోదగినసంగతా? ఇదంతా దేవతలకోసం ఆయన ఆడిననాటకం. అంతే.

## 23

**నిజానికి భాగవతం చెప్పదలచిన రామకథ అయిపోయింది. కానీ కవికి పరితృప్తి కలుగలేదు. మరికొన్ని మాటలలో శ్రీరామచంద్రుని గుణగణాలను స్మరిస్తూ తానానందించి మనలను ఆనంద సముద్రంలో ముంచి యెత్తుతున్నాడు.**

**చ. వశుడుగ మ్రొక్కెదన్ లవణవార్ధి విజృంభణతా నివర్తికిన్,**
**దశ ధిగధీశ మౌళిమణి దర్పణమండిత దివ్యకీర్తికిన్,**
**దశశత భానుమూర్తికి, సుధారుచి భాషికి, సాధు పోషికిన్,**
**దశరథరాజు పట్టికిని, దైత్యపతిం బొరిగొన్న జెట్టికిన్. 9-359**

ఆమహితాత్ముడు మహాసముద్రం ఎగిరిపాటులను అణగగొట్టినవాడు. పదిమంది దిక్పాలకుల కిరీటాల మణులనే అద్దాలకు అందచందాలను కూర్చిన దివ్యమైన కీర్తి కలవాడు. వేయిమంది భాస్కరుల వెలుగులకు వెలుగునిచ్చేవాడు. అమృతం రుచిని మరపించే పలుకులుగలవాడు. సాధువులను ఆదరించి ఆదుకొనే దయామూర్తి. దశరథ మహారాజు ముద్దులపట్టి – అతిక్రూరచిత్తంగల రావణుడనే రాక్షసరాజు ప్రాణాలు తీసిన మహామల్లుడు. అట్టి శ్రీరామచంద్రునకు నేను నన్ను సమర్పణ చేసుకొని మ్రొక్కుతాను.

## 24

కవికి తనివితీరలేదు. శ్రీరామదర్శనంనుండి బయటపడలేకపోతున్నాడు. శ్రీరామచంద్రుని నుండి తనకూ, తనద్వారా మనకూ ఏమికావాలో కోరుకుంటున్నాడు.

**ఉ. నల్లనివాడు, పద్మనయనంబులవాడు, మహాశుగంబులన్**
**విల్లును దాల్చువాడు, గడు విప్పగు వక్షమువాడు, మేలు పై**
**జల్లెడువాడు, నిక్కిన భుజంబులవాడు, యశంబు దిక్కులం**
**జల్లెడువాడు నైన రఘుసత్తము డీవుత మా కభీష్టముల్. 9-360**

ఆయన నల్లనివాడు. ఆకాశంలాగా అంబుధిలాగా అనంతమైనవాడు. పద్మములవంటి విశాలములైన కనులతో మనలను చల్లగా చూస్తూఉంటాడు. ఎక్కడా, ఎప్పుడూ వ్యర్థంకాని మహాబాణాలూ, విల్లూ ధరించి ఉండేవాడు. అతివిశాలమైన వక్షస్థలంతో విరాజిల్లుతూ భక్తులారా! మీరెందరైనా, ఎక్కడివారైనా రండి ఇక్కడ మీకుచోటుఉన్నది అని ప్రకటించేవాడు. అందరికీ శుభాన్ని, మేఘం వర్షంలాగా, కురిపించేవాడు. ఎగుబుజములవాడు. తనకీర్తిని అన్నిదిక్కులలో చల్లిన మహానుభావుడు. అటువంటి రఘువంశతిలకుడైన శ్రీరాముడు మాకోరిన కోర్కెలను తీర్చుగాక !

## 25

శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే. దుష్టశిక్షణకోసం మానవుడుగా భూమిలో అవతరించాడు. ఆ మహాత్మునితో కలసిమెలసి ఉండగలగటం ఒక మహాపుణ్యం. దానిఫలాన్ని ఈపద్యంలో వర్ణిస్తున్నారు.

**ఆ. రామచంద్రు గూడి రాకల పోకల**
**గదిసి తిరుగువారు గన్నవారు**
**నంటికొన్నవారు నా కోసలప్రజ**
**లరిగి రాదియోగు లరుగు గతికి. 9-361**

ఆయన శ్రీరామచంద్రుడు. చంద్రుడంటే అందరికీ ఆహ్లాదం కలిగించేవాడు. అయోధ్యలో ఎందరో పుణ్యవంతులు అతనికి చెలికాండ్రై కలసిమెలసి ఉన్నారు. విశ్వామిత్రుడు మొదలైన మహర్షులు అతనిని ఆశ్రయించి కొన్ని ఘనకార్యాలు చేయించుకొన్నారు. అరణ్యవాసంలో జానపదులు ఎందరో ఆయనను దర్శించుకున్నారు. సుగ్రీవుడు మొదలైన వానరాదులు, విభీషణుడు మొదలైన రాక్షసులు అతని చెలిమితో పవిత్రులైనవారే. మరల అయోధ్యకు తిరిగి వచ్చినతరువాత కోసలదేశం ప్రజలు ఆయనచెలిమికలిమిని అనుభవించినవారే. అలా ఆయనతోపాటు రాకపోకలలో కలిసి - అంటిపెట్టుకొని - తిరిగినవారూ, కనుగొన్నవారూ, ఆయనను తాకినపుణ్యం పొందినవారూ అయిన కోసలప్రజలు ఆదియుగంనాటి యోగులు పొందిన పుణ్యలోకాలకు చేరుకున్నారు.

## 26

శ్రీరామచంద్రునికి సంబంధించిన భావనలు చాలా గొప్పవి అని నిరూపిస్తున్నారు.

**క. మంతనములు సద్గతులకు, పొంతనములు ఘనము లైన పుణ్యముల కిదా**
**నీంతన పూర్వ మహాఘ నికృంతనములు రామనామ కృతిచింతనముల్. 9-362**

రామునిపేరును తలపోయటం, ఆయన చేసిన మహాకార్యములను మనస్సులో సంభావించటం అనే రెండూ ఉత్తమలోకాలకు చేరుకోవటానికి దారిచూపే ఆలోచనలు. గొప్పగొప్ప పుణ్యాలను చక్కగా సమకూర్చే మంచియోగాలు. అవి ఈకాలమునకు, వెనుకటి జన్మములకు సంబంధించిన మహాపాతకాలను నామరూపాలు లేకుండా చీల్చిపారవేసే శక్తిసంపద కలవి. అట్టి మహాఫలాలను ప్రసాదించే రామనామాన్ని తనివితీరా జపించండి. ఆయన ఆ అవతారంలో చేసిన ఘనకార్యాలను సంభావించండి - అంటున్నది శ్రీమహాభాగవతం.

# 27

**పది అవతారాలలో పరశురామావతారం ఒకటి. ఆయన మహర్షి జమదగ్ని కొడుకులలో ఒకడు. కార్తవీర్యార్జునుడు అనే మహాచక్రవర్తి జమదగ్ని మహర్షి ఆశ్రమానికి పెద్దపరివారంతో వచ్చాడు. మహర్షి అందరికీ ఆతిథ్యం ఇచ్చి గొప్పవిందుభోజనం పెట్టాడు. అది అతని హోమధేనువు మహిమ. రాజుననే పొగరుతో అర్జునుడు బలవంతంగా దానిని తీసుకొనిపోయాడు. పరశురాముడు ఇది తెలిసికొని పట్టరాని కోపంతో మాహిష్మతీపురానికి వెళ్ళి రాజునూ, ఆరితేరిన సైనికులనూ అతిక్రూరంగా చంపి దూడతోపాటు ఆవును తెచ్చి తండ్రికి సమర్పించాడు. తాను ప్రళయరుద్రుడై చేసిన సంహారకాండను కూడా వివరించాడు. శాంతమూర్తి అయిన జమదగ్ని నొచ్చుకున్నాడు. కొడుకును మందలిస్తున్నాడు.**

**క. క్షమ గలిగిన సిరి గలుగును, క్షమ గలిగిన వాణి గలుగు సౌఖ్యము లెల్లన్**
**క్షమగలుగ దోన కలుగును, క్షమ కలిగిన మెచ్చు శౌరి సదయుడు తండ్రీ ! 9-462**

నాన్నా! సహనం చాలాగొప్పదయ్యా! అది ఉంటే అన్నీ ఉన్నట్లే. సహించటం తెలిసినవారికి సంపదలు కొల్లలుగా కలుగుతాయి. ఓర్పు కలవానికి మంచిమాటలు సిద్ధిస్తాయి. సౌఖ్యాలన్నీ సహనశీలుణ్ణి వెనువెంటనే చేరుకుంటాయి. బాబూ! దయామయుడైన శ్రీమహావిష్ణువు ఓరిమిని పండించుకొన్నవానిని మెచ్చుకుంటాడయ్యా!

# 28

**వెనుకటికాలంలో నహుషచక్రవర్తి ఒకడు ఉండేవాడు. అతడు ఇంద్రపదవిని పొందగలిగినపుణ్యశాలి. అతనికి యతిమొదలైన ఆరుగురు పుత్రులు కలిగారు. నహుషుడు పెద్దకొడుకు యతికి రాజ్యం ఇచ్చాడు. కానీ ఆమహానుభావుడు వైరాగ్యాన్ని పండించుకొన్నవాడు కనుక ఇలా అనుకున్నాడు.**

**క. రాజ్యంబు పాపమూలము, రాజ్యముతో నొడ లెఱుంగ రాదు, సుమతియున్**
**రాజ్యమున పూజ్యు నెఱుగడు, రాజ్యము గీజ్యంబు ముక్తిరతులకు నేలా. 9-507**

రాజ్యం అనేది అన్నిపాపాలకూ మూలకారణం. ఒకమారు రాజ్యం దక్కింది అంటే వానికిక ఒళ్ళు తెలియదు. ఎంత మంచిబుద్ధి ఉన్నవాడయినా రాజ్యం పొందినతరువాత గౌరవింపదగినవానిని తెలిసికోలేదు. పూజ్యులను అవమానిస్తాడు. ఘోరమైన ఆపదలను కొనితెచ్చుకుంటాడు. కాబట్టి మోక్షసామ్రాజ్యం మీద ప్రీతిఉన్నవారికి ఈ రాజ్యమూ గీజ్యమూ ఎందుకు? - అని రాజ్యాన్ని పూచికపుల్లలా వదలివేసి తపస్సు చేసుకోవటానికి వెళ్ళిపోయాడు.

# 29

**నహుషుని కొడుకు రెండవవాడు యయాతి రాజయ్యాడు. శుక్రాచార్యుని బిడ్డ దేవయాని అతనికి భార్య అయింది. ఒకనాడతనికి ఆత్మజ్ఞానం కలిగింది. స్త్రీ కారణంగా మోసపోయాననుకొన్నాడు. వైరాగ్యం హృదయంలో కదలాడుతూ ఉండగా కామవికారం ఎంతఘోరమైనదో ఆమెకు తెలియజేస్తున్నాడు.**

**క. కామోపభోగ సుఖములు, వేమాఱును పురుషు డనుభవింపుచు నున్నం**
**గామంబు శాంతి బొందదు, ధూమధ్వజు డాజ్యవృష్టి ద్రుంగుడువడునే. 9-581**

దేవయానీ! మానవుడు కామసుఖాలను వేలకొలదిగా అనుభవిస్తూనే ఉంటాడు. కానీ కామం ఒకపెద్ద అగ్నివంటిది. పెద్దపెద్దపాత్రల నిండుగా నేతినితెచ్చి అగ్నిలో పోస్తున్నా అగ్ని ఇంక చాలు అంటుందా? అటువంటిదే ఈ కామాగ్ని. దాని అనుభవాలు పెరిగిపోతున్నకొద్దీ కామం మరింతగా విజృంభిస్తుందే కానీ అణగారదు.

# 30

**శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు భగవంతుని అవతారాలనూ, భాగవతుల చరిత్రనూ భాగవతరూపంలో చెబుతున్నాడు. యాదవవంశ చరిత్రను చెబుతూ శ్రీకృష్ణ వాసుదేవుని అవతార కారణాన్ని వివరిస్తున్నాడు.**

**క. ఎప్పుడు ధర్మక్షయ మగు, నెప్పుడు పాపంబు పొడము నీ లోకములో**
**నప్పుడు విశ్వేశుడు హరి, దప్పక విభు డయ్యు దన్ను దా సృజియించున్. 9-725**

పరీక్షిన్మహారాజా! ఈసృష్టి అంతా ఒక విచిత్రమైనచక్రం తిరుగుళ్ళవంటిది. ఒక్కొక్క కాలంలో ధర్మం క్షీణించిపోతుంది. పాపం పండిపోతుంది. అదిలోకం అంతటికీ చేటుకాలం. గమనిస్తాడు విశ్వానికంతటికీ ప్రభువైన విష్ణువు. అధర్మమైన పాపాన్ని అంతంచేసి ధర్మాన్ని మళ్ళీ సుస్థితికి తేవటం కర్తవ్యంగా పెట్టుకొని తన్నుతాను సృజించుకుంటాడు. అతడే దేవకి ఎనిమిదవ గర్భంగా అవతరించిన శ్రీకృష్ణ వాసుదేవుడు.

# 31

**శ్రీకృష్ణ వాసుదేవుని అవతార పరిసమాప్తిని సూచనామాత్రంగా వినిపిస్తున్నాడు శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజునకు. అట్టి శ్రీహరి అమృతచరిత్రను విన్నవారికి కలిగే పుణ్యఫలం ఎట్టిదో తెలుపుతున్నాడు.**

**క. మంగళ హరికీర్తి మహా, గంగామృత మించుకైన కర్ణాంజలులన్**
**సంగతము సేసి ద్రావ దొలంగును గర్మంబు లావిలం బగుచు నృపా ! 9-730**

రాజా! పరీక్షిత్తూ ! కృష్ణుడై అవతరించి దుష్టులను శిక్షించి, శిష్టులను కాపాడి ధర్మస్థాపన చేసిన శ్రీహరికీర్తి సకలశుభాలనూ సమకూర్చుతుందయ్యా! ఆకీర్తి మహాగంగ. అదియొక అమృతవాహిని. దానిని ఏ కొంచెమైనా చెవిదొప్పలతో హృదయంలోనికి చేర్చుకుంటే కర్మములన్నీ కాలిపోతాయి. అంటే పుట్టటం, చావటం అనే చక్రంలో తిరుగుతూ ఉండే ఘోరమైన ఆపద తొలగిపోతుంది.

# 32

శుకయోగీంద్రులు శ్రీకృష్ణవాసుదేవుని మనోహరరూపాన్ని తన జ్ఞాననేత్రంముందు కదలాడాలని కోరుకుంటున్నారు. మనకు కూడా అట్టి భాగ్యాన్ని ప్రసాదిస్తున్నారు.

**చ. నగుమొగమున్, సుమధ్యమును, నల్లనిదేహము, లచ్చి కాటప**
**ట్టగు నురమున్, మహాభుజము, లంచిత కుండలకర్ణముల్, మదే**
**భగతియు, నీలవేణియు, కృపారస దృష్టియు గల్గు వెన్నుఁడి**
**మ్ముగ బొడసూపు గాత గను మూసిన యప్పుడు, విచ్చునప్పుడున్. 9-732**

ఆమహాత్ముడు నిరంతరమూ నవ్వుమొగంతోనే కానవస్తాడు. అంటే అచ్చమైన ఆనందం ఆయన స్వరూపమన్నమాట. సన్నని నడుమును గమనిస్తే అందులోనే పదునాలుగులోకాలు భద్రంగా ఉన్న స్ఫూర్తి కలుగుతుంది. ఆయన అనంతుడు అని తెలపటానికై ఆకాశంవంటి నీలమైన దేహకాంతితో అలరారుతున్నాడు. ఆవిశాలమైన వక్షఃస్థలం శ్రీమహాలక్ష్మికి ఆటపట్టు. ఎంత అలవికాని పనినైనా అలవోకగా చేస్తాయి అనిపించే పొడవైన గొప్పహస్తాలతో వెలుగొందుతున్నాడు స్వామి. కర్ణముల కుండలాలు కమనీయంగా కాంతులను విరజిమ్ముతూ కదలాడుతున్నాయి. అడుగుతీసి అడుగువేస్తుంటే ఒక మదించిన గజరాజు ఆమహాత్ముని నుండియే నడకను అభ్యసించిందా అనిపిస్తుంది. తలమీది కేశపాశం నల్లనివన్నెతో నిగనిగలాడిపోతున్నది. కన్నులలో అపారమైన కృపారసం తొణికిసలాడుతూ ఉంటుంది. అటువంటి గొప్పలక్షణాలు గల కన్నయ్య కన్నులుమూసినా తెరచినా నాకు కనబడుతూ ఉండాలి.

* * *

# దశమ స్కంధం - పూర్వభాగం

## 1

భాగవతం దశమస్కంధం నేరుగా శ్రీకృష్ణవాసుదేవుని పరమాత్మతత్త్వాన్ని ప్రపంచించే వాఙ్మయ విరాట్స్వరూపం. పోతన మహాకవి ఆ స్కంధాన్ని ప్రారంభిస్తూ శ్రీరామచంద్రప్రభువు గుణవిశేషాలను ఆత్మానందంకోసం వక్కాణిస్తున్నాడు.

**శ్రీకంఠచాపఖండన**
**పాకారి ప్రముఖ వినుతభండన ! విలసత్**
**కాకుత్స్థ వంశమండన !**
**రాకేందు యశోవిశాల ! రామనృపాలా !** **భా. 10.పూ.**

స్వామీ రామచంద్రప్రభూ ! నీవు శ్రీకంఠుని వింటిని ముక్కలు చేసిన మహాత్ముడవు. దేవేంద్రుడు మొదలైనవారు కూడా నీ యుద్ధాన్ని నిండు గౌరవంతో కొనియాడుతారు. కకుత్స్థుడు అనే మహాపురుషుని కుదురునందు వెలుగులు నింపటానికి నీవు అందులో అవతరించిన ఆదిదేవుడవు. నీ విశాలమైన కీర్తి పూర్ణచంద్రునిలా సర్వలోకాలను ఆహ్లాదపరుస్తున్నది.

## 2

శ్రీ వాసుదేవ పరమాత్మ తనమాయతో నందగోకులంలో సుందరశిశువై యశోద ఒడిలోనికి చేరుకున్నాడు. అందరూ ఆనందనందనుడు యశోద కడుపున పుట్టినట్లే సంభావించారు. వ్రేపల్లెలోని గోపసుందరులందరూ ఇలా అనుకుంటున్నారు.

**ఆ. ఏమినోము ఫలమొ యింత ప్రొ ద్దొక వార్త**
**వింటి మబలలార! వీను లలర**
**మన యశోద చిన్ని మగవాని గనె నట,**
**చూచి వత్త మమ్మ! సుదతులారు !** **10-184**

ఒయ్యోయి అబలలారా ! సుదతులారా ! ఈనాడు మనం వెనుకటి పుట్టువులలో చేసుకొన్న పుణ్యమెటు వంటిదో కానీ ఒక వార్త వీనులవిందుగా వినబడింది. మన యశోద లేదూ, నందుని ఇల్లాలమ్మా ఒక చిన్ని మగవానిని కన్నదట. వెళ్ళి చూచివద్దాము రండి ! రండి.

## 3

పరంధాముడు బాలకృష్ణుడై లీలలెన్నో ప్రదర్శించాడు. అవి లోకంలో మరెక్కడా మరెవ్వరియందూ సంభవించేవి కావు పసితనంలోనే బండిరూపంలో ఉన్న బండ రక్కసుని కాలితో తన్ని నేలగూల్చివేశాడు. అది విని గోపకులు, గోపికలు ముక్కున వేలు వేసుకొని ఇలా అనుకొంటున్నారు.

**శా. బాలుం డెక్కడ ? బండి యెక్కడ ? నభోభాగంబుపై జేడ్పడన్**
**గాలం దన్నుట యెక్కడాట పడుచుల్ గల్లాడి రీ జడ్డు బ**

ల్కే లోకంబున నైన చెప్పబడునే యే చందమో కాక యం
చాలాపింపుచు వ్రేలువ్రేతలు ప్రభూతాశ్చర్యలై రంతటన్. 10-256

పిల్లవాడెక్కడ ? బండియెక్కడ ? మింటిలో విరిగి ముక్కలయ్యేవిధంగా కాలితో తన్నటం ఎక్కడ? తోడి చెలికాండ్రు అబద్ధాలాడుతున్నారు. ఇటువంటి తెలివితక్కువమాట ఏలోకంలోనైనా ఎవరైనా పలుకుతారా? ఇదేమి తీరోగానీ! అని పలువిధాలుగా పలుకుతూ గోపగోపికలు చాలా చాలా ఆశ్చర్యపడ్డారు.

# 4

బండిని పగులదన్ని పసిపాపడైన కృష్ణుడు నంగనాచిలా ఏమీ ఎరుగనట్లు ఏడవటం మొదలుపెట్టాడు. తల్లిహృదయం తల్లడిల్లిపోయింది. ఆమె పరుగుపరుగున వచ్చి కన్నయ్యతో ఇలా అంటున్నది.

ఆ. అలసితివి గదన్న ! ఆకొంటివి గదన్న
మంచి యన్న ! యేడ్పు మాను మన్న
చన్ను గుడువు మన్న సంతసపడు మన్న
యనుచు చన్ను గుడిపె నర్భకునకు. 10-పూ. 258

కన్నా! అలసిపోయావా తండ్రీ! ఆకలి వేస్తున్నదా నాన్నా! మంచివాడవుగదూ! ఏడ్పుమాను నాయనా! ఇదిగో పాలు త్రాగరా బాబూ! సంతోషం పొందు చిన్నా! అంటూ పసివానికి పడతి యశోద పాలిచ్చింది.

# 5

కొన్ని ఘనకార్యాలు చక్కబెట్టటానికి స్వామి వాసుదేవుడు అవసరమైనప్పుడల్లా అవనికి దిగివస్తూ ఉంటాడు. వినోదంగా ఒకతోడును కూడా తెచ్చుకుంటాడు. ఆయనయే నందగోపబాలుడు కన్నయ్య. తోడై వచ్చిన మహాత్ముడు ఆదిశేషుని అంశమైన బలరాముడు. పసితనపు పరువంలోని గోపబాలుని పరికించి చూచేవారికి పరమశివుని దర్శనం కూడా అవుతున్నది.

సీ. తనువున నంటిన ధరణీపరాగంబు పూసిన నెఱిభూతి పూత గాగ
ముందర వెలుగొందు ముక్తాలలామంబు తొగలసంగడికాని తునుక గాగ
ఫాలభాగంబుపై బరగు కావిరిబొట్టు కాముని గెల్చిన కన్ను గాగ
గంఠమాలికలోని ఘననీల రత్నంబు కమనీయ మగు మెడకప్పుగాగ

హారవల్లు లురగ హారవల్లులు గాగ
బాలులీల ప్రౌఢ బాలకుండు
శివునిపగిదినొప్పె శివునికిం దనకును
వేఱులేమి దెలుప వెలయునట్లు 10.296

కన్నయ్య అన్నయ్యతోపాటు ఆడుకొంటున్నాడు. ఒడలంతా దుమ్ము దుమ్మైపోయింది. అది పరమశివుడు పూసుకొన్న విభూతిలాగా వెలిగిపోతున్నది. తలమీద తెలికాంతులు వెదజల్లుతున్న ముత్యాలహారం చంద్రశేఖరుని తలమీది జాబిల్లిని తలపింపచేస్తున్నది. అమ్మ నొసటిమీద ఎఱ్ఱని తిలకం చక్కగా పెట్టింది. అది కాముణ్ణి కాల్చివేసిన మూడవకన్నులాగా ప్రకాశిస్తున్నది. యశోదమ్మ మెడచుట్టి వచ్చేట్టుగా ఒక చక్కనిహారం వేసింది. దానిమధ్య ఇంద్రనీలమణి మనోజ్ఞ కాంతులతో ఒప్పారుతున్నది. అది శివమహాదేవుని మెడలోని

నీలిమను తోపజేస్తున్నది. నిలువెల్లా హారాలే కదలాడుతూ ఉన్నాయి. అవి శివుని దేహంమీద తిరుగాడే పాములా అన్నట్లున్నాయి. ఇలా ఆ గోపబాలుడు, నిజానికి గొప్ప ప్రౌఢుడు, బాల లీలలతో ఫాలలోచనుని వలె భాసిల్లుతున్నాడు. బహుశ:, మేమిద్దరము కాదయ్యా! ఆయనే నేను, నేనే ఆయన అని లోకాలకు తెలియజెప్పాలి అనే కోరిక కలిగిఉంటుంది.

## 6

**కన్నయ్య చిన్నప్పుడు చాలాచాలా చిలిపి పనులు చేశాడు. అవన్నీ తాను భగవంతుడనని ప్రకటించటం కోసమే కనుక వానిని మహాకవులూ, మహర్షులూ లీలలుగా భావించి ఆనందసాగరంలో ఈదులాడారు. ఒక గోపిక యశోదమ్మతో బాలుని లీలను ఇలా చెప్పుకొంటున్నది.**

**క. బాలురకు పాలు లే వని,**
**బాలెంతలు మొఱలు వెట్ట పకపక నగి యీ**
**బాలుం డాలము సేయుచు,**
**నాలకు గ్రేపులను విడిచె నంభోజాక్షీ ! 10-307**

చక్కగా విచ్చుకొన్న పద్మాలలాగా అలరారుతున్న కన్నులు గల ఓ యశోదమ్మా! ఒకపక్క మా పసిపిల్లలకు పాలులేవని బిడ్డలను గన్న అమ్మలు మొత్తుకుంటూ ఉంటే నీ పిల్లగాడు పకపకా నవ్వుతూ పట్టనలవికాని అల్లరి చేస్తూ దూడలను ఆవుల దగ్గరకు వదలివేశాడమ్మా !

## 7

**గోపికలు యశోదమ్మకు కృష్ణుని దుడుకు పనులు చెప్పుకుంటున్నారు. అలా చెప్పుకోవటం వారి కడొకతృప్తి వినటం యశోదమ్మకు ఆనందం. మహాకవి మనకు కూడా అటువంటి తృప్తినీ ఆనందాన్నీ అందిస్తున్నాడు.**

**క. పడతీ! నీ బిడ్డడు మా**
**కడవలలో నున్న మంచి కాగిన పా లా**
**బుడుతలకు బోసి చిక్కిన,**
**కడవల బో నడిచె, నాజ్ఞ గలదో లేదో ? 10 -308**

యశోదమ్మా! నీవు కూడా ఒక ఆడదానవే కదమ్మా! చూడు నీ పోరగాడు ఏమి చేశాడో! కడవలలో మేము చక్కగా మీగడ కట్టేవిధంగా కాచి దాచుకొన్న పాలను మెల్లగా మా యిళ్ళలో దూరి, దుడుకుతనంతో ఏమాత్రమూ తీసిపోని చెలికాండ్రకు పీకలదాకా పోశాడమ్మా! కాస్తోకూస్తో మిగిలిన పాలకుండలను పగుల గొట్టి పారిపోయాడమ్మా! వానిమీద నీకేమయినా అదుపూ ఆజ్ఞా ఉన్నాయటమ్మా ?

## 8

**యశోదమ్మకు కన్నయ్యమీద కోపం రావాలి. అతనిని గట్టిగా శిక్షించాలి. అతడు బుంగమూతి పెట్టి కన్నులు నులుపుకుంటూ బుడిబుడి ఏడ్పులు ఏడుస్తూ ఉంటే ఆ అందమే అందం. అందుకోవాలని అంగనలు పితూరీలు చెపుతున్నారు.**

క. మీ పాపడు మా గృహముల
నాపోవగ పాలు ద్రావ నగపడ కున్నం
గోపించి పిన్నపడుచుల
వాపోవగ జిమ్ముకొనుచు వచ్చెం దల్లీ ! 10-309

తల్లీ ! యశోదమ్మా ! ఏమి చెప్పమంటావు. మీ అబ్బాయిగారు మా యింట్లో తృప్తితీరా, కడుపు నిండా పాలు త్రాగాలని దూరాడు. పాపం ! వాడికి పాలెక్కడా కనపడలేదు. అప్పుడు ఆయన గారికి గొప్పగా కోపం వచ్చింది. ఇంట్లో ఉన్న మా పసిపిల్లలు కుయ్యో మొఱ్రో అని ఏడుస్తూ ఉండగా వారినందరిని చెదర గొట్టుకుంటూ బయటకు వచ్చాడు.

## 9

**ఒక చక్కని లతలాగా ఊగిపోతున్న యశోదమ్మ తల్లీ ! మీవాడు వట్టి తంపులమారివాడమ్మా ! అంటున్నది ఒక గోపిక. చూడు ఎంత ఆగడం చేశాడో నీ కొడుకు.**

క. ఆడం జని వీరల పెరు
గోడక నీ సుతుడు ద్రావి యొకయించుక తా
కోడలి మూతిం జరిమిన
గోడలు మ్రుచ్చనుచు నత్త కొట్టె లతాంగీ ! 10-311

యశోదమ్మా ! మీ పిల్లవాడు మెల్లగా ఒక యింటిలో దూరాడు. జంకుగొంకులు ఏ మాత్రమూ లేకుండా వీరియింటిలోని పెరుగు త్రాగివేశాడు. పాపం ఆ యింటి కోడలుపిల్ల గమనించింది. ఈ మహాపురుషుడు వెంటనే ఆ పెరుగును కొంచెం తీసికొని ఆ కోడలిమూతికి అంటించాడు. ఆమె బిత్తరపోయి చూస్తూ ఉండగా అత్తగారు కోడలిని చూడనే చూచింది. భడవా ! దొంగతిండి తింటున్నావా ? అని కోడలికి నాలుగు వడ్డించింది.

## 10

**ఒక గోపిక కన్నయ్య దుడుకుతనాన్ని యశోదమ్మకు ఇలా వివరించి చెబుతున్నది.**

క. వారిల్లు సొచ్చి కడవల
దోరంబగు నెయ్యి ద్రావి తుది నా కడవల్
వీరింట నీ సుతుం డిడ,
వారికి వీరికిని దొడ్డ వాదయ్యె సతీ ! 10-312

అమ్మా ! మహాతల్లీ ! మీ పాపడు ఎంత నంగనాచియో చూడు. వాళ్ళింట్లో దూరాడు. కడవలలో కమ్మగా క్రాగిన కమ్మని నేతిని అంతా పొట్టను పెట్టుకున్నాడు. ఆ కడవలనన్నింటినీ తెచ్చి వీరింట్లో పెట్టాడు. ఇంక చూడు ! వాళ్ళూ వీళ్ళూ తిట్టుకొన్న తిట్లు అన్నీఇన్నీ కావు.

## 11

**గొల్లభామలు ఇండ్ల తలుపులకు గట్టిగా తాళాలు వేసుకున్నారు. కృష్ణుడు ప్రవేశించటానికి పిసరంత సందు లేకుండా ఏర్పాట్లు భద్రంగా చేశారు. నిబ్బరంగా ఉండి గమనిస్తున్నారు. ఇళ్ళల్లోనికి పోనేపోయాడు. వెక్కిరింతలూ వేళాకోళాలూ చేయనే చేశాడు. పాపం యశోదకు చెప్పుకుంటున్నారు.**

సీ. కలకంఠి ! మావాడ గరితల మెల్ల నీ పట్టి రాగలడని పాలు పెరుగు
లిండ్ల లోపల నిడి యే మెల్ల దనత్రోవ జూచుచో నెప్పడు సొచ్చినాడొ ?
తలుపుల ముద్రలు దాళంబులును బెట్టి యున్నచందంబున నున్న వరయ
నొక యింటిలో నాడు, నొకయింటిలో బాడు, నొకయింటిలో నవ్వు, నొకట దిట్టు.,

ఒకట వెక్కిరించు, నొక్కొకచో మృగ
పక్షిఘోషణములు పరగజేయు
నిట్లు చేసి వెనుక నెక్కడ బోవునో
కానరాడు రిత్తకడవలుండు. 10.326

నీ కమ్మనికంఠం మా కంఠాలను నొక్కివేస్తుందమ్మా యశోదమ్మా ! మాపేటలోని ఆడవాళ్ళమందరమూ గట్టిపూనికతో ఒక పథకం వేసుకున్నాం. నీ కొడుకు వస్తాడేమో అని పాలూపెరుగూ ఇండ్ల లోపలి గదులలో భద్రంగా పెట్టి ఎలావస్తాడో అని ఆయనగారు వచ్చేదారిని చూస్తూ ఉన్నాము. ఇళ్ళకు వేసిన తాళాలూ, తలుపుల ముద్రలూ వేసినవి వేసినట్లుగానే ఉన్నాయి. కానీ ఎప్పుడూ దూరాడో, ఎలా దూరాడో ఇండ్ల లోపల ఉన్నాడు. ఒక యింటిలో ఆడుతున్నాడు. ఒక యింటిలో పాడుతున్నాడు. ఒక యింటిలో నవ్వుతున్నాడు. ఒక యింటిలో వెక్కిరిస్తూ ఉన్నాడు. ఇంకా వింతగా ఒకచోట జంతువులా, పక్షులా కూతలు. ఎలాగైనా పట్టికట్టిపడవేయాలని ప్రయత్నిస్తే కనపడనే కనపడడు. ఎక్కడకు పోతాడో ఏమో ! ఇళ్ళల్లో మాత్రం ఖాళీ కడవలు కానవస్తాయి !

## 12

గోపికలు యశోదమ్మకు మొరపెట్టుకుంటున్నారు. శ్రీకృష్ణుని ఆగడాలను పేర్కొని ఎక్కడికైనా వెళ్ళిపోతామంటున్నారు.

ఓయమ్మ! నీ కుమారుడు,
మాయిండ్లను పాలుపెరుగు మననీ డమ్మా !
పోయెద మెక్కడి కైనను,
మా యన్నల సురభులాన మంజులవాణీ ! 10-329

ఓయమ్మా ! మంజులవాణీ ! నీ కుమారుడు మా యిండ్లలో పాలూపెరుగూ బ్రదకనివ్వడు తల్లీ ! ఎక్కడికైనా వెళ్ళిపోతాము. ఇది యేదో ఆషామాషీగా అంటున్నమాట కాదు. మా అన్నల ఆవులమీద ఒట్టువేసి అంటున్న మాట.

## 13

గోపవనితలు కృష్ణుని ఆగడాలను యశోదమ్మకు చెప్పుకొని తమదారిని తాము పోయారు. ఈ అయ్యవారు ఏమీ ఎరుగని నంగనాచిలా అమ్మఒడిలో ఆడుకుంటూ కూర్చున్నాడు. ఒకనాడు బలరాముడు మొదలైన గోపబాలురందరూ యశోదకు కృష్ణుడు మన్నుతింటున్నాడని చెప్పారు. ఆయమ్మ మన్నెందుకు తింటున్నావని గదమాయించింది. అప్పుడు కన్నయ్య ఇలా అన్నాడు.

శా. అమ్మా! మన్ను దినంగ నే శిశువనో? యాకొంటినో? వెఱ్ఱినో?
నమ్మం జూడకు వీరి మాటలు మదిన్, న న్నీవు గొట్టంగ వీ
రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు. కాదేనిన్ మదీయాస్య గం
ధమ్మాఘ్రాణము సేసి నా వచనముల్ దప్పైన దండింపవే ! 10-338

అమ్మా ! మన్ను తినటానికి నేనేమైనా పసివాడనా? ఆకలివేసినవాడనా? వెఱ్ఱివాడనా? నీవు వీరిమాటలు మనస్సులో నమ్మవద్దు. నీవు నన్ను కొట్టాలని వీళ్ళీమార్గం కల్పించి చెబుతున్నారు. కాదంటే నానోటివాసన చూచి నామాటలు తప్పైతే నన్ను దండించు.

## 14

**నా నోటివాసన చూచి మన్ను తిన్నానోలేదో తెలుసుకో అని నోరుపెద్దగా తెరచి ఆమెకు చూపాడు. యశోదకు లక్కపిడతలాంటి ఆ నోటిలో సముద్రాలతో, పర్వతాలతో, అడవులతో, భూగోళాలతో, అగ్ని, ఆదిత్యుడు, చంద్రుడు, దిక్పాలకులు మొదలైనవానితో కూడిన బ్రహ్మాండమంతా కానవచ్చింది. ఆ అద్భుత దర్శనానికి ఆమె విస్తుపోయి ఇలా అనుకుంటున్నది.**

**మ. కలయో! వైష్ణవమాయయో! యితర సంకల్పార్థమో! సత్యమో!**
**తలపన్ నేరక యున్నదాననొ! యశోదాదేవి గానో! పర**
**స్థలమో! బాలకుడెంత! యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర**
**జ్వలమై యుండుట కేమి హేతువొ! మహాశ్చర్యంబు చింతింపగన్ ! 10-342**

ఏమిటి ఇది కలయా ? విష్ణువునకు సంబంధించిన మాయయా ? లేక మనస్సులోని సంకల్పాలకు రూపకల్పనయా ? లేక ఇదంతా సత్యమేనా ? నా మనస్సు సరిగా పనిచేస్తున్నదా ? అసలు నేను యశోదనేనా? ఇది మా ఇల్లేనా? పరస్థలమా ? వ్రేలెడంతలేని యీ బాలుడేమిటీ? ఇతని మోములో బ్రహ్మాండమంతా గొప్ప వెలుగులతో అలరారట మేమిటి? దీనికి కారణం ఏమిటో ? ఇది భావించినకొద్దీ పరమాద్భుతంగా ఉన్న విషయం.

## 15

**బాలకృష్ణుణ్ణి అమ్మ రోటికి కట్టిపడవేయగా దానితోపాటు పాకుకుంటూ రెండు మద్దిచెట్ల మధ్యనుండి పోగా అవి రెండూ ఫెళఫెళ నాదాలతో కూలిపోయాయి. వానినుండి యిద్దఱు గంధర్వులు నలకూబరమణిగ్రీవులై బాలునకు మోకరిల్లి నిలిచి స్తుతి చేశారు.**

**నీ పద్యావళు లాలకించు చెవులున్, నిన్నాడు వాక్యంబులున్,**
**నీపేరం బనిసేయు హస్తయుగమున్, నీమూర్తిపై చూపులున్,**
**నీపాదంబులపొంత మ్రొక్కు శిరముల్, నీసేవపై చిత్తముల్,**
**నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా. 10పూ.406**

పద్మపత్రనేత్రా ! పరంధామా ! మాకు నీపద్యాల వరుసలను ఆలకించే చెవులనూ, నిన్ను కొనియాడ గలిగే వాక్కులనూ, నీపేరుతో పనిచేసే చేతులజంటనూ, నీమూర్తిపై ప్రసరించే చూపులనూ, నీపాదాల చెంత మ్రొక్కే శిరస్సునూ, నీసేవ చేసుకొనే చిత్తాలనూ, నీమీది బుద్ధులనూ మాకు దయతో ప్రసాదించు స్వామీ!

## 16

**ఆ కృష్ణయ్య అమ్మను అతలాకుతలం చేసివేస్తున్నాడు. అలా చేస్తున్నకొద్దీ ఆమె హృదయం ఆనందధామమే అవుతున్నది. కానీ పైకి ఆ అల్లరికి అడ్డుకట్టవేయాలని ఆరాటంగానూ ఉన్నది. ఒకనాడు ఉట్టిమీద గట్టిగా పెట్టిన వెన్నను ఒక కోతికి అందిస్తూ దొరకిపోయాడు. ఒక బెత్తం పుచ్చుకొని వెంటబడింది యశోద. మనస్సులో ఇలా అనుకొంటున్నది.**

సీ. బాలు డీతండని భావింతు నందునా యే పెద్దలును నేర రీక్రమంబు
వెఱ వెఱుంగుటకు నై వెఱపింతు నందునా కలిగి లేకొక్కడు గాని లేడు
వెఱపుతో నా బుద్ధి వినిపింతు నందునా తను దానయై బుద్ధి దప్పకుండు
నొం డెఱుంగక యింట నుండెడి నందునా చొచ్చి చూడని దొకచోటు లేదు

తన్ను నెవ్వరైన తలపోయ బాఱెడు
నోజలేదు భీతి యొకటె ఱుంగ
డెలమి నూరకుండ డెక సక్కెముల నాడు
పట్టి శాస్తి చేయుభంగి యెట్లు ? 10.163

పసివాడని వీనిని అనుకొందామా అంటే యిటువంటి చేష్టలు పెద్దవాళ్ళు కూడా చేయలేరు. వినయాన్ని నేర్పటానికి కొంచెం భయపెడదామా అంటే లేకలేక కలిగినబాలుడైనాడు. ఎప్పుడైనా ఏదైనా ఉపాయంతో నాలుగు మంచిమాటలతో బుద్ధి చెబుదామా అంటే నేను చెప్పబోయేవేళకు ఏ అల్లరీ ఆగమూ లేకుండా బుద్ధిమంతుడై కూర్చుంటాడు. మరొకదానిని పట్టించుకోకుండా ఇంట్లోనే కూర్చుంటాడా అంటే చూడనిచోటు ఒక్కటి కూడా ఉండదు. ఎవ్వరైనా తననుగూర్చి భావిస్తే పరుగెత్తుకొనిపోతూ ఉంటాడు. ఒక పద్ధతిలేదు. భయమన్నమాట లేదు. పోనీ మాటాడకుండా ఊరకుందామా అంటే వేళాకోళాలూ వెక్కిరింతలతో ఉడికిస్తూ ఉంటాడు. ఇట్టి పిల్లవానిని పట్టి శాస్తి చేసేవిధం ఏమిటో? తెలియటంలేదు.

## 17

**సర్వభూపాలకుడైన పరమాత్మ ఇప్పుడు గోపాలకుడైనాడు. అన్నతోపాటు పసితనం దాటుకొని బాల్యంలోనికి అడుగుపెట్టాడు. ఆటపాటలన్నీ ఆవులతో, గోపాలకులతోనే. అరణ్య ప్రదేశాలలో వానినీ, వారినీ అలరిస్తూ తిరగటమే ఆ అయ్యగారి పని. తాను కాచుకొనే ఆవులకు అందమైన పేర్లు పెట్టుకున్నాడు. వానిని ప్రియమారా పిలుస్తూ ఉంటాడు.**

సీ. రా పూర్ణచంద్రిక! రా గౌతమీ గంగ! రమ్ము భగీరథరాజతనయ!
రా సుధాజలరాశి! రా మేఘబాలిక! రమ్ము చింతామణి! రమ్ము సురభి!
రా మనోహారిణి! రా సర్వమంగళ! రా భారతీదేవి! రా ధరిత్రి!
రా శ్రీమహాలక్ష్మి! రా మందమారుతి! రమ్ము మందాకిని! రా శుభాంగి!

యనుచు మఱియు నాఖ్యలు గలగోవు
లడవిలోన దూరమందు మేయ
ఘనగభీరభాష కడునొప్ప చీరు నా
భీర జనులు పొగడ పెంపు నెగడ 10పూ.602

పూర్ణచంద్రికా ! రావమ్మా తల్లీ ! గౌతమీ గంగా ! రా ! రా ! భాగీరథీ ! రా ! అమృత సాగరమా ! విచ్చేయవమ్మా ! మేఘబాలికా ! ఇటురా ! చింతామణీ రా ! సురభీ రమ్ము ! మనోహారిణీ రా ! సర్వ మంగళా ! రా ! భారతీదేవీ ! రా తల్లీ ! భూదేవీ ! రావమ్మా ! శ్రీ మహాలక్ష్మీ ! రావూ ! మందమారుతీ ! గబగబా గంతులు వేసుకుంటూ పరుగెత్తిరా ! మందాకినీ ! రా ! శుభాంగీ ! ఇటురా ! అంటూ ఇంకా ఎన్నో పేర్లు గల ఆవులు అడవిలో దూరంగా మేస్తూ ఉండగా మేఘగర్జన వంటి కంఠనాదంతో పిలుస్తూ ఉంటాడు. ఆ పిలుపులకు ముచ్చటపడి గోపాలకులందరూ మెచ్చుకుంటూ ఉంటారు.

## 18

కంసుడు రామకృష్ణులను తనపురికి పిలిపించాడు. వారు జంకుగొంకులు లేకుండా మధురా నగరంలో విహరిస్తున్నారు. రాచబాటలో వారికి సుదాముడనే మాలాకారుడు కనిపించాడు. మాలికలతో స్వామిని సత్కరించాడు. కృష్ణునికి అతనిపై పరమానుగ్రహం కలిగింది. అతని యింటికి వెళ్ళాడు. కోరిన వరం ఇస్తాను అన్నాడు. అప్పుడు సుదాముడు ఇలా అన్నాడు.

**క. నీ పాదకమల సేవయు,**
**నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం**
**తాపార భూతదయయును,**
**దాపసమందార! నాకు దయసేయ గదే! 10-1270**

స్వామీ ! నందనందనా ! యశోదా కుమారా ! నాకు నిరంతరము నీ పాదపద్మాలసేవ కావాలి. నిన్ను భక్తితో అర్చించే పుణ్యాత్ములతో చెలిమి కావాలి. తాపసమందారా ! ఎడతెగని, అంతులేని భూతదయ కావాలి. నా స్వామీ ! నాయీ మూడు కోరికలనూ అనుగ్రహించు.

## 19

బలరామ శ్రీకృష్ణులు పెండ్లియూడునకు వచ్చారు. బ్రహ్మదేవుని ఆజ్ఞమేరకు రైవతుడు తనబిడ్డ రేవతిని బలరామునకు ధర్మపత్నిగా ఇచ్చాడు. అని చెబుతూ శుకయోగి రుక్మిణీ కల్యాణ ప్రస్తావనగా ఇలా చెబుతున్నాడు.

**మ. ఖగనాథుం డమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్న చందంబునన్**
**జగతీనాథుల చైద్యపక్ష చరులన్ సాళ్వాదులం గెల్చి భ**
**ద్రగుడై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా**
**భగవత్యంశభవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్. 10-1682**

పరీక్షిన్మహారాజా ! వెనుకటికి పక్షిరాజు గరుత్మంతుడు దేవేంద్రుణ్ణి గెలిచి అమృత భాండాన్ని తెచ్చిన విధంగా సుదర్శనమనే చక్రం ధరించే శ్రీకృష్ణస్వామి శిశుపాలునిపక్షం వారైన సాళ్వుడు మొదలైన వారినందరినీ గెలిచి భద్రంగా రుక్మిణీదేవిని వరించాడు. ఆమె విదర్భరాజైన భీష్మకుడు కన్నబిడ్డ. పద్మాల సుగంధం ఆమెను అంటిపెట్టుకొని ఉంటుంది. సాక్షాత్తు లక్ష్మీదేవి అంశతో భూమిలో అవతరించిన జగన్మాత. ఆమె మహోదాత్త గుణాలే ఆమెకు మణిభూషణాలు. బాలలలోమణి.

## 20

రుక్మిణీదేవి త్రికరణాలలో శ్రీకృష్ణస్వామినే నింపుకొన్నది. కానీ అన్న రుక్మి తనను శిశుపాలునికి ఇస్తానంటున్నాడు. తల్లిదండ్రులు ఎటూ చెప్పలేక కర్తవ్యం తోచక తల్లడిల్లిపోతున్నారు. ఈ స్థితిలో తనకు సర్వవిధాలా ఉద్ధరింపగలవాడు వాసుదేవుడే అని నిర్ణయించుకొని ఒక ఉత్తమ విప్రుని ద్వారా తన సందేశం పురుషోత్తమునకు పంపింది. ఆ మహాత్ముడు అది కృష్ణునకు వినిపిస్తున్నాడు.

**సీ. ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోక దేహతాపంబులు దీఱిపోవు**
**నే నీ శుభాకార మీక్షింప గన్నుల కఖిలార్థలాభంబు గలుగుచుండు**
**నే నీ చరణసేవ లేప్రొద్దు జేసిన భువనోన్నతత్వంబు బొంద గలుగు**
**నే నీ లసన్నామ మే ప్రొద్దు భక్తితో దడవిన బంధసంతతులు వాయు**

**అట్టినీయందు నా చిత్త మనవరతము**
**నచ్చియున్నది నీయాన నానలేదు**
**కరుణ జూడుము కంసారి ! ఖలవిదారి**
**శ్రీయుతాకార ! మానినీచిత్తచోర !** **10-1701**

క్రూరాత్ముడైన కంసుని కడతేర్చిన స్వామీ ! పరమనీచులను చీల్చి చెండాడే జగదేకవీరా ! శ్రీ యుతాకారా! చెలువల చిత్తాన్ని అపహరించే సుందరసుందరా ! శ్రీకృష్ణా ! నీగుణాలు చెవులను తాకినంతటనే దేహ తాపాలన్నీ తీరిపోతాయి. నీ మంగళాకారాన్ని చూచినంతనే కన్నులకు చూడవలసిన లాభాలన్నీ సిద్ధిస్తాయి. నీ పాదాలకు ఎప్పుడు సేవలు చేస్తే అప్పుడు ఆ వ్యక్తికి భువనాలన్నింటినీ దాటుకొనిపోయే పరమసిద్ధి కలుగుతుంది. నీ శుభనామాన్ని భక్తితో పాడుకుంటే సంసారబంధాలన్నీ తెగిపోతాయి. అటువంటి నీయందు నాచిత్తం నిరంతరంగా ఇష్టపడి ఉన్నది. దీనికి నీ ఆజ్ఞ పొందలేదు. నన్ను కరుణతో చూడు మహాత్మా !

## 21

**రుక్మిణీదేవి సందేశంలోని మరొక విషయాన్ని ఆ బ్రాహ్మణోత్తముడు పురుషోత్తమునకు విన్నవిస్తున్నాడు.**

**ఉ. శ్రీయుతమూర్తి! యో పురుషసింహమ! సింహముపాలి సొమ్ము గో**
**మాయువు గోరు చందమున మత్తుడు చైద్యుడు నీ పదాంబుజ**
**ధ్యాయినియైన నన్ను వడి దా గొనిపోయెద నంచు నున్న వా**
**డా యధమాధముం డెఱుగ దద్భుతమైన భవత్ప్రతాపమున్.** **10-1706**

శ్రీయుతమూర్తీ ! నీవు పురుషులలో సర్వశ్రేష్ఠుడవు ! అందువలననే నిన్ను 'పురుష సింహము' అని నేను పిలుచుకుంటున్నాను. సింహపుపాలి సొమ్మును గుంటనక్క కోరినట్లుగా నీపాద పద్మాలను మాత్రమే ధ్యానంచేసే నన్ను, కండకావరంతో కన్నులుకానని శిశుపాలుడు, వడివడిగా కొనిపోవాలని అంటూ ఇక్కడ ఉన్నాడు. అధములందరిలో మరింత అధముడైన ఆ నీచుడు అద్భుతమైన నీ ప్రతాపాన్ని తెలుసుకోలేక పోతున్నాడు.

## 22

**రుక్మిణి, శ్రీకృష్ణుడు తనను ప్రమాదాలనుండి ఎలా దాటించాలో, ప్రమోదంతో ఎలా ఉద్ధరించాలో స్వామికి బ్రాహ్మణోత్తముని ద్వారా తెలియజేసుకుంటున్నది.**

**ఉ. అంకిలి సెప్పలేదు, చతురంగబలంబులతోడ నెల్లి యో**
**పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా**
**వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే**
**యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము, వచ్చెదన్.** **10-1708**

స్వామీ ! కృష్ణా ! పంకజనాభా ! పురుషోత్తమా ! నా గుండెలోని అలజడి ఇట్టిది అట్టిది అని నేను చెప్పగలిగింది కాదు. కాబట్టి అడ్డు చెప్పకు. రేపే రథాలూ, గజాలూ, గుఱ్ఱాలూ, కాల్బంటులూ గల గొప్ప సేనావాహినితో బయలుదేరు. మొట్టమొదటగా శిశుపాలుణ్ణీ, వానికి అండగా నిలిచిన జరాసుంధుణ్ణీ జయించు. తరువాత నా దగ్గరకు వచ్చి, నీ పరాక్రమమే కన్యకు ఇచ్చే సొమ్ముగా చేసి రాక్షస వివాహ పద్ధతితో నన్ను చెట్టపట్టి తీసుకొనిపో. నేను వస్తాను.

## 23

రుక్మిణి విప్రవరుని ముఖాన తన దృఢనిశ్చయాన్ని శ్రీకృష్ణవాసుదేవునకు తెలుపుకుంటున్నది. తన అయిదు జ్ఞానేంద్రియాలూ స్వామికి సమర్పణగా చేసికొన్న విషయాన్ని మరొక విధంగా వెల్లడిస్తున్నది.

**సీ. ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబుల కలిమి యేల?**
**పురుషరత్నమ! నీవు భోగింపగా లేని తనులతవలని సౌందర్యమేల ?**
**భువనమోహన! నిన్ను బొడగానగా లేని చక్షురింద్రియముల సత్త్వమేల ?**
**దయిత! నీ యధరామృతం బానగా లేని జిహ్వకు ఫలరససిద్ధి యేల ?**

**నీరజాతనయన ! నీ వనమాలికా**
**గంధ మబ్బలేని ఘ్రాణ మేల ?**
**ధన్య చరిత ! నీకు దాస్యంబు చేయని**
**జన్మమేల ? ఎన్ని జన్మములకు. 10ఉ.1708**

నీవు నా ప్రాణాలకు ప్రభువవు. నీ మధురమైన మాటలు వినలేకపోతే నాకు చెవులుండటమే ప్రయోజనం లేని విషయం. పురుషోత్తమా ! నీకు భోగ్యం కాని నా తనులత అందచందాలు ఎందుకయ్యా ! భువన మోహనా! నిన్ను చూడలేని కన్నులు ఉండి ఏమి ఊడి ఏమి ? ప్రియా ! నీ అధరామృతం ఆనలేని జిహ్వకు ఎంత ఫలరసం అందినా అది వ్యర్థమే. విప్పారిన పద్మాలవంటి కన్నులున్న స్వామీ ! నీవు ధరించిన వనమాలిక పరిమళాన్ని అందుకోలేని నాసికకు సార్థకత ఉంటుందా ? ధన్యచరితా ! నీకు దాస్యం చేయని బ్రదుకు ఎందుకు ? ఎన్ని జన్మలైనా వ్యర్థమే.

## 24

విప్రవరుని ద్వారా విదర్భరాజతనయ సందేశం వీనులారా విన్నాడు శ్రీకృష్ణస్వామి. ఆ మహాత్ముని చేతిని చేతిలోనికి తీసుకున్నాడు. ఆనందంతో తన కామెయందు గల అనురాగాన్ని ముక్తసరిగా మూడు మాటలతో చెప్పాడు. తన నిర్ణయాన్ని ఇలా ప్రకటించాడు.

**క. వచ్చెద విదర్భభూమికి**
**జొచ్చెద భీష్మకుని పురము; సురుచిరలీలన్**
**తెచ్చెద బాలన్; వ్రేల్మిడి,**
**వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చిన బోరన్. 10-1717**

బ్రాహ్మణప్రవరా ! నేను విదర్భ దేశానికి వస్తాను. భీష్మకునిపురం ప్రవేశిస్తాను. చూడముచ్చట అయిన విలాసంతో ఆ బాలను తెచ్చుకుంటాను. పగవారు అడ్డం వస్తే వారినందరినీ క్షణకాలంలో చీల్చి చెండాడుతాను.

## 25

రుక్మిణికి మదిమదిలో లేదు. ముహూర్తం దగ్గరపడుతున్నది. శిశుపాలుడు మొదలైనవారంతా వచ్చి కూర్చున్నారు. కృష్ణుడు వస్తాడో, రాడో ! తనను గూర్చి ఏమనుకుంటున్నాడో అని ఆమె హృదయం అదవదలయి పోతున్నది. ఇలా అనుకుంటున్నది.

మ. ఘను డా భూసురు డేగెనో? నడుమ మార్గశ్రాంతుండై చిక్కెనో
వినికృష్ణుం డిది తప్పుగా దలచెనో? విచ్చేసెనో? యీశ్వరుం
డనుకూలింప దలంచునో తలపడో? యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుగదో? నా భాగ్య మెట్లున్నదో ? 10ఉ.1727

ఆ మహాత్ముడు బ్రాహ్మణుడు కృష్ణుని దగ్గరకు వెళ్ళాడో లేదో ? మధ్యలో మార్గాయాసంతో ఎక్కడైనా చిక్కుపడ్డాడేమో ! నా విన్నపం విని శ్రీకృష్ణుడు తప్పుగా తలపోయలేదు కదా ! ఒకవేళ ఇక్కడకు వచ్చి ఉన్నాడేమో ! పరమేశ్వరుడు నా విషయంలో అనుకూలంగా ఉండాలనుకున్నాడో లేదో ? అమ్మలగన్నయమ్మ ఆ ఉమాపరమేశ్వరి నన్ను రక్షించటానికి పూనుకొన్నదో లేదో ? ఇంతకూ నాభాగ్యం ఎలా ఉన్నదో ?

## 26

శ్రీకృష్ణుని రాక సూచనలు లేక రుక్మిణి మూడు కరణాలూ ముప్పుతిప్పలు పడుతున్నాయి. అనేక ఆలోచనల అలలు హృదయంలో చెలరేగుతున్నాయి. ఎవరికి చెప్పుకొని కొంతకు కొంతైనా ఆరాటాన్ని ఆపుకోవాలో అర్థం కావటం లేదు. ఆ స్థితిలో ఆమె అవస్థ ఎలా ఉన్నదో పోతన మహాకవి వక్కాణిస్తున్నాడు.

ఉ. చెప్పదు తల్లికిం దలపు జిక్కు దిశల్ దరహాసచంద్రికం
గప్పదు, వక్త్రతామరసగంధ సమాగత భృంగసంఘమున్
రొప్పదు; నిద్ర గైకొన దురోజపరస్పర సక్తహారముల్
విప్పదు: కృష్ణమార్గగత వీక్షణపంక్తులు ద్రిప్ప దెప్పుడున్. 10ఉ.1730

తన ఎదలోని ఆరాటాన్ని ఎవరైనా ఆత్మీయులకు చెప్పుకొంటే కొంత శాంతత ఏర్పడుతుంది. బిడ్డకు అమ్మకంటే ఆత్మీయ ఎవరు ? అటువంటి కన్నతల్లికి కూడా తన ఆరాటాన్ని చెప్పుకోలేకుండా ఉన్నది. భావన దిక్కులలో చిక్కిపోయి ఉన్నది. చిరునగవు అనే వెన్నెలను కూడా దాచుకోవటం లేదు. మోము తామర పరిమళానికి పరవశించి మూగుతున్న తుమ్మెదలను తోలాలనే ఊహ కూడా ఆమెకు కలుగలేదు. నిద్ర అసలేలేదు. వక్షఃస్థలం మీది హారాలన్నీ అటూ ఇటూ పొరలటం వలన ఒకదానితో ఒకటి పెనవేసుకొని పోయాయి. వానిని కూడా చిక్కు తీయాలనిపించటం లేదు ఆమెకు. తన మనోహరుడు కృష్ణుడు వచ్చే దారి నుండి చూపుల పంక్తులను కొంచెం కూడా త్రిప్పటం లేదు.

## 27

రుక్మిణి తపస్సు ఫలించిందని తిరిగివచ్చిన విప్రప్రవరుడు తెలియజేశాడు. బలరామకృష్ణులకు భీష్మకుడు విడిదులేర్పాటు చేశాడు. క్షణంలో హరిరాక వార్త విదర్భపురం ప్రజల వీనులకు విందుచేసింది. శ్రీకృష్ణ దేవుని సుందరవదనారవిందాన్ని వీక్షించి పౌరజనాలు ఇలా అనుకున్నారు.

మ. తగు నీచక్రి విదర్భరాజసుతకుం; తథ్యంబు వైదర్భియుం
దగు నీచక్రికి; ఇంతమంచి దగునే దాంపత్య మీ యిద్దఱిం
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా! దర్పాహతారాతియై
మగడౌ గావుత చక్రి యీ రమణికిన్ మా పుణ్యమూలంబునన్. 10ఉ.1740

అదిగో చక్రం చేతిలో ధరించి విలాసంగా విచ్చేస్తున్న శ్రీకృష్ణుడు. మా ఏలిక కన్నబిడ్డకు ఇతడే తగినభర్త. అంతేకాదు. ఈ చక్రికి కూడా ఈమెయే అన్నివిధాలా యోగ్య అయిన ఇల్లాలు. ఇది ముమ్మాటికీ సత్యం. ఈ దాంపత్యం ఇంత గొప్పదై విరాజిల్లటం చాలా గొప్ప సంగతి. ఈ యిద్దరినీ ఒకరికొకరిని ఏర్పాటు చేసిన బ్రహ్మ గొప్ప నేర్పుకాడు. మా పుణ్యాలు మూలకారణంగా, ఈ చక్రి, పొగరుబోతులైన పగవారి నందరినీ పరిమార్చి మా రాజకుమారికి మగడగుగాక !

## 28

**కృష్ణస్వామి వచ్చిన సంగతి తెలుసుకొన్న రుక్మిణి హృదయం తేటపడింది. కులాచారం ప్రకారం గౌరీ పూజ నాచరించటానికి అమ్మవారి ఆలయంలోనికి ప్రవేశించింది. ముగ్గురమ్మల మూలపుటమ్మకు ముచ్చటగా రుక్మిణిచేత విప్రుల యిల్లాండ్రు పూజ చేయించారు. రుక్మిణి మనస్సులో ఇలా అనుకొంటున్నది.**

**ఉ. నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్**
**మిమ్ము పురాణదంపతుల మేలు భజింతు గదమ్మ! మేటి పె**
**ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతి సేయు మమ్మ ! నిన్ !**
**నమ్మినవారి కెన్నడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ ! 10ఉ.1744**

నేను నా మనస్సులో సనాతనులైన ఉమా మహేశ్వరులను నమ్ముకొన్నాను. మీరు పురాణ దంపతులు. కనుక పరమేశ్వరీ ! నీవు మేటి పెద్దమ్మవు. సముద్రమంత దయనీది. నాకు శ్రీహరిని పతిగా అనుగ్రహించు తల్లీ. నిన్ను నమ్మిన వారికి ఎన్నటికీ నాశములేదు గదమ్మా.

## 29

**శ్రీరుక్మిణీ మహాదేవి స్వయంవర మండపంలోనికి ప్రవేశించింది. మెల్లగా అడుగులు వేస్తూ రాజుల సముదాయాన్ని దాటుకుంటూ ముందునకు సాగుతున్నది. తక్కిన రాజులెవ్వరూ ఆమె కంటికి ఆనటంలేదు. అల్లంత దూరాన తన ప్రాణేశ్వరుడు కన్నులలో కదలాడుతున్నాడు.**

**మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం కంఠీరవేంద్రావ ల**
**గ్ను, నవాంభోజదళాక్షు, జారుతరవక్షున్, మేఘసంకాశ దే**
**హు, నగారాతి గజేంద్ర హస్తనిభబాహుం, చక్రి, పీతాంబరున్**
**ఘనభూషాన్వితు, కంబుకంఠు, విజయోత్కంఠున్, జగన్మోహనున్. 10ఉ.1750**

ఆ స్వామి పూర్ణచంద్రునివంటి మోముతో అలరారుతున్నాడు. సింహం నడుమువంటి నడుముతో విరాజిల్లుతున్నాడు. అప్పుడప్పుడే వికసిస్తున్న పద్మాలవంటి కన్నులతో అందాలు విరజిమ్ముతున్నాడు. దేహమంతా నీలమేఘంలాగా శ్యామల వర్ణంతో ఒప్పారుతున్నది. దేవేంద్రుని ఏనుగు ఐరావతం తొండం వంటి బాహువులు చూపులను ఆకట్టుకొంటున్నాయి. చేతబట్టిన చక్రం కాంతిచక్రాలను కమనీయంగా వెలుదరిస్తున్నది. పసిమివన్నె పట్టుబట్ట వెలుగులు అలరిస్తున్నాయి. నిలువెల్లా విలువకట్టనలవి కాని అలంకారాలు కాంతివలయాలకు ఆకరాలవుతున్నాయి. అదిగో కమనీయశంఖం వంటి కంఠం అందరినీ ఆకర్షిస్తున్నది. రుక్మిణిని గెలుచుకోవాలి అనే ఉత్కంఠ ముఖంలో స్పష్టంగా తెలియవస్తున్నది. జగత్తులన్నింటినీ మోహపారవశ్యంలో ముంచుతున్న నందనందన సుందరుడైన శ్రీకృష్ణుణ్ణి శ్రీ రుక్మిణి తిలకించింది.

## 30

బ్రహ్మాండాని కంతటికీ బ్రహ్మానందాన్ని సంధానించే రుక్మిణీ వాసుదేవుల దివ్యకల్యాణ వైభవాన్ని భావించటం పరమపుణ్యం. తెలుగుల పుణ్యపేటి పోతన ఆ మహాభాగ్యాన్ని మనకు అందిస్తున్నాడు.

శా. ధ్రువకీర్తిన్ హరి పెండ్లి యాడె నిజ చేతోహారిణిన్, మాన వై
భవ గాంభీర్య విహారిణిన్, నిఖిల సంపత్కారిణిన్, సాధు బాం
ధవ సత్కారిణి, పుణ్యచారిణి, మహాదారిద్ర్య సంహారిణిన్,
సువిభూషాంబర ధారిణిన్, గుణవతీ చూడామణిన్, రుక్మిణిన్. 10ఉ.1784

ఆయన హరి. సర్వప్రాణులనూ తనలోనికి హరింపజేసుకొనే మహాత్ముడు. ఆమె రుక్మిణి. తన ఒడలంతా సువర్ణమయమే అయిన ఉత్తమవనిత. ఆమె తన హృదయాన్ని కొల్లగొట్టింది. అభిమానము, వైభవము, గాంభీర్యమూ అనే మహాలక్షణాలతో విహరిస్తున్నది. అందరకూ, అన్నింటికీ సంపదలను సమకూర్చే సౌభాగ్యంతో విరాజిల్లుతున్నది. సజ్జనులను దగ్గరి చుట్టాలనుగా భావించి సత్కరించే సౌజన్యంతో ఒప్పారే దివ్యలక్షణం కలది. పుణ్య కార్యములందు మాత్రమే ప్రవృత్తి కలిగినట్టిది. లేమి అనే లేకి దెయ్యాన్ని రూపుమాపే శీలం కలది. జాజ్వల్యమానములైన ఆభరణాలతో, అత్యద్భుతంగా వెలుగులు చిమ్ముతున్న వస్త్రాలతో అలరారుతున్నది. గుణవతులైన వనితల తలమానికమై ప్రకాశిస్తున్నది. అటువంటి రుక్మిణీ దేవిని ఆ శ్రీహరి పెండ్లియాడినాడు.

## 31

శ్రీకృష్ణులవారు నరకాసురుణ్ణి సంహరించటానికి ప్రాగ్జ్యోతిషపురానికి చేరుకున్నారు. స్వామితోపాటు సత్రాజిత్తనయ సత్యభామ కూడా బయలుదేరింది. జగదేకజయశీలుడు మురాసురాదులను పరిమార్చాడు. సత్యభామా జగన్నాథులకు నరకుడు ఎదురై నిలిచాడు. హఠాత్తుగా అమ్మవారు వానితో పోరాటానికి సిద్ధమైంది. అదిచూచి శ్రీహరి యిలా అంటున్నాడు.

క. లేమా ! దనుజుల గెలువగ
లేమా? నీవేల కడగి లేచితి? విటు రా
లే మాను మాన వేనిన్
లేమా విల్లందికొనుము లీలం గేలన్. 10-172

లేమా ! ఈ రక్కసులను మేము గెలువలేమా ? నీవెందుకు పూనుకొని విజృంభిస్తున్నావు. నా దగ్గరకు రా ! లే ! ఈ ప్రయత్నాన్ని మానుకో ! మానుకోను అంటే ఇదిగో లేచి మా వింటిని లీలగా కేలితో అందుకో!

## 32

సత్యభామ సర్వేశ్వరుని అనుమతినీ, వింటినీ రెంటినీ అందుకొన్నది. కృష్ణదేవునకు ఆమె సంరంభం ఆనందసాంద్రస్థితిని కలిగిస్తున్నది. పగవానికి పరమరౌద్రంగా భాసిస్తున్నది. ఇది ఒక విచిత్రమైన రస సమ్మేళనం. అప్పటి ఆతల్లి విజృంభణను అభివర్ణిస్తున్నారు పోతన కవీంద్రులు.

సీ. సౌవర్ణకంకణ ఝుణఝుణ నినదంబు శింజినీరవముతో చెలిమిసేయ
తాటంక మణిగణ ధగధగ దీప్తులు గండమండల రుచి గప్పికొనగ
ధవళతరాపాంగ ధళధళరోచులు బాణజాల ప్రభాపటలి నడప
శరపాత ఘుమఘుమశబ్దంబు పరిపంథి సైనిక కలకలస్వనము లుడుప

వీర శృంగార భయ రౌద్ర విస్మయములు
గలసి భామిని యయ్యెనో కాక యనగ

**ఇషువు తొడుగుట, విడుచుట, యేయుటెల్ల**
**నెఱుగరాకుండ ననిసేసె ఇందువదన** **10-177**

సత్యభామ ముంజేతివలయాల ఝణఝణ నాదం అల్లెత్రాటి గంభీరనాదంతో చెలిమి చేస్తున్నది. కర్ణాభరణాలలోని మణుల ధగధగ కాంతులను చెక్కిలికాంతులు కప్పివేస్తున్నాయి. మిక్కిలి తెల్లని కడకంటి ధళధళలాడే దీప్తులు బాణాల పంక్తుల ప్రభలను అణచివేస్తున్నాయి. దూసుకొనిపోతున్న బాణాల భూత్కార ధ్వనులు పగవాని సైనికుల కలకల ధ్వనులను రూపుమాపుతున్నాయి. వీరము, శృంగారము, భయానకము, రౌద్రము, అద్భుతము అనే అయిదురసాలు ఒక్కటిగానై ఈ భామినిగా అయినాయా అన్నట్లు ఆ హరిసుందరి అలరారుతున్నది. బాణం వింటిలో ఎప్పుడు సంధించిందో, ఎప్పుడు విడిచిందో, ఎప్పుడు కొట్టిందో ఎవరూ గుర్తించలేకపోతున్నారు. ఆ విధంగా ఆ ఇందువదన యుద్ధక్రీడతో విహరించింది.

# 33

**సత్యభామ చకచకా ఇటు తన ప్రాణనాయకుణ్ణీ, అటు నరకుణ్ణీ మార్చిమార్చి చూస్తూ ఘోరంగా పోరుతున్నది. లిప్తకూడా వ్యవధానం లేని ఆ చూపులలో, ఆ కదలికలలో రెండు విరుద్ధరసాలు వింతగా అనుభవానికి వస్తున్నాయి.**

**మ. పరు జూచున్ వరు జూచు నొంప నలరింపన్, రోషరాగోదయా**
**విరతభ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్**
**జరగన్, గన్నుల గెంపు సొంపు బరగన్ జండాస్త్ర సందోహమున్**
**సరసాలోక సమూహమున్ నెఱపుచున్ జంద్రాస్య హేలాగతిన్.** **10ఉ.178**

ఆ భామ తీవ్రక్రోధంతో పగవానిని చంపివేయాలని చూస్తున్నది. వెంటనే చూపును ఇటువైపు త్రిప్పి తన పతిదేవుణ్ణి అదే చూపుతో ఆనందింపజేస్తున్నది. అటువైపు రోషం పెల్లుబుకుతున్నది. ఇటువైపు అనురాగం అంబరాన్నంటుకొంటున్నది. అటువైపు కనుబొమలు ముడివడుతున్నాయి. ఇటువైపు మందహాసం చిందులు త్రొక్కుతున్నది. అటు వీరరసమూ, ఇటు శృంగారరసమూ ఏకకాలంలో ఒప్పారుతున్నాయి. అటువైపు, కన్నులలో కెంపు, ఇటువైపు సొంపు తాండవిస్తున్నాయి. నిండు చందురుని చల్లని కాంతులు కదలాడుతున్న మోముతో అలరారే ఆ అంగన విలాసంగా, పగవానిమీద భయంకరములైన అస్త్రాలనూ, పతిదేవుని మీద సరసములైన చూపులనూ కుప్పలుతెప్పలుగా కురిపిస్తున్నది.

# 34

**శ్రీహరిని చెట్టపట్టిన శృంగార రసాధిదేవత సత్యభామ ఇప్పుడు క్రొత్తగా నరకుని నరికిపోగులు పెట్టటానికి వీరరసాధిదేవత అయి పోరుతున్నది. ఇటు శృంగారలక్ష్మి, అటు వీరలక్ష్మి అయిన ఆయమ్మను అత్యద్భుతంగా మనమన: పటంమీద అక్షరశిల్పం చేస్తున్నాడు మహాకవి.**

**సీ. రాకేందుబింబమై రవిబింబమై యొప్పు నీరజాతేక్షణ నెమ్మొగంబు,**
**కందర్పకేతువై ఘనధూమకేతువై యలరు పూబోడి చేలాంచలంబు,**
**భావజు పరిధియై ప్రళయార్కు పరిధియై మెఱయు నాకృష్ణమై మెలత చాప**
**మమృత ప్రవాహమై యనలసందోహమై తనరారు నింతి సందర్శనంబు.**

**హర్షదాయియై, మహారోషదాయియై**
**పరగు ముద్దరాలి బాణవృష్టి**
**హరికి నరికి చూడ అందంద శృంగార**
**వీరరసము లోలి విస్తరిల్ల** **10ఉ.183**

పద్మాలవంటి కన్నులతో విరాజిల్లుతున్న ఆ సత్యభామ నిండుమోము కృష్ణదేవునకు పూర్ణిమనాటి చంద్రబింబమై ఒప్పారుతున్నది. అటు నరకునకు భగభగమండే రవిబింబయై ఉడికిస్తున్నది. ఆమె చీరకొంగు కృష్ణునకు మన్మథుని పతాకయై భాసిస్తున్నది. నరకునకు అదే ఒక ప్రాణాంతకమైన తోకచుక్కగా తోస్తున్నది. చెవులదాకా లాగిన అల్లెత్రాటితో అలరారు ఆమె చేతిలోని విల్లు కృష్ణునకు మన్మథుని గుడి అయి ఆనంద మందిరం అయింది. అదే నరకునకు ప్రళయకాలం నాటి భాస్కరునికి ఏర్పడిన మండలంగా కన్పట్టింది. ఆ వనితను తేరిపారజూడటం హరికి అమృత ప్రవాహం అయింది. నరకునకు అగ్నికుంపటిలా అయిపోయింది. ఆ ముద్దరాలి బాణాల జడివాన హరికి హర్షాన్నీ, అరికి మహారోషాన్ని అందజేస్తున్నది. అలా శృంగార వీరరసాలు వింతగా ఒక క్రమంలో విస్తరిల్లుతున్నాయి.

## 35

**సత్యభామ సరభసంగా సాహసంతో పోరాడి రక్కసి మూకలను దిమ్మతిరిగేట్టు కొట్టింది. వారందరూ తోకముడిచారు. అది చూచి హరి ఆ హరిణలోచనతో సరసంగా ఇలా పలికాడు.**

**క. కొమ్మా! దానవనాథుని,**
**కొమ్మాహవమునకు దొలగె గురువిజయము గై**
**కొమ్మా! మెచ్చితి నిచ్చెద**
**గొమ్మా భరణములు నీవు గోరిన వెల్లన్. 10ఉ.187**

భామా ! దానవుల నాథుడు అనాథుడయ్యాడు. ఆతని పరివారమంతా నీ ధాటికి నిలువలేక పలాయనం చిత్తగించారు. నీకు చాలా గొప్ప విజయం సిద్ధించింది. గ్రహించు. అంతేకాదు నేను మెచ్చాను. కోరిన అలంకారాలన్నింటినీ నీకు కానుకగా ఇస్తాను. తీసుకో.

## 36

**శ్రీకృష్ణవాసుదేవుడు నరకాసురుని సంహరించి ఆతనిపురం ప్రవేశించి అక్కడ అతడు ఎక్కడెక్కడ నుండియో తెచ్చి బంధించి ఉంచిన పదునారువేల రాచ కన్నియలను చెఱనుండి విడిపించాడు. వారందరూ అతనిపై మోహం పెంచుకున్నారు. వారిలో వారిలా అనుకొంటున్నారు.**

**సీ. వనజాక్షి! నే గన్క వైజయంతిక నైన గదిసి వ్రేలుదు గదా కంఠమందు**
**బింబోష్ఠి! నే గన్క బీతాంబరము నైన మెఱసి యుండుదు గదా మేను నిండ**
**గన్నియ నే గన్క కౌస్తుభమణి నైన నొప్పు చూపుదు గదా యురమునందు**
**బాలిక! నే గన్క బాంచజన్యము నైన మొనసి చొక్కుదు గదా మోవి గ్రోలి**

**పద్మగంధి ! నేను బర్హదామమనైన**
**చిత్రరుచుల నుందు శిరమునందు**
**ననుచు పెక్కు గతుల నాడిరి కన్యలు**
**గములు గట్టి గరుడగమను జూచి. 10ఉ.212**

ఆ నరకుని చెరనుండి విడుదల పొందిన పదునారువేల కన్నియలు నల్లనయ్య అందచందాలను చూచి పరవశించిపోయారు. ఇలా అనుకుంటున్నారు. వనజాక్షీ నేనే వైజయంతీమాలనైతే ఆ స్వామి కంఠసీమలో మాలనై వ్రేలాడేదానను గదా ! బింబోష్ఠీ ! నేను పట్టుపుట్టాన్నయితే ఆ స్వామి మేనంతా ఆవరించి మెరసిపోయేదానను గదా ! ఓ కన్నెపిల్లా ! నేనే కనుక కౌస్తుభమణినై ఉంటే ఆ స్వామి ఉర:స్థలంపై ఒప్పారి ఉండేదానను కదా ! బాలికా ! నేను పాంచజన్యాన్నయి ఉంటే ఆ దేవదేవుని మోవిని ఆస్వాదిస్తూ పారవశ్యం పొందేదానను గదా ! పద్మగంధీ ! నేను నెమలిపింఛమునై ఉంటే ఆ మహాత్ముని శిరస్సుమీద చిత్రకాంతులతో చెన్నారి ఉండేదానను. - అని పెక్కువిధాలుగా గుంపులు గుంపులుగా కూడుకొని గరుడ గమనుని చూచి ఆడుకున్నారు.

# ఏకాదశ స్కంధము

## 1

శుక యోగీంద్రుడు పరీక్షిన్మహారాజునకు యాదవులందరూ బ్రాహ్మణ శాపంవల్ల ఒకరినొకరు కొట్టుకొని చనిపోయారని చెప్పాడు. అంతటి మహానుభావులకు బ్రాహ్మణశాపం ఎందుకు కలిగింది అని పరీక్షిత్తు అడుగగా దానిని వివరిస్తూ విశ్వామిత్రుడు మొదలైన మహర్షులు శ్రీకృష్ణుని దర్శించడానికి విచ్చేశారని శుకుడు చెప్పాడు. ఆ సందర్భంలో కృష్ణుని దివ్యవిభూతిని ఇలా వర్ణిస్తున్నాడు -

**సీ. ఘనుని, శ్రీకృష్ణుని, కౌస్తుభాభరణుని, కర్ణకుండలయుగ్మ ఘనకపోలు,**
**పుండరీకాక్షు, నంభోధరశ్యాముని, గలితనానారత్న ఘన కిరీటు,**
**నాజానుబాహు, నిరర్గళాయుధహస్తు, శ్రీకరపీతకౌశేయవాసు,**
**రుక్మిణీనయన సరోజ దివాకరు, బ్రహ్మాదిసుర సేవ్యపాదపద్ము,**

**దుష్టనిగ్రహ శిష్టసంతోషకరణు,**
**కోటి మన్మథలావణ్య కోమలాంగు,**
**ఆర్తజనరక్షణైక విఖ్యాత చరితు,**
**కనిరి కరుణాసముద్రుని, ఘనులు మునులు** **11-12**

ఆయన చాలా గొప్పవాడు. కౌస్తుభమనే మణితో విరాజిల్లుతున్నవాడు. గొప్ప తేజస్సులను వెదజల్లుతున్న కర్ణాభరణముల జంటతో అతని చెక్కిళ్లు ప్రకాశిస్తున్నాయి. తెల్లని కాంతులతో విరాజిల్లుతున్న పద్మాలవంటి కన్నులు ఒప్పారుతున్నాయి. నీలిమేఘం వంటి వన్నెతో శోభిల్లుతున్నాడు. పెక్కు విధాలైన రత్నాలు పొదిగిన కిరీటం శిరస్సు మీద వెలుగులు నింపుతున్నది. మోకాళ్ల వరకు వ్యాపించియున్న బాహువులు అందంగా ఒప్పారుతున్నవి. చక్రము, గద, ఖడ్గము మొదలైన ఆయుధాలను ధరించియున్నాడు. ఆ ఆయుధాలకు చొరరాని తావులు లేవు. శోభతో ఒప్పారుతున్న పట్టుపుట్టాన్ని కట్టుకొని ఉంటాడు. రుక్మిణీదేవి కన్నులనే కమలాలకు సూర్యుడైనవాడు. బ్రహ్మ మొదలైన దేవతలందరూ ఆయన పాదపద్మాలను అర్చించి ఆనంద మొందుతూంటారు. కోటి మన్మథుల లావణ్యంతో విరాజిల్లే సుకుమారమైన దేహంగలవాడు. ఆర్త జనులను రక్షించుటయే పరమప్రయోజనమైన విఖ్యాత చరిత్రుడు. అట్టి శ్రీకృష్ణుని, కరుణాసముద్రుని ఘనులైన మునులు దర్శించుకున్నారు.

## 2

శ్రీకృష్ణ దర్శనానికి వచ్చిన విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, నారదుడు మొదలైన మహర్షులు పవిత్రమైన వాక్కులతో అతనిని ప్రశంసిస్తున్నారు.

**క. జనములు నిను సేవింపని,**
**దినములు వ్యర్థంబు లగుచు దిరుగుచు నుండుం,**
**తనువులు నిలుకడ గావట,**
**వనములలో నున్ననైన వనరుహనాభా!** **11-14**

ఓయీ పద్మనాభా ! నిన్ను సేవించుకోలేని దినాలు జనాలకు పనికిమాలినట్టివి. ఈ దేహాలు శాశ్వతంగా ఉండవు. అన్ని సంగములను వదలిపెట్టి అరణ్యాలకు పోయినా తనువులు నిలుకడగా ఉండవుకదా!

# 3

**మహర్షులు శ్రీకృష్ణ వాసుదేవుని చరణాల మహిమను వర్ణిస్తున్నారు.**

**క. తరణంబులు భవజలధికి,**
**హరణంబులు దురిత లతల, కాగమముల కా (కు+ఆ)**
**భరణంబు; లార్తజనులకు**
**శరణంబులు, నీదు దివ్యచరణంబు లిలన్. 11-15**

స్వామీ! సంసారమనేది చాలా పెద్ద సముద్రము. దానిలో పడ్డ జీవుడు తనంతతాను ఒడ్డునకు చేరుకొనలేడు. నీ పాదపద్మాలు అట్టివానికి భద్రమైన నావలవుతాయి. పాపాలు భయంకరంగా అల్లుకున్న బలమైన తీగలు, నీ చరణాలు వానిని చేదించడానికి సమర్ధమైన సాధనాలు. వేదాలు పరమాత్మ జ్ఞానాన్ని ప్రసాదించే వాగ్వైభవము గల గ్రంథాలు. నీ పాదాలు వానికి ఆభరణాలు. దు:ఖంతో కుమిలిపోయే జనులకు దిక్కైనవి నీ దివ్య చరణాలు.

# 4

**జ్ఞానసంపన్నులైన మహర్షుల మహనీయ స్తుతులు ఇంకా ఇలా సాగుతున్నాయి.**

**మ. ఒక్కవేళను సూక్ష్మరూపము నొందు దీ వణుమాత్రమై**
**యొక్క వేళను స్థూలరూపము నొందు దంతయు నీవయై**
**పెక్కురూపులు దాల్తు నీ దగుపెంపు మాకు నుతింపగా**
**నక్కజం బగుచున్న దేమన? నంబుజాక్ష! రమాపతీ ! 11-16**

విశ్వాన్నంతటినీ వీక్షించే విశాలమైన కన్నులతో అలరారు స్వామీ ! రమాపతీ ! నీవు ఒక్కొక్క సమయంలో అణుమాత్రమైన సూక్ష్మరూపంతో విరాజిల్లుతుంటావు. కొన్నివేళలలో సర్వమూ నీవేయై స్థూల రూపంతో ప్రకాశిస్తూ ఉంటావు. నీ ఇష్టాన్ని అనుసరించి పెక్కు రూపాలను పొందుతూ ఉంటావు. నీ మహిమను మేము నుతింపగలమా ! మాకంతా ఆశ్చర్యముగా నున్నది.

# 5

**పరమాత్మజ్ఞానాన్ని నిలువెల్లా నింపుకున్న వశిష్ఠాది మహర్షులు శ్రీకృష్ణ పరమాత్ముని గురించి ఇలా స్తోత్రం చేస్తున్నారు.**

**క. శ్రీనాయక! నీ నామము,**
**నానాభవరోగకర్మనాశమునకు వి**
**న్నాణం బగు నౌషధ మిది,**
**కానరు దుష్టాత్ము లకట ! కంజదళాక్షా ! 11-17**

పద్మదళాక్షా! శ్రీనాయకా! నీనామం పెక్కువిధాలైన సంసారరోగాలను, కర్మలను నాశనం చేసే శ్రేష్ఠమైన ఔషధం. చెడిపోయిన బుద్ధిగల నికృష్ట మానవులు ఈ సంగతి తెలియలేరు. అయ్యో ఎంత ఘోరం!

## 6

**నారద మహర్షి వసుదేవునకు విదేహ వృషభ సంవాదాన్ని తెలియజేస్తూ ఇలా అంటున్నాడు.**

**క. అతిపాపకర్ములైనను,**
**సతతము నారాయణాఖ్య శబ్దము మదిలో**
**వితతంబుగ పరియించిన**
**చతురుల గొనియాడ కమలసంభవు వశమే ? 11-32**

మహానుభావా ! వసుదేవా ! ఎంత ఘోరాతిఘోరమైన పాపాలు చేసినవారైనా, ఎల్లవేళలా నారాయణ నామాన్ని వదలకుండా స్మృతిలో నిలుపుకున్నట్లయితే అట్టి నామజపపరాయణులను కొనియాడటం బ్రహ్మదేవునకు కూడా సాధ్యంకాని పని.

## 7

**ఒకమారు విదేహమహారాజు దగ్గరకు మహాతపస్సుతో విరాజిల్లే మహర్షులు తొమ్మిదిమంది వచ్చారు. విదేహరాజు వారి గొప్పతనాన్ని కొనియాడి కొన్ని ప్రశ్నలు అడిగాడు. వారు సమాధానం చెప్తూ ఇలా అన్నారు-**

**క. కరణ త్రయంబుచేతను,**
**నరుడే కర్మంబు సేయు నయ్యైవేళన్**
**హరి కర్పణ మని పలుకుట**
**పరువడి సుజ్ఞాన మండ్రు పరమమునీంద్రుల్. 11-42**

రాజా ! మానవులకు మనసు, మాట, కాయము అనే మూడు కరణాలు ఉన్నాయి. వీనితో నిరంతరమూ ఏవో పనులు చేస్తూనే ఉంటాడు. అలాచేసే సమయాలలో చేసిన ప్రతికార్యాన్నీ శ్రీహరికే సమర్పణ చేస్తున్నాను అని పలకటం మంచిజ్ఞానం అని మహామునిశ్రేష్ఠులు చెపుతూఉంటారు.

## 8

**మహర్షులు విదేహమహారాజునకు మూడు కరణాలతో పరమాత్మను సేవించుకొనే మార్గాన్ని చక్కగా ఉపదేశిస్తున్నారు.**

**సీ. సంతతంబును కృష్ణ సంకీర్తనంబులు వీనుల కింపుగ వినగవలయు,**
**హర్షంబుతోడుత హరినామకథనంబు పాటల నాటల పరగ వలయు,**
**నారాయణుని దివ్యనామాక్షరంబులు హృద్వీథి సతతంబు నెన్నవలయు,**
**కంజాక్షులీలలు కాంతారముల నైన భక్తి యుక్తంబుగా పాడవలయు**

**వెఱ్ఱిమాడ్కిని లీలతో విశ్వమయుని**
**నొడువుచును లోకభాహ్యత నందవలయు,**
**నింతయును విష్ణుమయమని ఎఱుగవలయు**
**భేదమొనరింప వలవదు మేదినీశ ! 11-44**

రాజా! శ్రీకృష్ణుని సంకీర్తనాన్ని నిరంతరము చెవులకు ఇంపుగా వింటూఉండాలి. పాటలలో, ఆటలలో మహానందంతో శ్రీహరి నామములను చెప్పుకుంటూ కాలం గడపాలి. శ్రీమన్నారాయణుని దివ్యనామాక్షరాలను హృదయవీధిలో విడువకుండా భావిస్తూఉండాలి. భయంకరమైన అడవులలోనైనా, శ్రీమహావిష్ణువు లీలలను భక్తిని కుదురుకొలుపుకుని పాడుకుంటూ ఉండాలి. వెఱ్ఱివారిలాగ విశ్వమంతా నిండిన పరమాత్మను ప్రస్తుతిస్తూ లోకానికి దూరమైపోవాలి. సమస్తము విష్ణుమయమని తెలుసుకోవాలి. విష్ణువునకు, విశ్వానికి భేదముంది అని అనుకోవటం కూడా పనికిరాదు.

## 9

**మహర్షులు నిలువెల్లా జ్ఞానమే అయినవారు కనుక విదేహరాజుతో భాగవతుడు అయినవాని లక్షణాలను వివరిస్తున్నారు -**

**తే. సర్వభూతమయుండైన సరసిజాక్షు**
**డతడె తన యాత్మయం దుండు ననెడువాడు**
**శంఖచక్రధరుం డంచు జనెడువాడు**
**భక్తిభావాభిరతుడు వో భాగవతుడు. 11-46**

రాజా! పద్మాలవంటి చక్కని నేత్రములు గల శ్రీమన్నారాయణుడు సర్వభూతమయుడు. అంటే విశ్వమంతా విష్ణుమయమే. కాగా అతనిని లోపలా, వెలుపలా కూడా దర్శించుకోవాలి. తన హృదయంలో లోపలి పొరలలో శంఖము, చక్రము ధరించి సంచరిస్తున్నవాడు సర్వాత్ముడైన పరమాత్మయే అని భక్తిభావంతో ఆనందించే శీలం కలవానిని భాగవతుడు అంటారు.

## 10

**భాగవతుని లక్షణాన్ని గురించి మహర్షులు విదేహమహారాజునకు ఇలా వివరిస్తున్నారు.**

**క. వర్ణాశ్రమ ధర్మంబుల,**
**నిర్ణయకర్మముల జెడక నిఖిలజగత్సం**
**పూర్ణుడు హరి యను నాతడె**
**వర్ణింపగ భాగవతుడు వసుధాధీశా ! 11-47**

రాజా! మానవులు గుణకర్మల విభాగాన్నిబట్టి నాలుగేసి విభాగాలుగా ఏర్పడుతున్నారు. వానిలో మొదటివానిని వర్ణాలనీ, రెండవవానిని ఆశ్రమాలనీ అంటారు. ప్రతివర్ణానికి, ప్రతి ఆశ్రమానికి కొన్ని ధర్మాలు విడివిడిగా ఉంటాయి. వానికి అనుగుణంగా కొన్ని ప్రత్యేకమైన పనులు కూడా విధ్యుక్తంగా ఉన్నాయి. ఎవరికివారు ఆయా ధర్మాలను పాటిస్తూ ఉండాలి. ఆయా కర్మలను ఆచరిస్తూ ఉండాలి. వానిని చెడగొట్టరాదు. అలా వర్ణాశ్రమ ధర్మాలను చక్కగా నిర్వహిస్తూ సమస్త జగాలు నిండిన మహాత్ముడు హరి ఒక్కడే అని పలుకుతూ తదనుగుణంగా ప్రవర్తించేవాడు భాగవతుడు అవుతాడు.

## 11

**రాజా! నారాయణ తత్త్వాన్ని వివరిస్తాను ఆలకించు అని విదేహ రాజుతో అంతరిక్షుడనే ఋషివరేణ్యుడు ఇలా అంటున్నాడు.**

**క. పరమబ్రహ్మ మనంగా**
**పరతత్త్వ మనంగ, పరమపద మనగను నీ**
**శ్వరు డన కృష్ణు డన జగ**
**ద్భరితుడు నారాయణుండు దా వెలుగొందున్. 11-51**

రాజా ! మనం భగవంతుణ్ని అనేక నామాలతో అర్చిస్తూ ఉంటాం. నామాలెన్నైనా తత్త్వం ఒక్కటే. దానిని దృష్టిలో ఉంచుకుంటే పరమబ్రహ్మము అన్నా, పరతత్త్వము అన్నా, పరమపదము అన్నా, ఈశ్వరుడు అన్నా, కృష్ణుడు అన్నా లోకాలన్నింటియందు నిండియున్న నారాయణుడే ప్రకాశిస్తూ ఉంటాడు.

# 12

**విదేహమహారాజులకు విజ్ఞానబోధ చేయడానికి వచ్చిన తొమ్మండుగురిలో ప్రబుద్ధుడు అనే మహర్షి ఉత్తమ భాగవతుల ధర్మాలన్నిటినీ వివరించి చెప్పి, చివరకు ఇలా అంటున్నాడు -**

**క. 'హరిదాసుల మిత్రత్వము,**
**మురరిపుకథ లెన్నికొనుచు మోదముతోడన్**
**భరితాశ్రు పులకితుండై,**
**పురుషుడు హరిమాయ గెల్చు భూపవరేణ్యా!। 11-55**

ఉత్తమనృపాలా ! హరిమాయ చాలా గొప్పది. దానిని దాటటం అతి దుష్కరమైన విషయం. కానీ దానికొక చక్కని దారిఉన్నది. దానిని చెబుతాను విను. నిరంతరము హరిదాసులతో చెలిమి చేస్తూ ఉండాలి. శ్రీమహావిష్ణువు కథలను వింటూ ఆనంద పారవశ్యంతో కన్నీరు వదలుతూ దేహమంతా పులకలతో అలరారుతూ ఉండే మానవుడు ఆ హరిమాయను గెలువగలుగుతాడు.

# 13

**వేదాంతవిజ్ఞాన సునిశ్చితార్థులైన మహర్షులలో ఒకడైన ఆవిర్హోత్రుడు అనే మహర్షి పరమాత్మ గుణ వైభవాన్ని విదేహరాజునకు వివరిస్తూ ఇలా అంటున్నాడు -**

**క. తారల నెన్నగ వచ్చును;**
**భూరేణుల లెక్కవెట్ట బోలును ధాత్రిన్;**
**నారాయణగుణ కథనము (ములు+ఆ)**
**లారయ వర్ణింపలేరు హరబ్రహ్మాదుల్. 11-61**

రాజా! ఆకాశంలో మిలమిలలాడుతూ అనంతంగా కన్పట్టే తారలనైనా లెక్కపెట్టవచ్చు. భూమికి సంబంధించిన రేణువులనైనా బుద్ధికుశలతతో ఇన్నీ అని ఎన్నవచ్చు. కానీ శ్రీమన్నారాయణుని గుణాల లెక్కను హరుడు గానీ, తామరసభవుడు గానీ ఇంకా అటువంటి దేవతలు గానీ లెక్కపెట్టలేరు. శ్రీమన్నారాయణుడు అనంత కల్యాణ గుణసంపన్నుడు.

# 14

**ద్రమిళుడు అనే పేరుగల మహాతత్త్వవేత్త విదేహజనపాలునకు శ్రీమన్నారాయణుని స్తుతించటం పరమదుష్కరమని తెలియజేస్తూ కమనీయ పదజాలంతో పరవశించి పాడుకోవడానికి అనువుగా ఒక పద్యరత్నాన్ని మనకు అందిస్తున్నాడు.**

సీ. నవవికచ సరసిరుహ నయనయుగ ! నిజచరణ
గగనచర నది! నిఖిల నిగమవినుత !
జలజసుత కుచకలశ లలితమృగమద రుచిర
పరిమళిత నిజహృదయ! ధరణిభరణ !
ద్రుహిణముఖ సురనికర విహితనుతి కలితగుణ !
కటిఘటిత రుచిరచర కనకవసన !
భుజగరిపు వరగమన ! రజితగిరిపతివినుత !
సతతజపరత నియమసరణి చరిత !

తిమికమఠకిటినృహరిముదితబలి నిహి,
త పద పరశుధర దశవదన విదళన!
మురదమన కలికలుష సుముదపహరణ !,
కరివరద ! మునివరసుర గరుడవినుత! 11-72

అప్పుడప్పుడే వికసించిన తామరపూలవంటి కంటిజంటగల స్వామీ! పాదాలనుండి జాలువారిన పరమపుణ్య జలాల మందాకినితో సుందరమైన దేవా! సకల వేదాలవినుతులకు పాత్రమైన పరమాత్మా! లోకమాత అయిన లక్ష్మీదేవి పాలిండ్లపై పెట్టుకొన్న కస్తూరి వాసనలతో ఘుమఘుమలాడే వక్షఃస్థలంతో అలరారే జగత్పతీ! భూదేవిని ఉరస్థలంలో పెట్టుకొని పట్టుకొన్న కరుణావరుణాలయా! లోకాలన్నింటినీ సృష్టించే బ్రహ్మ మొదలైన దేవతలందరి సన్నుతులకు యోగ్యమైన గుణసంపదకల దేవదేవా! నడుమునందు తళుకుబెళుకులతో అలరారుతున్న పచ్చనిపట్టుబట్టతో విరాజిల్లుతున్న విశ్వేశా! మహాసర్పాల దర్పాన్ని రూపుమాపే ఆదిశేషుణ్ణి వాహనంగా చేసికొని ఆదరించిన దయాసాంద్రా! వెండికొండపై విరాజిల్లే జ్ఞానమూర్తి శివయ్య సోత్రాలకు పాత్రమైన మహాప్రభూ! క్షణమైనా నీ జపాన్ని ఏమరని నియమంగల తాపసుల దారిలో విహరించే జగన్నాయకా! చేపగా, తాబేలుగా, వరాహముగా, నరసింహుడుగా, ఆనందంతో నీ అడుగు తామరను నెత్తికొత్తుకొన్న బలిచక్రవర్తిని పరిరక్షించిన వామనుడుగా, గండ్రగొడ్డలితో దుష్టులను శిక్షించిన పరశురాముడుగా, పదితలల పాదురక్కసుని విదిలించికొట్టిన వీరశేఖరుడు రాముడుగా అవతరించిన మహాత్మా! మురాసురుని మట్టుపెట్టిన ముకుందా! కలికల్మషాల పొంగులను భంగపరచే పరమాత్మా! గజేంద్రునకు వరాలిచ్చిన మహాస్వామీ! మహర్షుల, దేవతల, గరుడుని స్తోత్రాలకు పాత్రమైన పురుషోత్తమా! నమస్తే! నమస్తే! నమస్తే!

# 15

భారతంలోని భగవద్గీతవంటిదే భాగవతంలోని ఉద్ధవగీత. ఇక్కడ ఉద్ధవుడు శిష్యుడు, కృష్ణుడే గురువు, గురువు. ఆ ఉద్ధవుడు వాసుదేవుణ్ణి స్వామీ! మానవుడు మోహలోభాదులను వదలివేసి, జనార్దనుని చేరుకొనే మార్గమేమిటి అని అడిగాడు. దానికి శ్రీకృష్ణుడు సమాధానం చెపుతున్నాడు.

సీ. పరధన పరదార పరదూషణాదుల పరవస్తు చింత దా పరిహరించి
ముదిమిచే రోగము లుదయింప కటమున్న తనువు చంచలతను దగులకుండ
బుద్ధిసంచలతచే బొదలక యట మున్న శ్లేష్మంబు గళమున జేరకుండ
శక్తియుక్తులు మది సన్నగిల్లక మున్న భక్తి భావనచేత ప్రాధు దగుచు

**దైత్యభంజను దివ్యపాదారవింద**
**భజన నిజభక్తిభావన ప్రాజ్ఞుడగుచు**
**అవ్యయానందమును బొందు ననుదినంబు**
**అతడు కర్మవిముక్తుడౌ అనఘచరిత !** **11-95**

పుణ్యమైన నడవడి గల ఉద్ధవా! ఆలకించు. మానవుడు ఇతరుల ధనాలయందు, ఇతరుల స్త్రీలయందు, ఇతరుల దూషణల మీదా సాధారణంగా కలిగే ఆశలను అభ్యాసంతో తీసివేయాలి. ముసలితనంలో రోగాలు ఏర్పడతాయి. శరీరం స్థిరంగా ఉండదు. బుద్ధికి నిలుకడ ఉండదు. కంఠంలో శ్లేష్మం కమ్ముకొని ఇబ్బంది పెడుతూ ఉంటుంది. దేహశక్తీ, మనస్సు యుక్తీ సన్నగిల్లిపోతాయి. ఈ దురవస్థలు కలుగకముందే భావనలను ఉదాత్తంగా చేసుకొని శ్రీ మహావిష్ణువు దివ్యపాదారవిందాల భజనతో గొప్ప తెలివిని పెంపొందించుకొని ప్రతిక్షణమూ పెరుగుట, తరుగుట, మార్పులను పొందుట అనే వికారాలు లేని ఆనందాన్ని అనుభవించే వ్యక్తి కర్మబంధాలనుండి విడుదల పొందుతాడు.

## 16

**వాసుదేవుడు ఉద్ధవునికి జ్ఞానబోధ చేస్తూ, పింగళ అనే వేశ్య ప్రవృత్తిని వివరించిన తరువాత ముక్తి పొందే విధానాన్ని వివరిస్తున్నాడు.**

**క.** **దేహము నిత్యముగా దని,**
**మోహము దెగగోసి సిద్ధమునివర్తనుడై**
**గేహము వెలువడి నరుడు,**
**త్సాహమునుం జెందు ముక్తి సంపద ననఘా !** **11-102**

పుణ్యాత్మా ! ఉద్ధవా ! వివేకంతో పరికించిచూస్తే ఒక చక్కని విషయం తెలిసివస్తుంది. దేహం నిత్యం కాదు. ఏదో ఒకనాడు నశించిపోతుంది. దీనిని తెలుసుకోవాలి. పిమ్మట దానియందు పెరిగిపోతూఉ ఒడే మోహాన్ని తెగగోసివేయాలి. తపస్సులతో సిద్ధి పొందిన మునుల ప్రవర్తనలను చక్కగా అలవర్చుకొని ఇంటినీ సంసారబంధాలనూ వదలివేసి మానవుడు పరమప్రయోజనం పొందడానికి ఉత్సాహంతో ప్రయత్నిస్తాడు. ఫలితంగా ముక్తి సంపదను కైవసం చేసుకుంటాడు.

## 17

**శ్రీకృష్ణపరమాత్మ తన అవతార కృత్యాల నన్నింటిని చక్కగా నెరవేర్చుకొని తన నిత్యస్థావరమైన వైకుంఠానికి చేరుకున్నాడు. అతని రథసారథి దారుకుడు సర్వప్రాణుల ప్రాణమయుడైన భగవంతుని ప్రాణరహితమైన దేహాన్ని కనుగొని చేతులు జోడించి దు:ఖంతో ఇలా అంటున్నాడు -**

**తే.** **నిన్ను చూడని కన్నులు నిష్ఫలములు,**
**నిన్ను నొడువని జిహ్వ తా నీరసంబు**
**నిన్ను గానని దినములు నింద్యములగు**
**గన్నులను జూచి మమ్మును గారవింపు.** **11-121**

స్వామీ! సర్వజగన్నాథా! నిన్ను చూడని కన్నులు ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. నిన్నుగూర్చి పలుకని నాలుక రసహీనమైనది. నిన్ను చూడని దినములు నిందకు యోగ్యమైనవి. ఒక్కమారు కన్నులుతెరచి చూచి మమ్ములను అనుగ్రహించు స్వామీ!

# ద్వాదశ స్కంధము

## 1

**శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజునకు భవిష్యత్తులో భూమిని పాలించే రాజుల స్థితిగతులను, రాబోయే కాలానికి సంబంధించిన విశేషాలను వర్ణిస్తున్నాడు.**

**క. చతురత నీ క్షితి నేలియు,**
**మతిమోహము విడువలేక మానవనాథుల్**
**సతతము తమ కీ కాలం,**
**బతిచంచల మగుట నెఱుగరయ్య మహాత్మా ! 12-5**

మహాత్మా ! పరీక్షిత్తు భూమిని పాలించే రాజులు ఎంతో నేర్పుతో పరిపాలించి కూడా, మనస్సులో పాతుకొనిపోయిన మోహాన్ని విడిచిపెట్టలేక పడరానిపాట్లు పడుతూఉంటారు. కాలం అతిచంచలమైనది. అంటే ఏదో ఒకనాడు తాము చనిపోవాలి అనే విషయాన్ని పట్టించుకోకుండా ప్రవర్తిస్తూఉంటారు. పరమార్థం పరిధిలోనికి పోవాలి అనే భావనయే వారికి కలుగదు.

## 2

**బ్రతుకు శాశ్వతం కాదనే భావననే పట్టించుకోని అజ్ఞానుల మనస్థితిని శుకుడు పరీక్షిత్తునకు వర్ణిస్తున్నాడు.**

**క. నరపతులమహిమ నంతయు,**
**నురగాధిపుడైన నొడువ నోపడు; ధాత్రిం**
**జిరకాల మేలి యిందే,**
**పరువడి నడగుదురు వారు భ్రాంతులు నగుచున్. 12-6**

రాజా ! వారు నరపతులు. అంటే నరులనందరినీ కన్నబిడ్డలలాగ పరిపాలించే బాధ్యత గలవారు. కానీ వారి అజ్ఞానం ఎంతగా మిన్నులు ముట్టిందంటే దానిని గూర్చి రెండువేల నాలుకలు గల ఆదిశేషుడు కూడా చెప్పలేడు. ఎంతోకాలం ఈ ధరణిని ఏలుతారు. చివరకు ఈ ధరణియందే తనువు చాలిస్తారు. కానీ పొందవలసిన జ్ఞానదీపాన్ని పొందలేని భ్రాంతచిత్తులు వారు.

## 3

**శుకమహర్షి పరీక్షిత్తునకు ఏది అనర్థమో, ఏది పరమప్రయోజనకరమో వివరించి చెపుతున్నాడు.**

**క. గజతురగాదిశ్రీలను,**
**నిజ మని నమ్మంగ రాదు; నిత్యమును హరిన్**
**గజిబిజి లేక తలంచిన,**
**సుజనులకును నతనియందు జొరగా వచ్చున్. 12-7**

రాజా ! మానవులు, ముఖ్యంగా మానవపాలకులు– నాకు గొప్ప గజసంపద, గుర్రాలసంపద మొదలైనవి ఉన్నాయి అని గర్వపడుతూఉంటారు. కానీ అవి ఏవీ నిత్యములు కావు. చూస్తూఉండగానే నశించిపోతూ ఉంటాయి. అందువలన వానిని నమ్మిఉండరాదు. మరి కర్తవ్యం ఏమిటీ అంటే అనుక్షణమూ హరిని స్మరిస్తూ ఉండాలి. ఆ స్మరణ కూడా గజిబిజి లేకుండా ఉండాలి. ఆవిధంగా హృదయంలో ధ్యానించేవారు పరమాత్మను చేరుకుంటారు. వారే సుజనులు.

# 4

**శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు పుణ్యాత్ముల లక్షణాలను వక్కాణిస్తున్నాడు.**

**క. ధర్మము సత్యము కీర్తియు,**
**నిర్మలతయు విష్ణుభక్తి, నిరుపమ ఘన స**
**త్కర్మ మహింసా వ్రతమును,**
**నర్మిలి గలవారె పుణ్యులవనీనాథా ! 12-16**

భూపాలా ! ధర్మము, సత్యము, కీర్తి, నిర్మలమైన దయ, విష్ణు భక్తి, సత్కర్మానుష్ఠానము, అహింసను వ్రతముగా పాలించుట అనే మహాగుణాలు పుష్కలంగా ఉన్నవారిని పుణ్యాత్ములు అంటారు.

# 5

**శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు మమతను త్రుంచివేసుకోవాలి అని దృష్టాంతపూర్వకంగా చెపుతున్నాడు.**

**తే. ఈ జగం బేలు తొల్లిటి రాజవరులు,**
**కాలవశమున నాయువుల్ గోలుపోయి**
**నామమాత్రావశిష్టు లైనారు; గాన,**
**సలుపవలవదు మమత నెచ్చట నృపాల ! 12-17**

రాజా ! ఈ భూమి ఎన్నో రాజ్యాలుగా ఏర్పడి ఉన్నది. మునుపటి రాజులు ఎందరో ఎన్నోవిధాలుగా దీనిని పాలించారు. కానీ వారందరూ కాలగర్భంలో కలసిపోయారు. ఇపుడు వారి పేర్లు మాత్రమే కొన్ని మిగిలిఉన్నాయి. దీనిని మెలకువతో గమనించుకుంటే తెలియవచ్చే విషయమేమిటంటే ఎపుడూ ఎక్కడా మమతను నిలుపుకోరాదు.

# 6

**శుకమహర్షి తారకమంత్రంవంటి ఉపదేశాన్ని పరీక్షిత్తునకు తెలుపుతున్నాడు.**

**తే. ఉత్తమశ్లోకు డన నెవ్వ డున్నవాడు!,**
**సన్నుతుండగు నెవ్వడు సకల దిశల**
**నట్టి పరమేశ్వరుని చిత్తమందు నిలిపి,**
**తద్గుణంబులు వర్ణింపు ధరణినాథ ! 12-19**

రాజా! శ్రీమహావిష్ణువును మహాజ్ఞానసంపన్నులు ఉత్తమశ్లోకుడు అని ప్రస్తుతించారు. ఉత్తమశ్లోకుడంటే మానవులందరికీ మేలుకలిగించే కీర్తికలవాడు అని అర్థం. అతడు ఉన్నవాడు, అంటే నిత్యసత్యస్వరూపుడు. అన్ని దిక్కులలో వివేకసంపద కలవారు అతనిని సన్నుతిస్తారు. అటువంటి పరమేశ్వరుణ్ణి హృదయంలో నిలుపుకొని సత్యము, జ్ఞానము, ఆనందము మొదలైన అతని గుణాలను పలుకుతూ ఉండు.

# 7

**శుకమహర్షి పరీక్షిత్తునకు ఉత్తమమైన వివేకధనాన్ని వివరిస్తున్నాడు.**

**ఉ. ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబులోపలన్**
**మానుము, సంభవంబు గల మానవకోట్లకు చావు నిత్యమౌ**
**గాన హరిం దలంపు, మిక గల్గదు జన్మము నీకు ధాత్రిపై;**
**మానవనాథ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్. 12-25**

మానవనాథా! నేను చనిపోతాను అనే భయాన్ని మనస్సులోనుంచి తీసివేయి. కోట్లకొలదిగా మానవులు పుడుతున్నారు. వారందరికీ చావు తప్పనిసరిగా కలుగుతుంది. అయితే చచ్చినవాడు మళ్ళీ పుట్టటం కూడా సంభవిస్తుంది. అదియే మహాభయంకరమైన సంసారం. అది ఆగిపోవాలి అంటే నీవు శ్రీహరిని స్మరిస్తూ ఉండు. నీకు ఇటుపైన భూమిలో పుట్టుక కలుగదు. మాధవలోకంలో నివసించే అదృష్టము, అక్కడి సౌఖ్యాలు నీవు పొందుతావు.

# 8

**శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు సంసార దు:ఖపరంపరను గూర్చి ఇలా వివరిస్తున్నాడు.**

**చ. మృతియును జీవనంబు నివి మేదినిలోపల జీవకోటికిన్**
**సతతము సంభవించు, సహజం బిది; చోరహుతాశసర్ప సం**
**హతులను దప్పి నాకటను బంచత నొందెదు నట్టి జీవుడున్**
**వెతలను పూర్వకర్మ భవవేదన లొందుచు గుందు నెప్పుడున్. 12-27**

రాజా ! చావు బ్రతుకు అనేవి భూమిపై ఉన్న కోట్లకొలది జీవులకు ఎప్పుడూ కలుగుతూనే ఉం టాయి. ఇది సహజం. దొంగలలో, అగ్నియో, పాముకాటులో, దప్పికయో, ఆకలియో చావుకు కారణాలవుతూ ఉంటాయి. ఆవిధంగా జీవుడు వెనుకటి జన్మలలో చేసుకున్న కర్మఫలాలను అనుసరించి వేదనలను పొందుతూ ఉంటాడు. దు:ఖాలతో కుమిలిపోతూ ఉంటాడు.

# 9

**భాగవతం ద్వాదశస్కందంలో సూతమహర్షి శౌనకాది తాపసులకు మార్కండేయుని కథను స్మృతికి తెచ్చాడు. మార్కండేయుని తపోమహిమకు సంతసించి శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అపుడు ఆ మహర్షి ఇలా అంటున్నాడు.**

**తే. జగము రక్షింప, జీవుల జంప, మనుప,**
**కర్తవై సర్వమయుడవై కానిపింతు**
**వెచట నీ మాయ దెలియంగ నెవ్వ డోపు ?,**
**విశ్వసన్నుత! విశ్వేశ! వేదరూప! 12-35**

దేవా! వేదరూపా! విశ్వేశా! విశ్వసన్నుతా! లోకాలనన్నింటిని రక్షించడానికీ, జీవులను మరల తనలో లీనం చేసుకోవడానికీ, పెంచిపోషించడానికీ కర్తవు నీవే. నీవు సర్వమయుడవు. అందరిలో, అన్నింటిలో ఉన్నది నీవే. ఇటువంటి మహాత్ముడవైన నీమాయను ఎవడు తెలియగలవాడు ?

## 10

**మార్కండేయుడు మహావిష్ణువుతో, అతనిమాయ ఎట్టివారికిని దాటనలవికానిది, తెలియజాలరానిది అని వక్కాణిస్తున్నాడు.**

**మ. బలభిన్ముఖ్య దిశాధినాథవరులున్ ఫాలాక్షబ్రహ్మాదులున్**
**జలజాతాక్ష పురందరాది సురులుం జర్చించి నీ మాయలం**
**దెలియన్ లేరట! నా వశంబె తెలియన్? దీనార్తి నిర్మూల! యు**
**జ్జ్వల పంకేరుహపత్త్ర లోచన! గదాచక్రాంబు జాద్యంకితా! 12-36**

స్వామీ ! నీవు దీనుల ఆర్తిని నామరూపాలు లేకుండా పోగొడతావు. గొప్ప కాంతులతో విలసిల్లే పద్మపు రేకులవంటి కన్నులతో విరాజిల్లుతూ ఉంటావు. నీ చేతులలో గద, చక్రము, పద్మము మొదలైన మహాపదార్థాలు విలసిల్లుతూఉంటాయి. అట్టి ఓ స్వామీ ! దేవేంద్రుడు మొదలైన ఎనిమిది దిక్కులను పరిపాలించే మహాత్ములు, మూడవకన్నుతో విరాజిల్లే శివుడు, నాలుగు ముఖాలతో అలరారే బ్రహ్మదేవుడు, ఇంకా ఈ వరుసలో అధికార స్థానాలలో ఉన్న అయ్యలు ఎంతగా చర్చించినా నీ మాయలను తెలుసుకోలేరట. ఇంక నిన్ను తెలియడం నావశమా !

## 11

**శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు భానువారమునాడు పుణ్యప్రదేశాలలో భాగవతం పఠిస్తే కలిగే మహాఫలాన్ని వివరిస్తున్నాడు.**

**తే. పుష్కరంబందు, ద్వారకాపురమునందు,**
**మథురయందును రవిదినమందు నెవడు**
**పఠన సేయును రమణతో భాగవతము,**
**వాడు తరియించు సంసారవార్ధి నపుడ. 12-46**

రాజా! పుష్కరమనే తీర్థంలో కానీ, ద్వారకా పట్టణంలో కానీ, మధురానగరంలో కానీ, ఆదివారమునాడు ప్రీతితో భాగవతాన్ని పఠించేవాడు సంసారమనే సముద్రాన్ని వెనువెంటనే తరిస్తాడు.

## 12

**శుకమహర్షి ఈవిధంగా భాగవతంలోని పన్నెండు స్కంధాల స్వరూపాన్ని మనోహరంగా చెప్పాడు అని సూతుడు శౌనకాది మునులతో ఇలా అంటున్నాడు.**

**క. శ్రీరమణీరమణకథా,**
**పారాయణ చిత్తునకును పతికి బరీక్షి**
**ద్భూరమణున కెఱిగించెను,**
**సారమతిన్ శుకుడు ద్వాదశస్కంధములన్. 12-47**

మహర్షులారా! వ్యాసమహర్షి పుత్రుడు, పుట్టుకతోడనే వైరాగ్యపు చివరి అంచులకు చేరుకొన్నవాడు అయిన శుకమహర్షి పన్నెండు స్కంధాలలో లక్ష్మీదేవిమనోనాయకుడైన విష్ణుదేవుని కథాపారాయణము హృదయంలో నిరంతరమూ చేసే శీలంకల పరీక్షిన్మహారాజునకు సారమైన బుద్ధితో తెలియజెప్పాడు.

## 13

**భాగవతం పదునెనిమిది పురాణాలలో నాయకమణి వంటిది. ఈ భాగవత పురాణాన్ని పఠించేవాడు విష్ణుసాయుజ్యం పొందుతాడు అని సూతుడు ఇంకా ఇలా అంటున్నాడు.**

**క. సకలాగమార్థపారగు,**
**డకలంక గుణాభిరాము డంచిత బృందా**
**రక వంద్య పాదయుగు డగు**
**శుకయోగికి వందనంబు సొరిది నొనర్తున్. 12-49**

శ్రీశుకుడనే యోగీంద్రుడు సమస్తమైన వేదములను తుదిముట్టా అధ్యయనం చేసినవాడు. ఎట్టి మచ్చాలేని గుణములతో మనోహరమైనవాడు. పరమపూజ్యులైన దేవతలకు కూడా నమస్కరింపదగిన పాదపద్మాలు కలవాడు. అట్టి మహానుభావునికి ఎల్లప్పుడూ నేను వందనం చేస్తూ ఉంటాను.

## 14

**సూతమహర్షి ఇంకా ఇలా అంటున్నాడు. అనంతకల్యాణగుణుడైన శ్రీకృష్ణ పరమాత్మను సర్వకాలాలలో, అన్ని అవస్థలలో కొనియాడుతూ ఉంటాను అని మనలనందరినీ ఆపనికి ప్రచోదనం చేయడంకోసం ప్రకటిస్తున్నాడు.**

**సీ. సకలగుణాతీతు సర్వజ్ఞు సర్వేశు నఖిలలోకాధారు, నాదిదేవు,**
**పరమయాపర సోద్భాసితు త్రిదశాభివందితపాదాబ్జు వనధిశయను,**
**ఆశ్రితమందారు నాద్యంతశూన్యుని వేదాంతవేద్యుని విశ్వమయుని**
**కౌస్తుభ శ్రీవత్స కమనీయవక్షుని శంఖచక్రగదాసిశార్ఙ్గ ధరుని**

**శోభనాకారు పీతాంబరాభిరాము**
**రత్నరాజితమకుట విభ్రాజమాను,**
**పుండరీకాక్షు మహనీయపుణ్యదేహు**
**తలతు నుతియింతు దేవకీతనయు నెపుడు. 12-50**

శ్రీకృష్ణవాసుదేవుడు సత్వము, రజస్సు, తమస్సు అనే జీవులను సంసారసముద్రంలో ముంచే గుణాలన్నింటికీ అతీతుడు. సర్వజ్ఞానాలూ కలవాడు. సర్వమునకూ ప్రభువు. అఖిలలోకాలకు ఆధారమైనవాడు. ఆదిదేవుడు. పరమదయ అనే రసంతో ఉజ్వలంగా ప్రకాశించేవాడు. దేవతలందరికీ నమస్కరింపదగిన పాదపద్మాలతో అలరారేవాడు. పాలసముద్రంలో పవ్వళించేస్వామి. ఆశ్రితులకు కల్పవృక్షం అయినవాడు. ఆదిఅంతములు లేనివాడు. వేదాంతములతో మాత్రమే తెలియదగినవాడు. సర్వమూ తాను అయినవాడు. కౌస్తుభమనే అమూల్యమైన మణినీ, శ్రీవత్సమనే పుట్టుమచ్చనూ వక్షస్థలమందు నిలుపుకొనేవాడు. శంఖము, చక్రము, గద, ఖడ్గము, శార్ఙ్గము అనే చాపము అనువానిని ధరించిఉంటాడు. పరమమనోజ్ఞమైన ఆకారము కలవాడు. పచ్చనిపట్టువస్త్రంతో అందాలను చిందించే భగవంతుడు. తెల్లని పద్మములవంటి కన్నులతో విరాజిల్లేవాడు. అవధులు లేని గొప్పతనంగల పుణ్యదేహం కలవాడు. అటువంటి దేవకీతనయుడైన వాసుదేవుణ్ణి నేను నిరంతరమూ స్మరిస్తాను.

## 15

**సూతమహర్షి శౌనకాది మహర్షులకు భాగవతమును ఆద్యంతమూ కమనీయంగా చెప్పాడు. అటు తరువాత వారందరూ ఆనందసాగరంలో తేలియాడుతూ తమతమ నివాసములకు వెళ్లిన సంగతిని ఈ పద్యము తెలియజేస్తున్నది.**

**మ. అని యీరీతి నుతించి భాగవత మాద్యంతంబు సూతుండు చె**
**ప్పిన సంతుష్ట మనస్కులై విని మునుల్ ప్రేమంబునం బద్మనా**
**భుని చిత్తంబున నిల్పి తద్గుణములన్ భూషించుచున్ ధన్యులై**
**చని రాత్మీయనికేతనంబులకు నుత్సాహంబు వర్ధిల్లగన్. 12-51**

లోమహర్షణుని పుత్రుడు, సకలపురాణవిజ్ఞానం పుష్కలంగా తనలో నిలుపుకున్నవాడు అయిన సూతమహర్షి ఈవిధంగా భాగవత మహాపురాణాన్ని మొదటినుండి చివరిదాకా పరమానందం కలిగేట్టుగా చెప్పాడు. మహర్షులు మరింత ఆనందసాంద్రస్థితిని పొంది సంతుష్టులైనారు. పరమానురాగంతో పద్మనాభుణ్ణి హృదయపద్మాలలో కుదురుకొల్పుకున్నారు. అతని గుణాలను నిరంతరమూ భావిస్తూ ధన్యులై ఉత్సాహం ఊపివేస్తూ ఉండగా తమతమ పర్ణశాలలకు చేరుకున్నారు.

## 16

**తెలుగుల పుణ్యపేటి మహాకవి బమ్మెర పోతన భాగవత కథారసామృతాన్ని ఈవిధంగా అందరికీ పంచిపెట్టి తనకృతిపతియైన శ్రీరామచంద్రుని స్మరణ చేసుకుంటూ గ్రంథాన్ని ముగిస్తున్నాడు.**

**క. జనకసుతాహృచ్చోరా!,**
**జనకవచోలబ్ధ విపినశైల విహారా!**
**జనకామిత మందారా!,**
**జననాదిక నిత్యదు:ఖచయ సంహారా! 12-52**

స్వామీ ! శ్రీరామచంద్రా నీవు పరమవేదాంతియైన జనకుని బిడ్డ సీతాదేవి హృదయాన్ని దొంగిలించిన వాడవు. తండ్రిమాట మేరకు అడవులలో, కొండలలో అద్భుత కార్యాలను నిర్వహిస్తూ విహరించినవాడవు. జనుల కోరికలకు కల్పవృక్షం అయినవాడవు. పుట్టటం మొదలైన నిత్యదు:ఖాల రాసులన్నింటినీ రూపుమాపేవాడవు. ఇట్టి నీకు అంకితంగా నేను రచించిన భాగవతాన్ని నీద్వారా లోకానికి నివేదించుకుంటున్నాను స్వామీ!

* * *